# ఇస్లాం తత్వ జ్ఞానం

రచన

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్
మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్
అలైహిస్సలాం



*"Islāmī Uṣūl Kī Philosophy"*

(Islām Tatwagnānam)
(Telugu)

The essay entitled *The Philosophy of the Teaching of Islam* was written in Urdu by Hadrat Mirza Ghulam Ahmad, the Promised Messiah and Mahdi[as] at the invitation of Swami Shugan Chandar under whose auspicious the conference of Great Religions was held in Lahore Town Hall from 26th to 29th December 1896. The scholars of Muslims, Christians, Arya Samaj and other religions were invited to represent their religions at the conference of Great Religion. They were required to write on the following five topics on the basis of their Holy Books.

- The Physical, moral and spiritual states of man
- The state of man after death.
- The object of man's life and the means of its attainment.
- The operation of the practical ordinances of the Law in this life and the next.
- Sources of Divine knowledge.

Allah revealed to the Promised Messiah[as] that his essay will be declared supreme over all other essays. And so it was. For instance the Civil and Military Gazette, Lahore, wrote that Hadrat Ahmad's essay was the only one worth mentioning and the only one paper which was commended highly. The essay has been published in several languages in different countries.

It is the best and most comprehensive introduction to Islam within the scope of the above five questions. The book was translated into English by Sir Muhammad Zafarulla Khan.

٩٧٨٨١٧٩١٢٠٠٢٣

# ఇస్లాం తత్వ జ్ఞానం

☼

రచన

**హజ్రత్ మిర్జా గులాం అహ్మద్**

**మసీహ్ మౌవూద్, మహ్ది మాహూద్ అలైహిస్సలాం**

**అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు**

☼

అనువాదము

షేక్ ఇబ్రాహీమ్ నాసిర్

☼

ప్రచురణ

నజారత్ నష్రో ఇషాఅత్

సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

اسلامی اصول کی فلاسفی

# Islām Tatwagnānam

Telugu Rendering of

# Islāmi usūl kī Philosophy (Urdu)

Written By

Hazrat Mirza Ghulam Ahmad as
Masih Moud Alihissalam

Translated from Urdu to Telugu By
Sk. Ibrahim Nasir B.A.,B.Ed.
Revised By
Dr. Pullela Sri Raama Chandrudu

1st Telugu Edition Published in India : 1996
Copies : 5000
2nd Telugu Edition Published in India : 2018
Copies : 2000
Printed at : Fazl-e-Umar Printing Press
Harchowal Road Qadian

Published by : Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian
Dist: Gurdaspur, Punjab, India,143516

ఇతర వివరాలకు సంప్రదించగలరు
www.ahmadiyyamuslimjamaat.in

# రచయిత పరిచయం

## (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం)

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం 13 ఫిబ్రవరి 1935 తేదీన ముఘల్ గొప్ప వంశములో హజ్రత్ మిర్జా గులాం ముర్తజా–చరాఘ్ బీబీ దంపతులకు జిల్లా గుర్దాస్‌పూర్‌లోని ఒక కుగ్రామము ఖాదియాన్ (పంజాబ్) లో జన్మించిరి. బాల్యము నుండే ఇస్లాం, పవిత్ర ఖుర్ఆన్, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల అమితాసక్తి కలిగి వుండిరి. తమ నీతి, నిజాయితి, మృదు స్వభావములో పేరు గాంచిరి.

వారు అంతర్జాతీయ అహ్మదియ్యా ముస్లిం జమాఅత్‌ను క్రీ.శ. 1889లో స్థాపించిరి. వివిధ మత గురువుల ద్వారా విభిన్న నామములతో సూచించబడిన, నిరీక్షించబడుచున్న వాగ్దత్త సంస్కర్త తానేనని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ, అలైహిస్సలాం దైవాదేశముతో తమను తాము ప్రకటించుకొనిరి. మానవజాతిని మొత్తం ఒకే ఒక్క విశ్వ ధర్మము ఇస్లాం పతాక నీడన చేర్చుటకు ఇటువంటి ఒక సంస్కర్త అవతరించవలసి యుండెనని దైవవాణి ద్వారా తెలుసుకొని వారు ప్రకటించిరి. ఈ వాగ్దత్త సంస్కర్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరునిగా, శిశ్యునిగా అవతరించునని కూడ వారు తెలిపిరి. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ భవిష్యవాణీలలో రాబోవు వాగ్దత్త సంస్కర్తను మసీహ్ ద్వితీయ అవతరణగా అభివర్ణించిరి. అల్ ఇమామ్,

అల్‌మహ్ది అని కూడ వారు నామకరణం చేసిరి. కావున ఇటువంటి భవిష్యవాణీలు పూర్తి అయినవి.

ప్రపంచ పటములో మనుగడ సాధించిన ధర్మములన్ని సత్యమైనవే, దేవుని తరపున వచ్చినవేనని వారు విశ్వసించేవారు. కాని తర్వాతి కాలములో ఆయా ధర్మములు పలువురు అమాయకుల, స్వార్థపరుల వలన మార్పుకు గురైనవని వారు తెలిపిరి. అన్ని మతాలు గౌరవించదగ్గవే. కావున ఎవరు కూడ తమ రచనలు, ఉపన్యాసాలు, సంభాషణలలో ఇతర మతాలను, ఇతర మతాల స్థాపకులను, అవతార పురుషులను అవమానించకూడదు. ఈ సూత్రమును పాటించనిదే శాంతి స్థాపన అసాధ్యమని వారు నొక్కిచెప్పిరి. ఇందుకు తమ రచనలు, ప్రసంగాల తో నిర్విరామ కృషి కూడ చేసిరి. దైవారాధన, ప్రజా సేవ మతమునకు రెండు చక్రాలని వారు ఉపదేశించిరి. శాంతి స్థాపనకు చక్కటి మార్గాలను నిర్దేశించుచు తమ జీవిత చివరి రోజులలో 'శాంతి సందేశము' అను గొప్ప పుస్తకము రచించిరి. ఇదే వారి అంతిమ రచన.

వారు 80కు పైగా పుస్తకములు రచించిరి. 'ఇస్లాం తత్వజ్ఞానం' అను పుస్తకములో సూచించబడిన ఐదు ప్రశ్నలకు నిరుపమాణ, అద్వితీయ సమాధానాలిచ్చి సభికులందరిని ఆకట్టుకొనిరి. ఇస్లాం, పవిత్ర ఖుర్‌ఆన్ సందేశమును అర్థము చేసుకొనుటకు ఇదొక గొప్ప రచన. 60 భాషలలో ఇది అనువాదము చేయబడినది. 'యేసు క్రీస్తు భారత దేశములో' అను నామముతో వారు మరొక గొప్ప పుస్తకము దైవానుగ్రహముతో 1899లో రచించిరి. యేసు క్రీస్తు భారత దేశమునకు వచ్చినట్లు ఇందులో సాక్ష్యాధారాలతో నిరూపించిరి. 26 మే 1908 తేదీన వారు పరమ పదించిరి.

వారి జీవితములోనే లక్షలాది మంది వారిని విశ్వసించి వారి

సంస్థలో చేరిరి. ప్రస్తుతము 2010 దేశాలలో కోట్లాది మంది ఈ సంస్థలో చేరి దైవారాధన, ప్రజా సేవలో నిమగ్నమై, శాంతి స్థాపనకు నిస్వార్థముగా దివారాత్రులు కృషి చేయుచున్నారు. వారి తర్వాత వారి ఉత్తరాధికారులు ఈ అద్భుత ప్రజా సేవా కార్యక్రమాలను కొనసాగించుచున్నారు.

❖❖❖

# విషయ సూచిక


| క్ర.సం | వివరములు | పుట |
|---|---|---|
| 1. | టైటిలు పేజీలు | I |
| 2. | రచయిత పరిచయం | III |
| 3. | విషయసూచిక | VI |
| 4. | ప్రచురణ విభాగము | X |
| 5. | సత్యాన్వేషులకు ఒక గొప్ప శుభవార్త | XII |
| 6. | సందేశము | XV |
| 7. | పరిచయము | XVII |
| | **ఇస్లాం** | 1 |
| | దావా, సాక్ష్యము అవతరణ గ్రంథము నుండి వుండుట అనివార్యము | |
| | **మొదటి ప్రశ్న** | 2 |
| 8. | మానవుని శారీరక, నైతిక, ఆధ్యాత్మిక స్థితిగతులు | 2 |
| 9. | మూడు విధములైన మానవుని చర్యలు | 2 |
| 10. | మొదటి ఉత్పత్తి స్థానము–స్వార్థము | 2 |
| 11. | రెండవ ఉత్పత్తి స్థానము–తమను నిందించు ఆత్మ | 3 |
| 12. | మూడవ ఉత్పత్తి స్థానము–తృప్తి పడిన ఆత్మ | 4 |
| 13. | ఆత్మ పుట్టుక | 13 |
| 14. | ఆత్మ రెండవ పుట్టుక | 14 |
| 15. | మానవుని క్రమేణ పెరుగుదల | 15 |

| | | |
|---|---|---|
| 16. | ఇస్లాం వాస్తవికత | 15 |
| 17. | సహజ, నైతిక పరిస్థితుల భేదము- | 17 |
| 18. | జీవ హత్య ఖండన | 17 |
| 19. | సంస్కరణ పద్ధతులు మూడు - అత్యవసరముననే పవిత్ర ప్రవక్త అవతరణ | 19 |
| 20. | పవిత్ర ఖుర్‌ఆన్ ముఖ్యోద్దేశము మూడు స్థితుల సంస్కరణ | 22 |
| 21. | సహజ స్థితులు నీతి దాయక స్థితులుగా మారును | 22 |
| 22. | నిజమైన నీతి | 24 |
| 23. | కల్క్ (సృష్టి), కుల్క్ (నీతి) మధ్య గల భేదము | 24 |
| 24. | సహజ స్థితుల సంస్కరణ | 26 |
| 25. | పంది మాంసము నిషేధము | 33 |
| 26. | మానవుని నైతిక స్థితులు | 34 |
| 27. | చెడును త్యజించు నైతిక విలువలు | 35 |
| 28. | పవిత్రత చికిత్సలు ఐదు | 39 |
| 29. | మంచి చేయు నైతిక విలువల స్వభావము | 49 |
| 30. | ధైర్యము | 59 |
| 31. | సత్యము | 60 |
| 32. | సహనము | 63 |
| 33. | మానవ జాతితో కనికరము | 64 |
| 34. | ఘనత గల ఒక జీవి పరిశోధన | 65 |
| 35. | పవిత్ర ప్రవక్త అరేబియాలో ప్రత్యక్షమగుటకు గల కారణములు | 69 |
| 36. | ప్రపంచమునకు పవిత్ర ఖుర్‌ఆన్ చేసిన మేలు | 70 |

| | | |
|---|---|---|
| 37. | అల్లాహ్ ఉనికి నిదర్శనములు | 71 |
| 38. | అల్లాహ్ స్వభావము | 75 |
| 39. | ఆధ్యాత్మిక స్థితులు | 84 |
| 40. | దివ్యమైన ఒక ప్రార్థన | 88 |
| 41. | శౌంటి కర్పూరముతో చేయబడిన పానీయము | 96 |
| 42. | శౌంటి ప్రభావము | 97 |
| 43. | అల్లాహ్‌తో పూర్తి ఆధ్యాత్మిక సంబంధమేర్పరచు మార్గం | 105 |
| | **రెండవ ప్రశ్న** | 109 |
| 44. | మరణము తరువాత మానవుని స్థితి ఎట్లుండును | 109 |
| 45. | పరలోకమును గురించిన మూడు ఖుర్ఆన్ నిర్వచనములు | 114 |
| 46. | మొదటి దశ పరిజ్ఞానము | 114 |
| 47. | తెలుసుకొను విధములు మూడు | 116 |
| 48. | లోకాలు మూడు | 117 |
| 49. | రెండవ దశ పరిజ్ఞానము | 124 |
| 50. | మూడవ దశ పరిజ్ఞానము | 128 |
| | **మూడవ ప్రశ్న** | 131 |
| 51. | ప్రపంచములో మానవుని జీవిత ఉద్ధేశములేవి? వాటిని పొందుటెట్లు? | 129 |
| 52. | మానవ జీవితమును పొందు మార్గములు | 133 |
| | **నాల్గవ ప్రశ్న** | 141 |
| 53. | కర్మల ప్రభావము ఇహపరలోక జీవితములపై ఎట్లు పడును? | 141 |

| | | |
|---|---|---|
| 54. | పవిత్ర ఖుర్ఆన్‌లో గల వివిధములైన ప్రమాణముల దార్శనికత | 144 |
| | **ఐదవ ప్రశ్న - సమాధానము** | 151 |
| 55. | దైవ జ్ఞాన మార్గాలు | 151 |
| 56. | మానవుని స్వభావ వాస్తవికత | 155 |
| 57. | దైవవాణి నిర్వచనము | 159 |
| 58. | ఇస్లాం ప్రత్యేకత | 163 |
| 59. | ఉపన్యాసకుడు దైవ సంభాషణ పొంది గౌరవించబడుట | 164 |
| 60. | అల్లాహ్ వాణి - సంపూర్ణ జ్ఞానమునకు ఆధారం | 165 |
| 61. | పవిత్ర ప్రవక్త జీవితములోని రెండు స్థితులు | 169 |
| 62. | పవిత్ర ప్రవక్త యుద్ధముల ఉద్దేశము | 174 |


❁ ❁ ❁

# ప్రచురణ విభాగము

ఇస్లాంను గురించి వివరముగా, స్పష్టముగా, వ్రాయబడిన ఈ వ్యాసము, అహ్మదియ్య ముస్లిం సంఘ స్థాపకులైన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని రచించినది. ఇతర ధర్మముల వారికి ఇస్లాం నిజస్వరూపము, వాస్తవ సిద్ధాంతాలను తెలియజేయుట దీని ముఖ్యోద్దేశము, దీనిని 1896వ సంవత్సరము డిసంబర్ 26 నుండి 29 వరకు జరుగు ప్రపంచ సర్వ ధర్మ సమ్మేళనములో చదివి వినిపించుటకు వ్రాసిరి. ఆ సమావేశపు నిర్వహకులిచ్చిన ఐదు ప్రశ్నలు క్రింది విధముగా నున్నవి ?

1. మానవుని శారీరక, నైతిక, ఆధ్యాత్మిక స్థితులు.
2. మరణానంతరము మానవుని స్థితి.
3. మానవ జీవిత ముఖ్యోద్దేశము, దానిని పొందుటెట్లు.
4. ఐహిక పరలోకములందు కర్మల ప్రభావము.
5. దైవ జ్ఞాన ఆధారాలు.

వివిధ భాషలలో వివిధ దేశాలలో పెద్ద ఎత్తున దీనిని అనువదించి ప్రచురించబడెను. దీనిని షేక్ ఇబ్రాహీం నాసిర్ గారు నవాబుపేట చాలా జాగ్రత్తగా ఉర్దు నుండి తెలుగులో అనువదించిరి. తెలుగు అనువాదమును డాక్టర్ పుల్లెల శ్రీరామ చంద్రుడు గారు, హైదరాబాదు, పునఃపరిశీలించిరి. అల్లాహ్ వారి ఈ సేవను అంగీకరించి వారికి మంచి ప్రతి ఫలితము

నొసంగుగాక. ఈ పుస్తకము మొదటి సారి తెలుగులో 1996 సం॥లో ముద్రించబడినది.

ప్రస్తుతం మజ్లిసె శూరా భారత్ 2017 సం॥ సిఫారసుల మేరకు హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఆమోదముతో రెండవ సారి ప్రచురించబడుచున్నది. రివ్యూ కమిటి అధ్యక్షులు హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ గారు పునఃపరిశీలించగా ముహమ్మద్ జీశాన్ ముబల్లిఘ్ కొండూర్, అమతుల్ ఖయ్యూమ్ ముబారక పాలకుర్తి గార్లు ప్రూఫ్ రీడింగ్ బాధ్యతలు వహించిరి. అల్లాహ్ తఆలా వారికి గొప్ప ప్రతిపలము నొసంగుగాక!

నాజిర్ నష్రో ఇషాఅత్
సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్
జిల్లా: గుర్దాస్‌పూర్,
పంజాబ్-ఇండియా

# సత్యాన్వేషులకు ఒక గొప్ప శుభవార్త

స్వామి శుగన్ చందర్ గారు తమ కర పత్రములో ముస్లిములు, క్రైస్తవులు, ఆర్యులనుద్దేశించి లాహోరు నగరమందు గల టౌన్ హాలులో 1896 సం॥ డిసంబర్ 26,27,28 తేదీలలో ప్రపంచ సర్వధర్మ సమ్మేళనము జరుగును, అందులో వారి వారి ధర్మముల ముఖ్యాంశములు ఆయా పండితులు వారి వారి ధర్మ గ్రంథములలో నుండి తప్పక ప్రవేశ పెట్టవలెనని ప్రకటించిరి. కనుక దానిలో నా వ్యాసము చదువబడును. అందులో పవిత్ర ఖుర్ఆన్ మహిమలు, ప్రత్యేకతలు వివరింపబడినవి. ఇది మానవ శక్తికందని అల్లాహ్ సంకేతాలలో నుండి ఒక సంకేతము. అల్లాహ్ ప్రోద్బలముతో వ్రాయబడిన వ్యాసమిది. పవిత్ర ఖుర్ఆన్ అందచందాలు, సత్యము దానిలో పొందుపరచబడినవి. వాటి నుండి పగటి సూర్యుని వలె ఇది అల్లాహ్ మాటలని సర్వేశ్వరుని గ్రంథమని ఋజువగును. ఈ వ్యాసము మొదటి నుండి అంతము వరకు మొత్తము ఐదు ప్రశ్నలకు సమాధానములు. శ్రద్ధగా విను వానిలో ఒక నూతన విశ్వాసము జనించి ఒక నూతన కాంతి ప్రకాశించునని నా నమ్మకము. అతని చేతికి శక్తిమంతుడైన అల్లాహ్ ప్రవచనాల గొప్ప వివరణ అందును. నా ఈ వ్యాసము మానవుల లోపములకు, డంబికాలకు అతీతము.

కేవలము మానవాళి సానుభూతి నన్ను ఆ వ్యాసము వ్రాయుటకు ప్రేరేపించెను. పవిత్ర ఖుర్ఆన్ అంద చందాలను తిలకించి మా వ్యతిరేకులు అంధకారమును ప్రేమించి కాంతిని ద్వేషించి ఎంత అన్యాయము చేయుచున్నారో చూడుము. సర్వజ్ఞుడైన అల్లాహ్ దైవవాణి ద్వారా ఈ వ్యాసము సర్వ వ్యాసాలలో ఉత్కృష్టమైనదని, జయించునని నాకు తెలియ జేసెను. ఇందులోని సత్యము, వివేకము, జ్ఞానపు కాంతిని తిలకించి సమావేశము నందు పాల్గొనిన ఇతర జాతులు మొదటి నుండి అంతము వరకు వినినచో సిగ్గుపడిపోవును. క్రైస్తవులు గాని, ఆర్యులు గాని, సనాతన్ ధర్మము వారు గాని, మరెవరు గాని వారి గ్రంథముల నుండి ఇటువంటి మహిమలు చూపలేరు. ఎందుకనగా శక్తిమంతుడైన అల్లాహ్ ఈ రోజు ఈ గ్రంథపు నిజరూపమును బహిర్గత మొనరించ సంకల్పించెను, స్వప్నావస్థలో ఒక హస్తము నా భవనమును కొట్టెను. ఫలితముగా భవనము నుండి ఒక కాంతి వెళ్ళి నలువైపులు వ్యాపించెను. ఆ ప్రకాశము నా చేతులపై పడినపుడు నా దగ్గర నిలిచివున్న వాడొకడు గట్టిగా اَللّٰهُ اَكْبَرُ خَرِبَتْ خَيْبَرُ "అల్లాహు అక్బర్ కరిబత్ కైబర్" అని అరిచెను. భవనమనగా పవిత్ర ఖుర్ఆన్, కాంతులు అవతరించు కేంద్రమైన నా హృదయము, కైబర్ అనగా అసత్య, అల్లాహ్‌కు తప్ప ఇతరులను ఆరాధించు మానవునికి అల్లాహ్ స్థానము నొసంగి, అల్లాహ్ గుణములను పూర్తిగా వాటి స్థానము నుండి తొలగించిన సర్వధర్మములు. ఈ వ్యాసము నలువైపులు వ్యాపించినపుడు అబద్ధపు అసత్య ధర్మముల నిజరూపము బయటపడునని, పవిత్ర ఖుర్ఆన్ సత్యము క్రమేణ తమ వలయమును పూర్తి చేయునని తెలుపబడెను. స్వప్నావస్థ నుండి దైవవాణి వైపు నన్ను మళ్ళించబడెను. اِنَّ اللّٰهَ مَعَكَ اِنَّ اللّٰهَ يَقُوْمُ اَيْنَ مَا قُمْتَ "ఇన్నల్లాహ మఅక

ఇన్నల్లాహ యఖూము ఐనమా కుమ్తు" అను దైవ వాణి నాకందెను. అనగా "అల్లాహ్ నీతో నున్నాడు నీవున్న చోట అల్లాహ్ వుండును". ఇది అల్లాహ్ సహాయమును తెలుపు రూప కాలంకారము.

నేనెక్కువ వ్రాయదలచ లేదు. కష్టమైనను భరించి లాహోర్‌లో జరుగు మహాసభలో ఉపస్థితులగుటకు, దానిలో వివరించు, వర్ణించు వాస్తవాలను తిలకించవలెనని ప్రతి ఒక్కరితో నేను కోరుచున్నాను. వారూహించలేని రీతిలో వారి విశ్వాసము, జ్ఞానము అభివృద్ధి చెంది లాభములు కలుగునని నా నమ్మకము.

"వస్సలాము అలా మనిత్తబఅల్ హుదా"

మార్గదర్శనమవలంభించు వారికి శాంతి కలుగుగాక!

మిర్జా గులాం అహ్మద్,

ఖాదియాన్

21 డిసెంబర్ 1896.

# సందేశము

(హజ్రత్ మిర్జా తాహిర్ అహ్మద్ రహిమహుల్లాహ్
విశ్వవ్యాప్త అహ్మదియ్య సంఘ నాలుగవ ఖలీఫా)

లాహోరు నగరమందు 1896 డిసెంబర్ 26 నుండి 28 వరకు జరిగిన సర్వధర్మ మహా సభలో చదువబడిన ఈ అమోఘమైన రచన, శతాబ్ద మహోత్సవమును విశ్వవ్యాప్తమగు అహ్మదియ్య సంఘము జరుపుకొనుచున్నది. అల్లాహ్ అనుగ్రహముతో వ్రాయబడిన వ్యాసమిది. ఇది అసాధారణ జయమునొందునని అల్లాహ్ దివ్యవాణి ద్వారా ముందే తెలిపి వుండెను. సభారంభమునకు ముందే ఈ వార్తను ప్రకటించబడెను. లాహోర్ నగరపు వివిధ ప్రాంతాలలో దీని పోస్టర్లు అతికించబడెను. కరపత్రాలు పంచి చాటబడెను. మా ఈ కృతజ్ఞతా మహోత్సవము నిష్ఠాపరులకు గుణ్యమై పనికిరాని, మోసపు ప్రదర్శనలకతీతమైనది. కనుక దీనిని వివిధ భాషలలో అనువదించి దీని శతాబ్ద మహోత్సవమును జరుపుకొనుచున్నాము.

ప్రపంచములోని అధిక దేశములు దీని శుభములు, అమోఘ ప్రవచనముల నుండి లాభపడునని మేమాశించుచున్నాము.

కేవలము అల్లాహ్ అనుగ్రహము వలననే మేము దీనిని ప్రపంచపు 52 భాషలలో అనువదించి గ్రంథరూపమిచ్చి వున్నాము. మరికొన్ని భాషలలో కూడా దీనిని అనువదించు కార్యము జరుగుచున్నది. 1996 సంవత్సరాంతము వరకు అల్లాహ్ అనుగ్రహము వలన పూర్తి చేయగలమని

మేము ఆశించుచున్నాము.

తమ సమయమును, అర్హతలను వినియోగించి ఈ పుణ్య కార్యమును పూర్తి చేయుటకు ప్రయత్నించిన వారందరికి అల్లాహ్ తమ బహుమతులను నొసంగుగాక !

మిర్జా తాహిర్ అహ్మద్

# పరిచయం

స్వామి శుగన్ చందర్ గారు నాలుగు సంవత్సరముల నుండి హిందువుల లోని కాయిస్త్ వర్గమును సంస్కరించుటకు ప్రయత్నించుచుండిరి. అందరు ఏకమగునంత వరకు లాభము చేకూరదని వారు 1892 సంవత్సరములో ఊహించి తుదకు ఒక ధర్మ సమ్మేళనమును నిర్వహించవలెనని నిర్ణయించిరి. ఈ కోవకు చెందిన మొదటి సభ అజ్మీర్ నగరములో నిర్వహించబడెను. అనంతరం రెండవ సమ్మేళనమునకు లాహెూర్ నగరపు వాతావరణము సరిపోవునని ఊహించి దాని ఏర్పాట్లలో వారు నిమగ్నమైరి.

ధర్మ సమ్మేళన నిర్వహణ కొరకు స్వామి గారు ఒక కమిటీని ఏర్పాటు చేసిరి. దానికి అధ్యక్షులు మాస్టర్ దుర్గా ప్రసాద్, ముఖ్య కార్యదర్శిగా లాలా ధన్‌పత్ రాయ్ B.A.,L.L.B న్యాయవ్యాది చీఫ్ కోర్టు లాహెూర్ ఎన్నుకోబడిరి.

1896 డిసెంబర్ 26,27,28 తేదీలలో కాన్ఫరెన్స్ నిర్వహించవలెనని నిర్ణయించిరి. సభ నిర్వాహణ కొరకు క్రింద పేర్కొనిన ఆరుగురు ప్రముఖులు మోడరేటర్లు నియుక్తులైరి.

1. రాయ్ బహాదుర్ బాబు పర్తోల్‌చంద్ గారు,
   జజ్ చీఫ్ కోర్టు, పంజాబ్.
2. ఖాన్ బహాదుర్ షేక్ ఖుదా బక్ష్ గారు,
   జజ్ స్మాల్ కాజ్ కోర్టు, లాహెూర్.
3. రాయ్ బహాదుర్ పండిత్ రాధాకిషన్ గారు,
   కోల్ ప్లీడర్ చీఫ్ కోర్టు, మాజీ గవర్నర్ జమ్ము.

4. హజ్రత్ మౌల్వీ హకీమ్ నూరుద్దీన్ గారు
రాజ వైద్యులు.

5. రాయ్ భవాని గారు M.A.,
ఎక్స్ట్రా సెటిల్‌మెంట్ ఆఫీసర్, జహలమ్.

6. సర్దార్ జవహర్ సింగ్ గారు,
కార్యదర్శి ఖాలిసా కమిటి, లాహోర్.

స్వామి శివ్‌గన్‌చంద్ గారు కమిటి వైపు నుండి ప్రకటన చేయుచు ముస్లిములను, క్రైస్తవులను, ఆర్యులను ఉద్ధేశించి పేరుగాంచిన వారి వారి మత పండితులు ఈ సభలో తప్పక పాల్గొని తమ మత విషయములను వివరించవలెనని, సత్య ధర్మ మహిమలు, శుభములు సభ్యకరమైన సభలో బహిర్గతమై హృదయాలను అర్థము చేసుకొనుట ఈ మహ ధర్మ సమ్మేళనపు ముఖ్యోద్ధేశమని దీని ద్వారా ప్రతి ధర్మ పండితునికి తమ ధర్మ సత్య సిద్ధాంతాలను వివరించు అవకాశము లభించునని, వివిధ ధర్మముల గొప్ప పండితుల ఉపన్యాసములు విని, పరిశీలించి సత్యమును కనుగొను అవకాశము వినువారికి కూడా లభించునని, సర్వ ధర్మ మహాసభ లాహోర్ టౌన్ హాలులో నిర్వహించ బడునని ప్రకటించిరి.

ధర్మముల పరస్పర వైరుధ్యముల వలన సత్యధర్మమును కనుగొను అభిలాష ఈ యుగము నందు ప్రతి హృదయము నందు అంకురించినది. సర్వ ధర్మముల ఉపన్యాసికులు, సంస్కర్తలు, ఒక చోట ఏకమై తమ తమ ధర్మ సత్య సిద్ధాంతాలను ప్రకటితమైన ప్రశ్నల పరిమితులు దాటకుండ వివరించవలెనని వారు తెలిపిరి, ఫలితముగా ఈ ధర్మములలో ఏ ధర్మము ఈశ్వరుని వైపు నుండి వున్నా ఆ ధర్మము తప్పక తమ

ప్రకాశమును, కాంతిని బహిర్గతమొనర్చును. ఈ ఉద్ధేశముతోనే ఈ సభ సదస్సును నిర్వహించడమైనది. తమ ధర్మ సత్యమును బహిర్గతమొనర్చుట వారి కర్తవ్యమని ప్రతి ధర్మ పండితులకు బాగా తెలుసు. సత్యములు బహిర్గతమగుటకు ఈ మహ సభ ద్వారా అల్లాహ్ వారికి మంచి అవకాశము ప్రసాదించినాడు. ఇది సదా వీలు పడదు. మానవుని అధికారములో కూడా లేదు. వారిని ఈ విధముగా ప్రోత్సహించెను. అపాయకరమైన వ్యాధిలో చిక్కుకొనిన వారు నా మందుతో నయమగుదురని విశ్వసించు వాడు మానవాళికి మేలు చేయువాడనని దావా చేసి కూడా వారి చికిత్స కొరకు పిలిచినపుడు వెనుకాడునని నేనూహించగలనా ? ఏ ధర్మము సత్యములు, సత్య నిదర్శనములతో నిండి వున్నదో నిర్ధారణ కొరకు నా హృదయము తహ తహ లాడుచున్నది. ఈ నా కోరికను బహిర్గతమొనర్చుటకు నాకు పదములు దొరకడము లేదు.

ధర్మ సమ్మేళనము లేదా సర్వధర్మ మహాసభ యందు పాల్గొనుటకు వివిధ ధర్మముల వారు స్వామి గారి ఆహ్వానమును అంగీకరించిరి. డిసంబర్ 1896లో లాహూర్ నగరములో ఒక సర్వ ధర్మ మహాసభ నిర్వహించబడెను. దీనిలో వివిధ ధర్మ ప్రతినిధులు సభా కమిటి ద్వారా ప్రకటించబడిన అంశములపై ఉపన్యసించిరి. ఈ ప్రశ్నలు మహాసభ కంటే ముందే సమాధానాల కొరకు ప్రకటించబడివుండెను. సమాధానములు పవిత్ర గ్రంథమని తాము నమ్ము ధర్మ గ్రంథము వరకే పరిమితమై వుండవలెనని మహాసభ కమిటి నిబంధన.

ప్రశ్నలు క్రింది విధముగా నుండెను.

1. మానవుని శారీరక, నైతిక ఆధ్యాత్మిక స్థితులు.
2. మరణానంతరము మానవుని స్థితి అనగా పరలోక జీవితము.

3. మానవ జీవిత ముఖ్యోద్దేశము దానిని పొందు మార్గాలు.
4. ఐహిక-పరలోకములందు కర్మల ప్రభావము.
5. దైవజ్ఞాన ఆధారాలు.

26 డిసంబర్ నుండి 29 డిసంబర్ వరకు నిర్వహించబడిన ఈ సభలో సనాతన ధర్మము, హిందూయిజం, ఆర్య సమాజము, ఫ్రీ థింకర్, బ్రహ్మ సమాజము, థ్యాసోఫికల్ సోసైటీ, రిలీజియన్ ఆఫ్ హార్మని, క్రైస్తవ, ఇస్లాం, సిక్కిజం ప్రతినిధులు ఉపన్యసించిరి. కాని ఈ మొత్తము ఉపన్యాసాలలో కేవలము ఒకే ఒక ఉపన్యాసములో పై ప్రశ్నలకు సంపూర్ణ, వాస్తవ సమాధానాలుండెను. హజ్రత్ మౌల్వి అబ్దుల్ కరీం (రజి) సియాల్కోటి గారు ఈ ఉపన్యాసము చదువు సమయపు వాతావరణమును వివరించలేము. ప్రతి మతము వారు పరవశించి ప్రశంసించు వారే కాని మౌనము వహించు వారు లేకుండెను. పఠన పద్ధతి ప్రతి ఒక్కరిని చూరగొనుచుండెను. వైరులు కూడా దీనిని ప్రశంసించిరి, దీని కంటే గొప్ప నిదర్శనము మరొకటి గలదా! ప్రఖ్యాతి గాంచిన ఆంగ్ల పత్రిక సివిల్ మిలటరి గజిట్ లాహోర్ క్రైస్తవ మతమునకు సంబంధించిన దైనప్పటికి కేవలము ఈ వ్యాసమునే ప్రత్యేకముగా ప్రచురించి కొనియాడెను.

ఈ వ్యాసము అహ్మదియ్య సంఘ స్థాపకులైన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాన్ గారు వ్రాసినది. దీని కొరకు నియమిత సమయము రెండు గంటలుండెను. కాని ఇది పూర్తి కానందున 29 డిసంబర్ వరకు పొడిగించబడెను. ఈ వ్యాసపు ప్రశంసలతో పంజాబ్ ఆబ్జర్వర్ నిండివుండెను. పైసా అక్బార్, చౌద్వీం సదీ, సాదికుల్ అక్బార్, ముక్బిరే దక్కన్ మరియు జనరల్ వగౌహరే ఆసఫి కలకత్తా మొదలగు

పత్రికలు వ్యాసమును ఏకముగా ప్రశంసించెను, కొనియాడెను. ఇతర జాతులు, ఇతర మతముల వారు అన్నిటికంటే ఉత్తమ స్థాయిలో నున్నదని దీనిని శ్లాఘించిరి, ఒప్పుకొనిరి. ఈ ధర్మ సమ్మేళనపు కార్యదర్శి ధన్‌పత్ రాయ్ B.A.,L.L.B. ప్లీడర్ చీఫ్ కోర్టు పంజాబ్ "రిపోర్ట్ సర్వధర్మ మహాసభ" (ధర్మోత్సవ) అను గ్రంథములో ఈ ఉపన్యాసమును ఇట్లు శ్లాఘించిరి.

"పండిత్ గోవర్ధన్ దాస్ ఉపన్యాసము తర్వాత అర్ధ గంట విరామముండెను. విరామము వెంటనే ఒక ప్రఖ్యాత న్యాయవాది ఇస్లాం గురించి ఉపన్యాసము చేయనుండిరి, కనుక ప్రేక్షకులు తమ స్థానమును విడవకుండా వుండిరి. ఒకటిన్నర వరకు ఇస్లామియా కాలేజ్ పూర్తిగా జనముతో నిండి పోయెను. అప్పుడు సుమారు ఏడు వేల నుండి ఎనిమిది వేల మంది ప్రేక్షకులుండిరి. ఇందులో వివిధ మతముల, వివిధ సొసైటీల పండితులు, విద్వాంసులు, గౌరవ పదమైన వ్యక్తులుండిరి, పెద్ద మొత్తములో కుర్చీలు వేసినను తివాచీలు పరచినను, వందల సంఖ్యలో జనము నిలబడక తప్పలేదు. నిలబడిన వారిలో గొప్ప గొప్ప మత పండితులు, పంజాబ్ అధికారులు, న్యాయవాదులు, బారిష్టర్లు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, అసిస్టెంట్లు అనగా ఉత్తమ శ్రేణికి చెందిన వారనేకులుండిరి. వారందరు ఏకమై సహనముతో, నిరంతరము నాలుగైదు గంటలు ఒంటి కాలిపై నిలబడి సభా కార్యక్రమాలను తిలకించినారని, వారికి ఈ పవిత్ర సభలో ఎంత శ్రద్ధనున్నదో అట్లే తెలియవచ్చెను. ఈ వ్యాసము వ్రాసినవారు స్వయముగా సభలో లేకున్నను గౌ॥ మౌల్వి అబ్దుల్ కరీం సియాల్కోటి అను తమ ప్రత్యేక శిష్యున్ని ఈ వ్యాసము చదువుటకు పంపివుండిరి. కమిటి వైపు నుండి ఈ వ్యాసము కొరకు కేవలము రెండు గంటలే కేటాయించబడియుండెను. కాని సభికుల శ్రద్ధను చూచి మోడరేటర్స్

సంతోషముతో వ్యాసము ముగించు వరకు సభా కార్యక్రమము నిర్వహించబడునని అనుమతించిరి. వారిట్లనుమతించుట సభికులకు అనుకూలముగా నుండెను. అదెట్లనగా నిర్ణీత సమయము ముగిసిన తరువాత మౌల్వీ అబూ యూసుఫ్ ముబారక్ అలీ గారు తమ కొరకు కేటాయించిన సమయము కూడా ఈ వ్యాసమునకు ఇచ్చి వేసినపుడు సభికులు, మోడరేటర్లు సంతోషించి మౌల్వి గారికి కృతజ్ఞతలు తెలిపిరి, సభా కార్యక్రమము నాలుగున్నర (4:30) గంటలకు అంతమయ్యే దుండెను. కాని తర్వాత సభికుల కోరికను మన్నించి ఐదున్నర గంటల వరకు నిర్వహించవలసి వచ్చెను. ఎందుకనగా ఈ వ్యాసము సుమారు నాలుగు గంటలలో పూర్తయ్యెను. ఆరంభము నుండి అంతము వరకు ప్రత్యేక ఆసక్తి, శ్రద్ధ నెలకొని వుండెను".

ఆశ్చర్యమేమనగా సభా నిర్వహణ కంటే ముందు 21 డిసంబర్ 1896 నాడు అహ్మదియ్య సంఘ స్థాపకులు తమ వ్యాసము అన్నిటిలో ఉత్తమమైనదని, జయమునొందునని అల్లాహ్ నుండి వార్తనందుకొని ఒక ప్రకటన చేసిరి దానిలో ఇట్లుండెను.

# సత్యాన్వేషులకు ఒక గొప్ప శుభవార్త

స్వామి శుగన్ చందర్ గారు తమ కర పత్రములో ముస్లిములు, క్రైస్తవులు, ఆర్యులనుద్దేశించి లాహోరు నగరమందు గల టౌన్ హాలులో 1896 సం॥ డిసంబర్ 26,27,28 తేదీలలో ప్రపంచ సర్వధర్మ సమ్మేళనము జరుగును, అందులో వారి వారి ధర్మముల ముఖ్యాంశములు ఆయా పండితులు వారి వారి దర్మ గ్రంథములలో నుండి తప్పక ప్రవేశ పెట్టవలెనని ప్రకటించిరి. కనుక దానిలో నా వ్యాసము చదువబడును.

అందులో పవిత్ర ఖుర్ఆన్ మహిమలు, ప్రత్యేకతలు వివరింపబడినవి. ఇది మానవ శక్తికందని అల్లాహ్ సంకేతాలలో నుండి ఒక సంకేతము. అల్లాహ్ ప్రోద్బలముతో వ్రాయబడిన వ్యాసమిది. పవిత్ర ఖుర్ఆన్ అందచందాలు, సత్యము దానిలో పొందపరచబడినవి. వాటి నుండి పగటి సూర్యుని వలె ఇది అల్లాహ్ మాటలని సర్వేశ్వరుని గ్రంథమని ఋజువగును. ఈ వ్యాసము మొదటి నుండి అంతము వరకు మొత్తము ఐదు ప్రశ్నలకు సమాధానములు. శ్రద్ధగా విను వానిలో ఒక నూతన విశ్వాసము జనించి ఒక నూతన కాంతి ప్రకాశించునని నా నమ్మకము. అతని చేతికి శక్తిమంతుడైన అల్లాహ్ ప్రవచనాల గొప్ప వివరణ అందును. నా ఈ వ్యాసము మానవుల లోపములకు, డంబికాలకు అతీతము.

కేవలము మానవాళి సానుభూతి నన్ను ఆ వ్యాసము వ్రాయుటకు ప్రేరేపించెను. పవిత్ర ఖుర్ఆన్ అంద చందాలను తిలకించి మా వ్యతిరేకులు అంధకారమును ప్రేమించి కాంతిని ద్వేషించి ఎంత అన్యాయము చేయుచున్నారో చూడుము. సర్వజ్ఞుడైన అల్లాహ్ దైవవాణి ద్వారా ఈ వ్యాసము సర్వ వ్యాసాలలో ఉత్కృష్టమైనదని, జయించునని నాకు తెలియ జేసెను. ఇందులోని సత్యము, వివేకము, జ్ఞానపు కాంతిని తిలకించి సమావేశము నందు పాల్గొనిన ఇతర జాతులు మొదటి నుండి అంతము వరకు వినినచో సిగ్గుపడిపోవును. క్రైస్తవులు గాని, ఆర్యులు గాని, సనాతన్ ధర్మము వారు గాని, మరెవరు గాని వారి గ్రంథముల నుండి ఇటువంటి మహిమలు చూపలేరు. ఎందుకనగా శక్తిమంతుడైన అల్లాహ్ ఈ రోజు ఈ గ్రంథపు నిజరూపమును బహిర్గత మొనరించ సంకల్పించెను, స్వప్నావస్థలో ఒక హస్తము నా భవనమును కొట్టెను. ఫలితముగా భవనము నుండి ఒక కాంతి వెళ్ళి నలువైపులు వ్యాపించెను. ఆ ప్రకాశము నా

చేతులపై పడినపుడు నా దగ్గర నిలిచివున్న వాడొకడు గట్టిగా اَللّٰهُ اَكْبَرُ خَرِبَتْ خَيْبَرُ "అల్లాహు అక్బర్ కరిబత్ కైబర్" అని అరిచెను. భవనమనగా పవిత్ర ఖుర్ఆన్, కాంతులు అవతరించు కేంద్రమైన నా హృదయము, కైబర్ అనగా అసత్య, అల్లాహ్‌కు తప్ప ఇతరులను ఆరాధించు మానవునికి అల్లాహ్ స్థానము నొసంగి, అల్లాహ్ గుణములను పూర్తిగా వాటి స్థానము నుండి తొలగించిన సర్వధర్మములు. ఈ వ్యాసము నలువైపులు వ్యాపించినపుడు అబద్ధపు అసత్య ధర్మముల నిజరూపము బయటపడునని, పవిత్ర ఖుర్ఆన్ సత్యము క్రమేణ తమ వలయమును పూర్తి చేయునని తెలుపబడెను. స్వప్నావస్థ నుండి దైవవాణి వైపు నన్ను మళ్ళించబడెను. اِنَّ اللّٰهَ مَعَكَ اِنَّ اللّٰهَ يَقُوْمُ اَيْنَ مَا قُمْتَ "ఇన్నల్లాహ మఅక ఇన్నల్లాహ యఖూము ఐనమా కుమ్త" అను దైవ వాణి నాకందెను. అనగా "అల్లాహ్ నీతో నున్నాడు నీవున్న చోట అల్లాహ్ వుండును". ఇది అల్లాహ్ సహాయమును తెలుపు రూప కాలంకారము.

నేనెక్కువ వ్రాయదలచ లేదు. కష్టమైనను భరించి లాహోర్‌లో జరుగు మహాసభలో ఉపస్థితులగుటకు, దానిలో వివరించు, వర్ణించు వాస్తవాలను తిలకించవలెనని ప్రతి ఒక్కరితో నేను కోరుచున్నాను. వారూహించలేని రీతిలో వారి విశ్వాసము, జ్ఞానము అభివృద్ధి చెంది లాభములు కలుగునని నా నమ్మకము.

*"వస్సలాము అలా మనిత్తబఅల్ హుదా"*

మార్గదర్శనమవలంభించు వారికి శాంతి కలుగుగాక!

మిర్జా గులాం అహ్మద్,

ఖాదియాన్

21 డిసెంబర్ 1896.

ఉదాహరణగా రెండు మూడు పత్రికల ప్రకటనలు ఈ క్రింద నివ్వబడుచున్నవి.

## సివిల్ అండ్ మిలటరీ గజిట్ (లాహొూర్)

"ఈ సభలో సభికుల ప్రత్యేక శ్రద్ధ ఇస్లాం రక్షణ నిపుణులు మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని లెక్చర్ పై కేంద్రీకృతమై వుండెను. ఈ లెక్చర్‌ను వినుటకు దూర దూరము నుండి వివిధ వర్గముల ఒక పెద్ద జన సమూహము వచ్చివుండెను. స్వయముగా మిర్జా గారు రాలే కుండిరి, కనుక అతని ఒక శిష్యుడు మున్షి అబ్దుల్ కరీం సియాల్కోటి గారు చదివి వినిపించిరి. 28 నాడు ఈ లెక్చర్ మూడు గంటల వరకు చదవబడెను. సభికులు దీనిని శ్రద్ధతో, ఆనందముతో వినిరి. కాని ఈ మూడు గంటలలో కేవలము ఒక ప్రశ్నకు సమాధానవే పూర్తయ్యెను. సమయము లభించినచో మిగిలిన భాగము కూడా వినిపించెదనని మౌల్వీ అబ్దుల్ కరీం గారు నుడివిరి. అందువలన నిర్వహణ కమిటి, అధ్యక్షులు అనుమంతించినందులకు 29వ దినము పొడిగించబడెను."

## అఖ్బార్ "చౌధ్విఁ సది" (రావల్పిండి)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లెక్చర్‌ను ఇట్లు వివరించెను.

"మొత్తము ఉపన్యాసాలలో ఉత్తమమైనది, ఈ సభ ప్రాణమైనది. మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని గారి ఉపన్యాసము. దీనిని ప్రఖ్యాత వక్త మౌల్వీ అబ్దుల్ కరీం సియాల్కోటి గారు చాలా నైపుణ్యముతో చదివిరి. ఈ ఉపన్యాసము రెండు రోజులలో పూర్తయ్యెను. 28 డిసెంబర్ నాడు సుమారుగా నాలుగు గంటలు, 29 డిసెంబర్ నాడు రెండు గంటలు

మొత్తము ఆరు గంటల వరకు ఈ ఉపన్యాసము చదువబడెను. మౌల్వీ అబ్దుల్ కరీం గారు ఈ ఉపన్యాసము ఆరంభించినప్పటి నుండే సభికులు ముగ్ధులైరి. ప్రతి వాక్యమునకు ప్రశంసల వర్షము కురియుచుండెను. తరచుగా ఒక్కొక్క వాక్యమును మరల వినుటకు సభికులు కోరుచుండిరి. జీవితములో ఇంతమంచి ఉపన్యాసము మేము వినలేదనిన అతిశయోక్తి గాదు, ఇతర ధర్మముల వారి ఉపన్యాసములు వాస్తవముగా నియమిత ప్రశ్నలకు సమాధానాలుగా లేకున్నవి. అధిక వక్తలు కేవలము నాలుగవ ప్రశ్ననే తీసికొనిరి కాని మిగిలిన ప్రశ్నలు నామ మాత్రముగా పేర్కొనిరి. చాలా మంది మంచి వక్తలే గాని సారాంశరహితములైన ఉపన్యాసాలు వారివి. కేవలము మిర్జా గారి ఉపన్యాసములో ప్రతి ప్రశ్నకు విడి, విడిగా సంపూర్ణ సమాధానముండెను. దీనిని సభికులు చాలా శ్రద్ధతో ఆనందముతో వినిరి. ఉత్తమ మైనదని, అమూల్య ఉపన్యాసమని కొనియాడిరి.

మేము మిర్జా గారి శిష్యులము కాము. వారితో మాకు ఎట్టి సంబంధమూ లేదు. కాని న్యాయమును గాయపరచలేము. ఏ న్యాయ నిర్ణేత కూడ అట్లు చేయలేడు. మిర్జా గారు మొత్తం ప్రశ్నల సమాధానములు పవిత్ర ఖుర్ఆన్‌ను అనుసరించి వ్రాసిరి. ఇస్లాం గొప్ప గొప్ప సిద్ధాంతాలను తెలివికందునట్లు, తత్వమునననుసరించి వుండెను. బుద్ధికి సంబంధమైన నిదర్శనములతో అల్లాహ్ సమస్యలను నిరూపించుట, తరువాత వాటికి అనువైన అల్లాహ్ ప్రవచనములను ప్రవేశపెట్టుట శోభాయమానముగా వుండెను.

పవిత్ర ఖుర్ఆన్ సమస్యల ఫిలాసఫీని వివరించడమే కాక పవిత్ర ఖుర్ఆన్ పదముల ఫిలాలోజి, ఫిలాసఫీని కూడ మిర్జా గారు వెంటనే

విశదపరచిరి. మొత్తముపై మిర్జా గారి ఉపన్యాసము సంపూర్ణమై అన్నిటిలో ఉత్తమమై వుండెను. దానిలో అనేకములైన వివేక, గుప్తాంశములు, ఆదేశాలు, సత్యము ముత్యాల వలె మెరియుచుండెను. అల్లాహ్ ఫిలాసఫీని పొందుపరచి వివరించిన రీతిని చూచి సర్వ మతస్తులు ఆశ్చర్య పడిరి. ఏ ఉపన్యాస సమయములో ఇంత జన సమూహము ఉపస్థితి కాలేదు. మిర్జా గారి ఉపన్యాస సమయములో మొత్తము హాలు క్రింద పైన నిండి వుండెను. సభికులు శాంత చిత్తులై శ్రద్ధతో వినుచుండిరి. ఇతర వక్తల ఉపన్యాసముల కంటే మిర్జా గారి ఉపన్యాసములో జనులు తేనె టీగల వలె గుమిగూడిరి. ఇతర ఉపన్యాసముల సమయములో సభికులు రుచి లేనందున కూర్చొనివున్నవారు కూడ లేచి పోవుచుండిరి. మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ గారి ఉపన్యాసము పూర్తిగా సాధారణమైనదిగా వుండి మనము ప్రతి రోజు విను ముల్లాల ధోరణిలో వుండెను. దానిలో ఆశ్చర్యకరమైన, ప్రత్యేకమైన అంశమేదియును లేకుండెను. అతని రెండవ ఉపన్యాస సమయములో అనేక మంది లేచి హాలు బయటికి వెళ్ళిపోయిరి.

వారికి కేటాయించిన సమయము కంటే కొన్ని నిమిషములు కూడ అధికముగా తమ ఉపన్యాసమును పూర్తి చేయుటకు అనుమతి నొసంగబడలేదు.”

(అఖ్బార్ “చౌధ్వీం సదీ” రావల్పిండి 01-02-1897)

## జనరల్ - గోహర్ ఆసఫి పత్రిక- కలకత్తా

తమ 24 జనవరి 1897 ప్రచురణలో “లాహెూర్ మహాసభ” మరియు “ఫతహ్ ఇస్లాం” అను ద్వంద శీర్షికలలో ఇట్లు వ్రాసెను.

“సర్వ ధర్మ సమ్మేళన మహాసభలో ఇస్లాంను విశదీకరించుటకు

తగిన వ్యక్తి ఎవరని మా పత్రికలో చర్చ ఇంతకు ముందే జరిగిన విషయము మా చదువరులకు తెలిసినదే. మహాసభను గురించి వ్రాయక ముందు దానిని విషదపరచుట తప్పని సరి అని మేము భావించుచున్నాము. మా ఒక విలేకరి సత్యము, న్యాయమును దృష్టియందుంచుకొని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాన్‌ను ఎన్నుకొని వుండిరి. వారే గాక మరొక మా అభిమాని వారిని బలపరచి వుండిరి. మౌల్వీ సయ్యద్ ముహమ్మద్ ఫఖ్రుద్దీన్ ఫఖర్ గారు ఈ ఎన్నికను బలపరచుచు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారు ఖాదియాన్‌తో పాటు సర్ సయ్యద్ అహ్మద్ గారు అలీగఢ్‌ను కూడ ఎన్నుకొని వుండిరి. వారిద్దరితో పాటు ఇస్లాం ప్రతినిధులుగా ఈ క్రింది ప్రముఖులను కూడ ఎన్నుకొని వుండిరి. అనగా మౌల్వీ అబూ సయీద్ ముహమ్మద్ హుసేన్ గారు బటాల్వీ, మౌల్వీ హాజి సయ్యద్ ముహమ్మద్ అలీ గారు కాన్పూరి, మౌల్వీ అహ్మద్ హుసేన్ గారు అజీమాబాది పేర్లను కూడ నమోదు చేసి వుండిరి. ఇంతే గాదు మా పత్రిక లోకల్ విలేకరి ఒకరు తఫ్సీరె హఖ్ఖాని రచయిత మౌల్వీ అబ్దుల్ హఖ్ దహెల్వీ గారిని ఈ కార్యమునకు ఎన్నుకొని వుండిరి."

దీని తరువాత స్వామి శివ్‌గన్ చందర్‌గారు హిందూ దేశ మత పండితులను, విద్వాంసుల నుద్ధేశించి వారి వారి మత వైభవములను తెలుపుటకు ప్రేరేపించినది వివరించుచూ ఈ పత్రిక ఇట్లు వ్రాసెను.

"ఈ సభ ప్రకటనలు చూచి, ఆహ్వానములందిన తరువాత హిందు దేశపు ఏ ఏ పండితులు, విద్వాంసులు ఇస్లాం ప్రాతినిధ్యము కొరకు ముందుకు వచ్చిరి. ఇస్లాంను బలపరచి నిదర్శనముల సాక్ష్యముల ద్వారా పవిత్ర ఖుర్ఆన్ రహస్యాలను విశదీకరించి ఇతర మతముల హృదయములను ఎంత వరకు ఆకర్షింపజేసిరి.

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారిని, సర్ సయ్యద్ అహ్మద్ గారిని ప్రత్యేకముగా సభ కార్యకర్తలు సభలో పాల్గొనడానికి ఆహ్వానించి వుండిరని మాకు తెలిసినది. అనారోగ్య కారణముచే హజ్రత్ మిర్జా గారు స్వయముగా సభలో పాల్గొనలేక పోయిరి. కాని తమ వ్యాసమును పంపి చదువడానికి తమ ప్రత్యేక శిష్యులు మౌల్వీ అబ్దుల్ కరీం సియాల్‌కోటి గారిని నియమించిరి. కాని సర్ సయ్యద్ అహ్మద్ గారు సభలో పాల్గొనడానికి గాని, తమ వ్యాసము పంపడానికి గాని వెనుకాడిరి. వృద్ధులై ఇట్టి సభలలో రాలేకుండిరని కాదు. ఆ సమయములోనే మీరత్ నందు ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ ఉండినదని గాని కాదు. మతపరమైన సభలు వారి హెూదాకు తగినవి కావని వారు ఇందులో పాల్గొనలేదు. వారు మత సంస్కర్తగాని, ఉపదేశకులు గాని, మౌల్వీగాని కారని, ఈ కార్యము ఉపదేశకులది, మత సంస్కర్తలదని వారు తమ లేఖలో స్పష్టముగా వ్రాసివున్నారు. ఈ లేఖను మా పత్రికలో మరెప్పుడైన ప్రచురింప జేయుదుము. మౌల్వీ సయ్యద్ ముహమ్మద్ అలీ గారు కాన్పూరి, మౌల్వీ అబ్దుల్ హఖ్ దహెల్వి గారు, మౌల్వీ అహ్మద్ హుసేన్ అజీమాబాది గారు ఈ సభ వైపు ఏమియును శ్రద్ధ వహించలేదని సభా కార్యక్రమములను తిలకించిన తరువాత మాకు తెలిసినది. ఇంతే గాదు నేటి ఇస్లాం పండితులలో నుండి ఎవరు కూడా ఉపన్యసించుటకు గాని, తమ వ్యాసము చదువుటకు పంపుటకు గాని ముందుకు రాలేదు. ఒకరిద్దరు ఇస్లాం పండితులు ధైర్యము చేసి ముందుకు వచ్చిన నియమిత అంశములను చర్చించక ఏదో వాదించిరి, ఇది మా రాబోవు వార్తలో స్పష్టమగును. సభ కార్యక్రమములు తిలకించిన తరువాత కేవలము **హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ ఈ మైదానములో దిగి ఇస్లాం బాధ్యతను**

**పూర్తిగా నిర్వర్తించిరని రూఢి అయినది.** పెషావర్, రావల్పిండి, జెహలుం, షాహ్‌పూర్, భేర, ఖోషాబ్, సియాల్‌కోట్, జమ్ము, వజీరాబాద్, లాహెూర్, అమృత్‌సర్, గుర్దాస్‌పూర్, లుధ్యానా, షిమ్లా, ఢిల్లీ, అంబాలా, పటియాలా, కపూర్‌థల, డెహ్రాదూన్, అలహాబాద్, మద్రాస్, బొంబాయి, హైద్రాబాద్ దక్కన్, బెంగళూరు మొదలగు ప్రాంతాల నుండి వివిధ ఇస్లాం వర్గములు సంతకాల పత్రములు పంపి వారిని ఎన్నుకొనిన దానిని వారు వమ్ము చేయలేదు. **ఈ సభలో హజ్రత్ మిర్జా గారి వ్యాసమే లేనిచో ఇస్లాం వర్గములకు ఇతర మతముల ముందు అవమానము పొంది సిగ్గుతో తల దించుకోవలసి వచ్చేది. కాని అల్లాహ్ పవిత్ర ఇస్లాంను అపజయము నుండి రక్షించెను. ఈ వ్యాసము వలన ముస్లిములకే గాక వ్యతిరేకులు కూడా సహజ ప్రేరణతో ఈ వ్యాసము అన్నిటిలో మేటి అయినదని వక్కానించిరి. ఇది అమోఘమైన జయము. ఇంతే గాక వ్యాసము పూర్తి అయిన తరువాత ఇస్లాంను నిరాకరించు వారు ఇస్లాం సత్యము బహిర్గతమైనది, ఇస్లాం జయించినదని కొనియాడిరి.** ఈ ఎన్నిక సరియైనదని, తిరుగులేనిదని తేలెను. దీనిని వ్యతిరేకించుటకు ఎంత మాత్రం వీలు లేదు. ఇది మాకు గర్వ కారణము. ఎందుకనగా దీనిలో ఇస్లాం వైభవము గొప్పదనము, సత్యము ఇమిడి వున్నది.

ఈ సర్వ ధర్మ సమ్మేళన మహా సభ భారత దేశములో రెండవది. కాని ఇది తమ వైభవము గొప్పదనము వలన సర్వ హిందూ దేశములో

జరిగిన మహా సభలను, కాన్ఫరెన్సులను వెనుకకు నెట్టి వేసెను. హిందూ దేశ వివిధ ప్రాంతముల విద్వాంసులు దీనిలో పాల్గొనిరి. మా మద్రాస్ కూడ దీనిలో పాలుపంచుకొనినదని తెలుపుటకు మేమానందించు చున్నాము. సభ యందు అభిరుచి పెరిగినందులకు నియమిత మూడు రోజులే గాక ఒక రోజు పొడిగించవలసి వచ్చెను. సభ నిర్వహణ కొరకు విశాలమైన లాహెూర్ నగరములో అతి పెద్ద భవనము ఇస్లామీయా కాలేజ్‌ను నిర్వహకులు ఎన్నుకొని వుండిరి. కాని అధిక జన సమూహము వలన ఈ భవనము అతి చిన్నదైపోయెను. పంజాబ్ ప్రముఖులే గాక చీఫ్ కోర్ట్, హై కోర్ట్ అలహాబాద్, ఆనరేబుల్ న్యాయాధీషులు బాబు పర్తోల్ చందర్ గారు మరియు మిస్టర్ బెనర్జీ చాలా సంతోషముతో ఈ సభలో పాల్గొనిరి. ఇది ఈ సభ గొప్పదనమునకు, వైభవమునకు నిదర్శనము."

ఈ వ్యాసము ముందు "సర్వ ధర్మ మహా సభా లాహెూర్ నివేదికలో వున్నది వున్నట్లు ప్రచురింపబడెను. అహ్మదియ్య ముస్లిం సంఘము వైపు నుండి "ఇస్లాం తత్వజ్ఞానము" నామముతో గ్రంధరూపములో అనేక ఎడీషన్లు ఉర్దు, ఆంగ్ల భాషలలో ప్రచురించబడినవి. ఈ భాషలో గాక ఫ్రాన్సిస్, డచ్, స్పానిష్, అరబ్బి, జర్మన్ మొదలగు భాషలలో ప్రచురించ బడినది. దీనిపై గొప్ప గొప్ప తత్వవేత్తలు, విదేశీ పత్రికలు, మ్యాగజైన్‌ల సంపాదకులు కూడ చాలా ప్రశంసనీయమైన రివ్యూ వ్రాసిరి. పశ్చిమ ఆలోచనా కర్తలు ఈ లెక్చర్‌ను చాలా ప్రశంసించిరి. ఉదాహరణకు కొన్ని రివ్యూలు క్రింద నివ్వబడినవి.

1. **"బ్రిస్టల్ టైమ్స్ అండ్ మిఱ్ఱర్"** ఇట్లు వ్రాసెను:

"ఐరోపా, అమెరికాను ఈ రూపములో సంబోధించు వ్యక్తి నిశ్చయముగా సాధారణమైన వ్యక్తి కాలేదు."

2. "**స్పిరుచవల్ జనరల్**" బోస్టన్ ఇట్లు కొనియాడెను:

"ఈ గ్రంథము మానవాళి కొరకు నిశ్చయముగా ఒక స్వచ్ఛమైన శుభవార్త."

3. "**థియోసోఫికల్ బుక్ నోట్స్**" ఇట్లు వ్రాసెను:

"ఈ గ్రంథము ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మ ఉత్తమ గ్రంథము శోభాయమాన రూపము."

4. "**ఇండియన్ రివ్యూ**" ఇట్లు వ్రాసెను:

"ఈ గ్రంథము వివేకము, కాంతి, సారవంతమైన జ్ఞానముతో నిండి వున్నది. దీనిని చదివిన ప్రతి ఒక్కరు ప్రశంసించక వుండలేరు."

5. "**ముస్లిం రివ్యూ**" ఇట్లు వ్రాసెను:

"ఈ గ్రంథమును చదువు వాడు దీనిలో సత్యమైన, గూఢమైన, నిజరూపములో ఆత్మను రంజింపజేయు అంశములను కనుగొనును." ("సిల్సిల అహ్మదియ్య" రచయిత హజ్రత్ సాహెబ్‌జాద మిర్జా బషీర్ అహ్మద్ ఎమ్.ఏ.గారు పుట 69)

ఈ వ్యాసము నందు ఇతర అంశములపై దాడి చేయబడలేదు.

ఇతర మతములను విమర్శించక కేవలము ఇస్లాం గుణములు ఈ వ్యాసము నందు వివరించబడినవి. ఇదే దీని ప్రత్యేకత, ప్రశ్నలకు సమాధానములు పవిత్ర ఖుర్ఆన్ నుండి మాత్రమే వ్రాయబడినవి. తద్వారా ఇతర మతముల కంటే ఇస్లాం ఉత్తమమైనదని, మంచిదైనదని, సంపూర్ణమైనదని ఋజువగును.

హజ్రత్ మౌలానా జలాలుద్దీన్ షంస్

రూహాని ఖజాయిన్ సంపుటి 10 పుటలు 8–18

అపార దయామయుడు పరమ కారుణ్యమూర్తి అల్లాహ్ పేర

# ఇస్లాం

గౌ॥ హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాన్ గొప్ప నాయకుల ఈ వ్యాసమును మౌలానా మౌల్వీ అబ్దుల్ కరీం సియాల్కోటీ గారు లాహోర్‌లోని మహా సర్వ ధర్మ మహోత్సవములో 27 డిసంబర్ 1996 తేదీన నిలబడి వినిపించిరి.

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ
نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ

## దావా, సాక్ష్యము అవతరణ గ్రంధము నుండి వుండుట అనివార్యము

ఆహ్వానితులు, ప్రకటించబడిన ప్రశ్నల సమాధానములు తమ ధర్మ గ్రంధముల నుండి వెల్లడించుట ఈ రోజు ఈ శుభప్రదమైన మహా సభ ముఖ్యోద్దేశము. నేను ఇస్లాం గుణములను వివరింతును. నేనేమి వివరించినను అల్లాహ్ మాటలగు పవిత్ర ఖుర్‌ఆన్ నుండే వివరించడము జరిగినదని తెలుపుటకు గర్వ పడుచున్నాను. తాననుసరించు గ్రంధము అవతరించిన గ్రంధమని నమ్మిన ప్రతి వాడు దాని ఆధారముగనే ప్రతి ప్రశ్నకు సమాధానమిచ్చుట నా దృష్టిలో తప్పనిసరి. లేనిచో ఒక క్రొత్త గ్రంధము సిద్ధమగును. కనుక పవిత్ర ఖుర్‌ఆన్ సుగుణము నిరూపించి మహిమలు ప్రదర్శించుటకు మనము ప్రతి విషయము నందు కూడ దానిననుసరించి దాని సూక్తులనాధారముగా వ్యాసము వ్రాసిన ప్రేక్షకులకు

సత్యాసత్యాలు తెలిసికొనుటకు సులువగును. అప్పుడు తాను అనుసరించు, దైవిక గ్రంధమును నమ్ము ప్రతివాడు ఆయా గ్రంధముల నుండే సాక్ష్యాలు ప్రవేశపెట్టును. కనుక నేను హదీసులను చర్చించలేదు. సత్య హదీసులు పవిత్ర ఖుర్ఆన్ లోనివే. అది ఒక లోపము లేని ఉత్తమమైన సంపూర్ణ గ్రంధము. మొత్తము గ్రంధముల చర్చ దానిలో గలదు. పవిత్ర ఖుర్ఆన్ మహిమ శోభ బహిర్గతమగు దినము. ఈ దినము. ఈ కార్యము నందు అల్లాహ్ సహాయమును నేను అర్థించుచున్నాను. (ఆమీన్)

# మొదటి ప్రశ్న

## మానవుని శారీరక, నైతిక, ఆధ్యాత్మిక స్థితిగతులు

సమాధానములు సులువుగా సరిగా గ్రహించుటకు, సమాధానములకు ముందు కొన్ని పరిచయ వాక్యములు వ్రాయబడినవి. ఇవి సంబంధము లేనివిగా అగుపడును. కాని వీటిని అర్థము చేసికొనుట చాలా అవసరం.

## మూడు విధములైన మానవుని చర్యలు

సహజ, నైతిక, ఆధ్యాత్మిక సంబంధమైనది మొదటి ప్రశ్న. పవిత్ర ఖుర్ఆన్ ఈ మూడు స్థితిగతులను మూడు వేర్వేరు ఉత్పత్తి స్థానములుగా విభజించినది. వాటిలో నుండి ఇవి వేర్వేరుగా బయలు దేరును.

## మొదటి ఉత్పత్తి స్థానము - స్వార్థము

ఇది మొత్తము సహజ స్థితులకు మూల స్థానము. దీనిని పవిత్ర ఖుర్ఆన్ 'నఫ్‌సె అమ్మారహ్' అని పేర్కొనినది. అనగా స్వార్థము, చెడును నింపుకొని వుండును. ఇట్లు నుడివెను.

اِنَّ النَّفْسَ لَاَمَّارَةٌۢ بِالسُّوْٓءِ

(యూసుఫ్ 12:54)

అనగా మానవుని ప్రగతి, నైతిక స్థితులకు విరుద్ధముగా స్వార్థము అతనిని తమ వైపు ఆకర్షించును. ఇష్టము లేని అపమార్గముపై నడిపించగోరును. వ్యసనములకు, దుష్కార్యములకు లోనగుట మానవుని ఒక సహజ గుణము. నైతిక స్థితి కంటే ముందు ఇది అతనిని పూర్తిగా ఆవరించును. ఇది మానవుని సహజ స్థితి. ఈ స్థితి మానవుని యందు తెలివి మార్గదర్శనము చోటు చేసికొనునంత వరకుండును. చతుష్పాదమల వలె తినుట, త్రాగుట, పరుండుట, మేల్కొనుట, కోపము, రెచ్చగొట్టు సహజ స్థితులను మానవుడు అనుసరించును. మార్గదర్శనము, తెలివికుపయోగించి దీనిపై అదుపు సాధించినప్పుడు ఈ స్థితి సహజ స్థితి గాక నైతిక స్థితిగా మారును.

## రెండవ ఉత్పత్తి స్థానము: తమను నిందించు ఆత్మ

ఈ ఉతప్పత్తి స్థానమును పవిత్ర ఖుర్ఆన్ 'నఫ్సె లవ్వామహ్' అని పేర్కొనెను. పవిత్ర ఖుర్ఆన్ ఇట్లనెను.

وَلَآ اُقْسِمُ بِالنَّفْسِ اللَّوَّامَةِ ۝٣

(అల్ ఖియామహ్ 75:03)

అనగా తమను నిందించు ఆత్మ సాక్ష్యము. అది దుష్కార్యము, ప్రతి ఆక్రమము నందు తమను నిందించును. ఇది మానవుని స్థితులలో రెండవ ఉత్పత్తి స్థానము. దీని నుండే నైతిక స్థితులు ఉత్పన్నమగును. ఈ స్థితి యందు మానవుడు జంతువుల స్వభావము నుండి విముక్తి పొందును. దీని సాక్ష్యమనగా దీనిని గౌరవించుట. దుష్కార్యములు, వ్యసములను

ఇష్ట పడక వాటిని నిందించు స్థాయిని అందుకొనినందుకు దైవ మర్యాదకు యోగ్యత పొందును. మానవున్ని చెడు నుండి ఆపుట వలన సహజ స్థితి యందు యధేచ్ఛగా చదుష్పాదముల జీవితమును గడుపుటకు ఇష్టపడనందులకు దీనిని 'నఫ్సె లవ్వామహ్' అని పిలిచిరి. నైతిక విలువలు పుట్టి మంచి స్థితి నందుకొనుటకు, మానవ జీవిత అవసరములు, సహజపు కోరికలు తెలివితో నిండినవిగా వుండవలెనని కోరిక జనించును. దుష్కార్యములను, చెడును నిందించును. కనుక దీని పేరు నిందించు ఆత్మ అనగా సహజ ఆదేశమును ఇష్టపడక తమను చాలా వరకు అదుపులో పెట్టుటకు ప్రయత్నించుచునే వుండును. కాని సన్మార్గమవలంభించుటకు, సత్కార్యములు చేయుటకు కూడ పూర్తిగా యోగ్యత యుండదు. ఒక్కొక్కప్పుడు సహజ ఆవేశములు దానిని ఆవరించినప్పుడు, ఒక శిశువు నడుచునప్పుడు పడుట ఇష్టపడదు కాని బలహీనత వలన పడిపోవును. తమ బలహీనతను స్వీకరించిన విధముగా పడిపోవును. సద్గుణములను ప్రోగు చేసికొని, దుర్గణముల నుండి దూరముండి పూర్తిగా సహజ స్వభావమును గెలువని స్థితి ఈ రెండవ స్థితి.

## మూడవ ఉత్పత్తి స్థానము-తృప్తి పడిన ఆత్మ

ఆధ్యాత్మిక స్థితులు జన్మించు స్థానము మూడవది. దీనిని పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు వర్ణించెను.

يَٰٓأَيَّتُهَا ٱلنَّفْسُ ٱلْمُطْمَئِنَّةُ ۝٢٨ ٱرْجِعِىٓ إِلَىٰ رَبِّكِ رَاضِيَةً مَّرْضِيَّةً ۝٢٩
فَٱدْخُلِى فِى عِبَٰدِى ۝٣٠ وَٱدْخُلِى جَنَّتِى ۝٣١

(అల్ ఫజ్ర్ 89:28-31)

అల్లాహ్ నుండి విశ్రాంతి పొందిన ఓ ఆత్మ! తమ అల్లాహ్ వైపు తిరిగి రమ్ము. నీవు అతనితో, అతడు నీతో రాజీ పడిరి. నా దాసులలో కలిసిపొమ్ము, నా స్వర్గము నందు చేరుము. ఈ స్థాయి యందు ఆత్మ మొత్తము బలహీనతలతో విముక్తి పొందును. ఆధ్యాత్మిక శక్తులతో నిండిపోవును. అల్లాహ్‌తో సంబంధమేర్పరచు కొనును. అతనిని విడిచి జీవించలేదు. పై నుండి నీరు ఆటంకములు లేక చాలా జోరుగా ప్రవహించునట్లు అది అల్లాహ్ వైపు సాగును. "అల్లాహ్ నుండి విశ్రాంతి పొందిన ఓ ఆత్మ! అతని వైపు తిరిగి రమ్ము" అను వాక్యము దీనినే సూచించును. కనుక మరణానంతరము గాక ఈ జీవితము నందే అది ఒక గొప్ప మార్పు చెందును మరో స్థానము నందు గాక ఈ ప్రపంచము నందే అది ఒక స్వర్గమును పొందును. "నీవు తమ ప్రభువు వైపు అనగా పోషకుని వైపు రమ్ము" ఈ సూక్తి యందు సూచించినట్లు అల్లాహ్ పోషణలో వచ్చును. అల్లాహ్ ప్రీతి దాని ఆహారముగా మారును. జీవితమొసంగు ఈ చెలిమ నీరునే త్రాగును. అప్పుడు మరణము నుండి విముక్తి పొందును. అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్ నందు మరో చోట ఇట్లు నుడివెను.

قَدْ اَفْلَحَ مَنْ زَكّٰىهَا ۝ وَقَدْ خَابَ مَنْ دَسّٰىهَا ۝

(అశ్శమ్‌స్ 91:10,11)

అనగా భూ సంబంధ ఉద్రేకములను వీడినవాడు ముక్తి పొందును. సహజ ఆవేశాలకు భూ సంబంధ ఆవేశాలకు లోనగువాడు జీవితమునకు దూరమైనవాడే. మూడు స్థితులివి. మరో విధముగా వీటిని సహజ, నైతిక, ఆధ్యాత్మిక స్థితులనవచ్చును. సహజములైన కోరికల ఆధిక్యత అపాయకరమైనది. ఇది ఒకప్పుడు నైతిక, ఆధ్యాత్మిక విలువలను సర్వనాశనమొనర్చును. కనుక అల్లాహ్ పవిత్ర గ్రంధము నందు దీనిని

"నఫ్సె అమ్మారహ్" అని పేర్కొనెను. మానవుని సహజ స్థితులపై పవిత్ర ఖుర్ఆన్ ప్రభావమేమి? వాటిని గురించి సూచించిన మార్గమేమి? ఎంతవరకు వాటిని అదుపు చేయును? అను ప్రశ్నలు పుట్టినచో మానవుని సహజ స్థితులలో అతని నైతిక, ఆధ్యాత్మిక స్థితులకు గొప్ప సంబంధముండునని మానవుని, తిను, త్రాగు పద్ధతులు కూడా అతని నైతిక, ఆధ్యాత్మిక స్థితులపై ప్రభావము చూపునని తెలిసికొనవలెను. దైవిక ఆదేశానుసారము సహజ స్థితులనుపయోగించినచో, ఉప్పు గని యందు ప్రతిది ఉప్పుప్పు అగునట్లు ఈ స్థితులన్నియు నైతిక స్థితులుగా మారును. అవి ఆధ్యాత్మిక విలువలపై ప్రగాఢ ప్రభావమేయును. అందు కొరకే పవిత్ర ఖుర్ఆన్ సర్వ ప్రార్థనల కొరకు అంతర్గత బహిర్గత శుభ్రత కొరకు శారీరక శుభ్రత ముఖ్యమైనదని వెల్లడించెను. శారీరక అవయాల ప్రభావము ఆత్మపై ఎక్కువగా పడునని ఆలోచించినచో తేలును. సహజ కార్యములు శారీరకములైనను వాటి ప్రభావము మన ఆధ్యాత్మిక స్థితులపై పడునట్లు మనము చూచుచునే వున్నాము. మనము దుఃఖముతో ఏడ్చినచో మన కండ్లలో కన్నీరు ప్రవహించును. ఇది శారీరక మార్పు. కాని ఆ కన్నీరు ప్రభవాము హృదయస్పందనకు కారణమగును, ఫలితముగా హృదయము కూడ దుఃఖించును. అదే విధముగా మనము నవ్వినచో మన హృదయము కూడ ఆనందించును. శారీరక సాష్టాంగము కూడ ఆత్మలో భక్తిని, నమ్రతని, విధేయతలను పుట్టించును. ఈ విధముగనే మనము మెడను పైకెత్తి ఛాతిని ముందుకు చేసి నడిచినప్పుడు మనలో గర్వము పుట్టునట్లు మనము చూచెదము. అనగా శారీరక స్థితుల ప్రభావము నిస్సందేహముగా ఆత్మపై పడునని స్పష్టమగును.

వివిధములైన ఆహార వస్తువుల ప్రభావము కూడా మెదడు,

హృదయ శక్తులపై పడునని తెలియుచున్నది. మాంసము తినని వారు రాను రాను ధైర్య సాహసాలను కోల్పోయి బలహీనులగుట మనము ఆలోచించి చూచినచో తెలిసికొందుము. వారు ఒక ప్రశంసనీయమైన అల్లాహ్ ప్రసాదించిన శక్తిని కోల్పోవుదురు. మాంసాహార జంతువులలో గల ధైర్య సాహసాలు శాఖాహార జంతువులలో కానరావు. పక్షులలో కూడ ఇదే భేదముండును. కనుక నిస్సందేహముగా ఆహార వస్తువుల ప్రభావము నైతిక స్థితులపై వుండును. దివా రాత్రులు మాంసాహారము తినుచు శాఖాహారము చాలా తక్కువ వాడు వారు కూడా నమ్రత, సాధుత్వము కోల్పోవుదురు. మధ్యే మార్గమవలంభించు వారు ఈ రెండు గుణములు కలిగి వుందురు. దినినే పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు తెలుపును.

كُلُوْا وَاشْرَبُوْا وَلَا تُسْرِفُوْا

(అల్ ఆరాఫ్ 7:32)

అనగా మాంసముతో ఇతర వస్తువులను కూడ తినుము. కాని ఏ వస్తువును కూడ మితిమీరి తినకుము. లేనిచో నైతిక స్థితి దెబ్బతినును. ఆరోగ్యము చెడును. శారీరక కార్యముల ప్రభావము ఆత్మపై పడునట్లు ఆత్మ ప్రభావము కూడ శరీరముపై బడును. దుఃఖము కలిగిన వాడు కన్నీరు కార్చును, సంతోషము కలిగినవాడు సంతోషించును. మన తినుట, త్రాగుట, నిద్రించుట, మేల్కొనుట, విశ్రాంతి తీసికొనుట మొదలగు కార్యములన్నియు నైజములు, ఈ కార్యముల ప్రభావము మన ఆధ్యాత్మిక స్థితులపై పడును. మన శారీరక నిర్మాణముతో మానత్వమునకు గొప్ప సంబంధము గలదు. మెదడునకు దెబ్బ తగిలినచో హఠాత్తుగా జ్ఞాపక శక్తి పోవును. మరో స్థానము నందు తగిలిన దెబ్బకు స్పృహ తప్పిపోయెదము. విషవాయువు శీఘ్రగతిలో శరీరమును, హృదయమును

కూడ ప్రభావితము చేసి అంతర్గత క్రమమును చెడిపి నైతికమును చెదరగొట్టును. అప్పుడు కొన్ని నిమిషములలో మానవుడు పిచ్చివాడై మరణించును. శారీరక బాధలు చూచిన తరువాత ఆత్మ శరీరము మధ్య విడదీయరాని సంబంధము గలదని రూఢి అగును. దీనిని వివరించుట మానవుని పని కాదు. గర్భవతుల కడుపు నందు ఆత్మ ఎప్పుడు పై నుండి బడదు. అది ఒక కాంతి వీర్యములోనే దాగికొని వుండును. శరీరము పెరుగుదలతో అది ప్రకాశించుచుండును. కనుక ఆత్మ తల్లి శరీరమేనని తెలియును. వీర్యము నుండి పుట్టి గర్భము నందు ఆత్మ తయారగునని శక్తి సంపన్నుడైన అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ నందు ఇట్లు తెలిపెను.

ثُمَّ اَنْشَاْنٰهُ خَلْقًا اٰخَرَ ؕ فَتَبٰرَكَ اللّٰهُ اَحْسَنُ الْخٰلِقِيْنَ ۝١٥

(అల్ ము’మినూన్ 23:15)

అనగా మేము గర్భము నందు సిద్ధమైనది శరీరమును మరో రూపము నందు పుట్టింతుము. అదే ఆత్మ అని పిలువబడును. అల్లాహ్ శుభములు గల వాడు. అతడు తప్ప మరో సృష్టికర్త లేదు. “మేము ఆ శరీరము నుండే మరో ప్రాణమును పుట్టింతుము” అనునది ఆత్మ వాస్తవమును తెలుపు ఒక రహస్యము. శరీరము, ఆత్మ మధ్య గల ప్రగాఢ సంబంధమును తెలుపుచున్నది. మానవ శారీరక కర్మలు, మాటలు, సర్వ సహజ కార్యములు అల్లాహ్ కొరకు అతని మార్గము నందు బహిర్గతమైనచో వాటికి కూడా ఈ దైవిక తత్వమే కారణము. అనగా వీర్యము నందు గుప్తముగా వున్నట్లు ఈ కార్యములలో కూడా ఒక ఆత్మ దాగివుండును. కార్యములు ఆకార రూపము దాల్చినట్లు ఆత్మ ప్రకాశించును. ఆకారము సిద్ధమైనప్పుడు ఆ ఆత్మ తనను ప్రకటించును. వెంటనే ఒక వస్తువు పిడుగు మాదిరి లోపలి నుండి తన కాంతిని

వెదజల్లును. ఈ కాలము గురించి అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ నందు ఇట్లు నుడివెను.

فَاِذَاسَوَّيۡتُهٗ وَنَفَخۡتُ فِيۡهِ مِنۡ رُّوۡحِىۡ فَقَعُوۡا لَهٗ سٰجِدِيۡنَ ۝٣٠

(అల్‌హిజ్ర్ 15:30)

అనగా దాని ఆకారము పూర్తి చేసి మొత్తము మహిమలను నింపి నేను దాని యందు ప్రాణము పోసినప్పుడు మీరందరు అతని కొరకు భూమిపై సాష్టాంగములు చేయుము. చర్యలు రూపము దాల్చినప్పుడు దానిలో అల్లాహ్ తమ వైపు నుండి నింపిన ప్రాణము ప్రకాశించుననని ఈ సూక్తి తెలియజేయును. ప్రాపంచక జీవితము అంతమైన తరువాత ఆ స్థితి సిద్ధమగును. కనుక అల్లాహ్ కాంతి మందముగా వున్నది ఒకే సారి ప్రజ్వరిల్లును. అల్లాహ్ గొప్పదనమును చూచి ప్రతివాడు సాష్టాంగము చేయక, ఆకర్షింపబడక మానడు. కనుక అంధకారమును కోరు ఇబ్లీసు తప్ప ప్రతివాడు ఈ కాంతిని చూచి సాష్టాంగము చేయును, ఆ వైపు వచ్చును.

ఇచట మరో విషయమును ప్రస్తావించుట తప్పక లాభదాయక మగును. అదేమనగా గర్భములో పుట్టు బాలుడు నాలుగు నెలల పది రోజుల తరువాత కదులును. బాలుడు గర్భములో ఒంటరిగా యుండే కాలములో ఇది అర్ధ భాగము. 'జనీన్' అనగా గర్భములో యుండే బాలుడు నాలుగవ నెలలో తమ జీవిత మహిమ చూపి, మొక్క పరిస్థితి నుండి మానవ పరిస్థితికి చేరునో ఇదే ప్రకృతి చట్టము ఆధ్యాత్మిక పుట్టుకలో కూడ గలదు. అనగా జనీన్ (బాలుడు) గర్భములో ఒంటరిగా తమ జీవితములోని సుమారు అర్ధ భాగము గడిపిన తరువాత తమ జీవిత లక్షణములను బహిర్గతము చేయును, జీవిత సంపూర్ణ వైభవమును

చూపును. ఈ పరిస్థితే ఆధ్యాత్మిక జీవితములో కూడ నిర్ణయించబడెను. బుద్ధిహీనత మలినములు, లోపములతో పవిత్రమైన మానవుని జీవితము అనుభవము మేరకు 80 సంవత్సరముల వయసు వరకుండును. 80లో సగం 40 అగును. నాలుగు నెలలు ముగిసిన తరువాత బాలునికి జీవిత ఆత్మ లభించునను నాలుగుతో ఇది చాలా వరకు పోలియున్నది. నిజమైన అనుభవము సూచించునదేమనగా మానవుడు గర్భములోని నాలుగు నెలలతో పోల్చి యున్న తమ గొప్ప జీవితపు సగ భాగము అనగా 40 సంవత్సరములు గడుపునో లేదా దాని వరకు చేరునో అప్పుడు అతని భాగ్యములో సత్యాత్మ యున్నచో అప్పుడా ఆత్మ ఆ ప్రత్యేక సమయమునకు చేరినప్పుడు తన స్పష్టమైన లక్షణములను చూపును. కదలిక మొదలు పెట్టును.

నలుభై సంవత్సరముల క్రితం చాలా మందిపై అంధకార కాలము పైచేయి సాధించునను విషయము ఒకరితో దాగి యున్నది కాదు. ఎందుకనగా ఏడు, ఎనిమిది సంవత్సరములు బాల్యములోనే గడిచిపోవును. అనంతరం 25, 26 సంవత్సరముల వరకు విద్యాభ్యాసంలోనే నిమగ్నమై వుండును లేదా ఆటల పాటలలో సమయమును వృథా చేయును. దాని తరువాత వివాహము అయినందున, భార్య, పిల్లలు అయినందున లేదా ఏదో రకంగా ప్రాపంచిక కోరికలు అతన్ని జయించును. ప్రాపంచిక ధనము, గౌరవముల కొరకు వివిధ కోరికలు, ఆశలు ఏర్పడును. అభిరుచులను పూర్తి చేయుటకు ఆలోచన ధోరణి దిగజారిపోవును. అల్లాహ్ తఆలా వైపు శ్రద్ధ వహించినను ప్రాపంచిక కోరికలు కొంత మేరకు ముడిపడివుండును. ప్రార్థన చేసినను బహుశా ప్రపంచము కొరకు చాలా చేయును. రోధించినను బహుశా అందులో ప్రాపంచిక ఉద్దేశ్యములు

కూడ కలిసియుండును. ప్రళయ దినము పట్ల చాలా బలహీన విశ్వాసముండును. ఒక వేల యున్నను ఇంకా మరణించుటకు చాలా కాలము యున్నదని భావించి ఒక ఆయకట్టు తెగి చుట్టు ప్రక్కల భూమిని సర్వనాశనం చేసినట్లు మానసిక కోరికల వరద జీవితమును అతి ప్రమాదములో పడవేయును. ఇటువంటి స్థితిలో అతడు ప్రళయ దినపు సూక్ష్మమైన విషయములను ఎన్నడు నమ్మవచ్చును. వాస్తవానికి అతడు ధార్మిక అంశములపై హాస్యించును, ఎగతాళి చేయును, తన పసలేని, బుద్ధిహీన తత్వమును ప్రదర్శించును. కాని సత్యస్వభావికుడైనచో దేవున్ని కూడ నమ్మును. కాని హృదయపూర్వకముగా సత్యము, విశ్వసనీయతతో కాక తన సఫలముల నిబంధనతో నమ్మును. ప్రాపంచిక ఉద్దేశములు లభించినచో దేవుని వాడగును లేనిచో షైతాన్ వాడగును.

యదార్థమేమనగా ఈ యుక్త వయసులో సున్నితమైన స్థితి వుండును. దేవుడు కరుణించనిచో నరకాగ్నిలో పడిపోవును. ఈ వయసే అన్ని చెడులకు మూలమను విషయములో సందేహము లేదు. ఈ వయసులో మానవుడు అధికంగా శారీరక వ్యాధులు, సిగ్గుమాలిన రోగములను కొనుక్కొనును. ఈ అపరిపక్వత వయసు తప్పిదముల వల్లనే నిజమైన, మార్పునకు గురి కాని దేవునితో విముఖత చెందును. ఈ కాలములో దేవుని భయము తక్కువ, లైంగికమును ఆశించు మనసు జయము పొందియుండును. ఉపదేశకుని మాట వినదు. ఈ వయసు తప్పిదముల ఫలితములను జీవితమంతా అనుభవించవలసి యుండును. అనంతరం 40 సంవత్సరములకు చేరినప్పుడు యవ్వనపు లక్షణములు ఒక్కొక్కటిగా అంతమగుచుండును. ఉపదేశకులు చెప్పి చెప్పి అలసిపోయిన ఆయా అనేక తప్పిదముల పట్ల ఇప్పుడు స్వయముగా పశ్చత్తాపపడును.

శారీరకంగా బలహీన వయసు కాలము మొదలైనందున మానసిక ఉద్రేకము దానంతట అదే తగ్గిపోవును. గతములో పుట్టే ఉడుకు రక్తం ఇప్పుడెక్కడ ఏర్పడును. గతములో యున్న అవయవముల శక్తి, యవ్వన మస్తితో కూడన ఆనందమెక్కడ మిగిలియుండును. ఇప్పుడు బలహీనత, నష్టపు కాలము వచ్చును. ఇంకా తమ వయసు కంటే చాలా పెద్దగా యున్న పెద్దల మరణములను వరుసగా చూడవలసివచ్చును. కాని కొన్ని సార్లు దైవ నిర్ణయములతో సంభవించే చిన్న వయస్కుల మరణములు నడ్డి విరుచును. బహుశా ఇదే కాలములో తల్లిదండ్రులు కూడ సమాధులకు చేరుతారు. ప్రపంచ అస్థిరత గురించి అనేక ఉదాహరణలు బహిర్గతమగును. ప్రపంచ కథా ఇట్లుండునని అల్లాహ్ తఆలా అతని ముందు అద్దము పెట్టును. దేని కొరకైతే నీవు చచ్చిపోతున్నావో దాని అంతమిట్లుండును. అప్పుడు తన గత తప్పిదములను నిరాశతో చూడును. ఒక భారీ విప్లవము అతనిలో ఏర్పడును. అతని అదృష్టములో పుణ్యము యున్న యెడల ఆహ్వానము పంపబడిన వారిలో అతడున్నచో ఒక నూతన జీవితము మొదలగును. దీని గురించే అల్లాహ్ తఆలా ఇట్లనెను.

وَوَصَّيْنَا الْإِنْسَانَ بِوَالِدَيْهِ إِحْسٰنًا ۖ حَمَلَتْهُ أُمُّهُ كُرْهًا وَّوَضَعَتْهُ كُرْهًا ۖ
وَحَمْلُهُ وَفِصٰلُهُ ثَلٰثُوْنَ شَهْرًا ۖ حَتّٰى إِذَا بَلَغَ أَشُدَّهُ وَبَلَغَ أَرْبَعِيْنَ سَنَةً ۙ قَالَ
رَبِّ أَوْزِعْنِيْٓ أَنْ أَشْكُرَ نِعْمَتَكَ الَّتِيْٓ أَنْعَمْتَ عَلَيَّ وَعَلٰى وَالِدَيَّ وَأَنْ أَعْمَلَ
صَالِحًا تَرْضٰهُ وَأَصْلِحْ لِيْ فِيْ ذُرِّيَّتِيْ ۚ إِنِّيْ تُبْتُ إِلَيْكَ وَإِنِّيْ مِنَ الْمُسْلِمِيْنَ ﴿١٦﴾

(అల్ అహ్ఖాఫ్ 46:16)

అనగా తమ తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించుమని మేము మానవునికి ఉపదేశమందించితిమి. నీ తల్లి నీ కొరకు ఎంతటి బాధలు అనుభవించినదో చూడుము. ఆమె నిన్ను కడుపులో మోయుచు ఒక సుదీర్ఘ కాలము వరకు బాధలో యుండెను. బాధలు, ఇబ్బందులతో నీకు జన్మనిచ్చెను. నీకు పాలు త్రాగించడం, నిన్ను మోయడం వలన ఆమె ముప్పది నెలల వరకు బాధలు భరించెను. సత్పురుషుడు నలుబది సంవత్సరములకు చేరినప్పుడు, బుద్ధి పరిపక్వత చెందినప్పుడు అతనికి దేవుని ఆదేశములు గుర్తుకు వచ్చును. అప్పుడిట్లనును. ఓ నా పోషకుడా! నా పై, నా తల్లిదండ్రులపై నీవు చేసిన వరములకు కృతజ్ఞతలు తెలుపు అనుగ్రహము నాకిప్పుడివ్వుము. ఓ నా పోషకుడా! నీవు రాజీ పడు పనులు నాతో చేయించుము. నా సంతానమునకు నా కొరకు సామర్థ్యము ప్రసాదించుము. అనగా నేను తల్లిదండ్రుల సేవలో ఏమైనా తగ్గుదల చేసినచో వారలా చేయకూడదు. మతి తప్పిన కాలము నాకు ఎదురైనచో వారికి ఎదురు కాకూడదు. ఓ నా అల్లాహ్! నేనిప్పుడు పశ్చత్తాప పడు చున్నాను. నేను నీ విధేయులలో చేరినాను. పుణ్య దాసులపై 40వ సంవత్సరం శుభకరముగా వచ్చునని అల్లాహ్ తఆలా ఈ సూక్తిలో తెలిపెను. సత్యపు ఆత్మ యున్న ఆత్మ 40వ సంవత్సరంలో తప్పక కదులును. దేవుని అధిక గొప్ప సందేశహరులు ఈ 40వ సంవత్సరంలోనే ప్రకటితమగుతారు. మన యజమాని, మార్గదర్శకులు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం 40వ సంవత్సరంలోనే ప్రజా సంస్కరణ కొరకు ఉద్భవించియుండిరి.

## ఆత్మ పుట్టుక

ఆత్మ గర్భము నందు పోషింపబడు శరీరము నందే పుట్టుననుట

నిజము, సరియైనది. అది ఒక చల్లని కాంతి, పుట్టుట అనగా ముందు గుప్తముగా నుండి తరువాత బహిర్గతమగును. మొదట దాని బీజము వీర్యము నందుండును. ఆకాశ అధినేత అల్లాహ్ సంకల్పము, ఇష్టము, అనుమతితో రహస్య స్థానములో వీర్యము నుండును. అదొక వీర్యపు ప్రకాశించు కాంతి శరీర భాగముల వలే ఇది వీర్యపు భాగమని అనలేము. కాని బయట నుండి వచ్చునని గాని, భూమిపై బడి వీర్యముతో కలియునని గాని చెప్పలేము. నిప్పు రాయి యందు వున్నట్లు అది వీర్యము నందు గుప్తముగా నుండును. ఆత్మ వేరుగా ఆకాశము నుండి అవతరించునని గాని, గాలిలో కలిసి భూమిపై పడి వీర్యములో కలిసి గర్భములో చేరునని గాని అల్లాహ్ గ్రంథపు అభిమతము గాదు. మురిగిన వస్తువులలో, మాసిన ఆహారములో, గాయములలో పురుగులు పడును. మైల బట్టలలో వందల పేనులు పుట్టుట, మానవుని కడుపునందు పురుగులు పుట్టుట మనము చూచుచునే ఉంటాము. అవి ఆకాశము నుండి వచ్చునని గాని, బయటి నుండి వచ్చునని గాని మనమందుమా ? అట్లూహించినచో సృష్టి శాసనమే తలక్రిందులగును. కనుక ఆత్మ శరీరము నుండే పుట్టుననుట సరియైనది, అదే నిజము. దీని వలననే అది పుట్టునని రూఢి అగును.

## ఆత్మ - రెండవ పుట్టుక

శక్తిమంతుడైన అల్లాహ్ ఆత్మను శరీరము నుండి పుట్టించినట్లు దీని రెండవ పుట్టుక కూడ శరీరము నుండే చేయాలని అతని సంకల్పమని మనకు తెలియవచ్చును. మన శరీర చర్యలపై ఆత్మ చర్యలు ఆధారపడి వుండును. శరీరమును మనమేవైపు చేసినను ఆత్మ ఆ వైపు దాని వెంట వచ్చును. కనుక మానవుని సహజ స్థితులను కనిపెట్టుట దైవిక గ్రంథపు కార్యము. అందు కొరకే పవిత్ర ఖుర్ఆన్ మానవ సహజ స్థితులను

సంస్కరించుటకు శ్రద్ధ వహించినది. మానవుని నవ్వు, ఏడ్పు, తినుట, త్రాగుట, ధరించుట, నిద్రించుట, పలుకుట, మౌనము వహించుట, అనారోగ్యములో ప్రత్యేక శ్రద్ధ వహించుట మొదలగు విషయములను గురించి పద్ధతులు, మార్గదర్శనము చూపినది. మానవ శరీర స్థితుల ప్రభావము ఆధ్యాత్మిక స్థితులపై ఎంతైనా వుండునని నిర్ణయించినది. ఆ మార్గములు, మార్గ దర్శక సూత్రాలు వ్రాసినచో సరిపోవు సమయము లభించునని నేనూహించలేను.

## మానవుని క్రమేణ పెరుగుదల

అల్లాహ్ తమ బోధలో మానవుని సహజ స్థితుల సంస్కరణ ఆదేశాలిచ్చి అతనినెట్లు పైకి తెచ్చును. ఆధ్యాత్మిక ఉత్తమ స్థితిని కల్పించగోరినది అతని పవిత్ర వచనములను ఆలోచించినప్పుడు తెలియవచ్చినది. మానవునికి మాట్లాడుట, కూర్చుండుట, లేచుట, తినుట, త్రాగుట, సామాజిక ఆచార వ్యవహారములు నేర్పి జంతు వ్యవహారము నుండి సంపూర్ణ సభ్యతను ప్రసాదించి సంస్కృతిని నేర్పవలెనని అల్లాహ్ ఆశయమని తేలును. ప్రాథమిక నీతిని ఉన్నత స్థాయి నందుకొనునట్లు చేయదలచెను. ఈ రెండు నిజానికి ఒకే రకమైన పద్ధతులు. ఇవి సహజ స్థితుల సంస్కరణ గురించి గలవు. ఇవి ప్రాథమిక ఉన్నత స్థాయిలుగా విభజింపబడినవి. మానవుడు నైతికముగా క్రింది స్థాయి నుండి పై స్థాయికి ఎదుగునట్లు నైతిక పద్ధతులను ఆ వివేకవంతుడు పొందు పరచివున్నాడు.

## ఇస్లాం వాస్తవికత

మానవుడు తమ సృష్టికర్త ప్రేమను ప్రీతిని పొందుటలో నిమగ్నమగునట్లు, సర్వస్వము అల్లాహ్ కొరకే అంకితము చేయునట్లు

మూడవ అభివృద్ధి పథముగా పెట్టెను. దీనిని జ్ఞప్తియందుంచుకొనుటకు ముస్లిముల ధర్మము పేరు ఇస్లాం పెట్టబడెను. ఇస్లామ్ అనగా మొత్తము అల్లాహ్‌కే అంకితమగుట, అల్లాహ్ పలికినట్లు.

بَلٰى مَنْ اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ فَلَهٗۤ اَجْرُهٗ عِنْدَ رَبِّهٖ
وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ○

(అల్ బఖరహ్ 2:113)

قُلْ اِنَّ صَلَاتِيْ وَنُسُكِيْ وَمَحْيَايَ وَمَمَاتِيْ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○
لَا شَرِيْكَ لَهٗ ۚ وَبِذٰلِكَ اُمِرْتُ وَاَنَا اَوَّلُ الْمُسْلِمِيْنَ ○

(అల్ అన్ఆమ్ 6:163,164)

وَاَنَّ هٰذَا صِرَاطِيْ مُسْتَقِيْمًا فَاتَّبِعُوْهُ ۚ وَلَا تَتَّبِعُوا السُّبُلَ فَتَفَرَّقَ
بِكُمْ عَنْ سَبِيْلِهٖ ؕ

(అల్ అన్ఆమ్ 6:154)

قُلْ اِنْ كُنْتُمْ تُحِبُّوْنَ اللّٰهَ فَاتَّبِعُوْنِيْ يُحْبِبْكُمُ اللّٰهُ وَيَغْفِرْ لَكُمْ
ذُنُوْبَكُمْ ؕ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ○

(ఆలె ఇమ్రాన్ 3:32)

అనువాదము: తమను అల్లాహ్ కొరకు, అల్లాహ్ మార్గము నందు పూర్తిగా బలిగొనుటకు సిద్ధమగువాడు విముక్తి పొందును. ఇట్లు వ్యవహరించువాని ప్రతిఫలము అల్లాహ్ వద్ద భద్రపరచబడినది. ఇట్టి వారికి భయముండదు దుఃఖముండదు. నా ప్రార్థనా, నా బలి, నా చావు

బ్రతుకులు సర్వమును ఆవరించుకొను అల్లాహ్ కొరకేనని పలుకుము. అతని భాగస్వామి ఎవడు కూడ లేడు, జీవ రాశులు అతనికి భాగస్వాములు కానేరరు. ఇట్లు చేయుటకు నన్నాదేశించనైనది. ఇస్లాంపై నిలకడగా వుండువాడు అనగా అల్లాహ్ మార్గము నందు త్యాగము చేయువారిలో నేను మొదటి వాడిని. ఇదే నా మార్గము. రమ్ము నా మార్గమునవలంభించుము. దీనికి భిన్నమగు మార్గమవలంభించిన అల్లాహ్‌కు దూరమగుదురు. వారితో ఇట్లనుము. అల్లాహ్ ప్రీతి కోరినచో నన్ననుసరించుము. నా మార్గమునవలంభించుము. అప్పుడు అల్లాహ్ కూడ మిమ్ము ప్రేమించి మీ పాపములను క్షమించును. అతడు గొప్ప క్షమాప్రపూర్ణుడు, దయామయుడు.

# సహజ, నైతిక పరిస్థితుల భేదము

# జీవ హత్య ఖండన

మానవుని మూడు స్థితులను వేర్వేరుగా విపులీకరణ చేయుటకు ముందు, మానవుని చెడుకు కేంద్రమైన, సహజ స్థితి. నైతిక స్థితితో వేరు కాదని అల్లాహ్ నుడివినది జ్ఞప్తియందుంచుకొనుట ఆవశ్యకము. శక్తిమంతుడైన అల్లాహ్ సర్వసహజ శక్తులను, శారీరక కాంక్షలను, అవసరములను సహజ స్థితులతో జోడించివున్నాడు. ఆ సహజ స్థితులనే ఉద్ధేశ్య పూర్వముగా అవసరము ప్రకారము ఉపయోగించినపుడు అవి నైతిక రూపమును దాల్చును. అటులనే నైతిక స్థితులు ఆధ్యాత్మిక స్థితులతో వేరు లేవు. అల్లాహ్‌కు పూర్తిగా అంకితమైనపుడు, కోరికల అదుపు అల్లాహ్ కోరికలకు, ప్రీతికి లోనై తృప్తితో అల్లాహ్ ఆదేశాలను పూర్తిగా అమలు పరచినపుడు అవి ఆధ్యాత్మిక స్థితుల రూపమును దాల్చును. సహజ

స్థితులు నైతిక స్థితులుగా మారనంత వరకు మానవుడు పొగడ్తకు అనర్హుడు. కారణము, ఇవి ఇతర జంతుజాలమునందు కూడ వుండును. అటులనే కేవలము నైతిక స్థితులు ఒక మానవునికి ఆధ్యాత్మిక జీవితమును ప్రసాదించలేవు. ఒకడు అల్లాహ్‌ను నిరాకరించి కూడ నైతికమును వ్యక్తపరచగలడు. సాధుత్వము, దయా ప్రదర్శన, శాంతిని, సంధిని కోరుట ఇవన్నియు సహజ స్థితులు. ఇవి ముక్తినెరుగని అయోగ్యునికి కూడ లభించవచ్చును. అనేక చతుష్పాదములు సాధువులు, కదలక సంధి కూడ చేసుకొనుటకు కూడ సమ్మతించును. దెబ్బలకు లొంగి ఎదుర్కొనుటకు కూడ సంసిద్ధులు కావు. వీటిని మనము మానవులనేము. ఈ గుణములు గల వారు ఉచ్ఛస్థితి మానవులు కాలేరు. అపనమ్మకము గల, వ్యసనములకు అలవడినవాడు సద్గుణములు కలిగి వుండవచ్చును. తమ గాయాలలో పెరుగు పురుగులను కూడ చంపుటకు వెనుకాడుట సాధ్యము. తమ నెత్తిలో పడు పేనులను, కడుపులో, పేగులలో, మెదడులో పుట్టు పురుగులను చంపుటకు కూడ వెనుకాడును. దయతో ఒకడు తేనె తినుటను కూడ మానుకోగలడని నేను నమ్మగలను. ఎందుకనగా అనేక ప్రాణాలను బలిగొనిన తరువాత ఈగలను వాటి స్థానముల నుండి వెడలగొట్టిన తరువాత గాని తేనె లభించదు. దుప్పిని చంపినగాని కస్తూరి లభించదని ఒకడు కస్తూరిని విడువ వచ్చును. ఒకడు ముత్యాలను, పట్టు వస్త్రములనుపయోగమును మానుకొనవచ్చును. ఈ రెండు కూడ పురుగులను చంపనిదే లభించవు. కష్టములు కలిగినప్పుడు ఒక జలగను అంటించుకొనుటకు వెనుకాడి దుఃఖమును భరించి వాటి మరణమును గోరలేదని కూడ నేను ఒప్పుకుంటాను. జీవహింస చేయరాదని ఒకడు నీరు త్రాగుట కూడ విడువగలడని నా నమ్మకం. దయానుగ్రహమును

పై విధముగా ప్రదర్శించినను అల్లాహ్ కలయికను నిరోధించు మలినము దూరమగునని, వీటిని నైతిక స్థితులనవచ్చునని నేను నమ్మను. కొన్ని చుతష్పాదములు, మృగముల వలె సాధుత్వము, కష్టపెట్టని గుణములు ప్రదర్శించి ఉచ్ఛస్థితి మానవత్వమును పొందవచ్చునని నేనెప్పుడు నమ్మలేను. ఇట్లనినచో సృష్టితో పోట్లాడుటనని నా నమ్మకము. సృష్టి మనకు ప్రసాదించిన వరమును ధిక్కరించినట్లగును. అవసరమున్నపుడు నీతిని, న్యాయమునపయోగించినపుడు, అల్లాహ్ మార్గమునందు నమ్మకముగా ముందుకు సాగినప్పుడు తమను పూర్తిగా అతనికి అంకితము చేసినపుడు, ఆధ్యాత్మిక స్థానము లభించును. అల్లాహ్‌కు అంకితమైనవాడు అతనిని వీడి జీవించలేడు. నిజముగా అల్లాహ్‌కు అంకితమైనవాడు అల్లాహ్ చేతులతో బలిగొనిన చేప వలె నుండును. దాని నీరు అల్లాహ్ ప్రేమ.

## సంస్కరణ పద్ధతులు మూడు

## అత్యవసరముననే పవిత్ర ప్రవక్త అవతరణ

ఇప్పుడు నేను అసలు విషయమును గురించి చర్చను సాగింతును. ముందే మానవ స్థితుల కేంద్రాలు మూడని తెలిపివున్నాను. అవి ఆత్మలో చెడును ప్రేరేపించు స్థితి, ఆత్మను హెచ్చరించు లేదా నిందించు స్థితి, శాంతించు ఆత్మ సంస్కరణ పద్ధతులు కూడ మూడు.

**మొదటిది** సభ్యత తెలియని అయోగ్యులను తిను, త్రాగు, వివాహాది సభ్యకరమైన అంశములను నేర్పుట. పాపోసులు లేకుండా తిరుగునట్లు చేయుట, కుక్కల వలె చచ్చినది తిననట్లు చేయుట, ఇవి సహజ స్థితుల సంస్కరణలోని చాలా క్రింది స్థాయి సంస్కరణ. పోర్ట్ బ్లైర్ అడవి మనుషులలో నుండి ఒకనికి మానవత్వమును నేర్పవలెనినిన

ముందు మానవత్వపు క్రింది స్థాయి పద్ధతులను నేర్పబడును.

**రెండవ సంస్కరణ పద్ధతి:–** మానవత్వపు విలువలు తెలిసికొనినవానికి మానవత్వపు ఉచ్ఛస్థితి పద్ధతలును తెలిపి మానవ అవయవ సంబంధమైన మొత్తములను సమయ సందర్భానుసారము వాడుకొనునట్లు నేర్పవలెను.

**మూడవ సంస్కరణ పద్ధతి:–** ఉచ్ఛస్థితి నైతిక విలువలను నేర్చుకొనిన వారిని అల్లాహ్ కలయిక, అతని ప్రేమ రుచిని కలిగించవలెను.

ఈ మూడు సంస్కరణ పద్ధతులను పవిత్ర ఖుర్ఆన్ వివరించినది. ప్రపంచమంతయు పాడై చెడిపోయినపుడు మన ప్రవక్త హ్రజత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చిరి. అల్లాహ్ ఇట్లనును.

ظَهَرَ الْفَسَادُ فِي الْبَرِّ وَالْبَحْرِ

(అర్రూమ్ 30:42)

అనగా అడవి కూడ చెడినది. నదులు కూడ తార్మారైనవి. అనగా గ్రంథము గలవారు, అల్లాహ్ పిలుపు వినని వారు కూడ చెడిపోయిరి. పవిత్ర ఖుర్ఆన్ కార్యము శవములను పునరుజ్జీవనమిచ్చుట. అదిట్లనును.

اِعْلَمُوْٓا اَنَّ اللّٰهَ يُحْيِ الْاَرْضَ بَعْدَ مَوْتِهَا

(అల్ హదీద్ 57:18)

అనగా భూమి మరణించిన తరువాత దానిని అల్లాహ్ క్రొత్తగా బ్రతికించునని తెలిసికొనుము. ఆ కాలము నందు అరబ్బుల పరిస్థితులు మానవత్వమునకు విరుద్ధము మృగములను పోలివుండెను. మానవత్వ రూపు రేఖలు కూడ వారిలో లేకుండెను. వ్యసనములే వారి దృష్టిలో గౌరవ కారణములై వుండెను. ఒక్కొక్కడు వందల భార్యలను చేసికొను వాడు. నిషిద్ధ వస్తువులనార్జన వారి వద్ద వేటను పోలివుండెను. తల్లులతో వివాహమాడుట వారు సరైనదని దలచేవారు. ఆ కారణము వలననే

శక్తిమంతుడు అల్లాహ్ ఇట్లనెను.

حُرِّمَتْ عَلَيْكُمْ أُمَّهَٰتُكُمْ

(అన్నిసా 4:24)

అనగా ఈ రోజు మీ తల్లులు మీ కొరకు నిషేధింపబడిరి. అటులనే వారు మరణించిన జంతువుల మాంసము తినువారు. నరమాంస భక్షకులు కూడ. ప్రపంచములోని ప్రతి పాపమును వారు చేయువారు. చాలా మంది పరలోక జీవితమును నమ్మేవారు కారు. అల్లాహ్‌ను కూడ నమ్మేవారు కారు. బాలికలను తమ చేతులతో చంపేవారు. అనాథలను చంపి వారి ఆస్తి పాస్తులను వశపరచుకొనువారు. వారు మానవులే కాని, తెలివి లేని వారు, సిగ్గు, అభిమానము, గౌరవ మర్యాదలు వారికి తెలియవు. సారాను నీటివలె త్రాగువారు. వ్యభిచారములో ఆరి తేరిన వాడే నాయకుడు. మూఢులు, ఇరుగు పొరుగు జాతులన్నియు వారిని అజ్ఞానులని పిలుచువారు. అట్టి సమయము నందు, ఇట్టి జాతుల సంస్కరణ నిమిత్తము మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా నగరము నందు ప్రత్యక్ష్యమయ్యెను. ఇంతకు ముందు మనము చర్చించుకొనిన మూడు విధములైన సంస్కరణముల కాలమిదే. కనుక ఈ కారణముల వలననే పవిత్ర ఖుర్‌ఆన్ ప్రపంచములోని సర్వమార్గములలో ఉత్తమమైనదని, సంపూర్ణమైనదని ప్రకటించుకొనుము. దానికి కారణము ప్రపంచములోని ఇతర గ్రంధములకు ఈ మూడు విధముల సంస్కరణ ప్రాప్తి లభించలేదు. పవిత్ర ఖుర్‌ఆన్‌కు లభించెను. జంతువులలో నుండి మానవులుగా తీర్చిదిద్దుట. మానవులను నీతిమంతులుగా చేయుట, తుదకు వారిని అల్లాహ్ దాసులుగా తీర్చిదిద్దుట. పవిత్ర ఖుర్‌ఆన్ ముఖ్యోద్దేశము. ఈ మూడు అంశాలను పవిత్ర ఖుర్‌ఆన్ తెలిపినది.

# పవిత్ర ఖుర్‌ఆన్ ముఖ్యోద్దేశము

## మూడు స్థితుల సంస్కరణ

## సహజ స్థితులు నీతి దాయక స్థితులుగా మారును

ఈ మూడు స్థితుల సంస్కరణలను వివరించక పూర్వము పవిత్ర ఖుర్‌ఆన్‌లోని ఏ బోధ కూడ బలవంతముగా స్వీకరించునది లేదని తెలియచేయుట అవసరము. దీని మొత్తము బోధల సారము ఈ మూడు స్థితుల సంస్కరణ మాత్రమే. మిగిలిన ఆదేశాలన్నీ సంస్కరణ కొరకు చూపిన మార్గాలే. ఆరోగ్య ప్రాప్తి కొరకు ఆపరేషన్, (శస్త్ర చికిత్స) మలామ్ అవసరమగునట్లు ఖుర్‌ఆన్ బోధ కూడ అ అంశాలను మానవుని సంస్కరణ కొరకు ఆయా సమయాలలో వాడినది. దీని ఆదేశాలు, జ్ఞానము, ఉపదేశములు మానవుని మృగ రూపములో నున్న సహజ స్థితులను రూపుమాపి అతడు నైతిక స్థితుల నందు కొనునట్లు, ఆ నైతిక స్థితుల నుండి ఆధ్యాత్మిక స్థితులు పొందునట్లు చేయుటకే గలవు.

సహజ స్థితులు, నైతిక స్థితులు వేరుగాని, ఆ స్థితులనే బుద్ధినుప యోగించి సమయానుసారముగా వాడినప్పుడు నైతిక స్థితుల రూపము దాల్చునని ముందే స్పష్టీకరించబడినది. కాని ఇవి నైతిక స్థితులనబడవు. నైతిక స్థితులను పోలి మాత్రముండును. ఒక మేక గాని, ఒక కుక్క గాని, తమ యజమానితో ప్రేమ, అభిమానము, విధేయత వెలిబుచ్చినచో వాటిని నైతిక స్థితులనలేము. ఆ కుక్కను గాని, మేకను గాని సభ్యత గలవని భావించలేము. అటులనే ఒక తోడేలును గాని ఒక సింహమును గాని వాటి గుణముల ప్రకారము అసభ్యులనరా? ఆలోచించి, సమయ సందర్భానుసారముగా మెలిగినపుడు నైతిక స్థితి ఆరంభమగును. తెలివి,

సమయ సందర్భమునుపయోగించనివాడు, తెలివితేటలు ఛాయ పడని ఒక శిశువును గాని, తెలివి సోకని పిచ్చివారిని గాని పోలివుండును. ఒక శిశువుగాని పిచ్చివాడు గాని ఒక్కొక్కపుడు తెలివిమాటలను చేష్టలలో నైతిక స్థితులను ప్రదర్శించును. కాని అవి సమయ సందర్భముగా గాని తెలివితో గాని ప్రదర్శింపబడక సహజ స్థితుల ద్వారా బహిర్గతమగును. కనుక వీటిని ఎవరు కూడ నైతిక స్థితులని అనరు. అదెట్లనగా శిశువు పుట్టిన వెంటనే పాల కొరకు తల్లి రొమ్ము వైపు వెళ్ళును. ఒక కోడి పిల్ల ధాన్యము వైపు పరుగెత్తును. ఒక జలగ పిల్ల జలగ అలవాట్లు, సర్పము సంతానము సర్పము అలవాట్లు, సింహము సంతతి సింహపు అలవాట్లు కలిగివుండును. ప్రత్యేకముగా మానవుని శిశువు పుట్టిన వెంటనే మానవ అలవాట్లు ఎట్లు ప్రదర్శించునో గమనించవలెను. సంవత్సర, సంవత్సరమున్నర వయస్సు నిండిన తరువాత అతనిలో సహజమైన అలవాట్లు స్పష్టముగా కానవచ్చును. ఉదాహరణకు ముందు ఏడ్పుకంటే ఇపుడు స్పష్టముగా గట్టిగా ఏడ్చును. నవ్వు కూడ పెద్దగా మారును. కనుచూపు కూడ మెరుగుపడును. ఈ వయస్సులో తమ ఇష్టమును, అయిష్టతను ప్రదర్శించిగాని ఒకనిని కొట్టి గాని, ఏదో ఒకటి ఇచ్చుటకు ఇచ్ఛగించును. ఇవన్నియు ఒక సహజ స్థితి స్పందననే. ఇటులనే ఒక అడవి మనిషి కూడ సభ్యత తెలియకనే మాటలాడును, కార్యములొనరించును. కాని ఇవన్నియు సహజ స్థితులే, తమ కోరికలకు లొంగిపోవును. ఆలోచనా రాహిత్యముగా, సహజ స్థితిలో నున్నవి. ధారాళముగా అతని చేష్టలతో బహిర్గతములగు చుండును. కాని వాటిలో చాలా వరకు మంచివే వుండినను ఆలోచించి చేసిన కార్యములు కావవి. సహజ స్థితుల ఫలితమేనని చెప్పక తప్పదు.

# నిజమైన నీతి

సహజ ఆవేశములు జంతువుల వలె, శిశువుల వలె, పిచ్చివాని వలె ఆవరించిన, వాని చేష్టలు నైతికములనబడవు. అతడు తన జీవితమును అడవి మనిషి వలె గడుపును. మానవుడు అల్లాహ్ ఒసంగిన తెలివి ద్వారా మంచి చెడులలో గాని, రెండు చెడులలో గాని, రెండు మంచిలలో గాని, తేడాలను తెలిసి కొనినప్పుడు, పుణ్యమును విడిచినప్పుడు తన హృదయమందు కలతనొంది, చెడు చేసినప్పుడు, పశ్చాత్తాపము నొందినపుడు, నిజమైన సభ్యత, అసభ్యత, కాలము ఆరంభమగును. ఇది, మానవుని రెండవ దశ అనబడును. దానిని పవిత్ర ఖుర్ఆన్ తమను నిందించు స్థానముగా పేర్కొనినది. కాని ఒక అడవి మనిషిని నిందించు స్థితికి చేరునట్లు చేయుట కేవలము ఉపదేశముతో సాధ్యము కాదు. అల్లాహ్‌ను గుర్తించు జ్ఞానము కలుగచేయుట అవసరము. అపుడు అతడు తన పుట్టుక అవసరమైనదని పనికి రాని ఆలోచనలో పడక, అల్లాహ్ అనుగ్రహముతో సత్ప్రవర్తన అతనిలో పుట్టును. అందుకొరకే నిజమైన అల్లాహ్ అనుగ్రహము పొందుటకు శ్రద్ధ వహించవలెనని అల్లాహ్ బోధించెను. ఒక కార్యము ఈ జీవితములో ఆధ్యాత్మిక సుఖము గాని, ఆధ్యాత్మిక బాధగా గాని ఫలించును. పరలోకములో స్పష్టముగా దీని ప్రభావము పడును. నిందించు స్థితిలో మానవుడు చెడును నిందించి మంచి చేయుటకు ఇచ్ఛగించును. ఆశపడును. ఈ స్థితిలోనే మానవుడు నైతిక విలువలను సంపాదించును.

## కల్క్ (సృష్టి), కుల్క్ (నీతి) మధ్య గల భేదము

కుల్క్ (నీతి) పదమునకు నిర్వచనమవసరము. కల్క్ అనగా

శారీరకమైన పుట్టుక, కుల్క్ అనగా అంతరంగములో పుట్టునది. అంతరంగము పుట్టుక నీతి వలననే అభివృద్ధి చెందును. కేవలము సహజ ప్రేరణతో కాదు. కనుక ఈ పదము నీతి కొరకే కేటాయించబడినది. సహజ ప్రేరణ కొరకు కాదని తెలిసికొనుట అవసరం. సామాన్యముగా జనులు కుల్క్ అనగా సాధుత్వము, విధేయత, గౌరవ మర్యాదలని భావింతురు. కాని ఇది వారి పొరపాటు, బహిర్గత అవయవముల చర్యలకు అంతర్గత ప్రతిస్పంపదన గలదు. దానినే నీతి అందురు. ఉదాహరణముగా మానవుడు కన్నీరు కార్చును. ఫలితముగా హృదయమునందు దుఃఖము దయ పుట్టును. దానిని కుల్క్ (నీతి) అందురు. శత్రువును చేతులతో ఎదుర్కొందుము. కాని హృదయమునందు సాహసము జనించును. సమయానుకూలముగా ఈ శక్తులను వాడినపుడు వాటిని నీతి అందురు. అటులనే ఒకడు పీడించు వారితో పీడించబడువారిని రక్షించగోరును. లేదా అనాథలను, బీదసాదలను గాని ఏ విధముగానైన ప్రాణులకు సేవ చేయగోరును. ఈ చర్యలకు హృదయమునందు దయ అను శక్తి పుట్టును. అన్యాయున్ని శిక్షించాలని గోరును. అపుడు దానిని ప్రతీకారమందురు. ఒకప్పుడు దాడి జరిగినను ఎదుర్కొనుటకు ముందుకు రాక క్షమించును. హృదయమునందు సహనము, ఓర్పు పుట్టినందుకే అట్లు చేయును. ఒకప్పుడు తమ చేతులతో గాని పాదములతోగాని, మెదడునుపయోగించి గాని మానవులకు మేలు చేయగోరును. వారి కొరకు తమ స్వంత ధనము కూడ వ్యయపరచుటకు వెనుకాడడు. వీటికి హృదయమునందు ఒక శక్తి వుండును. దీనిని కనికరమందురు. కనుక ఈ మొత్తము చర్యలను సమయానుకూలముగా మానవుడు వాడినపుడు వాటిని నైతిక విలువలందురు. మహిమవంతుడు అల్లాహ్ మన ప్రవక్తనుద్దేశించి

ఇట్లనుచున్నాడు.

اِنَّكَ لَعَلٰى خُلُقٍ عَظِيۡمٍ ۝

(అల్ ఖలమ్ 68:5)

అనగా నీవు ఉత్తమ నైతిక విలువలు కలిగివున్నావు. అనగా కనికరము, సాహసము, న్యాయము దయ సానుభూతి, దానము, సహనము, ఓర్పు మొదలగు నైతిక విలువలు నీ యందున్నవి. మానవుని యందు గల శక్తులు అనగా, గౌరవ మర్యాదలు, సిగ్గు, నమ్మకము, అభిమానము, సమానత్వము, సానుభూతి, దయ ధైర్యసాహసాలు, క్షమించుట, సహనము, సంయమము, కనికరము, మొదలగు వాటిని బుద్ధిననుసరించి వాటి వాటి సమయముల యందు వాటిని బహిర్గతమొన రించినపుడు అవి నైతిక విలువలనబడును. ఇవన్నియు వాస్తవముగా మానవుని సహజ స్థితుల ఆవేశాలే, వీటిని సమయము, అవసరమును బట్టి ఉపయోగించినపుడు నైతిక విలువలుగా పిలువబడును. అభివృద్ధి పొందుట మానవుని సహజ గుణము. కనుక మానవుడు సత్య ధర్మము ననుసరించి సజ్జనుల సహవాసములో వుండి, మంచి బోధల ద్వారా సహజ స్థితులను నైతిక రూపములో వ్యక్తపరచును. ఇది మరో ప్రాణికి శక్యముగాదు.

## సహజ స్థితుల సంస్కరణ

పవిత్ర ఖుర్‌ఆన్ బోధించిన మూడు సంస్కరణలలో నుండి మొదటి సంస్కరణను గురించి చర్చ జరుపుదుము. ఇది క్రింది స్థాయి సహజ స్థితులను వివరించును. మంచి పద్ధతులను మానవుని యందు పుట్టించును. అనగా అనాగరికుల సహజ స్థితులను మార్చి సభ్యకరమైన

స్థితులలో తెచ్చెను. వారి తినుట, త్రాగుట, వివాహము మొదలైన వాటిలోని అనాగకరిత నుండి విముక్తి కల్గించి మానవునిగా తీర్చిదిద్దును. దీనినే పవిత్ర ఖుర్ఆన్ నందు అల్లాహ్ ఇట్లు నుడివెను.

حُرِّمَتۡ عَلَيۡكُمۡ أُمَّهَٰتُكُمۡ وَبَنَاتُكُمۡ وَأَخَوَٰتُكُمۡ وَعَمَّٰتُكُمۡ وَ
خَٰلَٰتُكُمۡ وَبَنَاتُ ٱلۡأَخِ وَبَنَاتُ ٱلۡأُخۡتِ وَأُمَّهَٰتُكُمُ ٱلَّٰتِيٓ
أَرۡضَعۡنَكُمۡ وَأَخَوَٰتُكُم مِّنَ ٱلرَّضَٰعَةِ وَأُمَّهَٰتُ نِسَآئِكُمۡ وَرَبَٰٓئِبُكُمُ
ٱلَّٰتِي فِي حُجُورِكُم مِّن نِّسَآئِكُمُ ٱلَّٰتِي دَخَلۡتُم بِهِنَّ فَإِن لَّمۡ تَكُونُواْ
دَخَلۡتُم بِهِنَّ فَلَا جُنَاحَ عَلَيۡكُمۡ وَحَلَٰٓئِلُ أَبۡنَآئِكُمُ ٱلَّذِينَ مِنۡ
أَصۡلَٰبِكُمۡ وَأَن تَجۡمَعُواْ بَيۡنَ ٱلۡأُخۡتَيۡنِ إِلَّا مَا قَدۡ سَلَفَ

(అన్నిసా 4:24)

لَا يَحِلُّ لَكُمۡ أَن تَرِثُواْ ٱلنِّسَآءَ كَرۡهًا

(అన్నిసా 4:20)

وَلَا تَنكِحُواْ مَا نَكَحَ ءَابَآؤُكُم مِّنَ ٱلنِّسَآءِ إِلَّا مَا قَدۡ سَلَفَ

(అన్నిసా 4:23)

أُحِلَّ لَكُمُ ٱلطَّيِّبَٰتُ ...... وَٱلۡمُحۡصَنَٰتُ مِنَ ٱلۡمُؤۡمِنَٰتِ وَٱلۡمُحۡصَنَٰتُ
مِنَ ٱلَّذِينَ أُوتُواْ ٱلۡكِتَٰبَ مِن قَبۡلِكُمۡ إِذَآ ءَاتَيۡتُمُوهُنَّ أُجُورَهُنَّ
مُحۡصِنِينَ غَيۡرَ مُسَٰفِحِينَ وَلَا مُتَّخِذِيٓ أَخۡدَانٍ

(అల్ మాయిదహ్ 5:6)

وَلَا تَقْتُلُوْٓا اَنْفُسَكُمْ

(అన్నిసా 4:30)

وَلَا تَقْتُلُوْٓا اَوْلَادَكُمْ

(అల్ అన్ఆమ్ 6:152)

لَا تَدْخُلُوْا بُيُوْتًا غَيْرَ بُيُوْتِكُمْ حَتّٰى تَسْتَاْنِسُوْا وَتُسَلِّمُوْا عَلٰٓى اَهْلِهَا ؕ

(అన్నూర్ 24:28)

فَاِنْ لَّمْ تَجِدُوْا فِيْهَآ اَحَدًا فَلَا تَدْخُلُوْهَا حَتّٰى يُؤْذَنَ لَكُمْ ۚ

وَاِنْ قِيْلَ لَكُمُ ارْجِعُوْا فَارْجِعُوْا هُوَ اَزْكٰى لَكُمْ ؕ

(అన్నూర్ 24:29)

وَاْتُوا الْبُيُوْتَ مِنْ اَبْوَابِهَا ۪

(అల్ బఖరహ్ 2:190)

وَاِذَا حُيِّيْتُمْ بِتَحِيَّةٍ فَحَيُّوْا بِاَحْسَنَ مِنْهَآ اَوْ رُدُّوْهَا ؕ

(అన్నిసా 4:87)

اِنَّمَا الْخَمْرُ وَالْمَيْسِرُ وَالْاَنْصَابُ وَالْاَزْلَامُ رِجْسٌ مِّنْ عَمَلِ

الشَّيْطٰنِ فَاجْتَنِبُوْهُ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ ○

(అల్ మాయిదహ్ 5:91)

حُرِّمَتْ عَلَيْكُمُ الْمَيْتَةُ وَالدَّمُ وَلَحْمُ الْخِنْزِيْرِ وَمَآ اُهِلَّ لِغَيْرِ

اللّٰهِ بِهٖ وَالْمُنْخَنِقَةُ وَالْمَوْقُوْذَةُ وَ الْمُتَرَدِّيَةُ وَالنَّطِيْحَةُ وَ مَآ

اَكَلَ السَّبُعُ اِلَّا مَا ذَكَّيْتُمْ ۟ وَمَا ذُبِحَ عَلَى النُّصُبِ

(అల్ మాయిదహ్ 5:4)

يَسْـَٔلُوْنَكَ مَاذَآ اُحِلَّ لَهُمْ ؕ قُلْ اُحِلَّ لَكُمُ الطَّيِّبٰتُ ۙ

(అల్ మాయిదహ్ 5:5)

اِذَا قِيْلَ لَكُمْ تَفَسَّحُوْا فِى الْمَجٰلِسِ فَافْسَحُوْا يَفْسَحِ اللّٰهُ لَكُمْ ۚ

وَ اِذَا قِيْلَ انْشُزُوْا فَانْشُزُوْا

(అల్ ముజాదిలహ్ 58:12)

كُلُوْا وَاشْرَبُوْا وَلَا تُسْرِفُوْا ۚ

(అల్ ఆరాఫ్ 7:32)

وَقُوْلُوْا قَوْلًا سَدِيْدًا

(అల్ అహ్జాబ్ 33:71)

وَثِيَابَكَ فَطَهِّرْ ۙ۝ وَالرُّجْزَ فَاهْجُرْ ۙ۝

(అల్ ముద్దస్సిర్ 74:5,6)

وَاقْصِدْ فِىْ مَشْيِكَ وَاغْضُضْ مِنْ صَوْتِكَ ؕ

(లుఖ్మాన్ 31:20)

تَزَوَّدُوْا فَاِنَّ خَيْرَ الزَّادِ التَّقْوٰى ۫

(అల్ బఖరహ్ 2:198)

وَاِنْ كُنْتُمْ جُنُبًا فَاطَّهَّرُوْا ؕ

(అల్ మాయిదహ్ 5:7)

وَفِىْٓ اَمْوَالِهِمْ حَقٌّ لِّلسَّآئِلِ وَالْمَحْرُوْمِ ۝

(అజ్జారియాత్ 51:20)

وَاِنْ خِفْتُمْ اَلَّا تُقْسِطُوْا فِی الْیَتٰمٰی فَانْكِحُوْا مَا طَابَ لَكُمْ
مِّنَ النِّسَآءِ مَثْنٰی وَ ثُلٰثَ وَ رُبٰعَ ۚ فَاِنْ خِفْتُمْ اَلَّا تَعْدِلُوْا فَوَاحِدَةً اَوْ
مَا مَلَكَتْ اَیْمَانُكُمْ ؕ ذٰلِكَ اَدْنٰۤی اَلَّا تَعُوْلُوْا ۝

(అన్నిసా 4:4)

وَاٰتُوا النِّسَآءَ صَدُقٰتِهِنَّ نِحْلَةً ؕ

(అన్నిసా 4:5)

అనగా మీకు మీ తల్లులు నిషేధించబడిరి. ఈ విధముగనే మీ కూతుళ్ళు, మీ సోదరీలు, మీ మేనత్తలు, మీ చిన్నమ్మలు, పెద్దమ్మలు, మీ సోదరుల కూతుళ్ళు, మీకు పాలు గుడిపిన తల్లులు, మీ వెంట పాలు త్రాగిన సోదరీలు, మీ భార్యల తల్లులు, మీ భార్యల పూర్వపు భర్తల కూతుళ్లు, మీ కుమారుల భార్యలు, ఇద్దరు సోదరీలు ఒకే సమయంలో, ఇంత వరకు జరుగు ఇట్టి కార్యములన్నియు ఈ రోజు నుండి మీకు నిషేధించబడినవి. బలవంతముగా స్త్రీల వారసులగుట కూడా ధర్మ విరుద్ధము. మీ తండ్రులకు భార్యలుగా నుండిన స్త్రీలు కూడ మీకు ధర్మబద్ధముగా వున్నవారు గారు. ముందు జరిగినదేదో జరిగినది. మీలో నుండి గాని, ఇంతకు ముందు పవిత్ర గ్రంధము నొసంగబడిన వారిలో నుండి గాని, సౌశీల్యము గల స్త్రీలు మీ వివాహమునకు ధర్మబద్ధులు, కాని (మెహర్) డోరి నిర్ణయించబడిన తరువాత రహస్య సంబంధములు ధర్మ విరుద్ధములు. సంతానము లేని వాని భార్య సంతానము కొరకు ఇతరులతో అక్రమ సంబంధము పెట్టుకొను ఆచారము అరబ్బులలో వుండెడిది. పవిత్ర ఖుర్ఆన్ ఈ పద్ధతిని నిషేధించెను. దీనినే ముసాఫహత్

అందురు.

మీరు ఆత్మ హత్యకు దూరముగా వుండుము. తమ సంతానమును హతమార్చకుము. ఇతర ఇండ్లలో అనుమతి లేనిదే సరా సరి ప్రవేశించకుము. అనుమతి తప్పని సరి. ఇతరుల గృహములలో చేరిన వెంటనే "అస్సలాము అలైకుమ్" అనుము.

ఆ ఇండ్లలో ఎవరు లేనిచో ఆ గృహ యజమాని అనుమతి లేనిదే ప్రవేశించకుము. ఇంటి యజమాని తిరిగి పొమ్మనినచో మీరు వెళ్ళిపోవలెను. గోడల ద్వారా ఇండ్లలో ప్రవేశించకుము. ద్వారముల నుండి లోనికి ప్రవేశించుము. ఎవరేని మీకు సలాం చేసినచో మీరు దానికి ఉత్తమ పద్ధతిలో సమాధానమీయవలెను. మద్యపానము, జూదము, విగ్రహారాధన, తీర్పు కొరకు బాణములనుపయోగించుట, పనికి రాని అసహ్యకరమైన షైతాని కార్యములు. వీటి నుండి దూరముగా వుండుము. చచ్చిన జంతువు మాంసము, పంది మాంసము తినకుము. విగ్రహముల కర్పించినది తినకుము, మృగము చీల్చి చంపినది తినకుము. ఇవన్నియు చచ్చినవి. కనుక ఇవి నిషేధించబడినవి. మరేమి తినవలెనని వారడిగినచో ప్రపంచము నందు గల పరిశుద్ధ వస్తువులన్నియు తినుమని, చచ్చిన వాటిని అసహ్యకరమైన వస్తువులను తినరాదని సమాధానమిమ్ము.

సభలలో స్థలము చాలనప్పుడు ఇతరులు కూర్చొనుటకు స్థలమివ్వండి. లేచి వెళ్ళి పొమ్మనినచో గప్‌చిప్‌గా లేచి పొండి. పప్పు, మాంసము మొదలగునని పరిశుద్ధ వస్తువులు నిస్సందేహముగా తినుము. కాని ఏదేని తరచుగా తినకుము. అనవసర వ్యయము, ఎక్కువ భుజించడము మంచిది గాదు. పనికి రాని మాటలకు, సమయము తప్పిన మాటలకు దూరంగా వుండుము. తమ దుస్తులను శుభ్రపరచు కొనుము.

శరీరము, గృహమును, వీధిని, తాము వాడు ప్రతి స్థలమును మురికి నుండి, మలినము నుండి శుభ్రపరచుము. అనగా స్నానమాడుము, గృహమును శుభ్రముగా చేయు అలవాటు చేసికొనుము. అవసరమైనప్పుడు తప్ప తమ దృష్టిని మధ్య మార్గమునందుంచుము. వేగముగా గాని మెల్లగా గాని కాక సామాన్యమైన నడక నడువుము. ప్రయాణము చేయునప్పుడు ప్రయాణం ఏర్పాట్లన్నియు చేసికొనుము. అట్లు గానిచో భిక్షాటనము చేయవలసి వచ్చినను, స్త్రీలతో కలిసినప్పుడు స్నానము చేయుము. భుజించి నప్పుడు కుక్కకు, అడిగినవానికి కూడ ఇవ్వుము. పక్షులకు కూడ వేయుము. అనాధ బాలికలను పోషించినచో వారిని వివాహమాడుట తప్పుగాదు. వారితో మీరు న్యాయము చేయలేరని భావించిన తల్లిదండ్రులు, ఇతర సంబంధీకులు గలవారిని వివాహ మాడుము. అట్లు చేసినచో మీకు కూడ భయముండును. న్యాయము చేయుగలరని నమ్మకముండినచో ముగ్గురు, నల్గురు, స్త్రీలను వివాహమాడవచ్చును. న్యాయము చేయరని భావించినచో ఒక స్త్రీ తోనే తృప్తి పడుము. నల్గురిని వివాహమాడుట హద్దు. ఇది మీరు ప్రాచీన పద్ధతులలో వందల మందిని వివాహమాడరాదని, వ్యభిచారము నుండి దూరముండవలెనని నిర్ణయించబడినది. తమ స్త్రీలకు శుల్కము (మెహర్) ఇవ్వుము.

ఇది పవిత్ర ఖుర్ఆన్ మొదటి సంస్కరణ. దీని నుండి మానవుని సహజ స్థితులను మృగ స్థితుల నుండి మానవత్వపు స్థితుల వైపు మరల్చి సభ్యత వైపు తేవచ్చును. దానిలో కేవలము మానవత్వపు విలువలు గలవు. ఉచ్ఛ స్థితి నైతిక విలువలు లేవు. మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సంస్కరించుటకు వచ్చిన జాతి, మొరటుదనము, అడవి

మనుషుల గుణములు గలిగి వుండెనని, వారికి బోధ అవసరమని మేమింతకు పూర్వమే చర్చించి వున్నాము. ఇసుమంత కూడ మానవ పద్ధతి వారిలో లేకుండెను. కనుక ప్రారంభిక మానవత్వ పద్ధతులను వారికి బోధించి నేర్పు అవసరమెంతైనా వుండెను.

## పంది మాంసము నిషేధము

ప్రారంభములోనే అల్లాహ్ ఈ జంతువులను నిషేధించి వున్నాడను విషయమును జ్ఞప్తి యందుంచుకొనుట అవసరము. పంది అరబ్బి భాషలో ఖిన్‌జీర్ అనబడును. ఈ పదము "ఖిన్జ్" మరియు "అర" మిశ్రమము. అనగా నేను దానిని రోతపుట్టించు జంతువుగా చూచెదను. ఖిన్జ్ అనగా అసహ్యమైనది. రోత పుట్టించునది. అర అనగా చూస్తున్నాను. కనుక ఈ జంతువుకు అల్లాహ్ వైపు నుండి పూర్వము నుండే పెట్టబడిన నామమే నిదర్శనము. హిందీ భాషలో దీనిని "సుఅర్" అందురు. ఈ పదము "సు" మరియు "అర్" మిశ్రమము. అనగా దీనిని నేను చాలా రోత పుట్టించు జంతువుగా చూస్తున్నాను. ఇది వింతైన విషయము. అరబ్బి, హిందీ భాషలలో కూడ ఒకే అర్థము వచ్చును. ఇక్కడ "సు" అను పదము అరబ్బి భాష పదమెట్లగునని ఆశ్చర్యపోనవరసము లేదు. ఎందుకనగా మేము మా గ్రంథము మిననుర్రహ్మాన్ నందు సర్వ భాషల తల్లి, మూలము అరబ్బి భాషయని నిరూపించివున్నాము. అరబ్బి భాష పదాలు ప్రతి భాషయందు అనేకములు గలవు. కనుక "సు" పదము అరబ్బి పదము. కనుక హిందీలో చెడ్డదని అర్థము. కనుక ఈ జంతువును చెడ్డ జంతువు అని కూడ అందురు. మొత్తము ప్రపంచభాష అరబ్బి వున్న కాలమందు, ఈ దేశము నందు, ఈ జంతువు పేరు అరబ్బి భాష నామమునకు అర్థమిచ్చునదై వుండెననుటలో ఎట్టి సందేహము లేదు. అది ఇంత వరకు

వుండిపోయినది. సంస్కృత భాషలో ఈ పదమే వాడుట సాధ్యము, కాని వాస్తవ పదము ఇదే. ఎందుకనగా ఖిన్‌జీర్ పదము దాని స్వంత అర్థమును చాటుచున్నది. దీని అర్థము రోత పుట్టించు, అసహ్యామైనది. దీనిని వివరించు అవసరము లేదు. ఈ జంతువు మలము తినునని, సిగ్గుమాలినదని అందరికి తెలుసు. ఇట్టి అసహ్యాకరమైన జంతువు మాంసము తినువారి శరీరము, ఆత్మపై ప్రభావము కూడ ఆ విధముగనే పడునని, సృష్టి దానిని నిషేధించినదని తెలియుచున్నది. ఆహార ప్రభావము మానవుని ఆత్మపై పడునని మేము నిరూపించివున్నాము. కనుక చెడుగా వున్నదాని ప్రభావము చెడుగనే వుండుటలో సందేహము లేదు. గ్రీకు వైద్యులు ఇస్లామ్ కంటే పూర్వమే ఈ జంతువు మాంసము మానవునిలో వినయమును తగ్గించి సిగ్గుమాలిన గుణమును పెంచునని అభిప్రాయ పడిరి. చచ్చినది కూడ తమ గుణములు తినువారిపై చూపును. కనుక ఇస్లామ్ చచ్చిన మాంసము తినుటకు నిషేధించినది. ఇది ఆరోగ్యమునకు కూడ హానికరము. గొంతు నులిమి చంపినది. కఱ్ఱతో కొట్టి చంపినది. నిజమునకు చచ్చినవే. ఇట్టి జంతువుల రక్తము బయటకు రాదు. రక్తము లోపల వుండినపుడు అది తమ నిజరూపములో వుండగలదా? వుండనేరదు. పేరుకొని వున్నందు వలన శీఘ్ర గతిలో మురిగిపోవును. మొత్తము మాంసమును చెరచును. అదియును గాక రక్తమునందున్న సూక్ష్మ జీవులు చచ్చి శరీరము నంతయు విషమయము చేయునని ప్రస్తుత ప్రయోగాల ద్వారా తెలియవచ్చినది.

## మానవుని నైతిక స్థితులు

సహజ స్థితులను నిర్దిష్టములైన హద్దులలో పరిమితము చేసి ఉత్తమ నైతిక విలువల వరకు గొని పోవుట పవిత్ర ఖుర్‌ఆన్ రెండవ

సంస్కరణ. ఈ భాగము చాలా విశాలమైనది. పవిత్ర ఖుర్‌ఆన్ వివరించిన మొత్తము నైతిక విలువలను వివరించినచో ఈ సమయము నందు దాని పదవ వంతు కూడ వివరించలేము. కనుక కొన్ని నైతిక ఉత్తమ స్థితులను వివరించుట జరిగినది. నైతిక విలువలు రెండు విధములు. మొదటి నైతిక విలువల నుండి మానవుడు తనలో నున్న పనికిమాలిన, చెడును వీడు యోగ్యతను పొందును. రెండవ నైతిక విలువల నుండి మానవుడు మంచిని చేయు యోగ్యతను సంపాదించును. చెడును, పీడనమును వీడుట అనగా మానవుడు తమ నోటితో గాని, తమ చేతులతో గాని, తమ కన్నులతో గాని, తమ ఏ అవయవము నుండి కూడ ఇతరుల గౌరవమర్యాదలను గాని, ప్రాణమును గాని, హాని కల్పించుటకు ప్రయత్నించడు. లేదా హాని కలిగించుటకు గాని మర్యాదలు మంట కలుపుటకు గాని ఊహించడు. ఈ నైతిక విలువలన్నియు చెడును విడుచుటలో చేరి వున్నవి. మంచిని చేయుట యందు తమ నోటి నుండి గాని, చేతుల నుండి గాని, తమ జ్ఞానము నుండి గాని మరే మూలముగను మానవులకు లాభము కలిగించుటకు ప్రయత్నించును. లేదా అతని మహిమను, తేజస్సును కొనియాడుటకు పూనుకొనును. ఎవరేని అతనికి అన్యాయము చేసినచో మరచిపోవును. ఈ విధముగా దుఃఖము, శారీరక, ఆర్థిక బాధల నుండి అతనిని కాపాడి లాభము కలిగించును. శిక్షించినను అది అతనికి కనికరముగా వుండును.

## చెడును త్యజించు నైతిక విలువలు

నిజమైన సృష్టికర్త నిర్ణయించిన, చెడును వీడి, నైతిక విలువలు మానవుని భావాలు, గుణములు, నైతిక విలువలు బహిర్గతము చేయుటకు అరబ్బి భాషలో నాలుగు పదములు యిమిడి వున్న ఒక ప్రత్యేక నామము

గలదు.

ఈ నైతిక విలువలలో మొదటి నైతిన విలువ احسان 'ఇహ్సాన్' అనబడును. స్త్రీ, పురుషుని పవిత్ర లైంగిక సంబంధమును ఈ పదము తెలుపును. స్త్రీ లేక పురుషుడు, కామ అక్రమ బంధము నుండి తమను తప్పించుకొననిచో ఈ లోకము నుందు వారి సంబంధీకులకు అపకీర్తి, అవమానము, పరలోక శిక్ష అనివార్యము. ఒకడు ఒకని భార్యతో అక్రమ సంబంధము ఏర్పరచుకొనినచో అతడు తన భార్యకు విడాకులిచ్చుటలో ఎట్టి సందేహము లేదు. ఆమె గర్భము దాల్చి పిల్లలు కనినను వారిపై ఈ ప్రభావము తప్పక పడును. ఈ కష్టనష్టాలకు, ఈ కులుట వలన అతడు గురి అగును.

ఒకడు కామ వాంఛ కల్గి వుండినను, అనగా సృష్టికర్త ఈ అవయవములు, కోరికలు ఒసంగినను, వీటి ద్వారా వ్యభిచారము చేయుగలిగినను ఇట్టి తుచ్ఛములైన కోరికలను తమలో అణచి వేసికొనినపుడు ఈ పరిశుద్ధమైన స్థితియే ఇహ్సాన్ అను నైతిక విలువ అనబడునని జ్ఞప్తి యందుంచుకోవలెను. బాలుడు గాని, నపుంసకుడైన గాని, కొజ్జావాడు గాని వుండి కామ వాంఛలను పూర్తి చేయలేని స్థితి కలిగి తమను కామ కృత్యము నుండి తప్పించుకొనినచో ఈ స్థితిని 'ఇహ్సాన్' నైతిక విలువ అనలేము. ఇది కేవలము సహజ స్థితి. సహజ స్థితులు నైతిక విలువల కోవకు చెందలేవని మరి మరి తెలిపి వున్నాము. తెలివిగా పరిస్థితుల కనుగుణముగా కార్యమొనరించు, లేక బహిర్గతమైన అర్హత పొందినపుడే నైతిక విలువలనబడును. బాలురు, నపుంసకులు లేదా ఏదో ఒక పద్ధతిలో తమను నపుంసకులు చేసికొనినవారు "ఇహ్సాన్" అను నైతిక విలువ కలిగి వున్నారని అనలేము. పరిశుద్ధమైన, పవిత్రమైన

జీవితము గడిపినను "ఇహ్‌సాన్" అనలేము. ఇది కేవలము సహజ స్థితి అనబడును. ఈ అపవిత్ర కార్యములు పురుషునితో జరుగునట్లు స్త్రీతో కూడ జరుగవచ్చును. కనుక అల్లాహ్ పవిత్ర గ్రంథము నందు స్త్రీ పురుషులిరువురికి ఈ బోధ గలదు.

قُلْ لِّلْمُؤْمِنِيْنَ يَغُضُّوا مِنْ اَبْصَارِهِمْ وَيَحْفَظُوا فُرُوْجَهُمْ ؕ ذٰلِكَ اَزْكٰى لَهُمْ ؕ ...... وَقُلْ لِّلْمُؤْمِنٰتِ يَغْضُضْنَ مِنْ اَبْصَارِهِنَّ وَيَحْفَظْنَ فُرُوْجَهُنَّ وَلَا يُبْدِيْنَ زِيْنَتَهُنَّ اِلَّا مَا ظَهَرَ مِنْهَا وَلْيَضْرِبْنَ بِخُمُرِهِنَّ عَلٰى جُيُوْبِهِنَّ ۖ ...... وَلَا يَضْرِبْنَ بِاَرْجُلِهِنَّ لِيُعْلَمَ مَا يُخْفِيْنَ مِنْ زِيْنَتِهِنَّ ؕ وَتُوْبُوْٓا اِلَى اللّٰهِ جَمِيْعًا اَيُّهَ الْمُؤْمِنُوْنَ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ ○

(అన్నూర్ 24:31,32)

وَلَا تَقْرَبُوا الزِّنٰٓى اِنَّهٗ كَانَ فَاحِشَةً ؕ وَسَآءَ سَبِيْلًا ○

(బనీ ఇస్రాయీల్ 17:33)

وَلْيَسْتَعْفِفِ الَّذِيْنَ لَا يَجِدُوْنَ نِكَاحًا

(అన్నూర్ 24:34)

وَرَهْبَانِيَّةَ ۨ ابْتَدَعُوْهَا مَا كَتَبْنٰهَا عَلَيْهِمْ ...... فَمَا رَعَوْهَا حَقَّ رِعَايَتِهَا ۚ

(అల్ హదీద్ 57:28)

అనగా విశ్వాస పురుషులతో ఇట్లనుము. పర స్త్రీలను చూడనట్లు కన్నులను అదుపు చేయుము. కామోద్రేకములను పుట్టించు స్త్రీల వైపు చూడకుము. ఇట్టి సమయములందు కనులను మూసి వేయుము. సాధ్యమైనంత వరకు తన మాన స్థలములను రక్షించుకొనుము.

పర స్త్రీలను విననట్లుగా చెవులను మూసివేసికొనుము. అనగా పరస్త్రీల శబ్దాలను వినకుము. వారి అందచందాల కథలను వినకుము. పరిశుద్ధాత్మ కొరకు, పవిత్ర దృష్టికి ఈ పద్ధతి మంచిది. స్త్రీలు వారు కూడ తమ దృష్టితో పర పురుషులను చూడకూడదని, వారి మాటలు వినకూడదని, తమ మాన స్థలములను కప్పిపుచ్చుటకు, తమ అలంకరణ అవయవములను వారి ఎదుట ప్రదర్శించకూడదని, తమ ఓనిని తలపై నుండి యద వరకు అనగా తమ రెండు చెవులను, కణతలను కప్పునట్లు వుండునట్లు కప్పుకొనుమని, తమ పాదములను నాట్యము చేయువారి వలె భూమిపై వేయక నిదానముగా నడువవలెనని చెప్పుము. ఇట్లు చేసినచో పాపము నుండి తప్పి వుండగలరు.

రెండవ పద్ధతి, అల్లాహ్ వైపు శ్రద్ధ వహించు పద్ధతి. తప్పిదముల నుండి విముక్తి, బాధల నుండి తప్పించుటకు అతనిని ప్రార్థించుము. వ్యభిచారమును పుట్టించు మార్గముల నుండి, విందుల నుండి దూరముగా నుండుము, వ్యభిచారము చేయువాడు పాపపు అంతిమ సరిహద్దులకు చేరును. వ్యభిచారము గమ్యానికి దూరము చేయును. వివాహము కాని వారు ఉపవాస వ్రతమునాచరించి, అల్పాహారము నుండి తమ ఉద్రేకములను అదుపు చేయవలెను. కాని కొందరు వివాహము చేయక, కొజ్జాలుగా మారి, సాధువులుగా మారుచుందురు. కాని మానవునిపై ఈ ఆదేశమును కర్తవ్యముగా మేము చేయలేము. అనగా అల్లాహ్ మానవులను

కొజ్జాలుగా మారాలని ఆదేశించలేదు. ఆదేశమే అయివుండినచో అందరు దానిని పాటింతురు. ఫలితముగా మానవ జాతి అంతమై ప్రపంచమే అంతమయ్యేది. మగ అవయవమునే కోసివేసి మానవ పారిశుద్ధమును పొందినచో ఇవి అవయవ సృష్టికర్తనే ధిక్కరించునట్లగును. శక్తిని పొంది కూడ అల్లాహ్ భయముతో మానవుడు ఆ శక్తిని అపమార్గములలో ఉపయోగించినచో రెండు విధాల లాభము పొందగలడు. కాని ఆ అవయవమును వ్యర్థపరచినచో మానవుడు రెండు విధాలుగా నష్ట పోవునని తెలియవచ్చినది. పుణ్యము చెడును ఎదిరించినపుడే లభించును గదా! బాలుని వలే ఆ శక్తి లేనపుడు అతనికి పుణ్యమెక్కడిది. బాలునికి తమ మాన రక్షణతో పుణ్యము లభించునా?

## పవిత్రత చికిత్సలు ఐదు

ఈ సూక్తులలో అల్లాహ్ కేవలము ఇహ్సాన్ అనగా మానభద్రత కొరకు ఉత్తమ బోధనే గాక మానవ పవిత్రత పొందుటకు ఐదు మార్గములు కూడ చూపించినాడు. అనగా (1) పర స్త్రీలపై దృష్టిసారించుటను అరికట్టుట. (2) పర స్త్రీల మాటలు వినకుండా వుండుట. (3) పర స్త్రీల కథలను వినకుండా వుండుట. (4) కామాన్ని ప్రోత్సహించు అన్ని విందుల నుండి తమను దూరముంచుట. (5) వివాహము కానిచో ఉపవాస వ్రతమును నిర్వహించుట, మొదలగునవి.

ఈ ఉపాయములతో ఇట్టి ఉత్తమమైన బోధన పవిత్ర ఖుర్ఆన్ బోధించినది కేవలము ఇస్లాం నందే గలదని మేము నమ్మకముగా ప్రకటించుచున్నాము. మానవుని యందు కామము సహజ విలువగా నుండి పరిస్థితులకనుగుణముగా బయల్పడక వుండలేదు. అనగా కామవాంఛలు అపాయకరమైన రూపము దాల్చుట సహజము. ఇది

మనము మరువరాదు. అందుకనే పరస్త్రీల నృత్యగానములు, గుప్తాంగములను పవిత్ర దృష్టితోనైనను చూచుటకు అల్లాహ్ బోధించలేదు. యువతుల నృత్యగానాలు, అందచందాల గాథలు విను బోధ కూడ మనకు ఒసంగబడలేదు. పరస్త్రీల గుప్తాంగములు గాని, స్త్రీలను గాని, వారి నృత్యగానాలు గాని, మంచి దృష్టితో గాని, చెడు భావముతో గాని వినకూడదని, చూడకూడదని మనకు బోధించబడినది. అదుపు దప్పిన దృష్టి వలన ఒకనాడు తప్పక కామవాంఛలకు లోనగుట తథ్యము, కనుక మనము మన కన్నులు, హృదయము పవిత్రత కలిగివుండాలని అల్లాహ్ ఇట్టి ఉత్తమ బోధను బోధించెను. ఒక ఆకలి కలిగివున్న కుక్క ముందు రొట్టెలుంచి వాటి వైపు అది చూడదని భావించుట మన తప్పిదము. కనుక కామ వాంఛలను పూర్తి చేయు సౌలభ్యము గలిగి దూరముండుట అసాధ్యము. అందువలన ఆ కామవాంఛలు పుట్టు సమయమే, అవకాశమే సంభవించకూడదని అల్లాహ్ కోరిక.

ఇస్లామిక్ పరదా తత్వమిదే. ధర్మశాసనము కూడ ఇదే. ఇస్లాం పద్ధతులు తెలియని వారే స్త్రీలను బందీలుగా బందిస్తారు. కాని విశాల దృక్పథము, అందచందాల ప్రదర్శనను స్త్రీ పురుషులు చేయరాదని దాని ఉద్దేశ్యము. స్త్రీ, పురుషుల మేలు దీనిలో ఇమిడి వున్నది. ఒకరిని శ్రద్ధగా చూడుట నుండి తమని ఆపి, చూడదగినవి చూడుటను అరబ్బి భాషలో "ఘజ్జె బసర్" అందురు. తమ హృదయమును పవిత్రముగా నుంచుకొను ప్రతివాడు నిషిద్ధ వస్తువులను జంతువులుగా అదుపు తప్పి చూచుట మంచిది కాదని జ్ఞప్తి యందుంచు కోవలెను. కనుక జీవితము నందు కూడ "ఘజ్జె బసర్" అలవాటు బడుట తప్పనిసరి. ఈ పవిత్ర అలవాటు వలన అతని సహజ స్థితి ఒక గొప్ప నైతిక విలువగా రూపుదాల్చును.

అతని నాగరికత యందు కూడ భేదముండదు. దీనినే ఇహ్సాన్ శీలము అందురు.

చెడును వీడుటకు ఉపయోగించు రెండవ గుణము నీతి, నిజాయితి. అనగా పర సంపత్తిని అక్రమముగా ఆక్రమించి అతనిని కష్టపెట్టుటకు వెనుకాడుట, నిరాకరించుట, నీతి, నిజాయితి మానవ సహజ స్థితులలో ఒక స్థితి. కనుకనే ఒక శిశువు కూడ తన సహజ సాధుత్వమును ప్రదర్శించును. శిశువుగా వున్నందు వలన దురలవాట్లకు లోను కాడు. పరస్త్రీ పాలు త్రాగుటకు కూడ సమ్మతించదు. తన ప్రాణాలకు ముప్పు తెచ్చుకొనును గాని ఇతర స్త్రీ పాలు త్రాగుటకు ఇష్టపడదు. ఇట్లు ఇష్టపడని కారణమేమి? తల్లిని వదిలి మరో వైపు చూడుటకు ఎంత మాత్రము శ్రద్ధ వహించడు. ఇది అతని సహజ కృత్యము. ప్రాణా పాయమునకు కూడ సిద్ధమై ఇతరుల వస్తువును గైకొనని శిశువులోని ఈ గుణమునకు గల కారణాలను ఆలోచించగా, పరిశీలించగా, నీతి, నిజాయితే దీనికి మూలమని తేలును. నీతి, నిజాయితి, శిశువులే ఇతరుల వస్తువులను, సంపత్తిని వశపరచుకొనుటకు ఇష్టపడనంత వరకు ఎవడూ సజ్జనుడుగా పరిగణింపబడడు. కాని శిశువు తన మూర్ఖత్వము వలన సమయ సందర్భముల ప్రకారము ఈ అలవాటును ఉపయోగించక ఎనలేని కష్టములకు గురి అగును. అనగా ఈ అలవాటు సహజ స్థితిలో అనుకోకుండా బహిర్గతమగును. కనుక ఆ చర్య నైతిక విలువ అనబడదు. నీతి, నిజాయితి మానవుని స్వభావము. సమయ సందర్భములలో ఈ సహజ విలువలను ఉపయోగించని వాడు అనుకోకుండా ఈ చర్యలను బహిర్గతము చేసి శిశువును పోలివుండును. నీతి, నిజాయితీలను అలవర్చుకొనుట చాలా సున్నితమైన విషయము. దాని మొత్తము

అంశాలను పూర్తి చేసినపుడే మానవుడు నీతి, నిజాయితి గలవాడని నిర్ధారణ అగును. అంత వరకు కాదు. అల్లాహ్ దీనినే తన పవిత్ర గ్రంధమునందిట్లు విశదీకరించెను.

وَلَا تُؤْتُوا السُّفَهَآءَ اَمْوَالَكُمُ الَّتِیْ جَعَلَ اللّٰهُ لَكُمْ قِيٰمًا وَّارْزُقُوْهُمْ
فِيْهَا وَاكْسُوْهُمْ وَقُوْلُوْا لَهُمْ قَوْلًا مَّعْرُوْفًا ○ وَابْتَلُوا الْيَتٰمٰى حَتّٰٓى اِذَا
بَلَغُوا النِّكَاحَ ۚ فَاِنْ اٰنَسْتُمْ مِّنْهُمْ رُشْدًا فَادْفَعُوْٓا اِلَيْهِمْ اَمْوَالَهُمْ ۚ وَ
لَا تَاْكُلُوْهَآ اِسْرَافًا وَّبِدَارًا اَنْ يَّكْبَرُوْا ۭ وَمَنْ كَانَ غَنِيًّا
فَلْيَسْتَعْفِفْ ۚ وَمَنْ كَانَ فَقِيْرًا فَلْيَاْكُلْ بِالْمَعْرُوْفِ ۭ فَاِذَا دَفَعْتُمْ
اِلَيْهِمْ اَمْوَالَهُمْ فَاَشْهِدُوْا عَلَيْهِمْ ۭ وَكَفٰى بِاللّٰهِ حَسِيْبًا ○

(అన్నిసా 4:6,7)

وَلْيَخْشَ الَّذِيْنَ لَوْ تَرَكُوْا مِنْ خَلْفِهِمْ ذُرِّيَّةً ضِعٰفًا خَافُوْا عَلَيْهِمْ ۠
فَلْيَتَّقُوا اللّٰهَ وَلْيَقُوْلُوْا قَوْلًا سَدِيْدًا ○ اِنَّ الَّذِيْنَ يَاْكُلُوْنَ اَمْوَالَ
الْيَتٰمٰى ظُلْمًا اِنَّمَا يَاْكُلُوْنَ فِيْ بُطُوْنِهِمْ نَارًا ۭ وَسَيَصْلَوْنَ سَعِيْرًا ○

(అన్నిసా 4:10,11)

అనగా మీలో ఎవడేని అనాధ బాలుడు, ధనవంతుడున్నచో అతడు తన అవివేకముతో తమ ధనమును వ్యర్థపరచునని సందేహమున్నచో మీరు అతనికి సంరక్షకునిగా వుండి, ధనమును తీసికొని వ్యాపారములో వినియోగించి అతని ఆర్థిక స్థితిని పెంచుము. వారి అవసరాలకు తగినంత

ధనమును ఒసంగుచుండుము. వారికి వివేకము అభివృద్ధి చెందు మాటలు నేర్పి వారి అవివేకమును పోగొట్టుము. వారు వ్యాపారి సంతానమైనచో వ్యాపార పద్ధతులు, ఏ వృత్తి వారైతే ఆ వృత్తిలో నిపుణులుగా తీర్చి దిద్దవలెను. అప్పుడప్పుడు వారికి మీరు నేర్పినది నేర్చినారా లేదా తెలిసికొనుటకు పరీక్షించుచుండవలెను. వివాహ యోగ్యత వచ్చినప్పుడు అనగా సుమారు 18 సంవత్సరములు నిండినప్పుడు, తమ ధనమును ఉపయోగించు అర్హత సంపాదించినప్పుడు, వారి ధనము వారికి అప్పగించుము. అనవసరముగా వారి ధనమును తిరిగి తీసికొందురను భయముతో దానిని తొందరగా ఖర్చు చేయకుము. సంరక్షకుడు ధనవంతుడైనచో ఈ సేవకై సేవా ధనముగా ఏమియును తీసికోరాదు. బీదవాడైనచో సేవా ప్రతిఫలము తీసికొనుటలో తప్పేమియును లేదు.

వ్యాపారులైన అనాథల సంరక్షకులు వ్యాపారములో వచ్చు లాభములో నుండి వారు కూడ తీసికొను పద్ధతి అరబ్బులలో నుండినది. అసలు ధనమును నష్టపరచువారు కారు. ఆ పద్ధతినే అవలంభించి తీసికొనవలెనని తెలుపబడినది. మీరు అనాథల ధనము ఆస్తిపాస్తులను తిరిగి ఇచ్చునప్పుడు సాక్షుల ముందు వారికి వారి ధనమును ఇచ్చి వేయుము. ఒకడు చనిపోయినప్పుడు అతని సంతానము చిన్నగా, బలహీనులుగా వుండినచో వారికి హాని కలుగునట్లు వీలునామా వ్రాయరాదు. అనాథలను నష్టపరచి, అన్యాయముగా వారి ధనమును తినిన వారు ధనమును కాదు నిప్పును తిందురు. తుదకు వారు నిప్పు నందు వేయబడుదురు.

అల్లాహ్ నీతి, నిజాయితి అంశములెన్ని తెలిపివున్నాడో చూడుము. ఈ అంశాలను పూరించునదే నీతి, నిజాయితిలో అతి వివేకమును

పయోగించి ఈ అంశాలను అవలంభించక పోయినచో దాగివున్న అనేక అవినీతి అక్రమములు జరుగుటకు అవకాశముండును.

మరో చోట అల్లాహ్ ఇట్లు నుడివెను.

وَلَا تَأْكُلُوْٓا اَمْوَالَكُمْ بَيْنَكُمْ بِالْبَاطِلِ وَتُدْلُوْا بِهَآ اِلَى الْحُكَّامِ لِتَأْكُلُوْا فَرِيْقًا مِّنْ اَمْوَالِ النَّاسِ بِالْاِثْمِ وَ اَنْتُمْ تَعْلَمُوْنَ ۝

(అల్ బఖరహ్ 2:189)

اِنَّ اللّٰهَ يَاْمُرُكُمْ اَنْ تُؤَدُّوا الْاَمٰنٰتِ اِلٰٓى اَهْلِهَا ۙ

(అన్నిసా 4:59)

اِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْخَآئِنِيْنَ

(అల్ అన్ఫాల్ 8:59)

وَاَوْفُوا الْكَيْلَ اِذَا كِلْتُمْ وَزِنُوْا بِالْقِسْطَاسِ الْمُسْتَقِيْمِ ۭ

(బనీ ఇస్రాయీల్ 17:36)

وَلَا تَبْخَسُوا النَّاسَ اَشْيَآءَهُمْ

(అల్ ఆరాఫ్ 7:86)

وَلَا تَعْثَوْا فِى الْاَرْضِ مُفْسِدِيْنَ ۝

(అల్ బఖరహ్ 2:61)

وَلَا تَتَبَدَّلُوا الْخَبِيْثَ بِالطَّيِّبِ ۖ

(అన్నిసా 4:3)

అనగా పరస్పర సంపత్తిని అన్యాయముగా తినకుము. తన ధనమును లంచ రూపములో అధికారులకు అందచేయకుము. ఇట్లు చేసినచో మీరు ఇతరుల ధనమును అధికారుల సహాయముతో వశపరచుకొందురు. నిమ్మ మీ వద్ద పెట్టిన వస్తువులను తిరిగి వారికి ఇచ్చి వేయుము. అల్లాహ్ మోసము చేయు వారిని ప్రేమించడు. కొలతలు పూర్తిగా కొలువుము. సరియైన తూనికలు, త్రాసుతో జోకుము. లోకులకు ఎట్టి నష్టము కలగించకుము. పీడనము కొరకు భూమిపై తిరుగకుము. అనగా దొంగతనము, జేబులు కొట్టుటకు, అన్యాయముగా ఇతరుల ధనమును కాజేయుటకు ప్రయత్నించకుము. మంచి వస్తువుల స్థానములో చెడు వస్తువులను విక్రయించకుము. ఇతరుల ధనమును కాజేయుట ఎట్లు అన్యాయమో అటులనే మంచి వస్తువులకు బదులు చెడు వస్తువులు ఇచ్చుట, విక్రయించుట కూడా అన్యాయమే.

పై సూక్తులలో అల్లాహ్ అవినీతి పద్ధతులన్నీ తెలిపినాడు. ఏ అవినీతి మార్గమును వదలకుండా వివరించివున్నాడు. కేవలము దొంగతనమే చేయకూడదని నుడువలేదు. ఒక అవివేకి చోర్యము నాకు నిషేధించబడినది మిగిలిన అన్యాయంపు కార్యములన్నియు ధర్మబద్ధములైనవే నని భావించకూడదని వ్యసములన్నిటిని నిషేధించుటలో వివేకము గలదు. నితీ, నిజాయితి తమ యందు లేనివాడు. ఇట్టి అంశాలను చేపట్టనివాడు కొన్ని సమయాలలో నీతి, నిజాయితిని ప్రకటించినను ఈ చర్య నీతిగా పరిగణింపబడదు. ఇదొక సహజ విలువ అనబడును. వివేక రహిత చర్య ఇది.

దూర్మార్గము, కీడును వీడు మూడవ నైతిక విలువను అరబ్బి భాషలో "హుద్‌నహ్" లేదా "హౌన్" అందురు. అనగా అన్యాయ

మార్గమవలంభించి ఎవరిని శారీరక బాధకు గురిచేయక వుండుట. సంధీయుత, శాంతియుత జీవితము గడుపుట. నిస్సందేహముగా సంధీయుత, శాంతియుత విలువ ఉత్తమ నైతిక విలువ. మానవునికిది అనివార్యము, తప్పనిసరి అయినది. ఈ విలువ శిశువులో వున్న ఈ సహజ శక్తి నైతిక విలువగా మారును. మానవుడు కేవలము సహజ స్థితిలో అనగా అవివేకుడైనప్పుడు శాంతిని గాని, యుద్ధమును గాని ఎరుగడు. అప్పుడుద్భవించిన అలవాటు శాంతియుత అలవాటునకు మూలము. కాని వివేకముతో తెలివితో సంబంధము లేనందు వలన దీనిని నైతిక విలువ అనలేము. సమయ సందర్భములలో వివేకముతో దీనిని ఉపయోగించినప్పుడు ఈ విలువ శాంతియుత విలువగా పరిగణింపబడును. దీనినే అల్లాహ్ ఈ విధముగా బోధించును.

وَاَصْلِحُوْا ذَاتَ بَيْنِكُمْ ۖ

(అల్ అన్ఫాల్ 8:2 )

وَالصُّلْحُ خَيْرٌ ۗ

(అన్నిసా 4:129)

وَاِنْ جَنَحُوْا لِلسَّلْمِ فَاجْنَحْ لَهَا

(అల్ అన్ఫాల్ 8:62)

وَعِبَادُ الرَّحْمٰنِ الَّذِيْنَ يَمْشُوْنَ عَلَى الْاَرْضِ هَوْنًا

(అల్ ఫుర్ఖాన్ 25:64)

وَاِذَا مَرُّوْا بِاللَّغْوِ مَرُّوْا كِرَامًا

(అల్ ఫుర్ఖాన్ 25:73)

اِدْفَعْ بِالَّتِىْ هِىَ اَحْسَنُ فَاِذَا الَّذِىْ بَيْنَكَ وَ بَيْنَهٗ
عَدَاوَةٌ كَاَنَّهٗ وَلِىٌّ حَمِيْمٌ ○

(హామీమ్ అస్సజ్దహ్ 41:35)

అనగా పరస్పర సంబంధాలను సంస్కరించుకొనుటకు ప్రయత్నించుము. శాంతియందు శుభము గలదు. వారు శాంతి కాంక్షించినచో మీరు కూడ శాంతిని కోరుము. అల్లాహ్ దాసులు శాంతియుతంగా భూమిపై నడుతురు. పనికిరాని వ్యర్థమగు మాటలు వినినను గౌరవప్రదముగా వినకుండ ముందుకు సాగుదురు. అతి చిన్న విషయములలో పోట్లాడుటకు సిద్ధపడరు. అనగా అధిక బాధ కలుగు నంత వరకు హంగామా చేయుటకు ముందుకు రారు. చిన్న చిన్న విషయములను లెక్క చేయక క్షమించు గుణమే శాంతి సిద్ధాంతము. తుంటరి తనములో ఒక ఏదేని కీడు చేయుటకు వ్యర్థమైన వాగుడు వాగిన, హాని, నష్టము కలుగునపుడు అతనిని క్షమించుట, గౌరవ ప్రదమైన వ్యవహారమొనర్చుట ఉత్తమమైనది. కాని దీని నుండి ప్రాణ, ధన, గౌరవమునకు హాని కలిగినపుడు శాంతి, సంధికి వీలుండదు. క్షమించినచో దీనిని క్షమాపణ అందురు. ఒకడు తుంటరి తనములో ఏదేని వాగినచో మీరు సన్మార్గములో వ్యవహరించుము. ఇట్టి వ్యవహారముతో శత్రువు కూడా స్నేహితుడగును. మొత్తము మీద శత్రువు వాగుడును క్షమించు పద్ధతినవలంభించి శాంతి, సంయమనవలంభించుట మంచిది.

చెడును నిర్మూలించు నాలుగవ మంచి వ్యవహారము, మర్యాదగల ప్రవర్తన, ఇది ఉల్లాసమునకు సంతోషమునకు మూలము. శిశువు మాటలాడునంత వరకు చేయు చేష్టలు ఈ ఉత్సాహము, ఉల్లాసమునకు

నిదర్శనము. ఇది ఒక సహజ విలువ. ఈ విలువ సమయస్ఫూర్తిగా బయటపడును. దీనినే అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ నందిట్లు తెలిపెను.

وَقُوْلُوْا لِلنَّاسِ حُسْنًا

(అల్ బఖరహ్ 2:84)

لَا يَسْخَرْ قَوْمٌ مِّنْ قَوْمٍ عَسٰٓى اَنْ يَّكُوْنُوْا خَيْرًا مِّنْهُمْ وَ
لَا نِسَآءٌ مِّنْ نِّسَآءٍ عَسٰٓى اَنْ يَّكُنَّ خَيْرًا مِّنْهُنَّ ۚ وَلَا تَلْمِزُوْٓا
اَنْفُسَكُمْ وَلَا تَنَابَزُوْا بِالْاَلْقَابِ ؕ

(అల్ హుజురాత్ 49:12)

اجْتَنِبُوْا كَثِيْرًا مِّنَ الظَّنِّ ۫ اِنَّ بَعْضَ الظَّنِّ اِثْمٌ وَّلَا
تَجَسَّسُوْا وَلَا يَغْتَبْ بَّعْضُكُمْ بَعْضًا ؕ ......وَاتَّقُوا اللّٰهَ ؕ اِنَّ
اللّٰهَ تَوَّابٌ رَّحِيْمٌ

(అల్ హుజురాత్ 49:13)

وَلَا تَقْفُ مَا لَيْسَ لَكَ بِهٖ عِلْمٌ ؕ اِنَّ السَّمْعَ وَالْبَصَرَ
وَالْفُؤَادَ كُلُّ اُولٰٓئِكَ كَانَ عَنْهُ مَسْئُوْلًا ○

(బనీ ఇస్రాయీల్ 17:37)

అనగా లోకులకు మంచి మాటలను బోధించుము. అనగా లోకులతో మంచి మాటలే మాటలాడుము. ఒక జాతి మరో జాతిని పరిహసించరాదు. పరిహసించబడు జాతి మంచిదై వుండవచ్చు. స్త్రీలు ఇతర స్త్రీలను

పరిహసించరాదు. వారే మంచి వారు కావచ్చు. నేరారోపణ చేయకుము. తమ వారిని మంచి పేర్లతో పిలుచుము. అనుమానాస్పదములైన పలుకులు పలుకకుము. గుచ్చి గుచ్చి లోపాలను తెలిసికొనుటకు ప్రయత్నించకుము. పరోక్షముగా నిందించకుము. రుజువు లేనిది నిందారోపణ చేయకుము. చెవి, కన్ను, హృదయము ప్రతిదానితో అడుగబడునని జ్ఞప్తియందుంచుకొనుము.

## మంచి చేయు నైతిక విలువల స్వభావము

మంచి చేయు విలువ రెండవ నైతిక విలువ. మొదటిది క్షమాపణ అనగా పాపము చేసిన వానిని క్షమించుట. పాపము చేయువాడు హాని చేయును. అతనిని దండించుట, బంధించుట లేక క్షమించుట అనివార్యము. కాని క్షమించుట ఉత్తమము. ఇది మంచి కార్యము. ఈ విషయమును పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు బోధించును.

وَالْكٰظِمِيْنَ الْغَيْظَ وَالْعَافِيْنَ عَنِ النَّاسِ ؕ

(ఆలె ఇమ్రాన్ 3:135)

جَزٰٓؤُا سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا ۚ فَمَنْ عَفَا وَاَصْلَحَ فَاَجْرُهٗ عَلَى اللّٰهِ ؕ

(అశ్శూరా 42:41)

అనగా కోపమును చూపే సమయము నందు కోపమును మింగువాడు సజ్జనుడు. క్షమించు సమయము నందు పాపమును క్షమించువారు సజ్జనులు. చెడుకు ప్రతిఫలము దానికి తగినంత వుండవలెను. సంస్కరణ నిమిత్తము నేరమును క్షమించవలెను. కానిచో దాని ప్రతిఫలము అతడు పొందును. అనవసరంగా ప్రతి చోట ప్రతి అన్యాయమును ఎదురించకూడదని కాదు. సమయస్ఫూర్తిగా అనగా

క్షమించుట గాని శిక్షించుట గాని సమయమును బట్టి వుండవలెనని ఈ సూక్తి నిర్దేశించుచున్నది. కనుక నేరస్థునికి గాని సామాన్యునికి గాని సరిపడు నిర్ణయము తీసికొనవలెను. కొన్ని సమయములలో నేరస్థుడు క్షమించినచో పశ్చాత్తాప పడి పాపములను వీడును. కాని కొన్ని సమయములలో క్షమించుట వలన మరీ రెచ్చిపోయి ధైర్యముగా పాపములు చేయును. కనుక అంధుల వలె కేవలము పాపులను క్షమించక మేలునూహించి క్షమించుము లేదా శిక్షించుము. సమయమూ అవసరమూ చూచి నిర్ణయించుకొనుము. మానవులలో కొందరు పగ, కసి గుణమును పాటింతురు. తమ తండ్రి తాతల పగలను జ్ఞప్తియందంచుకొందురు. మరి కొందరు క్షమాపణ గుణమును అతిగా అవలంభించి, గౌరవ మర్యాదలను కూడ మంట కలిపి సత్ప్రవర్తనను దుష్ప్రవర్తనగా మారుస్తారు. ఫలితముగా దీనిని అందరు ఏవగింతురు. అందు కొరకే ప్రతి విలువ కొరకు పవిత్ర ఖుర్ఆన్ సమయ సందర్భ నిబంధనను నిర్ణయించెను. సమయ సందర్భములు లేని విలువలు నైతికమనబడవు.

కేవలము క్షమాగుణము నైతికమనబడదు. అది ఒక సహజాతము. ఇది శిశువులలో కూడ వుండునని జ్ఞప్తి యందుంచుకొనుట మంచిది. ఎవరేని శిశువును కొట్టినను కొంత సమయము తరువాత దానిని విస్మరించి అతని వద్దకు పోవును. ఆ వ్యక్తి అతనిని హతమార్చుట గోరినను తియ్యని మాటలకు సంతోషపడును. కనుక ఏ విధముగాను నైతికమనబడదు. సమయ సందర్భములలో దానిని ఉపయోగించినపుడే అది నైతికమనబడును. కానిచో అది ఒక సహజ శక్తి అనబడును. సహజ శక్తి నైతికముల మధ్య భేదమును గుర్తెరుగు వారు జగత్తులో అరుదు. సహజ శక్తి సమయ సందర్భములు లేనిది కూడ బయల్పడునని, నైతికము సమయ

సందర్భము లందే కానవచ్చునని ఈ రెండింటిలోని భేదమిదేనని మరీ మరీ తెలిపివున్నాము. ఆవు సాధు జంతువే. మేక కూడ సాధు జంతువే. కాని వీటిలో నైతిక గుణము గలదని మనము చెప్పలేము. కారణము వీటికి సమయ సందర్భ జ్ఞానము లేదు. అల్లాహ్ వివేకము, అల్లాహ్ సత్యమైన సంపూర్ణమైన, పవిత్ర గ్రంధము ప్రతి నైతిక విలువలో సమయ సందర్భ నియమమును ముడి వేసి వున్నది.

మేలు చేయు నైతిక విలువలలో రెండవది న్యాయ నిర్ణయము. మూడవది "ఇహ్సాన్" నాలుగవది "ఈతాయి జిల్ఖుర్బా" దీనినే అల్లాహ్ తన పవిత్ర ఖుర్ఆన్ నందిట్లనెను.

اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَ اِيْتَآئِ ذِى الْقُرْبٰى وَ يَنْهٰى عَنِ
الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْىِ

(అన్నహ్ల్ 16:91)

అనగా మేలుకు బదులు మేలు చేయుము. న్యాయము కన్నా మేలు చేయు సమయ సందర్భమున్నచో మేలు చేయుము. సమీప బంధువుల వలే సహజ ధోరణిలో మేలు చేయు సమయమున్నచో దయతో జాలితో మేలు చేయుమని అల్లాహ్ ఆదేశము. పరిమితులు దాటుటకు, మేలు చేయుటలో వెనుకాడుటకు, సందర్భము లేనిదే మేలు చేయుటకు, సహజ దయతో మేలు చేయు సందర్భమున్నచో వెనుకాడుటకు లేదా హద్దులు మీరిన కరుణా జల్లులు కురిపించుటకు అల్లాహ్ నివారించును. ఈ సూక్తిలో మంచి చేయు మూడు తరగతులు తెలుపబడినవి.

**మొదటిది:–** చేసిన మేలుకు సమానమగు మేలు చేయుట. చాలా క్రింది స్థాయి గల మానవుడు కూడ ఇది చేయగలడు. తమకు మేలు

చేసిన వారితో మేలు చేయు గుణము కలిగివుండును. కనుక ఈ క్రింది స్థాయి నైతిక విలువలను ఎవరైనా అలవరచుకొనవచ్చును.

**రెండవది:-** దీని కంటే కష్టతరము. మేలు చేయుటకు ముందుకు రావడము. ప్రతిఫలము నాశించకుండా లాభమును కలిగించుట. ఈ విలువ మధ్య తరగతికి చెందినది. బీదసాదలకు చాలా మంది మేలు చేయుదురు. మేలు చేయువాడు మేలు చేసినవానితో కనీసము కృతజ్ఞత లేదా వేడుకను ఆకాంక్షించును. ఇది గుప్త లోపము. ఎవరేని మేలు చేసిన తరువాత వ్యతిరేకి అయినచో అతనిని కృతఘ్నుడని భావించును. తన మేలుకు మోయలేని బరువు బాధ్యతలు అప్పగించును. లేనిచో తాను చేసిన మేలును స్మరింపజేయును. కనుక మేలు, ఉపకారము చేయువారినుద్దేశించి అల్లాహ్ ఇట్లు హెచ్చరించివున్నాడు.

لَا تُبْطِلُوْا صَدَقٰتِكُمْ بِالْمَنِّ وَالْاَذٰى

(అల్ బఖరహ్ 2:265)

అనగా చేసిన మేలు జ్ఞాపకము చేసి దుఃఖము కలిగించి తమ దానములను వ్యర్థము చేయకుము. సద్ఖా అనగా దానము, ఇది సిద్ఖ్ అనగా నిజాయితి లేదా నిష్కపటము నుండి పుట్టినది. దానము, నిజాయితి, నిష్కపటముగా చేయనిచో అది కేవలము కపటమగును. మేలు చేయువాడు అప్పుడప్పుడు తమ మేలు జ్ఞాపకము చేయకూడదని అల్లాహ్ అతనిని హెచ్చరించివున్నాడు.

ఒక తల్లి తమ బిడ్డపై కనికరముతో మేలు కొరకు ముందుకు వచ్చినట్లు ఇతరుల మేలు కొరకు ముందుకు సాగవలెను. ఏ విధమైన కృతజ్ఞత, దృష్టిలో వుండకూడదు. ఈ నైతిక విలువ అంతిమ విలువ.

దీని కంటే ఎక్కువ ఎరుగుట అసాధ్యము. ఈ దయగల నైతిక విలువ మూడవ తరగతికి చెందినది. ఈ దయ గల స్థాయిలను అల్లాహ్ సమయ సందర్భములతో ముడి వేసి వున్నాడు. ఈ మేలు సమయ సందర్భములలో వ్యక్తము కానిచో అవి నీచముగా లోపములుగా పరిగిణింపబడును. హద్దులు మీరిన న్యాయము కూడ అసభ్యముగా మారును. ఈ విధముగనే మేలు కీడుగా మారును. అనగా అనుభవము, తెలివికి విరుద్ధమగును. సమయసందర్భము లేని దయ, సానుభూతి కపటముగా మారును. హద్దులు మీరిన వర్షము పడి పంట చేనులు నాశనమైనచో అరబ్బి భాషలో "బఘీ" అందురు. ఉపకార లోపము, హద్దులు మీరిన ఉపకారము రెండును "బఘీ" అనబడును. ఏది ఏదైనా సమయ సందర్భము లేనిది ఈ మూడింటిలో ఏది బహిర్గతమైనను అది చెడు రూపమును దాల్చును. అందు వలననే ఈ మూడింటికి సమయ సందర్భముల షరతు విధించబడినది. కేవలము న్యాయము, దయ లేదా సానుభూతిని నైతికమనలేము. మానవునిలో ఇవన్నియు సహజ శక్తులుగా వుండనే వుండును. ఇవి శిశువులో తెలివి రాక మునుపే వుండునని జ్ఞాపకముంచు కొనవలెను. కాని నైతిక విలువలకు తెలివి తప్పక వుండవలెను.

మేలును గురించి అనేక మార్గములు పవిత్ర ఖుర్ఆన్ నందు గలవు. ఇవన్నియు సమయ సందర్భముల యందు వాడుటకు ఆదేశము గలదు. దీనినే ఇట్లు తెలిపెను.

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اَنْفِقُوْا مِنْ طَيِّبٰتِ مَا كَسَبْتُمْ ...... وَلَا
تَيَمَّمُوا الْخَبِيْثَ مِنْهُ

(అల్ బఖరహ్ 2:268)

لَا تُبْطِلُوْا صَدَقٰتِكُمْ بِالْمَنِّ وَالْاَذٰى ۙ كَالَّذِىْ يُنْفِقُ مَالَهٗ رِئَآءَ النَّاسِ

(అల్ బఖరహ్ 2:265)

وَاَحْسِنُوْا ۛۚ اِنَّ اللّٰهَ يُحِبُّ الْمُحْسِنِيْنَ

(అల్ బఖరహ్ 2:196)

اِنَّ الْاَبْرَارَ يَشْرَبُوْنَ مِنْ كَاْسٍ كَانَ مِزَاجُهَا كَافُوْرًا ۚ عَيْنًا
يَّشْرَبُ بِهَا عِبَادُ اللّٰهِ يُفَجِّرُوْنَهَا تَفْجِيْرًا ۝

(అద్దహ్ర్ 76:6,7)

وَيُطْعِمُوْنَ الطَّعَامَ عَلٰى حُبِّهٖ مِسْكِيْنًا وَّيَتِيْمًا وَّاَسِيْرًا ۝ اِنَّمَا
نُطْعِمُكُمْ لِوَجْهِ اللّٰهِ لَا نُرِيْدُ مِنْكُمْ جَزَآءً وَّلَا شُكُوْرًا ۝

(అద్దహ్ర్ 76:9,10)

وَاٰتَى الْمَالَ عَلٰى حُبِّهٖ ذَوِى الْقُرْبٰى وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنَ وَ
ابْنَ السَّبِيْلِ ۙ وَالسَّآئِلِيْنَ وَفِى الرِّقَابِ ۚ

(అల్ బఖరహ్ 2:178)

اِذَآ اَنْفَقُوْا لَمْ يُسْرِفُوْا وَلَمْ يَقْتُرُوْا وَكَانَ بَيْنَ ذٰلِكَ قَوَامًا

(అల్ ఫుర్ఖాన్ 25:68)

وَالَّذِيْنَ يَصِلُوْنَ مَآ اَمَرَ اللّٰهُ بِهٖٓ اَنْ يُّوْصَلَ وَيَخْشَوْنَ
رَبَّهُمْ وَيَخَافُوْنَ سُوْٓءَ الْحِسَابِ

(అర్రాద్ 13:22)

وَفِيٓ اَمۡوَالِهِمۡ حَقٌّ لِّلسَّآئِلِ وَالۡمَحۡرُوۡمِ

(అజ్జారియాత్ 51:20)

اَلَّذِيۡنَ يُنۡفِقُوۡنَ فِي السَّرَّآءِ وَالضَّرَّآءِ

(ఆలె ఇమ్రాన్ 3:135)

وَاَنۡفَقُوۡا مِمَّا رَزَقۡنٰهُمۡ سِرًّا وَّعَلَانِيَةً

(అర్రాద్ 13:23)

اِنَّمَا الصَّدَقٰتُ لِلۡفُقَرَآءِ وَالۡمَسٰكِيۡنِ وَالۡعٰمِلِيۡنَ عَلَيۡهَا
وَالۡمُؤَلَّفَةِ قُلُوۡبُهُمۡ وَفِي الرِّقَابِ وَالۡغٰرِمِيۡنَ وَفِيۡ سَبِيۡلِ اللّٰهِ
وَابۡنِ السَّبِيۡلِ ؕ فَرِيۡضَةً مِّنَ اللّٰهِ ؕ وَاللّٰهُ عَلِيۡمٌ حَكِيۡمٌ

(అత్తౌబహ్ 9:60)

لَنۡ تَنَالُوا الۡبِرَّ حَتّٰى تُنۡفِقُوۡا مِمَّا تُحِبُّوۡنَ

(ఆలె ఇమ్రాన్ 3:93)

وَاٰتِ ذَا الۡقُرۡبٰى حَقَّهٗ وَالۡمِسۡكِيۡنَ وَابۡنَ السَّبِيۡلِ وَلَا
تُبَذِّرۡ تَبۡذِيۡرًا

(బనీ ఇస్రాయీల్ 17:27)

وَّبِالْوَالِدَيْنِ اِحْسَانًا وَّبِذِى الْقُرْبٰى وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ وَ
الْجَارِ ذِى الْقُرْبٰى وَالْجَارِ الْجُنُبِ وَالصَّاحِبِ بِالْجَنْۢبِ وَ
ابْنِ السَّبِيْلِ ۙ وَمَا مَلَكَتْ اَيْمَانُكُمْ ؕ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ مَنْ كَانَ
مُخْتَالًا فَخُوْرَا ۙ ۟ الَّذِيْنَ يَبْخَلُوْنَ وَ يَاْمُرُوْنَ النَّاسَ
بِالْبُخْلِ وَيَكْتُمُوْنَ مَاۤ اٰتٰهُمُ اللّٰهُ مِنْ فَضْلِهٖ ؕ

(అన్నిసా 4:37,38)

అనగా ఓ విశ్వాసులారా! మీరు లోకుల మేలు గోరి దానములు, సహాయ రూపములో ఏదేని ఇచ్చినచో ఆ ధనము నిజాయితిగా సంపాదించినదై వుండవలెను. అనగా ఆ ధనము లంచము, దొంగతనము, ఇతరుల వద్ద నుండి అపహరించినది, అన్యాయముగా సంపాదించినది వుండకూడదు. అన్యాయముగా సంపాదించిన ధనము ఇతరులకు దాన రూపములో ఇచ్చుటకు కోరరాదు. రెండవది తమ దానములను, సహాయమును దుఃఖము కలిగించి వ్యర్థపరచకుము.

చేసిన మేలు ఎప్పుడు తెలుపకుము. మేలు చేసినామని పీడించకుము. అట్లు చేసినచో మీ మేలు వ్యర్థమగును. తమ ధనమును కపటముతో ఖర్చు చేయుకుము. అల్లాహ్ ప్రాణాలకు మేలు చేయుచుండును. అల్లాహ్ మేలు చేయువారిని ప్రేమించును. కపటము లేని మేలు, సహాయము చేయువారికి కర్పూరముతో కూడిన ద్రవము త్రాగించబడును. అనగా లౌకికములైన కోరికలు, దుఃఖములు దురాశలను

వారి హృదయముల నుండి దూరము చేయబడును. "కఫర" నుండి కర్పూరము పుట్టినది. "కఫర" అనగా అణచివేయుట, కప్పుట, వారి వ్యర్థ కోరికలను అణచివేయుబడునని అర్థము. అప్పుడు వారు పవిత్రులగుదురు. వారికి స్వర్గము లభించును. ఈ రోజు తమ చేతులతో త్రవ్వు చెలిమ నీరు వారు పునరుత్థానమున త్రాగుదురు. ఇక్కడ స్వర్గమని గూడార్థము తెలుపబడినది. కేవలము అల్లాహ్ ప్రేమ పొందుటకు తాము వంటకాలను బీద సాదలకు, అనాథలకు, బందీలకు తినుపింతురు. ఇది కూడ వారి మేలు కొరకు కాదు కేవలము అల్లాహ్‌కు ప్రీతి పాత్రులగుటకు చేయుచున్నామని, అల్లాహ్ కొరకేనని మీతో మేము ఎట్టి ప్రతిఫలము కోరడము లేదని, మా గురించి కృతజ్ఞత తెలుపనవసరము లేదని వారందురు. నిజముగా సజ్జనులైన వారి గుణములివే. ఇతరులకు సహాయము చేయు మూడవ పద్ధతిని ఇది సూచించుచును. దీనిలో కేవలము సానుభూతి ప్రక్రియ జరుగును. నిజమైన సజ్జనులు అల్లాహ్ ప్రేమను సంపాదించుటకు తమకు సంబంధమున్న వారికి తమ ధనముతో సహాయము చేయుదురు. బీదలను ఆకలి బాధలతో తప్పించి, అనాథలను పోషించుటలో వారికి విద్యాబుద్ధులు నేర్పించటలో తమ ధనములో నుండి ఖర్చు చేయుదురు. ఇదే కాదు ప్రయాణికులకు అవసరమున్న వారికి సేవలు చేయుదురు. తమ ధనమును బానిసలను స్వతంత్రులు గావించుటలో ఋణగ్రస్తులకు విముక్తి కలిగించుటకు ఖర్చు చేయుదురు. తమ ఖర్చులు అతిగా గాని మితిగా గాని చేయక మధ్యే మార్గమున వలంభింతురు. అల్లాహ్‌కు భయపడుదురు. వారి ధనములో అవసరమున్న వారి, మాటలాడని వారి భాగము కూడా వుండును. అనగా కుక్కలు, పిల్లులు, పిట్టలు, ఎద్దులు, గాడిదలు మేకలు ఇతరములు. వారి కష్టములు,

ఇబ్బందులలోను, తక్కువ ఆదాయమైనను, క్షేమమునందును, వారు చేతనైనంతా దానములు, సహాయము చేయుటకు వెనుకాడరు. వారు గుప్తముగా, బహిర్గతముగాను దానములు చేయుచుందురు. కపటముతో రక్షించబడుటకు గుప్తముగా ఇతరులను ప్రోత్సహించుటకు బహిర్గతముగా దానములొనరింతురు. దానములు చేయునప్పుడు ముందు అవసరమున్న వారి అవసరాలను పూర్తి చేయవలెను. దుర్మార్గము నుండి తప్పించుటకు కూడ ధన భాగమును ఖర్చు చేయవచ్చును. బానిసలకు, ఋణగ్రస్తులకు విముక్తి కలిగించుటకు, కష్టములలో చిక్కుకొనిన వారిని ఆదుకొనుటకు తమ ధనమును వినియోగించవచ్చును. కేవలము అల్లాహ్ ప్రీతిని పొందుటకు ఇతరుల కార్యములలో తమ ధనమును వినియోగించవచ్చును. మానవాళి హితమును గోరి తమ ధనమును ఖర్చు చేయునంత వరకు మీరు వాస్తవ పుణ్యమును పొందలేరు. బీదలను సాదలను ఆదుకొనుము. ప్రయాణికులకు సేవలందించుము. వ్యసనముల నుండి తమను రక్షించుకొనుము. అనగా వివాహాది ఐశ్వర్య కార్యములలో, శిశు జన్మము నందు చేపట్టు పనికిరాని ఆచారములను పూర్తి చేయుటకు వినియోగించు పనికిరాని ఖర్చులతో తమను అదుపులో పెట్టుకొనుము. తమ తల్లిదండ్రులకు సేవలందించుము. సమీప బంధువులపై, అనాథలపై, బీదలపై తమ ఇరుగు పొరుగు వారిపై ప్రయాణికులపై తమ ఉద్యోగులపై, బానిసలపై అశ్వములు, మేకలు, చతుష్పాదములు, జంతువులపై తమ ధనమును ఖర్చు చేయుము. ఇట్టి అలవాటునే మీ అల్లాహ్ ఇష్టపడును. లోభితనమును బోధించువారిని, తమ ధనమును అనాథపై ఖర్చు చేయక మా వద్ద ఏమియును లేదని అనువారిని అల్లాహ్ ఇష్టపడడు, ప్రేమించడు.

# ధైర్యము

మానవుని సహజ నైతిక స్థితులలో ధైర్యమును పోలి వున్న స్థితి ఒకటి. ఆ శక్తి మూలముగనే శిశువు ఒకప్పుడు నిప్పులో కూడ చేయి పెట్టడానికి ఉపక్రమించును. దీనికి కారణము మానవుని సహజ నైతిక స్థితి నిర్భయము. ఈ స్థితిలో మానవుడు నిర్భయముగా పులులను, ఇతర మృగములను ఎదుర్కొనును. ఒక్కడే అనేకులను ఎదుర్కొనుటకు సన్నద్ధుడగును. అతనిని గొప్ప వీరుడని అందరు శ్లాఘింతురు. కాని అది ఒక సహజ విలువ మాత్రమే. ఇది మృగములలో నుండును. కుక్కలలో కూడ వుండును. సమయ సందర్భములలో చూపబడు ధైర్యము ఉత్తమ నైతిక స్థితులలోని ఒక స్థితి. వీటిని పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు తెలిపెను.

وَالصّٰبِرِيْنَ فِي الْبَاْسَآءِ وَالضَّرَّآءِ وَحِيْنَ الْبَاْسِ ؕ

(అల్ బఖరహ్ 2:178)

وَالَّذِيْنَ صَبَرُوا ابْتِغَآءَ وَجْهِ رَبِّهِمْ

(అర్రాద్ 13:23)

اَلَّذِيْنَ قَالَ لَهُمُ النَّاسُ اِنَّ النَّاسَ قَدْ جَمَعُوْا لَكُمْ فَاخْشَوْهُمْ
فَزَادَهُمْ اِيْمَانًا ۖۗ وَّقَالُوْا حَسْبُنَا اللّٰهُ وَنِعْمَ الْوَكِيْلُ

(ఆలె ఇమ్రాన్ 3:174)

وَلَا تَكُوْنُوْا كَالَّذِيْنَ خَرَجُوْا مِنْ دِيَارِهِمْ بَطَرًا وَّرِئَآءَ النَّاسِ

(అల్ అన్ఫాల్ 8:48)

అనగా యుద్ధ సమయమాసన్నమైనను, వారిపై ఏదేని ఆపద వచ్చినను భయపడి పరుగెత్తనివారు ధైర్యవంతులు. యుద్ధము, కష్టకాలములలో

వారి సహనము అల్లాహ్ కొరకే వుండును. అతని ప్రీతి కొరకే ప్రయత్నింతురు. కాని ధైర్య సాహసాలు చూపడానికి కాదు. అందరు ఏకమై మిమ్ము శిక్షించుటకు సిద్ధమైనారు కనుక మీరు భయపడుమని హెచ్చరించబడును. అప్పుడు ఈ భయపెట్టుట వలన వారి విశ్వాసము ఇంకను ధృఢమగును. అప్పుడు వారిట్లందురు. **"అల్లాహ్ మాకు చాలు"**. వీరి ధైర్యము, గుండె నిబ్బరము కేవలము మృగముల వలె సహజ ఉద్రేకమై వుండక తమలో ఉధ్భవించు సాహసమును ఎదుర్కొంటు సమయముపై పూర్తి సాహసముతో సత్యమును జయించుటకు శత్రువులపై దాడి సలుపుదురు. కాని స్వంత ధైర్యముపై ఆధారపడి కాదు. కేవలము అల్లాహ్‌పై వున్న విశ్వాసముతో ధైర్య సాహసములు చూపుదురు. వారి ధైర్య సాహసముతో ఎట్టి వ్యక్తిత్వము గాని కపటము గాని వుండదు. అల్లాహ్ ప్రీతి దృష్టియందుండును. అల్లాహ్ ప్రేమను పొందుటకే ముందుకు వత్తురు. ధైర్య సాహసములు సహనము, నిలకడపై ఆధారపడి వున్నదని ఈ సూక్తి యందు తెలుపబడినది. శత్రువుల వలె దాడి సలుపు ప్రతి కోపము ఉద్రేకము ఎదుర్కొనుటకు నిలకడగా వుండుట పిరికిపందల వలె వెనుదిరగక వుండుటయే ధైర్య సాహసము. కనుక మానవుని ధైర్య సాహసములలోను ఒక మృగము ధైర్య సాహసములలోను తేడా గలదు. మృగము ఒక కోణముతో ఉద్రేక ధైర్యమును భయంకరముగా ఉపయోగించును. కాని వాస్తవ ధైర్య సాహసము గల మానవుడు సమయ సందర్భానుసారముగా దానినెదుర్కొనును లేదా తప్పించుకొనును.

## సత్యము

మానవ సహజ స్థితులలో సత్యము ఒకటి. స్వార్థపరుడైనంత వరకు మానవుడు అబద్ధమాడగోరడు. అబద్ధమాడుటకు వెనుకాడును,

ఒప్పుకోడు. అందువలననే అబద్ధము నిరూపణ అయిన వానిని చూచి సంతసించును. అతనిని ఏవగించును. కాని కేవలము ఈ సహజ గుణము నైతిక విలువ నైతిక స్థితి అనబడదు. ఎందుకనగా దీనిని పిచ్చివారుగాని శిశువులు గాని అలవరచుకొనవచ్చును. స్వార్థమును వీడి దాని అడ్డంకులను ఎదుర్కొనునంత వరకు మానవుడు సత్యవాది కాలేడు. తమకు నష్టము కానప్పుడు సత్యమాడి తమ లాభము, గౌరవమునకు నష్టము వాటిల్లినప్పుడు సత్యమును వీడి అసత్యమాడినచో అతనికి, పిచ్చివారికి గాని, శిశువులకు గాని తేడా ఏమి? పిచ్చివారు గాని, యుక్తవయస్సు రాని వారు గాని ఈ విధమైన సత్యమాడరా? ప్రోద్బలము లేనిదే ఎవడు కూడ ప్రపంచమునందు అసత్యమాడడు. కనుక నష్టము కలిగినప్పుడు సత్యమును వీడుట వాస్తవముగా నైతిక విలువ కానేగాదు. తమ ప్రాణ, ధన, గౌరవమునకు నష్టము వాటిల్లునప్పుడే సత్యమాడు సమయ సందర్భమూ. దీనినే అల్లాహ్ ఈ విధముగా వక్కాణించెను.

فَاجْتَنِبُوا الرِّجْسَ مِنَ الْاَوْثَانِ وَاجْتَنِبُوْا قَوْلَ الزُّوْرِ

(అల్‌హజ్ 22:31)

وَلَا يَاْبَ الشُّهَدَآءُ اِذَا مَا دُعُوْا ؕ

(అల్ బఖరహ్ 2:283)

وَلَا تَكْتُمُوا الشَّهَادَةَ ؕ وَمَنْ يَّكْتُمْهَا فَاِنَّهٗٓ اٰثِمٌ قَلْبُهٗ ؕ

(అల్ బఖరహ్ 2:284)

وَاِذَا قُلْتُمْ فَاعْدِلُوْا وَلَوْ كَانَ ذَا قُرْبٰى ۚ

(అల్ అన్‌ఆమ్ 6:153)

كُوْنُوْا قَوّٰمِيْنَ بِالْقِسْطِ شُهَدَآءَ لِلّٰهِ وَلَوْ عَلٰٓى اَنْفُسِكُمْ اَوِالْوَالِدَيْنِ وَالْاَقْرَبِيْنَ ۚ

(అన్నిసా 4:136)

وَلَا يَجْرِمَنَّكُمْ شَنَاٰنُ قَوْمٍ عَلٰٓى اَلَّا تَعْدِلُوْا ؕ

(అల్ మాయిదహ్ 5:9)

وَالصّٰدِقِيْنَ وَالصّٰدِقٰتِ

(అల్ అహ్జాబ్ 33:36)

وَتَوَاصَوْا بِالْحَقِّ ۙ وَتَوَاصَوْا بِالصَّبْرِ ○

(అల్ అస్ర్ 103:4)

لَا يَشْهَدُوْنَ الزُّوْرَ ○

(అల్ ఫుర్ఖాన్ 25:73)

విగ్రహారాధన నుండి అబద్ధము నుండి తమను తప్పించుకొనుము. అబద్ధము ఒక విగ్రహము. దానిని నమ్మిన వాడు అల్లాహ్ పై నమ్మకము పెట్టలేడు. అబద్ధమాడినచో అల్లాహ్ దూరమగును. నిజసాక్ష్యమునకు పిలిచినపుడు నిరాకరించకుము. నిజసాక్ష్యమును దాచకుము. దాచినచో అతని హృదయము పాపముతో నిండిపోవును. మాటలాడవలసివచ్చినపుడు సమీప వ్యక్తి అయినను న్యాయ సమ్మతమైన సత్యమునే చెప్పండి. ప్రతి సాక్ష్యము అల్లాహ్ కొరకే వుండవలెను. అసత్యమాడకుము. తమ ప్రాణాలకు నష్టము కలిగినను, తల్లిదండ్రులకు హాని కలిగినను లేదా తమ పూర్తి సమీప బందువులనగా కూమార్తె, కుమారుడైనను సత్యమును వీడకుము. సత్యమాడినచో ఒక జాతి శత్రువగునని వెనుకాడకుము. సత్య స్త్రీ, పురుషులు గొప్ప ప్రతిఫలమును

పొందగలరు. ఇతరులను సత్యమాడుటకు ప్రోత్సహింతురు, బోధింతురు, అసత్యవాదులను తమ సభల లోనికి రానివ్వరు. ఇది వారి అలవాటు.

## సహనము

మానవుని సహజ అంశాలలో సహనమొకటి. కష్టనష్టములలో, సుఖ దుఃఖములలో, అపదలలో, రోగములు వచ్చినపుడు దీనిని అవలంబించ వలసి వుండును. ఆపదలు, బాధలు అనుభవించిన తరువాత మానవుడు సహనము వహించును. కాని అల్లాహ్ పవిత్ర గ్రంధము ప్రకారము ఇట్టి సహనము నైతిక స్థితి కానే కాదు. ఆపదలు సంభవించినపుడు దుఃఖములో మునిగితేలి అలసి ఉద్రేకము చల్లారిన తరువాత సహనము వహించును. కనుక ఇది మానవునిలో నుండు సహజ గుణములలో ఒక సహజ స్థితి.

ఈ రెండు చర్యలు కూడ సహజ స్థితులే. వీటితో నైతికమునకు సంబంధమే లేదు. తమ నుండి ఏదేని వస్తువు పోయినను, అది అల్లాహ్ ప్రసాదించినది తిరిగి అతని వద్దకే చేరినదని ఫిర్యాదు కూడ చేయనిచో ఆ సహనము నైతిక విలువగా పరగణింపబడును. ఈ నైతిక విలువను గురించి పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు బోధించును.

وَلَنَبْلُوَنَّكُمْ بِشَيْءٍ مِّنَ الْخَوْفِ وَالْجُوْعِ وَنَقْصٍ مِّنَ الْاَمْوَالِ
وَالْاَنْفُسِ وَالثَّمَرٰتِ ؕ وَبَشِّرِ الصّٰبِرِيْنَ ۙ الَّذِيْنَ اِذَآ اَصَابَتْهُمْ
مُّصِيْبَةٌ ۙ قَالُوْٓا اِنَّا لِلّٰهِ وَاِنَّآ اِلَيْهِ رٰجِعُوْنَ ؕ اُولٰٓئِكَ عَلَيْهِمْ صَلَوٰتٌ
مِّنْ رَّبِّهِمْ وَرَحْمَةٌ ۫ وَاُولٰٓئِكَ هُمُ الْمُهْتَدُوْنَ

(అల్ బఖరహ్ 2:156-158)

అనగా ఓ విశ్వాసులారా! భయంకర ఆపదలతో, భయముతో, ఆకలి బాధలతో, మీ ధన నష్టముతో, మీ ప్రాణ నష్టముతో మిమ్ములను మేము పరీక్షింతుము. ఒకప్పుడు మీ ప్రయత్నాలను వమ్ము చేసి మీ అంచనాలను తారు మారు చేసి, ఒకప్పుడు మీ సంతాన మరణముతో కూడ మిమ్ము పరీక్షింతుము. ఆపదలు, బాధలు కలిగినప్పుడు మేము అల్లాహ్ అధీనములో నున్నవారము. మా ప్రతి వస్తువు అతనిదే. కనుక అతనినే శరణమడుగుట ఉత్తమమని అనువారికి శుభములు కలుగును. వీరే అల్లాహ్ వరములకు వారసులు, అల్లాహ్ మార్గము పొందువారు.

ఈ విధమైన నైతిక విలువలను సహనము, అల్లాహ్‌తో రాజీ పడుట అందురు. దీనిని న్యాయమందురు. మానవుని జీవితాంతము సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతనికిష్టమగు వేల వరములు, లాభములు కలిగించును. వీటిని మానవుడు గణణ చేయలేడు. ఎప్పుడో ఒకప్పుడు అల్లాహ్ తాను కోరినట్లు చేసినప్పుడు మానవుడు అతనితో ఏకీభవించడు, ఏడ్చును. అపమార్గమునవలంభించును. ఇది అతనికి తగునా? న్యాయమా?

## మానవ జాతితో కనికరము

మానవ సహజ స్థితులలో అతనికనుకూలముగా వున్న సహజ స్థితి మానవాళికై సానుభూతి, జాతీయ అనురాగము ప్రతి ధర్మము వారి యందుండుట సహజాతము. తమ జాతి సానుభూతితో అనేకులు తరచుగా ఇతరులకు మానవులు కారనునట్లు అన్యాయము చేయుదురు. కనుక ఈ కృత్యమును నైతిక విలువగా పరిగణింపజాలము. ఇది కేవలము ఒక సహజ స్పందన మాత్రము. మనము ఈ గుణమును కాకులు, మొదలగు పక్షులలో చూచెదము. ఒక కాకి మరణించినచో కాకుల గుంపులు కూడి

సానుభూతి తెలుపును. ఈ సానుభూతి, కనికరము సమయ సందర్భముల యందు న్యాయ విచక్షణతో బయల్పడినప్పుడు అది నైతిక విలువ అనబడును. ఈ గొప్ప నైతిక విలువ అరబ్బి, పారశీకము నందు కూడ పేర్కొనబడినది. దీనినే అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ నందిట్లు తెలిపివున్నాడు.

تَعَاوَنُوْا عَلَى الْبِرِّ وَالتَّقْوٰى ۖ وَلَا تَعَاوَنُوْا عَلَى الْاِثْمِ وَالْعُدْوَانِ ۖ

(అల్ మాయిదహ్ 5:3)

وَلَا تَهِنُوْا فِي ابْتِغَآءِ الْقَوْمِ ؕ

(అన్నిసా 4:105)

وَلَا تَكُنْ لِّلْخَآئِنِيْنَ خَصِيْمًا

(అన్నిసా 4:106)

وَلَا تُجَادِلْ عَنِ الَّذِيْنَ يَخْتَانُوْنَ اَنْفُسَهُمْ ؕ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ مَنْ كَانَ خَوَّانًا اَثِيْمًا ○

(అన్నిసా 4:108)

తమ జాతితో సానుభూతి, కనికరము కేవలము మంచి పనులలో చూపవలెను. అన్యాయపు కార్యములలో ఎన్నడు సహకరించరాదు. జాతితో పూర్తిగా సహకరించి సానుభూతి చూపుము. అలసిపోయి వెనుకాడకుము. ద్రోహములో వెనుదిరుగని వారి వైపు నుండి జగడమాడకుము. అల్లాహ్ ద్రోహులను ప్రేమించడు.

## ఘనత గల ఒక జీవి పరిశోధన

మానవుని సహజ స్థితులలో ఒక ఉన్నత స్థితి గలిగిన, ఘనత గల జీవి అన్వేషణ స్వభావికముగా ఒకటి. దానికై మానవుని హృదయము

నందు ఒక ఆకర్షణ వుండును. ఈ పరిశోధనా గుణము శిశువు పుట్టుక నుండి వుండును. శిశువు జన్మించిన వెంటనే తల్లి వైపు ఆకర్షింపబడి ఆధ్యాత్మిక గుణమును చూపును. వాస్తవికముగా అతడు తల్లి మమత గలిగి వుండును. పెరిగిన కొద్ది ఈ స్వభావము అభివృద్ధి చెందును. దాగి వున్న ప్రేమ బాహ్య రూపము దాల్చును. అప్పుడు శిశువు తమ తల్లిని విడిచి ఎక్కువ సుఖము పొందలేడు. తల్లి ఒడిలోనే అతనికి సుఖము లభించును. తల్లితో వేరు చేయబడి దూరముంచినచో అతని సర్వ ఐశ్వర్యములు చేదగును. వరములు, వివిధ కానుకలు, స్వేచ్ఛ కల్పించినను వాస్తవ ఆనందము, తృప్తి తల్లి ఒడి యందే పొందును. ఆమెను విడిచి ఎట్టి శాంతిని పొందలేడు. తల్లితో ఆకర్షించబడు ఆ ప్రేమ, మమత ఏమిటి?

నిజమైన ఆరాధ్య దైవము కొరకు శిశువు స్వభావములో పెట్టబడిన ఆకర్షణ ఇదే. ప్రతి రంగమందు సత్సంబంధమేర్పరచుకొనునది ఈ ఆకర్షణయే. ప్రేమ జ్వాల పుట్టించునది కూడ ఈ ఆకర్షణ ఛాయలే. ఇతర వస్తువులలో పోగొట్టుకొనిన వస్తువును వెతుకుతున్నాడు. ఇప్పుడు దాని పేరు కూడ మరచిపోయివున్నాడు. మానవుడు ధనము, సంతానము, భార్యను ప్రేమించుట లేదా ఇంపైనా గానము వైపు ఆకర్షింపబడుట నిజానికి ఆ పోగొట్టు కొనిన వస్తువు అన్వేషణమే. కనులకు కనబడని అగ్ని వలె ప్రతి దాని యందు గుప్తముగా వుండి మానవుడు దానిని చూడలేడు. అసంపూర్ణమైన తెలివితో దానిని పొందలేడు. అతని అన్వేషణలో మానవుడు పొరపాటులలో చిక్కుకొని వున్నాడు. అందు వలననే అతని స్థానము ఇతరులకు నొసంగబడినది. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇట్లు విశదపరిచెను. ప్రపంచము ఒక గాజు భవనము వలె

నున్నది. దాని నేల కూడ గాజుతో చేయబడినది. దాని క్రింద వేగముగా ప్రవహించు నీరును విడువబడెను. గాజుపై దృష్టి పడినప్పుడు దానినే నీరనుకొనును. నీటిలో నడుచుటకు భయపడునట్లు మానవుడు భయపడును. నిజానికి అవి గాజులే. కాని అది నున్నగా మెరియుచుండును. కనుకనే మెరియుచున్న సూర్య చంద్రులు మొదలగు వస్తువులను ఆరాధించబడినది. వీటిలో గాజులోని నీటిని వేగముగా ప్రవహింపచేయు ఒక గొప్ప శక్తి పనిచేయుచున్నది. ఆ శక్తిని విగ్రహారాధకులు గాజులతో అంటగట్టి తప్పిదములో పడివున్నారు. ఈ సూక్తి దీనినే విశదపరచుచున్నది.

إِنَّهُ صَرْحٌ مُّمَرَّدٌ مِّن قَوَارِيرَ

(అన్నమల్ 27:45)

ప్రకాశించినను శక్తిమంతుడైన అల్లాహ్ గుప్తముగా నుండును. కనుక అతనిని గుర్తించుటకు మనకగుపడు శారీరక నిర్మాణము చాలదు. ఈ విధమైన పద్ధతిపై ఆధారపడినవారు వందలు. ఆశ్చర్యకరమైన రహస్యములు తమలో దాచుకొనిన దానిని కనుగొనుటకు భూమ్యా కాశములు గాలించిరి. అయినను అనుమానాలు, సంశయాలతో ముక్తి పొందలేక పోయిరి. ఎక్కువ మంది వివిధ అపమార్గములను అవలంభించి, మూఢ నమ్మకాలకు లోనై ఎక్కడో పడిపోయిరి. ఉత్తమమైన ఈ గొప్ప పద్ధతిని తిలకించి దీనిని పుట్టించువాడొకడు తప్పక గలడని వారూహించిరి. కాని వారి ఊహ, ఈ పరిజ్ఞానము అసంపూర్ణమైనది. ఎందుకనగా మొత్తము ప్రక్రియ కొరకు, ఒక సృష్టికర్త అవసరము అనునది, ఒక సృష్టికర్త గలడు అనుదానికి పొత్తు గలుపదు. చాలా తేడా గలదు.

వారనునది కేవలము వారి ఊహగానమే. వారి హృదయాలకు తృప్తి నొసంగలేదు. అనుమానాలను వారి హృదయముల నుండి పూర్తిగా తొలగించలేదు. మానవుని స్వభావికమైన దప్పికను ఇది ఆర్పలేదు. ఇట్టి జ్ఞానము అపాయకరమైనది. తంటాలు పడినను ఫలితము శూన్యం.

శక్తిమంతుడైన అల్లాహ్ తమ కార్యముతో తెలిపినట్లు, అతను తమ ఉనికిని తెలిపినంతవరకు కేవలము పనిని తిలకించుట తృప్తికరము కాదు. ఎట్లనగా ఒక గది. అది మూయబడినది. లోపలి నుండి తలుపులకు గొలుసులు బిగించివున్నవి. ఇది చూచినప్పుడు లోపల ఎవరో ఒకరున్నారని మనమూహింతుము. ఎందుకనగా బయటి నుండి గొలుసు బిగించుట అసాధ్యము. కాని ఒక సమయము వరకే కాదు సంవత్సరాల తరబడి పిలిచినప్పటికి లోపలి నుండి సమాధానము రానప్పుడు మన ఊహ మారిపోవును. అప్పుడు మనము లోపల ఎవరు లేరు. ఏదో ఒక పద్ధతితో తలుపుల గొలుసులు లోపలి నుండి వేయబడినవని ఊహింతుము. తమ జ్ఞానమును కేవలము అల్లాహ్ కార్యములను తిలకించు వరకే పరిమితము చేసిన తత్వవేత్తల స్థితి ఇదే. అల్లాహ్‌ను శవము వలె భావించి, అతనిని సమాధి నుండి తీయుట కేవలము మానవుని కార్యమేనని ఊహించుట గొప్ప తప్పిదము. అల్లాహ్ ఈ విధముగనే వుండినచో, మన ప్రయత్నాలే అతనిని గుర్తించినచో ఇట్లు అల్లాహ్‌పై ఆధారపడుట వ్యర్థమే అగును. వాస్తవమేమనగా అల్లాహ్ శాశ్వతముగా సదా నుండి వున్నవాడు. నేనున్నానని తెలుపుచు మానవులను తమ వైపు పిలుచుచునే వున్నాడు. అల్లాహ్‌ను గుర్తించుటలో మానవుని ఉపకారము గలదని తత్వవేత్తలు లేనిచో అల్లాహ్ తెలియకనే వుండునని భావించుట పొగరుబోతు తనమగును.

అల్లాహ్ ఎట్లు మాటలాడగలడు? అతనికి నాలుక గలదా? అని భావించుట కూడ తెలివి తక్కువదనము. శారీరక హస్తములు లేనిదే, అల్లాహ్ శారీరక అవయవములను, భూమిని సృష్టించలేదా? శారీరకములైన కన్నులు లేనిదే సర్వ ప్రపంచమును తిలకించడా? శారీరకములైన చెవులు లేనిదే మన పిలుపును వినడా? ఇవన్నియు సాధ్యమైనప్పుడు అతడు మనతో మాటలాడడా? పూర్వము అల్లాహ్ మాటలాడువాడు ఇప్పుడు మాటలాడడము కూడ అవాస్తవము. అతని సంబోధనను, మాటలాడడమును మేము ఒక కాలము వరకు పరిమితము చేయము. పూర్వముండునట్లు ఇప్పుడు కూడ తమను అన్వేషించు వారికి సువార్త ఊటలు ప్రవహింపచేయుటకు సిద్ధముగా నున్నాడు. పూర్వము వలె ఇప్పుడు కూడ అతని శుభములు, వరములు తలుపులు తెరిచే వున్నవి. అవసరాలు తీరిన తరువాత ధర్మచట్టాలు హద్దులు అంతమైనవి. సర్వ ప్రవక్తృత్వములు తమ ఔన్నత్యమును పొంది మన ప్రభువు పవిత్ర ప్రవక్త (అల్లాహ్ ఆశీస్సులు, శుభములు కలుగు గాక) ను చేరి సంపూర్ణత పొందినవి.

## పవిత్ర ప్రవక్త అరేబియాలో ప్రత్యక్షమగుటకు గల కారణములు

అరేబియాలో ఈ దివ్య ప్రకాశము ప్రత్యక్షమగుటలో వివేకము లేక పోలేదు. ఆ జాతి ఇస్మాయీల్ సంతతికి సంబంధము గలది. ఇస్రాయీల్ నుండి విడిపోయి, అల్లాహ్ ఇష్ట ప్రకారము ఫారాన్ ఎడారి ప్రాంతములో వేయబడెను. ఫారాన్ అనగా ఇద్దరు పారిపోవువారు. వారిని స్వయముగా అబ్రాహమ్ ఇస్రాయీల్ నుంచి విడదీసి వుంచెను. ఇస్‌హాఖ్

వారసులు కాలేరని వ్రాయబడినట్లు వారికి తౌరాత్ చట్టముతో ఎట్టి సంబంధము లేకుండెను.

వీరికి ఇతరులతో ఎట్టి సంబంధాలు లేకుండెను. ఇతరులు కూడ వీరితో ఎట్టి సంబంధములు పెట్టుకోలేదు. ఇతర దేశాలలో కనిపించు ఆరాధనా విధానాలు ఆ దేశ సూత్రాలను చూచి, ఆయా దేశాలలో అప్పుడప్పుడు సందేశహరులు, ప్రవక్తల ఆదేశాలు అక్కడికి చేరినవని తెలియుచున్నది. కాని ఇట్టి బోధలు గాని, ఆదేశాలు గాని అందని దేశము ఒకే ఒక అరేబియా దేశము. ఫలితముగా ఆ దేశము ప్రపంచములో వెనుకబడిన దేశముగా పరిగణింపబడెను. అంతములో ఈ దేశపు వంతు వచ్చినది. దీని ప్రవక్తృత్వము సర్వ సామాన్యమైనది. సర్వమునకు చెందినది. దీని ఫలితముగా సర్వ దేశాలు మరల శక్తిమంతమైన శుభములు పొందవచ్చును. వున్న లోపాలను వీడదీయును. మానవ సంస్కరణ సర్వకార్యములు నెరవేర్చు సంపూర్ణ గ్రంథము లభించిన తరువాత మరో గ్రంథము కొరకు ఎదురుచూచుట అవసరము లేదు. పూర్వపు గ్రంథముల వలె ఒక జాతితో సంబంధము పెట్టుకోక సర్వ జాతుల సంస్కరణ గోరి మానవ శిక్షణ పద్ధతులన్నియు వివరించెను. మానవత్వ విలువలు, నైతిక విలువలు అలవర్చుకొనునట్లు చేసెను. ఇట్టి పవిత్ర ఖుర్ఆన్ అందిన తరువాత మరో గ్రంథమవసరమా?

## ప్రపంచమునకు పవిత్ర ఖుర్ఆన్ చేసిన మేలు

పవిత్ర ఖుర్ఆన్ స్వాభావివక స్థితికి, నైతిక విలువలకు భేదము గలదని ప్రపంచమునకు తెలిపి మానవాళికి ఎంతో మేలు చేసినది. స్వాభావిక స్థితుల నుండి ఉత్తమ నైతిక విలువలందు కొనడమే గాక ఆధ్యాత్మిక స్థితులు పొందుటకు కూడ పవిత్ర మార్గముల ద్వారములు

తెరిచెను. తెరవడమే గాక లక్షల మందిని ఆస్థానమునకు చేర్చెను. ఇంతకు ముందు తెలిపిన విధముగా మూడు రకములైన బోధలను వివరించెను. ఎందుకనగా అది ధర్మ శిక్షణ అవసరాలను పూర్తి చేయునదై వున్నది. కనుకనే ఇది ఇట్లు ప్రకటించెను.

اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَاَتْمَمْتُ عَلَيْكُمْ نِعْمَتِيْ وَرَضِيْتُ لَكُمُ الْاِسْلَامَ دِيْنًا ؕ

(అల్ మాయిదహ్ 5:4)

ఈనాడు నేను మీ మతమును మీ కొరకు సమగ్రమొనర్చితిని. మీకు చేయవలసిన ఉపకారమునంతయు చేసితిని. ఇస్లామ్‌ను మీకు మతముగా ఎన్నుకొన్నాను. అనగా ధర్మ ఔన్నత్యము ఇస్లామ్‌లో గలదు. అనగా కేవలము అల్లాహ్‌కే అంకితము గావలెను. మరో పద్ధతితో గాక తమ త్యాగములోనే విముక్తి కోరుట. ఈ సంకల్పమును తమ కార్యములో చూపుట. శ్రేష్టత లభించునదిదే స్థితి. తత్వవేత్తలు గుర్తించిన అల్లాహ్‌ను తెలిసికొనుటకు పవిత్ర ఖుర్ఆన్ రెండు పద్ధతులను పొందుపరచినది. మొదటి దాని ద్వారా మానవ బుద్ధి వికసించి ప్రకాశించినందు వలన మానవుడు తప్పుల నుండి తమను తప్పించుకొనును. రెండవ ఆధ్యాత్మిక పద్ధతిని మూడవ ప్రశ్నకు సమాధానమునందు వివరించగలము.

## అల్లాహ్ ఉనికి నిదర్శనములు

అల్లాహ్ ఉనికిని గురించి పవిత్ర ఖుర్ఆన్ బుద్ధి సంబంధమైన ఉత్తమ దివ్యమైన నిదర్శనములు ఎట్లు తెలిపినదో చూడుము. ఒక చోట ఇట్లు ప్రకటించెను.

رَبُّنَا الَّذِیْٓ اَعْطٰی کُلَّ شَیْءٍ خَلْقَہٗ ثُمَّ ھَدٰی

(తాహా 20:51)

ప్రతి వస్తువునకవసరమైన హంగులతో పుట్టించి తమ అవసరాలను పూర్తి చేసుకొనుటకు మార్గము చూపిన వాడే అల్లాహ్.

ప్రతి వస్తువునకవసరమగు హంగులు నొసంగి పుట్టించిన వాడే అల్లాహ్. తమ అవసరాలను పూర్తి చేసుకొనుటకు దానికి మార్గము చూపిన వాడే అతడు. ఈ సూక్తిని దృష్టియందుంచుకొని మానవుని నుండి జలచర, జంతువుల, పక్షుల నిర్మాణమును చూచినచో అల్లాహ్ మహిమ, గొప్పదనము కాన వచ్చును. ప్రతి దాని నిర్మాణము దానికి తగ్గట్టు వుండునని ప్రతివాడు గ్రహించగలడు.

అల్లాహ్ ఉనికిని చాటు రెండవ నిదర్శనమును పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు చాటును.

وَاَنَّ اِلٰی رَبِّكَ الْمُنْتَھٰی

(అన్నజ్మ్ 53:43)

సర్వ కారణాలకు అంతము నీ ప్రభువే. మనము శ్రద్ధతో ఆలకించినచో ప్రపంచమంతయు కార్యము, ఫలితముపైనే ఆధారపడి వున్నది. ఈ కారణము వలననే ప్రపంచము నందు అనేక విద్యలుద్భవించినవి. ఒక ప్రాణి కూడ ఈ పద్ధతికి అతీతము గాదు. కొన్ని కొందరికి మూలములైనచో కొందరికి కొమ్మలుగా వున్నవి. కారణము స్వయముగా పుట్టును లేదా మరో కారణముపై ఆధారపడును. ఈ రెండవది మరో కారణముపై ఈ విధముగా ఈ పద్ధతి నడుచుచునే వుండును. దీని అంతము ఎక్కడో ఒక దానిపై అగునని నమ్ముట తప్పని సరి. కనుక దీని తుది

అంతమే అల్లాహ్ وَاَنَّ اِلٰى رَبِّكَ الْمُنْتَهٰى "వఅన్న ఇలా రబ్బికల్ ముంతహా" ఈ సూక్తిలో చాలా తక్కువ పదాలలో దీని నిదర్శనమును అల్లాహ్ ప్రకటించుచున్నాడో చూడుము. అనగా తుది నిర్ణయము నీ ప్రభువు చేతిలోనే గలదు.

మరో నిదర్శనము అల్లాహ్ ఇట్లు తెలిపెను.

لَا الشَّمْسُ يَنْۢبَغِيْ لَهَآ اَنْ تُدْرِكَ الْقَمَرَ وَلَا الَّيْلُ سَابِقُ النَّهَارِ ؕ وَكُلٌّ فِيْ فَلَكٍ يَّسْبَحُوْنَ

(యాసీన్ 36:41)

అనగా సూర్యుడు చంద్రున్ని పట్టుకోలేడు. చంద్రునికి ప్రతీక గల రాత్రి, సూర్యునికి ప్రతీక గల పగలును ఆక్రమించలేదు. అనగా ఏదియును తమ నిర్ణీత హద్దులను దాటేలదు. వీటిని తెలవితో నడిపించువాడు లేనిచో ఈ పద్ధతి మొత్తము చిందర వందర అగును. ఈ నిదర్శనము జ్యోతి శాస్త్రజ్ఞులకు చాలా ఉపయోగపడును. ఆకాశము నందు గల పెద్ద పెద్ద గోళాలు క్రమము దప్పినచో, లేదా కొంత అవకతవక అయినచో ప్రపంచమే నాశనము కాగలదు. చూడండి నిర్మాణ పద్ధతిని. ఇవి పరస్పరము ఢీకొనవు. వేగములో ఇసుమంత భేదముండదు. చాలా కాలము నుండి పని చేసినందులకు అరగనూ లేవు. వీటి భాగములలో కూడ ఎట్టి మార్పు రాలేదు. దీని వెనుక ఎవరో ఒకరు లేనప్పుడు ఈ మహత్తర పరిశ్రమను ఎవరు నడుపుచున్నారు. అనన్య సంవత్సరముల నుండి స్వయముగా ఎట్లు నడుచుచున్నది. శక్తిమంతుడగు అల్లాహ్ వీటి వైపు దృష్టిని మళ్ళించుచు మరో చోట పవిత్ర ఖుర్ఆన్ నందిట్లు నుడివెను.

اَفِی اللّٰہِ شَکٌّ فَاطِرِ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ

(ఇబ్రాహీమ్ 14:11)

ఈ విధమైన భూమ్యాకాశములను సృష్టించిన అల్లాహ్ ఉనికిని శంకించుట తగునా? మరొక నిదర్శనము నందు తమను ఇట్లు ప్రకటించెను.

کُلُّ مَنْ عَلَیْهَا فَانٍ ○ وَّیَبْقٰی وَجْهُ رَبِّكَ ذُو الْجَلٰلِ وَالْاِكْرَامِ ○

(అర్రహ్మాన్ 55:27,28)

ప్రతి వస్తువు అంతమగును. మిగులునది కేవలము గౌరవ మర్యాదలు గల అల్లాహ్ మాత్రమే.

భూమి తునాతునకలైనను ఆకాశము ముక్కలై వాటి రూపురేఖలను నాశనము చేయు గాలి వీచినను నాశనము కాని, మార్పు లేని మొదటి రూపము నందే గల ఒకటి గలదని అంతరాత్మ తప్పని సరిగా తెలుసు కొనును. నాశనమగు వాటిని పుట్టించినవాడు, తాను నాశనము కానివాడే అల్లాహ్. తమ ఉనికిని పవిత్ర ఖుర్ఆన్ నందిట్లు ప్రకటించెను.

اَلَسْتُ بِرَبِّكُمْ ؕ قَالُوْا بَلٰی

(అల్ ఆరాఫ్ 7:173)

అనగా నేను మీ ప్రభువు కానా? అని ఆత్మలను నేనడగినప్పుడు అవి ఇట్లనినవి. ఎందుకు గాదు, ఈ సూక్తి యందు ఆత్మల ప్రత్యేక గుణమును అల్లాహ్ వివరించుచున్నాడు. దానినతడే వాటియందుంచెను. దాని ప్రకారము ఏ ఆత్మ కూడ అల్లాహ్‌ను నిరాకరించలేదు. నిదర్శనము దొరకనందు వలననే అల్లాహ్‌ను నిరాకరించినను సృష్టిలోని ప్రతి దానిని సృష్టించిన వాడొకడు తప్పక వున్నాడని నమ్ముదురు. అస్వస్థత, కారణము లేనిదే ఏర్పడునని భావించు మంద బుద్ధి ప్రపంచమందుండదు. కారణము

దాని ప్రభావమే ప్రపంచములో లేనిచో ముందే తుఫానుగాని, గాలి వాన గాని, చంద్ర సూర్య గ్రహణములు గాని సంభవించునని, ఈ రోగము వలన ఈ రోగము వచ్చునని గాని, రోగిష్టి ఇంత సమయము వరకు జీవించునని గాని సూచించుట అసాధ్యమయ్యేది. ఇట్టి పరిశోధకుడు అల్లాహ్ ఉనికిని గుర్తించడు. కాని ఒక విధముగా కార్యముల ఫలితాల కారణముల అన్వేషణలో నుండి గుర్తించినట్లే గదా! కనుక ఇది సంపూర్ణము కాకపోయినా, ఒక విధమైన స్వీకృతే గదా! అల్లాహ్ ఉనికిని గుర్తించని ఒక వ్యక్తి ఏదో ఒక విధముగా స్పృహ తప్పిపోయి తనలో నుండి భావము, తలంపులకు, ఉత్సాహములకు దూరమై తన జీవితమును మరిచి పోయి అల్లాహ్ అధీనమైనచో అతడు తప్పక అల్లాహ్ ఉనికిని స్వీకరించునే కాని నిరాకరించడు. ఇది గొప్ప నిపుణుల ప్రయోగముల ద్వారా స్పష్టమైన విషయము. ఇట్టి స్థితిని ఈ సూక్తి తెలుపుచున్నది. అనగా అల్లాహ్ నిరాకరణ కేవలము ఈ భూ జీవితమునకే పరిమితమైనది. స్వాభావికముగా స్వకృతి గుణమే వుండును.

## అల్లాహ్ స్వభావము

అల్లాహ్ ఉనికికి సాక్ష్యాధారాలు కొన్ని వ్రాసినాము. పవిత్ర ఖుర్ఆన్ చూపిన అల్లాహ్ స్వభావమును తెలుసుకొనుట కూడ అవసరము. కనుక అది ఈ విధముగా అల్లాహ్ గుణాలను స్వభావములను చాటుచున్నది.

هُوَ اللّٰهُ الَّذِىۡ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ‌ۚ عٰلِمُ الۡغَيۡبِ وَ الشَّهَادَةِ‌ۚ هُوَ الرَّحۡمٰنُ الرَّحِيۡمُ

(అల్ హశ్ర్ 59:23)

مٰلِكِ يَوْمِ الدِّيْنِ

(అల్ ఫాతిహా 1:4)

اَلْمَلِكُ الْقُدُّوْسُ السَّلٰمُ الْمُؤْمِنُ الْمُهَيْمِنُ الْعَزِيْزُ
الْجَبَّارُ الْمُتَكَبِّرُ ؕ

(అల్ హశ్ర్ 59:24)

هُوَ اللّٰهُ الْخَالِقُ الْبَارِئُ الْمُصَوِّرُ لَهُ الْاَسْمَآءُ الْحُسْنٰى ؕ يُسَبِّحُ لَهٗ مَا فِي
السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ

(అల్ హశ్ర్ 59:25)

عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ

(అల్ బఖరహ్ 2:21)

رَبِّ الْعٰلَمِيْنَ ۙ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۙ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○

(అల్ ఫాతిహా 1:2–4)

اُجِيْبُ دَعْوَةَ الدَّاعِ اِذَا دَعَانِ ۙ

(అల్ బఖరహ్ 2:187)

اَلْحَيُّ الْقَيُّوْمُ

(అల్ బఖరహ్ 2:256)

قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ ۚ اَللّٰهُ الصَّمَدُ ۚ لَمْ يَلِدْ ۙ وَلَمْ يُوْلَدْ ۙ وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ ۚ

(అల్ ఇఖ్లాస్ 112:2-6)

అనగా అల్లాహ్ ఒక్కడే. అతనికి భాగస్వామి ఎవరు లేరు. అతనికి తప్ప ఆరాధ్య దైవము గాని, విధేయత తెలుపవలసిన వారు గాని లేడు. అతనికి భాగస్వామి వున్నచో శత్రువు బలము అతనిని వశపరచుకొనునని సృష్టికర్త అపాయములో పడునని తెలుపనైనది. అతడు తప్ప మరో ఆరాధ్య దైవము లేదు. అనగా ఆ సంపూర్ణమైన ఉన్నతమైన అల్లాహ్ గుణములు, స్వభావము, విశేషముగా అత్యుత్తమమైనవి. సృష్టియందుండి దైవమును గుణములను బట్టి ఎన్నుకొనదలచిన లేక ఉన్నతమైన, ఉచ్చకోటి గుణములు. స్వభావము గల దానిని ఊహించినను అతడు అందరిలో ఉన్నతుడుగా గోచరించును. ఉన్నతుడైన అల్లాహ్ ఆరాధనలో మరొకనిని భాగస్వామిగా చేయుట అన్యాయము. కనబడనివన్నియు అతడు ఎరుగును. అనగా తనను తానే ఎరుగును. ఎవరు కూడ అతనిని ఊహించలేరు. ఉనికిని తెలుపలేరు. మనము సూర్య చంద్రాదులను, ప్రతి ప్రాణిని చూడవచ్చును. కాని అతనిని చూడలేము. అతడు సర్వము చూడును. అనగా అతడు ప్రపంచము నందున్న ప్రతి దానిని చూడును. అతనికి మరుగున వున్నది ఏదియును లేదు. అల్లాహ్ అయికూడ వస్తువులను గుర్తెరగనిచో అతనికిది తగదు. ప్రపంచ అణువణువును అతడు తమ దృష్టియందుంచును. కాని మానవుడు పెట్టలేడు. ఎప్పుడు ఈ పద్ధతిని సమాప్తించేది. పునరుత్థాన దినమెప్పుడొచ్చేది అతనికి తెలుసు. అతనికి తప్ప మరెవరు ఇట్లెప్పుడగునో ఎరుగరు. కనుక ఈ సర్వ సమయాలను

ఎరుగువాడే అల్లాహ్. తరువాత అతడే అనుగ్రహి అనెను. అనగా ప్రాణాల ఉనికిని వారి కార్యాల కంటే ముందు స్వార్థముతో గాని, కార్య ఫలితముగా గాని గాక కేవలము తమ అనుగ్రహము, కనికరముతో వారి కొరకు సౌకర్యములు సమకూర్చెను. ఎట్లనగా మా కార్యముల కంటే ముందు మన కొరకు భూమి, సూర్యుణ్ణి, ఇతర వస్తువులను సృష్టించెను. ఈ కానుకను అల్లాహ్ గ్రంథము పవిత్ర ఖుర్ఆన్ రహమానియ్యత్‌గా పేర్కొనెను. ఈ కార్యాన్ని బట్టి అల్లాహ్ రహమాన్ అనబడును. తరువాత ఇట్లు నుడివెను. అర్రహీమ్ అనగా ఆ అల్లాహ్ పుణ్య కార్యములకు పవిత్ర ఫలితమొసంగును. ఎవరి కష్టమును కూడ వ్యర్థము పోనియ్యడు. కనుక అతడు రహీమ్ అనబడును. ఈ గుణమును రహీమియ్యత్ అను పేరుతో పిలువబడును. తరువాత "మాలికి యౌమిద్దీన్" అనెను. అనగా న్యాయ దినమునకు అధినేత. ప్రతి వాని ఫలితము తాను స్వయముగా నొసంగును. భూమ్యాకాశముల ప్రభుత్వము అతడు ఎవరికి నొసంగలేదు. తానేమియు చేయక తమ కార్యకర్తలపై భారము వేసి వేరొక చోట విశ్రాంతిగా కూర్చోలేదు. పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు ప్రకటించెను.

اَلْمَلِكُ الْقُدُّوْسُ

(అల్ హశ్ర్ 59:24)

అనగా అల్లాహ్ చక్రవర్తి. అతనియందెట్టి లోపము లేదు. కాని మానవ రాజకీయములో లోపము లేనిది లేదు. ఉదాహరణకు మొత్తము ప్రజలు దేశము నుండి ప్రస్థానము చేసి మరొక దేశమువైపు పలాయనమైనచో రాజరికమే లేదు. లేదా క్షామమేర్పడి ప్రజలు హాహాకారము చేసినప్పుడు ప్రభుత్వ ఆదాయమెక్కడిది. లేదా మా కంటే నీలో అధికముగా నున్నదేమిటి? అని ప్రజలు వాదించినచో తన యోగ్యతనెట్లు ఋజువు

చేయగలడు. కనుక అల్లాహ్ ప్రభుత్వము ఈ విధమైనది కాదు. అతడు ఒకే క్షణములో మొత్తం దేశమును నాశనము చేసి వారి స్థానములో మరో ప్రాణులను పుట్టించగలడు. అతడు ఇట్టి సృష్టికర్త కానిచో అన్యాయమే అతని ప్రభుత్వ లక్ష్యమయ్యేది. ఎందుకనగా ప్రపంచమును ఒక పర్యాయము క్షమించి, విముక్తి నొసంగి మరల మరో ప్రపంచమెక్కడి నుండి తెచ్చేవాడు. మోక్షము పొందిన వారిని జగత్తు నందు పంపుటకు మరల పుట్టే వాడా? అన్యాయ మార్గముతో తాను ఒసంగిన క్షమాపణను, మోక్షమును తిరిగి తీసుకొనువాడా? ఇట్లు చేసినచో అతని దైవత్వములో తేడా ఏర్పడేది. ప్రపంచ రాజుల వలె ఒక లోప భూయిష్ట రాజుగా వుండేవాడు. వారు ప్రపంచము కొరకు శాసనాలు చేసి తమ స్వార్థము కొరకు అన్యాయము చేయవలసి వచ్చిన వెనుకాడరు. అన్యాయమును తమ జన్మహక్కుగా భావిస్తారు. ఒక ఓడను రక్షంచుట కొరకు ఒక పడవలో వున్నవారిని నాశనము చేయుట రాజకీయ శాసములో న్యాయమే గదా? కాని అల్లాహ్‌కు అట్టి నిర్బంధమేదియును లేదు. కనుక అల్లాహ్ సృష్టికర్తగా లేనిచో, ఏదియును పుట్టించువాడు కాడు. అల్లాహ్ ఇటులనే వున్నచో అతడు బలహీన రాజుల వలె న్యాయము విడచి అన్యాయము చేసి వుండేవాడు. లేదా న్యాయాన్ని పాటించి దైవత్వాన్ని వదిలి వుండేవాడు. కాని అల్లాహ్ ఓడ సర్వశక్తులతో న్యాయముగా నిరంతరముగా ప్రయాణించుచున్నది. తరువాత ఇట్లు నుడివెను.

"అస్సలాము" اَلسَّلٰمُ అనగా సర్వలోపాలకు బాధలకు కాఠిన్యములకు అతీతుడు. శాంతి నొసంగువాడే అల్లాహ్. అతడే బాధలకు గురైనచో మానవులచే చంపబడినచో తమ సంకల్పములలో విఫలమై వుండినచో హృదయాలు తృప్తి చెందేవా? ఇట్టి అల్లాహ్ మమ్ములను తప్పక

ఆపదలకే గురి చేయును గాని రక్షించలేడని భావించువారు. అందుకే అల్లాహ్ అసత్య దేవుళ్ళను గురించి ఇట్లు నుడివెను.

اِنَّ الَّذِيْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ لَنْ يَّخْلُقُوْا ذُبَابًا وَّلَوِ اجْتَمَعُوْا لَهٗ ؕ وَاِنْ يَّسْلُبْهُمُ الذُّبَابُ شَيْـًٔا لَّا يَسْتَنْقِذُوْهُ مِنْهُ ؕ ضَعُفَ الطَّالِبُ وَالْمَطْلُوْبُ ○ مَا قَدَرُوا اللّٰهَ حَقَّ قَدْرِهٖ ؕ اِنَّ اللّٰهَ لَقَوِيٌّ عَزِيْزٌ ○

(అల్ హజ్ 22:74,75)

మీరెవరిని దేవుళ్ళుగా చేసికొనినారో వారందరు ఒకరి కొరకు సహాయము చేసికొనినను, ఒక ఈగను కూడ ఎప్పుడు సృష్టించలేరు. మరి ముందున్న ఏదేని వస్తువును ఈగ గొనిపోయినచో దాని నుండి ఆ వస్తువు తీసికొను శక్తి కూడ వారికి లేదు. వారిని పూజించువారు బుద్ధిహీనులు. వారు శక్తి లేని వారు. అల్లాహ్ ఇట్లుండునా? శక్తిమంతులలో అధిక శక్తిమంతుడు. అందరిని వశపరచుకొనువాడు అల్లాహ్ అతనినెవరు పట్టలేరు. అల్లాహ్ ఎట్లుండవలెనో కూడ వారెరుగరు. శాంతిని ప్రసాదించువాడు తమ కనికరమునకు, మహిమలకు నిదర్శనములు తెలుపువాడు అల్లాహ్ అని తెలుపబడెను. నిజమైన దేవుడిని నమ్మినవాడు సమావేశాలలో గాని, సంఘములో గాని కలవరబడి ఇబ్బందులకు గురికాడు. అల్లాహ్ సన్నిధిలో కూడ పశ్చాత్తాపబడడు. ఎందుకనగా వారి వద్ద బలమైన సాక్ష్యాధారాలుండును. కాని కృత్రిమ దేవుణ్ణి నమ్మువాడు ఇబ్బందులకు గురై సాక్ష్యాలు ప్రవేశ పెట్టే బదులు పరిహాసము నుండి తప్పించుకొనుటకు ఒక తప్పుడు, పనికిరాని దానిని గుప్తముగా బెట్టుటకు

ప్రయత్నించును.

الْمُهَيْمِنُ الْعَزِيْزُ الْجَبَّارُ الْمُتَكَبِّرُ ۭ

(అల్ హశ్ర్ 59:24)

అతడందరిని కాపాడును, సంరక్షకుడు, సర్వాధికారి, అవక తవక కార్యములను సవరించును. సంపూర్ణ స్వయంభువు అతడే.

هُوَ اللّٰهُ الْخَالِقُ الْبَارِئُ الْمُصَوِّرُ لَهُ الْاَسْمَاۗءُ الْحُسْنٰى ۭ

(అల్ హశ్ర్ 59:25)

అనగా శరీరములనే గాక ఆత్మలను సృష్టించునట్టి వాడు అల్లాహ్. గర్భము నందు రూపకల్పన చేయువాడతడే. సర్వపుణ్య నామములు అతనివే.

يُسَبِّحُ لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ

(అల్‌హశ్ర్ 59:25)

అనగా ఆకాశవాసులే గాక, భూవాసులు కూడ అతని నామమును గౌరవముతో తీసికొందురు. ఈ సూక్తి ద్వారా ఆకాశము నందు కూడ నివసించువారు గలరని, వారు కూడ అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడి వున్నారని తెలియుచున్నది.

عَلٰي كُلِّ شَيْءٍ قَدِيْرٌ

(అల్ బఖరహ్ 2:20)

అనగా అల్లాహ్ సర్వాధికారి, అతనిని నమ్మనవారి కొరకిది తృప్తి, లేనిచో వారు అతనితో ఆశించేదేమిటి? తరువాత ఇట్లనెను.

رَبِّ الْعٰلَمِيْنَ ۝ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۝

(అల్ ఫాతిహా 1:2-4)

أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ

(అల్ బఖరహ్ 2:187)

అనగా సర్వలోకాల సంరక్షకుడు, న్యాయ నిర్ణయ దినమునకు అధినేత. ఈ అధికారము మరెవరికి హస్తగతము చేయలేదు. ప్రతి వాని పిలుపును వినువాడు సమాధానమిచ్చువాడు, ప్రార్థనలను స్వీకరించువాడతడే అనబడెను.

اَلْحَيُّ الْقَيُّوْمُ

(అల్ బఖరహ్ 2:256)

అనగా శాశ్వతముగా వుండువాడు. సర్వ ప్రాణులకు ప్రాణం. అన్నిటికి ఆధారమతడే. అతడు శాశ్వతముగా వుండనిచో అతని జీవితకాలము తెలియక మన కంటే ముందే గడిచిపోవునని, భయమేర్పడునని ఈ విధముగా తెలుపబడినది. ఆ దేవుడు ఏకైక దేవుడని, అతడు ఎవరి కుమారుడు కాడని, అతనికి కుమారుడు లేడని, అతనికి ఎవరు సమానులు కారని, అతని వలె మరెవరు లేరని తెలుపబడినది.

అల్లాహ్ ఏకత్వమును సరియైన పద్ధతిలో నమ్ముట, దానిని అతిక్రమించ కూడదని జ్ఞప్తియందుండవలెను. తన సృష్టికర్తతో మానవుడు చేసే న్యాయమిది. ఇదంతయు పవిత్ర ఖుర్ఆన్ నందు గల నీతి బోధ. ఈ సిద్ధాంతము నందు అల్లాహ్ మొత్తము నీతి ధర్మములను తమ హద్దులు మీరకుండ, అటు ఇటు కాకుండ పొందుపరచి వున్నాడు. అనగా రెండు హద్దుల మధ్య నున్నదే మంచిది. మధ్యకు గొనిపోవు, స్థిరపడు ప్రతి అలవాటు ఉచిత నైతికమును పుట్టించును. సమయ సందర్భములను గుర్తెరుగుట ఒక మధ్యమము. ఒక వ్యవసాయదారుడు సమయమునకు

ముందుగాని తరువాత గాని బీజము నాటినచో అతడు మధ్యమును వీడును. నీతి, సత్యము వివేకము అన్నియు మధ్యముతో నున్న మధ్య సమయ సందర్భము గలదు. మరో విధముగా వివరించవలెనని సత్యము, సదా రెండు అసత్యుల మధ్య గలదు. సమయ సందర్భము సదా మానవునికి మధ్యలో పెట్టుననుటలో సందేహము లేదు. అల్లాహ్ స్వభావమును అతనిని నిరాకరించు లేదా లేడని గాని, అల్లాహ్ శారీరక వస్తువులను పోలి వుండునని గాని, వివరించక మధ్య మార్గమును పయోగించినప్పుడే అల్లాహ్‌ను గుర్తెరుగవచ్చును. ఈ పద్ధతినే పవిత్ర ఖుర్ఆన్ అల్లాహ్ స్వభావమును వివరించునప్పుడు అవలంభించినది. కనుక అది, అల్లాహ్ వినును, చూచును, ఎరుగును, పలుకును, మాటలాడునని తెలిసినది. ప్రాణుల పోలిక నుండి కాపాడుటకు ఇదియునను.

لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ

(అశ్శూరా 42:12)

فَلَا تَضْرِبُوا لِلَّهِ الْأَمْثَالَ

(అన్నహ్‌ల్ 16:75)

అనగా అల్లాహ్‌కు వ్యక్తిగతముగా గాని, స్వభావములో గాని ఎవరు సమానులు గారు. కనుక దీని కొరకు ప్రాణుల నుండి కట్టుకథలు అల్లకుము. అనగా అల్లాహ్‌ను పోల్చినప్పుడు గాని.

అల్లాహ్ పోలిక శ్రేష్టత రెండింటి మధ్య నుండుటే మధ్యమన బడును. ఇస్లామ్ సర్వబోధలు ఈ మధ్య పద్ధతినే కలిగివున్నవి. ఫాతిహా అధ్యాయము కూడ ఈ మధ్యే మార్గమునే బోధించినది. కనుక అల్లాహ్ ఇట్లు నుడివెను.

غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ

(అల్ ఫాతిహా 1:7)

అనగా అక్రమ అన్యాయ పద్ధతులనుపయోగించి దుర్మార్గమున నుసరించుచు అల్లాహ్‌ను ఎదురించువారు చుతష్పాదముల వలె వ్యవహరించు వారు. اَنْعَمْتَ عَلَيْهِمْ అల్లాహ్ అనుగ్రహించిన వారు మధ్యే మార్గమునవ లంభింతురు. మొత్తముపై పవిత్ర ఖుర్ఆన్ మధ్యే మార్గమునుపదేశించును. తౌరాత్‌లో అల్లాహ్ ప్రతీకారమునపదేశించును. బైబిల్ మన్నించుటకు, క్షమించుటకు. బోధించి వుండెను. కాని ముస్లిములను సమయ సందర్భము ప్రకారము మధ్యే మార్గమున వలంభించుటకు బోధించెను. కనుకనే అల్లాహ్ ఇట్లు ఆదేశించెను.

وَكَذٰلِكَ جَعَلْنٰكُمْ اُمَّةً وَّسَطًا

(అల్ బఖరహ్ 2:144)

మేము మిమ్ములను మధ్యే మార్గమునవలంభించు వారిగా సృష్టించి, మిమ్ము మధ్యే మార్గపు బోధను ప్రసాదించితిమి. కనుక ఎప్పుడు మధ్యే మార్గమునవలంభించు వారు ధన్యులు.

خَيْرُ الْاُمُوْرِ اَوْسَطُهَا

(తఫ్సీర్ ఖుర్తబీ భాగము 2 పుట 154)

అనగా మధ్యే మార్గము అన్నిటికంటే శ్రేష్టమైనది.

## ఆధ్యాత్మిక స్థితులు

**మూడవ భాగము:–** ఆధ్యాత్మిక స్థితులనగానేమి? పవిత్ర ఖుర్ఆన్ ప్రకారము ఆధ్యాత్మిక స్థితుల మూలము శాంతచిత్తమైన, ఆత్మనని, మేము ముందే వివరించి వున్నాము. మానవునికి నైతిక స్థితి

నుండి దైవ భక్తి గల వానిగా మార్చేది కూడ ఇదే. దానిని మహిమవంతుడైన అల్లాహ్ ఇట్లు నుడివెను.

يَآ أَيَّتُهَا النَّفْسُ الْمُطْمَئِنَّةُ ۝ ارْجِعِي إِلَىٰ رَبِّكِ رَاضِيَةً مَّرْضِيَّةً ۝
فَادْخُلِي فِي عِبَادِي ۝ وَادْخُلِي جَنَّتِي ۝

(అల్ ఫజ్ర్ 89:28-31)

అల్లాహ్‌తో విశ్రాంతి పొందిన ఓ ఆత్మ! తమ ప్రభువు వైపు తిరిగిరా! అతడు నిన్ను ఇష్టపడును. నీవు అతనిని ఇష్టపడుదువు. కనుక నా దాసులలో చేరిపొమ్ము! నా స్వర్గమునకు రమ్ము! ఈ జీవితపు సర్వ సుఖములు అల్లాహ్‌లోనే గలవని, తృప్తిపడడము మానవుని ఉత్తమ ఆధ్యాత్మిక స్థితి అని జ్ఞప్తియందుంచుకొనవలెను. ఈ స్థితినే స్వర్గ జీవితమని అందురు. ఈ స్థితి యందు మానవుడు నిష్కపటము, పవిత్రత, విశ్వాస, ఫలితముగా స్వర్గమును పొందును. ఇతరుల దృష్టి లభించు స్వర్గము వైపుండును. ఈ స్థితి యందు మానవుడు తమపై వేయబడిన ఆరాధనా భారము నిజముగా ఆత్మ అభివృద్ధి చెందుటకు, అవసరమని ఆధ్యాత్మిక జీవితమునకు కేంద్రమని, దీని ఫలితము మరో లోకమునకు సంబంధించినది కాదని తెలిసికొనుము. ఈ స్థానమందే మానవుని నిందించు ఆత్మ అతని అపవిత్ర జీవితమును నిందించినను మంచి కోరికలను పూర్తిగా పురిగొల్పలేడు. చెడు కోరికల యడ ఏవగింపును పుట్టించలేదు. మంచినవలంభించు సంపూర్ణ శక్తిని కూడ నొసంగ లేదని తెలియును. ఫలితముగా తృప్తి పడిన ఆత్మాభివృద్ధినారంభమగును. ఈ స్థితి నందుకొనినప్పుడు మానవుడు సంపూర్ణ అభ్యుదయ అర్హతను పొందును. అప్పుడు కామ ఉద్రేకములన్నియు వాటికంతట అవే రూపు

మాపుటనారంభించును. ఫలితముగా మానవుడు తమ పూర్వపు బలహీనతలను ఏవగింపుగా చూచి పశ్చత్తాపపడును. అప్పుడు మానవుని యందు ఒక విప్లవమేర్పడి అలవాట్లలో ఒక గొప్ప మార్పు వచ్చును. తమ పూర్వపు స్థితి నుండి మానవుడు చాలా దూరమగును. శుభ్రపరచబడి పరిశుద్ధము చేయబడును. అల్లాహ్ తమ చేతితో అతని హృదయములో పుణ్య ప్రేమను వ్రాయును. దుష్టత్వ మలినమును తమ చేతులతో అతని హృదయము నుండి తీసివేయును. సత్యసైన్య మంతయు హృదయము నందు ప్రవేశించును. హృదయ దుర్గమును సత్యమునాక్రమించుకొనును. సత్యము జయించును. అసత్యము తమ ఆయుధాలు వదలి పలాయనమగును. ఆ వ్యక్తి హృదయముపై అల్లాహ్ హస్తముండును. ప్రతి అడుగు అల్లాహ్ ఛాయలో వేయును, నడుచును. కనుక అల్లాహ్ క్రింది సూక్తులలో ఈ విషయమును స్పష్టపరచివున్నాడు.

أُولَٰئِكَ كَتَبَ فِي قُلُوبِهِمُ الْإِيمَانَ وَأَيَّدَهُم بِرُوحٍ مِّنْهُ

(అల్ ముజాదిలహ్ 58:23)

حَبَّبَ إِلَيْكُمُ الْإِيمَانَ وَزَيَّنَهُ فِي قُلُوبِكُمْ وَكَرَّهَ إِلَيْكُمُ الْكُفْرَ وَالْفُسُوقَ وَالْعِصْيَانَ ۚ أُولَٰئِكَ هُمُ الرَّاشِدُونَ ۝ فَضْلًا مِّنَ اللَّهِ وَنِعْمَةً ۚ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ۝

(అల్ హుజురాత్ 49:8,9)

جَاءَ الْحَقُّ وَزَهَقَ الْبَاطِلُ ۚ إِنَّ الْبَاطِلَ كَانَ زَهُوقًا

(బనీ ఇస్రాయీల్ 17:82)

అనగా విశ్వాసుల హృదయములలో విశ్వాసమును అల్లాహ్ తమ

చేతులతో వ్రాసెను. పవిత్రాత్మతో వారికి సహాయపడెను. ఓ విశ్వాసులారా! విశ్వాసమును మీకు ప్రీతిగావించెను. దాని సౌందర్యమును మీ హృదయమునందు నింపెను. అవిశ్వాసము, దుష్టత్వము అవిధేయత, దుష్ప్రవర్తన పట్ల మీ హృదయములో ఏవగింపు పుట్టించెను. ఇదంతయు అల్లాహ్ అనుగ్రహ అభిమాన ఫలితము. సత్యము వచ్చెను. అసత్యము పలాయనమయ్యెను. అసత్యము సత్యము ముందు ఎప్పుడు ఆగును?

మానవునికి కలుగు మూడవ ఆధ్యాత్మిక స్థానమునకు సంబంధించిన సంకేతములివి. ఈ స్థితి లభించు నంతవరకు మానవునికి సత్యమైన అంతర్ దృష్టి కలుగదు. నేను విశ్వాసము వారి హృయదములో తమ చేతులతో వ్రాయుదుననునది. పవిత్రాత్మతో వారికి సహాయ పడితినను, అల్లాహ్ అనునది, మానవునికి ఆకాశ సహాయములందు వరకు అతనిలో పరిశుభ్రత పవిత్రత ఏర్పడదు. తమను నిందించు స్థాయి నందుకొనిన స్థితిలో మానవుడు మాటి మాటికి పశ్చత్తాపపడుచు అనేక సార్లు క్రిందపడును. అంతే గాదు కొన్ని సమయాల్లో తమ అర్హత చూచి నిరాశపడును. తమ రోగమును నివారించబడదని భావించును. ఒక సమయము వరకు ఆ విధముగనే వుండును. కాని నిర్ణయ కాలము పూర్తి అయిన తరువాత రాత్రికో, పగటిపూటనో, ఒక కాంతి అతనిపై దిగును. ఆ కాంతిలో దైవ శక్తి వుండును. ఈ కాంతి దిగిన వెంటనే అతనిలో ఒక అద్భుత మార్పు కలుగును. పరోక్ష సహాయము అందునట్లు అనుభూతి కలుగును. ఒక అద్భుత ప్రపంచము కన్నుల ముందు కానవచ్చును. అప్పుడు మానవునికి అల్లాహ్ గలడని తెలియును. ఇంత వరకు లేని కాంతి కన్నులలో మెదులును. కాని ఈ మార్గాన్వేషణ ఈ కాంతిని పొందుటెట్లు? ప్రతి కదలిక కొరకు ఒక కారణము. ప్రతి

కార్యమునకు ఒక ఫలము, ఒక జ్ఞాన సముపార్జన కొరకు ఒక మార్గము గలదు. దీనినే సరళమైన మార్గమందురు. అనగా కారణము లేనిది ఏమియును ప్రపంచము నందు లేదని తెలిసికొనవలెను. ప్రకృతి ఆరంభమున నిర్ణయించిన నియమములను అనుసరించనిదే ప్రపంచము నందు వస్తువు లభించదు. ప్రతి దానిని పొందుటకు ఒక సరళమైన మార్గము గలదని దానిపైనే ఆధారము గలదని ప్రకృతి తెలుపుచున్నది. చీకటి గదిలో నున్నప్పుడు వెలుతురవసరమైనచో సూర్యుని వైపు గల కిటికి తెరుచుట సరియైన మార్గము. అప్పుడు సూర్య కిరణములు గదిలో ప్రవేశించి మమ్ము ప్రకాశింపజేయును. కనుక అల్లాహ్ అనుగ్రహ శుభములు పొందుటకు కూడ ఏదో ఒక కిటికి తప్పక వుండవచ్చు. ఆధ్యాత్మిక సంబంధమైన ప్రత్యేక పద్ధతులు వుండవచ్చు. జీవితము విజయవంతముగా సాగుటకు మార్గాలన్వేషించు విధముగా ఆధ్యాత్మిక విషయ సాధనకు కూడ సరియైన మార్గాన్వేషణ అవసరము. కేవలము మన తెలివినుపయోగించు మార్గాలతో, తానూహించి సృష్టించిన పద్ధతులలో అల్లాహ్ సామిప్యము సాధ్యమా? కేవలము మన యుక్తి నియమ నిబంధనలతో అతడు తెరుచు తలుపులు తెరుచుకోబడునా? నిశ్చయముగా ఇది సరియైన మార్గము కాదే? శాశ్వతముగా జీవించు ఆ అల్లాహ్‌ను మనమూహించు మార్గములనవలంభించి పొందలేము. మన శక్తి సామర్థ్యములను కేవలము అల్లాహ్ మార్గములో వినియోగించి అతని ప్రీతి పొందుటకు ప్రార్థించు మార్గమే సరియైన మార్గము. ఫలితముగా అల్లాహ్‌ను అల్లాహ్ ద్వారనే పొందవచ్చును.

## దివ్యమైన ఒక ప్రార్థన

అన్నిటికంటే దివ్యమైన ప్రార్థన. సమయ సందర్భములతో కూడిన

ప్రార్థన. ఆధ్యాత్మిక ప్రేరణ కలిగించు ప్రతిమ మనముందు ప్రత్యక్షపరచు ప్రార్థన. పవిత్ర ఖుర్‌ఆన్ మొదటి భాగమందు అల్లాహ్ ఈ విధముగా మనకు నేర్పి వున్నాడు.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○

(అల్ ఫాతిహా 1:1,2)

అనగా సర్వ ప్రపంచములను సృష్టించు స్థాపితమైన అల్లాహ్‌కే సర్వ ప్రశంసలు.

الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

(అల్ ఫాతిహా 1:3)

మన కార్యముల కంటే ముందు మన కొరకు అనుగ్రహ శుభములు సమకూర్చువాడు, కార్యముల ప్రతిఫలము నొసంగువాడు కూడా అతడే.

مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○

(అల్ ఫాతిహా 1:4)

ప్రతిఫలమొసంగు దినమునకు అతడే అధినేత. మరొకరికి ఆ అధికారమొసంగబడలేదు.

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

(అల్ ఫాతిహా 1:5)

సర్వ ప్రశంసలకు అర్హుడగు ఓ అల్లాహ్! మేము నిన్నే ఆరాధింతుము. ప్రతి కార్యములో నిన్నే సహాయము నర్థింతుము. ఇచ్చట బహువచనము వాడబడినది. అనగా మన సర్వ అవయవములు అతని ఆరాధనలో మునిగి వున్నవని గుర్తు చేయుచున్నది. మానవుని సర్వ అవయవములు అల్లాహ్ సన్నిధిలో ఆరాధించునదే ఇస్లామ్ అనబడును.

اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ۙ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ

(అల్ ఫాతిహా 1:6,7)

మమ్ము నీ సరళ మార్గమును చూపి, నిలకడనొసంగి, నీ వరములు, శుభములు పొందిన వారి మార్గమును చూపుము.

غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ۝

(అల్ ఫాతిహా 1:7)

నీ క్రోధనమునకు గురియైన వారి, నీ దారిని మరిచి నిన్ను చేరనివారి దారి నుండి మమ్ము రక్షించుము. ఆమీన్. ఓ అల్లాహ్! ఇటులనే చేయుము.

తమ జీవితమును అల్లాహ్ మార్గదర్శనము నందు వినియోగించి త్యాగాలు చేసి, అల్లాహ్ ప్రీతిని పొందుటకు తమను పూర్తిగా వినియోగించువారికే అల్లాహ్ వరములు, శుభములు గలుగునని ఈ సూక్తులు తెలుపుచున్నవి. అట్టి వారు అల్లాహ్ సామీప్యము, వరములు, అతనితో మాటలాడుటలో వారికెంత లభించవలసినదో దానిని పొందుటకు వారు ప్రార్థనలు సలుపుచుందురు. ఈ ప్రార్థనతో తమను అతని ప్రార్థనలో మునిగిపోయి, ఆరాధనలు సలుపుదురు. పాపము నుండి దూరముండి అల్లాహ్ సన్నిధిలో పడివుందురు. సాధ్యమైనంత వరకు తమను దుష్టత్వము నుండి రక్షించుకొందురు. అల్లాహ్‌కు దూరమగు, క్రోధము కలిగించు మార్గముల నుండి దూరముందురు. సాహసము, నిజాయితితో అల్లాహ్‌ను వారు అన్వేషింతురు. గనుక అతనిని పొందుదురు. పవిత్ర పాత్రలలో నుండి త్రాగుదురు. అధ్యాత్మిక ప్రపంచమునకు చేర్చునది సంపూర్ణ శుభములు కలుగచేయునది సంపూర్ణ స్థిరత్వముతో

ముడిబడినది. సంపూర్ణ స్థిరత్వమనగా విధేయత, విశ్వాసము. కఠినమైన పరీక్ష కూడ చెరపని విధేయత, విశ్వాసముగల స్థితి అనగా ఖడ్గము కోయలేని, నిప్పు కాల్చలేని ఏదేని బాధ, హాని కలిగించని బంధు మిత్రుల ఎడబాటు గాని, మరణము గాని, విడదీయలేని, అగౌరవ భయము లేని, అపాయకర దుఃఖములు హృదయములను భయపెట్టని సంబంధము. ఈ మార్గము చాలా కఠినమైనది. ఈ ద్వారము చాలా ఇరుకైనది. ఈ మార్గము చాలా కష్టతరమైనది. దీనినే అల్లాహ్ ఈ సూక్తులలో ఇట్లు తెలుపుచున్నాడు.

قُلْ اِنْ كَانَ اٰبَآؤُكُمْ وَاَبْنَآؤُكُمْ وَاِخْوَانُكُمْ وَ
اَزْوَاجُكُمْ وَ عَشِيْرَتُكُمْ وَ اَمْوَالُ ۨاقْتَرَفْتُمُوْهَا وَ
تِجَارَةٌ تَخْشَوْنَ كَسَادَهَا وَ مَسٰكِنُ تَرْضَوْنَهَآ اَحَبَّ
اِلَيْكُمْ مِّنَ اللّٰهِ وَرَسُوْلِهٖ وَجِهَادٍ فِيْ سَبِيْلِهٖ فَتَرَبَّصُوْا حَتّٰى
يَاْتِيَ اللّٰهُ بِاَمْرِهٖ ؕ وَاللّٰهُ لَا يَهْدِى الْقَوْمَ الْفٰسِقِيْنَ ۝

(అత్తౌబహ్ 9:24)

మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ స్త్రీలు, మీ సమాజము, మీ కష్టార్జితము సమాప్తి అగునని మీరు భయపడు మీ వ్యాపారము, మీరు ఇష్టపడిన భవనములు, అల్లాహ్ అతని ప్రవక్త కొరకు అల్లాహ్ మార్గములో తమ ప్రాణాలర్పించుట కంటే ఎక్కువ ప్రీతి అయిన, అల్లాహ్ తమ ఆదేశము ఇచ్చునంత వరకు మీరు వేచి వుండమని, వారితో చెప్పివేయుము. అల్లాహ్ పాపులకు ఎప్పుడు తమ మార్గము చూపడు

అల్లాహ్ ఇష్టమును వీడి తమ బంధు మిత్రులను, ధన ధాన్యములను ఇష్టపడువాడు అల్లాహ్ దృష్టియందు దుష్టులని ఈ సూక్తులు స్పష్టముగా తెలుపుచున్నవి. వారు తప్పక నాశనమగుదురు. కారణము? వారు అల్లాహ్‌కు బదులు ఇతరములను ఇష్టపడిరి, ప్రాముఖ్యతనిచ్చిరి. అల్లాహ్ వైపు మనస్ఫూర్తిగా భక్తితో మోకరిల్లి, అతని కొరకు లక్ష ఆపదలను కనుక్కొని అల్లాహ్ తప్ప ప్రతిది నాశనమైనదని భావించు స్థానమే మానవున్ని దైవ వ్యక్తిగా సూచించును. ఈ స్థానము నందే మానవుడు దైవ భక్తునిగా మారును. మనము చచ్చినంత వరకు బ్రతికి వున్న అల్లాహ్ కానరాడు. మన శారీరక మరణము అల్లాహ్ దర్శనమిచ్చును. అల్లాహ్ చూపునిచ్చువరకు మనము గ్రుడ్డి వారము. ఇతరులను చూచినంత వరకు మనము అంధులము. అల్లాహ్ చేతులలో శవములా పడునంత వరకు మనము శవములమే. అల్లాహ్ సర్వ రంగములలో సంపూర్ణంగా తల దూర్చినప్పుడు కామ, క్రోధాధి గుణములను జయించు స్థిరత్వము మనకు లభించును. దానికి ముందే అది సాధ్యము కాదు. ఈ స్థిరత్వము వలననే కామ క్రోధాది గుణములు చచ్చిపోవును.

మన స్థిరత్వమును గురించి అల్లాహ్ ఇట్లు నుడివెను.

بَلٰى ۚ مَنْ اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ

(అల్ బఖరహ్ 2:113)

అనగా త్యాగమూర్తులై, తమను అతని ముందు వాలుటకు అల్లాహ్ కోరును. మన ప్రతి అవయవము, మన శక్తి సామర్థ్యము ఆత్మ అతని కార్యములో నిమగ్నమై మన జీవన్మరణము అతని కొరకే అయినప్పుడు మనము స్థిరత్వ స్థానమును పొందగలము. దీనినే అతడిట్లు తెలిపెను.

قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ○

(అల్ అన్ఆమ్ 6:163)

నా ఆరాధన పూజలు, నా త్యాగము, నా జీవితము, నా చావు అన్నియు అల్లాహ్ కొరకేనని చెప్పుము. తన జీవితము, మరణము తన కొరకు కాక అల్లాహ్ కొరకేనను ప్రేమ భావము ఒక వ్యక్తిలో చోటు చేసికొనినప్పుడు సదా ప్రేమించువారిని ప్రేమించు అల్లాహ్ తన ప్రేమను అతనిపై దింపును. ఈ రెండు ప్రేమలు పొందిన వ్యక్తియందొక కాంతి పుట్టును. దానిని ప్రపంచము గుర్తించదు. ఎరుగదు. జగత్తు ఎరుగనందులకే వేల సంవత్సరములు భక్తుల సంహారము జరిగెను. ప్రపంచము వారి కాంతివంతమైన రూపము ఎరుగనందులకే వారు స్వార్థపరులుగా, కపటులుగా ముద్ర వేయబడిరి. కనుకనే సర్వశక్తి వంతుడైన అల్లాహ్ ఇట్లు నుడివెను.

يَنْظُرُونَ إِلَيْكَ وَهُمْ لَا يُبْصِرُونَ ○

(అల్ ఆరాఫ్ 7:199)

వారు నిన్ను చూతురు కాని నీవు వారికి కానరావు. ఆ కాంతి పుట్టిన రోజు నుండి ఒక ఐహిక మానవుడు ఆకాశపువాడుగా మారును. ప్రతి దాని అధికారి అతని యందు మాటలాడుచు తమ మహత్య కాంతిని వెదజల్లును. పవిత్ర ప్రేమతో నిండిన అతని హృదయమును సింహాసనముగా చేసికొనును. అప్పటి నుండే ఈ వ్యక్తి ఒక ప్రకాశవంతమైన మార్పు పొంది ఒకే నూతన వ్యక్తిగా మారును. అతడు ఇతని కొరకు ఒక నూతన అల్లాహ్‌గా మారును. నూతన అలవాట్లను, మార్గములను పుట్టించును. అనగా అల్లాహ్ గాని, అలవాట్లు గాని క్రొత్త

పని కాదు. కాని అవి అల్లాహ్ సాధారణ మార్గముల కంటే వేరుగా నుండును. వాటిని ప్రపంచ తత్వమెరుగదు. ఇట్టి వ్యక్తిని గురించి అల్లాహ్ ఇట్లు నుడివెను.

وَمِنَ النَّاسِ مَنْ يَّشْرِيْ نَفْسَهُ ابْتِغَآءَ مَرْضَاتِ اللّٰهِ ۗ وَاللّٰهُ رَءُوْفٌ بِالْعِبَادِ ۝

(అల్ బఖరహ్ 2:208)

అల్లాహ్ ప్రీతిని పొందుటలో నిమగ్నమైన వారు మానవులలో ఉత్తములు. వారు తమ ప్రాణాలను అమ్మి అల్లాహ్ ప్రీతిని పొందుదురు. వీరే అల్లాహ్ అనుగ్రహమును పొందువారు. ఆధ్యాత్మిక స్థితిని అందుకొనినవాడే అల్లాహ్ మార్గము నందు ప్రాణాలను అర్పించును.

నా దారిలో నా ప్రీతి కొరకు ప్రాణాలను అమ్మువాడు. కష్టనష్టముల లో కూడా అల్లాహ్‌ను వదలక తమను సృష్టికర్త విధేయత కొరకు పుట్టించ బడినదని భావించు వాడు. సర్వ దుఃఖముల నుండి విముక్తి పొందునని శక్తిమంతుడైన అల్లాహ్ ఈ సూక్తి యందు తెలుపుచున్నాడు. తరువాత సత్కార్యములు, ధర్మ బద్ధ కార్యములు మనస్ఫూర్తిగా ఉబలాటతో పూర్తి చేసి తమకు నిజముగా ప్రియమైన దానిని అద్దములో చూచునట్లు భావించును. అతని సంకల్పము అల్లాహ్ సంకల్పముతో ఏకీభవించును. సర్వ అభిరుచులు విధేయతతో ముడిబడి పోవును. సర్వసత్కార్యములు శ్రమతోగాక సంతోషము ఉత్సాహముతో పూర్తగుచు పోవును. ఆధ్యాత్మిక వ్యక్తికి లభించు నగదు స్వర్గమిదే. రాబోవు కాలములో లభించు స్వర్గమునకు ఈ స్వర్గము నాంది అగును. దీనిని మరో లోకములో అల్లాహ్ శారీరక రూపములో ప్రసాదించును. దీనినే శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు

తెలిపెను.

وَلِمَنْ خَافَ مَقَامَ رَبِّهٖ جَنَّتٰنِ

(అర్రహ్మాన్ 55:47)

وَسَقٰهُمْ رَبُّهُمْ شَرَابًا طَهُوْرًا

(అద్దహ్ర్ 76:22)

اِنَّ الْاَبْرَارَ يَشْرَبُوْنَ مِنْ كَاْسٍ كَانَ مِزَاجُهَا كَافُوْرًا ۚ
عَيْنًا يَّشْرَبُ بِهَا عِبَادُ اللّٰهِ يُفَجِّرُوْنَهَا تَفْجِيْرًا ○

(అద్దహ్ర్ 76:6,7)

وَيُسْقَوْنَ فِيْهَا كَاْسًا كَانَ مِزَاجُهَا زَنْجَبِيْلًا ۚ
عَيْنًا فِيْهَا تُسَمّٰى سَلْسَبِيْلًا ○

(అద్దహ్ర్ 76:18,19)

اِنَّآ اَعْتَدْنَا لِلْكٰفِرِيْنَ سَلٰسِلَاۡ وَاَغْلٰلًا وَّسَعِيْرًا ○

(అద్దహ్ర్ 76:5)

وَمَنْ كَانَ فِيْ هٰذِهٖٓ اَعْمٰى فَهُوَ فِي الْاٰخِرَةِ
اَعْمٰى وَاَضَلُّ سَبِيْلًا ○

(బనీ ఇస్రాయీల్ 17:73)

అల్లాహ్‌కు భయపడుము, అతని మాహాత్యము, క్రోధముతో చింతాక్రాంతుడగు వ్యక్తి కొరకు రెండు స్వర్గములు గలవు. ఒకటి ఈ

ఐహిక ప్రపంచము. రెండవది పరలోకము. అల్లాహ్‌తో ఏకమైన వారికి అల్లాహ్ హృదయమును, ఆలోచనలను, సంకల్పములను పరిశుద్ధము చేయు పానీయమును త్రాపెను. కర్పూరము, కలిపిన పానీయము సజ్జనులు త్రాగుచున్నారు. తాము త్రవ్విన చెలిమతోనే వారు త్రాగుదురు.

## శొంటి కర్పూరముతో చేయబడిన పానీయము

అనగా అరబ్బి భాషలో కఫర అనగా అణచివేయుట, కప్పి వేయుటకు ఉపయోగిస్తారు. కనుక ఈ సూక్తిలో కాఫూర్ అను పదము వాడబడినదని ఇంతకు ముందే విశదీకరించబడినది. కపటము లేకుండా మనస్పూర్తితో అల్లాహ్ వైపు తిరుగు పానీయము త్రాగుట వలన వారిలో ప్రపంచ ప్రేమ పూర్తిగా చల్లబడినదని ఈ సూక్తి తెలియజేయుచున్నది. కామ క్రోధాలు హృదయ ఆలోచనలకు సంబంధించినవే గదా! హృదయమే ఈ పనికి రాని వట్టి ఆలోచనలకు దూరముండినచో వాటితో పూర్తిగా తెగతెంపులు చేసికొనినప్పుడు ఇవి క్రమేపి తగ్గుచు నామరూపాలు లేకుండా పోవుట సహజము. అల్లాహ్ ఉద్ధేశమిదే. ఇతని వైపు పూర్తిగా తిరిగిన వారు కామ క్రోధాలకు అతి దూరమైరి. ప్రపంచ కార్యకలాపాలు వారి హృదయాలలో చల్లబడినవి. అవి కర్పూరము విష పదార్థాలను అణచి వేయునట్లు అణగినవని ఈ సూక్తిలో అల్లాహ్ స్పష్టము చేయుచున్నాడు.

ఈ కర్పూర పానీయము తరువాత వారు శొంటి కలిపిన పానీయము త్రాగుదురని తెలుపుచున్నాడు. అరబ్బి భాషా పదము "జన్‌జబీల్" రెండు పదాల మిశ్రమము. అవి "జన" + "జబల్". జన అనగా పైకెక్కుట జబల్ పర్వతమును అందురు. అనగా పర్వతము నధిరోహించెను. విషపూరిత రోగ నివారణ తరువాత శక్తవంతమైన ఆరోగ్యము పొందువరకు మానవునిపై రెండు స్థితులు వచ్చునని

జ్ఞప్తియందుంచుకొనవలెను. విషము పూర్తిగా వెళ్లిపోయి అపాయకరమైన ప్రాణాంతకరమైన స్థితి నుండి బయటపడును. కాని బలహీనత మిగిలి శవము వలె నుండి కష్టతర కార్యము చేయలేడు. రెండవ దశలో ఆరోగ్యము కుదుట పడి శరీరములో శక్తిపుంజుకొని, బలము వచ్చి, కష్టము లేకుండా పర్వతమెక్కి సంతోషముగా పరుగిడు ఉత్సాహము పుట్టును. కనుక మూడవ దశలో ఈ స్థితి కలుగును. ఈ దశను ఈ సూక్తిలో అల్లాహ్ వివరించెను. అనగా అల్లాహ్ కొరకు జీవించు భక్తులు శొంటి కలిపిన పానీయము త్రాగుదురు. అనగా ఆధ్యాత్మిక శక్తిని పొంది పెద్ద పెద్ద కొండ లెక్కి అసాధ్యమైన కార్యములొనరింతురు. అల్లాహ్ మార్గములో ఆశ్చర్యకరమైన కార్యములు చేయుదురు.

## శొంటి ప్రభావము

శొంటి శరీరమునకు శక్తినిచ్చి అతిసార వ్యాధిని నిర్మూలించును. బలహీన వ్యక్తికి బలమునొసంగి పర్వతములను అధిరోహించునట్లు చేయునని జ్ఞప్తియందుంచుకొనవలెను. కనుక దానికాపేరు వచ్చినది. కామ క్రోధాది నుండి సుకృతులు పుణ్యముల వైపు నడిచినప్పుడు మునుముందు అతనిలో నుండి విషపూరిత కృత్యములు కర్పూరము చేత విషమును అణచి వేయబడినట్లు అణగిపోవును. ఈ సూక్తులలో అల్లాహ్ తమ దాసులను ఈ విషయమునే తెలియచేయుటకు, కర్పూరము, శొంటిని చర్చించెను. కనుకనే ఇది మహామారి, టాయిఫైడ్ నందు ఉపయుక్తమైనది. ఈ రెండవ దశలో విషపూరిత స్థితి పూర్తిగా పోయిన తరువాత బలహీనత నిస్పృహ వాటిల్లు బలహీన రోగి, శొంటి పానీయముతో శక్తిని పొందును. శొంటి పానీయము ఆధ్యాత్మికముగా ఆత్మను పోషించును. అల్లాహ్ అందమైన రూపమును చూపును.

బలమును పొందినప్పుడు మానవుడు ఎత్తైన శిఖరము సైతము ఎక్కుటకు యోగ్యత పొందును. అల్లాహ్ మార్గము నందు ఆశ్చర్యకరమైన, కఠినమైన కార్యములు కూడా నిర్వహించును. అల్లాహ్‌తో వేడి వేడి ప్రేమ గలిగినప్పుడే, తన హృదయము నందు అల్లాహ్ వేడి ప్రేమ పుట్టినప్పుడే, ఒకడు ఇట్టి కష్టతరమైన అసాధ్యమైన కార్యములు చేయగలుగును. కనుక ఈ రెండు దశలను స్పష్టపరచుటకు అల్లాహ్ అరబ్బి రెండు పదాలను ఉపయోగించెను. ఒకటి అణచివేయు కర్పూరము, రెండవది పైకెక్కు ఎగబాకు శొంటి, ప్రయత్నించు వారికి ఈ రెండు దశలే గలవు.

إِنَّآ أَعْتَدْنَا لِلْكَٰفِرِينَ سَلَٰسِلَا۟ وَأَغْلَٰلًا وَسَعِيرًا ۝

(అద్దహ్ర్ 76:5)

సత్యమును స్వీకరించని అవిశ్వాసుల కొరకు మేము గొలుసులు, మెడ కడియములు, మాడు మంటలు సిద్ధము చేసి వున్నాము. సత్య హృదయులై అల్లాహ్‌ను అన్వేషించని వారిని ఛేదించు ప్రతీకారము ఆవహించును. ప్రపంచ ఆపదలలో గొలుసులతో బంధించబడినట్లు చిక్కుకొందురు. మెడలలో కడియములుండి ఆకాశము వైపు చూచుటకు వీలు లేకుండా వుండునట్లు భూకార్యములలో మునిగివుందురు. వారి హృదయములలో లోభము నిండి ఈ ధనము, ఆ సంపద, లభించాలని, ఆదేశమును వశపరచుకొనవలెనని, శత్రువును జయించవలెనని, చాలా ధనముండ వలెనని ఆశ వుండును. వారు దుష్కార్యములలో మునిగి వుందురు. కనుక అల్లాహ్ వారిని అనర్హులని ఈ మూడు ఆపదలలో పడవేయును. మానవునితో ఒక కార్యమైనప్పుడు దాని ప్రకారము అల్లాహ్ తనవంతు కార్యమొన రించును. అదెట్లనగా ఒకడు గది తలుపులు మూసికొనినచో

అల్లాహ్ ఆ గది మొత్తము అంధకరాము చేయును. ఎందుకనగా సృష్టియందు మన ప్రతి కార్యమునకు ఒక ఫలితము తప్పక గలదు. ఇవన్నియము అల్లాహ్ కార్యములు. కార్యముల ఫలితములు, ఒకడు అపాయకరమైన విషము త్రాగినప్పుడు అల్లాహ్ అతనికి మరణమునిచ్చును. ఒకడు తమ కార్యము వలన అంటురోగమునకు గురైనచో అల్లాహ్ కార్యము ఆ రోగము అతన్ని ఆవరించును. మన ఐహిక జీవితము నందు ప్రతి పనికి ఒక ఫలితము తప్పక గలదని స్పష్టముగా తెలియును. ఆ ఫలితము అల్లాహ్ కార్యము. ధర్మము నందు కూడా ఈ పద్ధతే గలదు. ఈ రెండు ఉదాహరణాలలో అల్లాహ్ స్పష్టపరచి వున్నాడు.

وَالَّذِيْنَ جَاهَدُوْا فِيْنَا لَنَهْدِيَنَّهُمْ سُبُلَنَا ؕ

(అల్ అన్కబూత్ 29:70)

فَلَمَّا زَاغُوْٓا اَزَاغَ اللّٰهُ قُلُوْبَهُمْ ؕ

(అస్సఫ్ 61:6)

అల్లాహ్‌ను కనుగొనుటలో పూర్తిగా మునిగి ప్రయత్నించు వారికి అల్లాహ్ తమ దారి తప్పక చూపును. కపటము వహించి సన్మార్గము అవలంభించని వారి హృదయములలో అల్లాహ్ దుష్టత్వమును పొందపరచును. ఈ స్థితిని స్పష్టముగా ఈ క్రింది సూక్తిలో మంచిగా తెలియ జేసెను.

مَنْ كَانَ فِىْ هٰذِهٖٓ اَعْمٰى فَهُوَ فِى الْاٰخِرَةِ
اَعْمٰى وَاَضَلُّ سَبِيْلًا ۝

(బనీ ఇస్రాయీల్ 17:73)

ఈ లోకము నందు అంధుడుగా నున్నవాడు రాబోవు లోకము

నందు కూడా అంధుడుగానే వుండును. అంధుల కంటే అధముగా నుండును. అనగా సజ్జనులకు ఈ ప్రపంచము నందే వారి ప్రభువు దర్శనమగును. తమ సర్వస్వము ఎవరి కొరకు పోగొట్టు కొందురో అతని దర్శనము ఈ లోకము నందే పొందుదురు. స్వర్గ జీవిత పునాది ఈ లోకము నందే పడునని, నరక అంకార జీవిత అంకురము కూడ ఈ లోకమునకే సంబంధము గలదని ఈ సూక్తి ద్వారా తెలియుచున్నది. తరువాత ఇట్లు నుడివెను.

وَبَشِّرِ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ اَنَّ لَهُمْ جَنّٰتٍ تَجْرِيْ
مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ ؕ

(అల్ బఖరహ్ 2:26)

విశ్వసించి మంచి కార్యములొనరించు వారి నివాసము కాలువలు ప్రవహించు తోటలు ఈ సూక్తి యందు విశ్వాసమును అల్లాహ్ కాలువలు ప్రవహించు తోటతో పోల్చి వున్నాడు. ఈ సూక్తి యందు శక్తిమంతుడైన అల్లాహ్ కాలువల సంబంధము తోటతోనున్నట్లు కార్యముల సంబంధము విశ్వాసముతో గలదని విశదపరచుచున్నాడు. నీరు లేనిది తోటలు పచ్చగా నుండవు. అదే విధముగా సత్కార్యములు లేనిదే విశ్వాసముండనేరదు. విశ్వాసమున్న కార్యములు లేనిచో ఆ విశ్వాసము పనికిరానిది. అటులనే సత్కార్యములెన్ని చేసినా విశ్వాసము లేనిచో ఆ కార్యములన్నియు వ్యర్థమే.

ఈ ప్రపంచపు సత్యార్యముల, విశ్వాసపు ప్రతిబింబమే ఇస్లామీ స్వర్గము. ఇది బాహ్యమునకు సంబంధించినది, క్రొత్తది కాదు. మానవుని స్వర్గము అతనిలోనే వికసించును. ప్రతి వాని స్వర్గము అతని విశ్వాసము సత్కార్యములపై ఆధారపడి వుండును. వారి అభిరుచులు, ఆనందము

ఈ లోకము నందు ప్రారంభమైన గూఢముగానున్న విశ్వాసము, సత్కార్యముల తోటలు కాలువలు కనిపించును. పరలోకము నందు ఈ తోటలే వాస్తవ రూపములో బయటపడును. స్వచ్ఛమైన, నిశ్చలమైన పవిత్రమైన విశ్వాసము. అల్లాహ్ అతని స్వభావము, సంకల్పములకు సంబంధించిన అల్లాహ్ బోధ, అందమైన, ఫలములతో నిండిన వృక్షముల స్వర్గము. సత్కార్యములు ఈ స్వర్గములోని ప్రవహించు కాలువలు. దీనినే అల్లాహ్ ఇట్లు తెలిపెను.

ضَرَبَ اللّٰهُ مَثَلًا كَلِمَةً طَيِّبَةً كَشَجَرَةٍ طَيِّبَةٍ اَصْلُهَا ثَابِتٌ
وَّفَرْعُهَا فِي السَّمَآءِ ۙ تُؤْتِيْٓ اُكُلَهَا كُلَّ حِيْنٍ

(ఇబ్రాహీమ్ 14:25,26)

విశ్వాసముతో కూడిన ఒక పదము ప్రతి లోపము, అసత్యము, పనికిరాని గర్వముతో అతీతమైన పరిపూర్ణత కలిగివున్నచో, ప్రతి వేరు పాతాళమును చేరి కొమ్మలు ఆకాశము నంటి వుండు సదా ఫలములు ఇచ్చుచు ఏ కాలము నందు కూడ ఫలములు లేకుండా వుండనే వుండని, ఏ లోపము లేని వృక్షమును పోలి వుండును. దీనిలో విశ్వాసముతో కూడిన పదమును అల్లాహ్ సదా ఫలములు నొసంగు పచ్చని వృక్షమును పోల్చుచు దాని మూడు గుణములను పేర్కొని వున్నాడు. **1. వేరు.** అనగా వాస్తవ ఉద్దేశము మానవుని హృదయములో నాటుకొని వుండవలెను. అనగా మానవుని స్వభావము, స్మారకము, అతని నైజాన్ని వాస్తవాన్ని స్వీకరించు గుణము మొదటిది. **2.** ఈ పదపు కొమ్మలు ఆకాశాన్నంటి వుండవలెను. అనగా అకారణముగా వుండక సృష్టికర్త సృష్టించిన నియమములకు అనుకూలముగా నుండవలెను. అనగా అతని

ప్రతి పని సత్యము. సరియైనదిగా నుండవలెను. అవి వాదము ప్రతి వాదమునకు అతీతముగా వుండవలెననునది రెండవ గుణము. **3.** మూడవ గుణము తమ యోగ్యత కలిగిన ఫలము శాశ్వతమై హద్దులు లేనిదై వుండవలెను. అనగా కార్యపు శుభములు, ప్రభావములు. ఎల్లప్పుడు ప్రతి కాలము అనుభవించునట్లు వుండవలెను. ఒక పరిమిత కాలము వరకుండి తరువాత ఆగిపోవునట్లుండ కూడదు. తరువాత ఇట్లనెను.

مَثَلُ كَلِمَةٍ خَبِيْثَةٍ كَشَجَرَةٍ خَبِيْثَةِ ۣاجْتُثَّتْ مِنْ فَوْقِ
الْاَرْضِ مَالَهَا مِنْ قَرَارٍ ○

(ఇబ్రాహీమ్ 14:27)

అనగా చెడు పదము భూమి నుండి వేళ్ళతో వెళ్ళిన వృక్షముతో సమానము. మానవ స్వభావము దీనిని స్వీకరించదు. నిదర్శనములు, సృష్టి నియమము ప్రకారముగాని అది స్థిరత్వము పొందదు. అది కేవలము కథ మాత్రమే. కనుక పవిత్ర ఖుర్ఆన్ పరలోకము నందు విశ్వాసపు పవిత్ర వృక్షమును ద్రాక్ష, దానిమ్మ ఉత్తమ ఫలములతో పోల్చి ఆ రోజు ఈ ఫలముల రూపములో కనిపించునని తెలిపెను. ఇటులనే అవిశ్వాస, పనికిరాని వృక్షమును పరలోకము నందు 'జఖ్ఖూమ్' అని నామకరణము చేసెను. అతడు తెలిపినట్లు

اَذٰلِكَ خَيْرٌ نُّزُلًا اَمْ شَجَرَةُ الزَّقُّوْمِ ○ اِنَّا جَعَلْنٰهَا فِتْنَةً
لِّلظّٰلِمِيْنَ ○ اِنَّهَا شَجَرَةٌ تَخْرُجُ فِيْٓ اَصْلِ الْجَحِيْمِ ○ۙ
طَلْعُهَا كَاَنَّهٗ رُءُوْسُ الشَّيٰطِيْنِ ○

(అస్సాఫ్ఫాత్ 37:63-65)

إِنَّ شَجَرَتَ الزَّقُّومِ ۝ طَعَامُ الْأَثِيمِ ۝ كَالْمُهْلِ يَغْلِي فِي الْبُطُونِ ۝ كَغَلْيِ الْحَمِيمِ.... ذُقْ إِنَّكَ أَنتَ الْعَزِيزُ الْكَرِيمُ ۝

(అద్దుఖాన్ 44:44–47,50)

స్వర్గపు తోటలు మంచివా? లేదా అన్యాయములకొక ముప్పుగా వున్న "జఖ్ఖూమ్" వృక్షము మంచిదా? అది నరకపు మొదటి వేరు నుండి వెళ్లును. అనగా గర్వము అహంకారము నుండి పుట్టును. ఇదే నరకమునకు మూలము. దీని ఫలము షైతాన్ తల వంటిది. అనగా నాశనమగునది. ఈ పదము షైతాన్‌కు పుట్టినిల్లు అనగా దీనిని తినుట నాశనమగుట. తెలిసి తెలిసి పాపము చేయు నరకవాసుల ఆహారము జఖ్ఖూమ్. ఇది మురుగుచున్న రాగి పానీయము. కడుపులో మంటలు రేపే ఆహారము. నరకవాసున్ని సంబోధించి ఇట్లనెను. ఈ వృక్షపు రుచి చూడుము. నీవు గౌరవ మర్యాద గల వాడవు. నీవు గర్వపడినచో ఈ రోజు ఇన్ని కష్టాలు భరించనవసరము లేకుండెడిది గదా! అని ఈ వాక్యము ద్వారా తెలుపుచున్నది. జఖ్ఖూమ్ అను పదము జుఖ్, అమ్ మిశ్రమము.

إِنَّكَ أَنتَ الْعَزِيزُ الْكَرِيمُ ۝

(అద్దుఖాన్ 44:50)

దీని ముందు మొదటి అక్షరమొకటి అంతపు అక్షరమొకటి గలదు. అనగా శక్తిమంతడైన అల్లాహ్ లోకపు అవిశ్వాస కార్యములను స్వర్గముతో, అవిశ్వాస కార్యములను నరకముతో పోల్చినట్లు ఈ వృక్షమును నరకపు వృక్షముగా పేర్కొనెను. స్వర్గము నరకమునకు ఆధారము ఈ ప్రపంచము

నుండే ప్రారంభమగునని తెలిపెను. మరో చోట నరకమును గురించి ఇట్లు ప్రస్తావించెను.

نَارُ اللّٰهِ الْمُوْقَدَةُ ۝ الَّتِیْ تَطَّلِعُ عَلَى الْاَفْـِٕدَةِ ۝

(అల్ హుమజహ్ 104:7,8)

అల్లాహ్ ఆగ్రహావేశాల ఫలితము మండుచున్న అగ్ని గుండము, నరకము. ఇది పాపముతో ప్రజ్వలించును. మొదట హృదయమునాక్రమించును. అనగా హృదయమును కలవర పరచు దుఃఖములు, కోరికలు, దీనికి మూలము. ఆధ్యాత్మిక బాధలు మొత్తము హృదయము నందే ఉద్భవించును. తరువాత మొత్తము శరీరమునకు వ్యాపించును. మరో చోట ఇట్లు నుడివెను.

وَقُوْدُهَا النَّاسُ وَالْحِجَارَةُ

(అల్ బఖరహ్ 2:25)

నరకపు అగ్ని సదా మండుటకు గల రకములు రెండు. ఒకటి అల్లాహ్‌ను విడిచి, ఇతరములను ఆరాధించువారు. లేక ఇష్టపడిన వారిని ఆరాధించువారు. అందువలననే ఇట్లు నుడివెను.

اِنَّكُمْ وَمَا تَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ حَصَبُ جَهَنَّمَ ط

(అల్ అన్బియా 21:99)

మీరు, మానవులై పూజింపబడు మీ ఆరాధ్య దైవములు, నరకములో వేయబడుదురు. రెండవ నరకపు ఇంధనము, విగ్రహములు. అనగా ఇవి లేనిచో నరకము కూడ ఉండేది కాదు. కనుక పై సూక్తులతో అల్లాహ్ పవిత్ర బోధలో స్వర్గము, నరకము ఈ శారీరక లోకము వలే కాక, ఆధ్యాత్మికమునకు సంబంధించి వుండును. కాని అది పరలోకము

నందు శారీకముగా కనిపించినను ఐహిక లోకమునకు సంబంధించినవి కావవి.

## అల్లాహ్‌తో పూర్తి ఆధ్యాత్మిక సంబంధమేర్పరచు మార్గం

అల్లాహ్ ఆధ్యాత్మిక సంపూర్ణ సంబంధమార్గము ఇస్లామ్. ఫాతిహా అధ్యాయము అని మనకు పవిత్ర ఖుర్ఆన్ బోధించుచున్నది. అనగా మొదలు తమ సర్వస్వము అల్లాహ్ కొరకు వినియోగించుట. ఫాతిహా అధ్యాయములో చూపిన ప్రార్థనను జీవితాంతము అవలంభించుట. ఇవి రెండు ఇస్లామ్ సారాంశము. అనగా ఇస్లామ్, ఫాతిహా అధ్యాయము. వాస్తవ విముక్తి పానీయము త్రాగడానికి, అల్లాహ్ దరి చేరుటకు ఇదొక మార్గమే ఉత్తమమైనది. మానవుని అల్లాహ్‌తో కలయిక కొరకు సృష్టి పొందుపరచిన చట్టము కూడా ఇదే. ఇస్లామ్ సారపు ఆధ్యాత్మిక అగ్నిలో ప్రవేశించి ప్రార్థనలో నిమగ్నమైనవారే అల్లాహ్‌ను పొందగలరు. మన ఐహిక జీవితమును భస్మము చేసి, మన అసత్య దైవములను కాల్చి వేసి, వాస్తవమైన, నిజమైన, పవిత్ర ఆరాధ్యదైవము కొరకు తమ ప్రాణాలు, ధన సంపత్తులు గౌరవమర్యాదలను అర్పించు, ప్రజ్వలించు జ్వాలయే ఇస్లామ్. ఇటువంటి చెలిమలో ప్రవేశించి మనము ఒక నవీన జీవితపు నీరును త్రాగెదము. మన మొత్తం ఆధ్యాత్మిక శక్తులు అల్లాహ్‌తో బంధుత్వ సంబంధము వలె అతుక్కు పోవును. విద్యుత్తు వలె ఒక జ్వాల మనలోపల ఉద్భవించును. ఒక జ్వాల పై నుండి మనపై దిగును. రెండిటి కలయికతో మనలో గల మొత్తము దురాశ. లోభితనము, అల్లాహ్ తప్ప ఇతరుల ప్రేమ, భస్మమగును. మన పూర్వపు జీవితమంతమగును. ఈ స్థితి నామమే

పవిత్ర ఖుర్ఆన్ ప్రకారము ఇస్లామ్ అనబడును. ఇస్లామ్‌తో మన కామ క్రోధాలకు మరణము వాటిల్లును. ప్రార్థన తరువాత మనము నవీన జీవితమును పొందగలము. ఈ రెండవ జీవితములో దైవ దర్శనము లభించుట తప్పనిసరి. ఈ స్థితిని పొందినప్పుడు అల్లాహ్ దర్శనమగును. ఈ స్థితిని పొందిన తరువాత మానవునిలో అల్లాహ్‌ను తమ కన్నులతో చూచునట్లు యోగ్యత వచ్చును. అతనికా శక్తి ప్రసాదింపబడును. అప్పుడు అతని ఇంద్రియములు, అంతర శక్తులన్నియు ప్రకాశింపబడును. ఈ దశలో అల్లాహ్ మానవుని కన్నులుగా మారును. వాటితో అతడు చూచును. అతడు మాటలాడు జిహ్వగా మారును. అతడు దాడి చేయు చేతులుగా మారును. అతడు విను చెవులగును. అతడు నడుచు కాళ్ళగును. ఈ దశను చర్చించుచు అల్లాహ్ ఇట్లు నుడివెను.

يَدُ اللّٰهِ فَوْقَ اَيْدِيْهِمْ ۚ

(అల్ ఫతహ్ 48:11)

వారి చేతులపై నున్న ఈ చెయ్యి అల్లాహ్ చెయ్యి. ఈ విధముగనే మరో చోట ఇట్లనెను.

وَمَا رَمَيْتَ اِذْ رَمَيْتَ وَلٰكِنَّ اللّٰهَ رَمٰى ۚ

(అల్ అన్ఫాల్ 8:18)

నీవు విసిరినది, నీవు కాదు. అల్లాహ్ విసిరెను. ఈ దశలో కలయిక ఉచ్ఛ స్థాయినందుకొనును. అల్లాహ్ పవిత్ర ప్రీతి ఆత్మను పూర్తిగా వశపరచుకొనును. బలహీనముగా నున్న నైతిక విలువలు ఈ దశలో పర్వతము వలె స్థిరముగా వుండును. తెలివి తేటలు చురుకు

స్థాయినందుకొనును. దీనిని అల్లాహ్ ఈ క్రింది సూక్తి నందు స్పష్టముగా వివరించెను.

وَاَيَّدَهُمۡ بِرُوۡحٍ مِّنۡهُ ‌ؕ

(అల్ ముజాదిలహ్ 58:23)

ఈ దశలో అల్లాహ్ కొరకు సవాలక్ష ఆపదలను మోయుట, అగౌరవమునకు గురి అగుట, అల్లాహ్ కొరకు ప్రాణాలను సైతము అర్పించుట ఒక గుడ్డి పొరను విరుచునట్లు సులభమగును. అల్లాహ్ వైపు ఆకర్షింపబడును. ఎవరు లాగుచున్నారో తెలుసుకోలేదు. ఒక రహస్య హస్తము అతనిని ఎత్తుకొని తిరుగును. అల్లాహ్ ఇష్టమును పూర్తి చేయుట అతని జీవిత ముఖ్య లక్ష్యమగును. ఈ దశలో అల్లాహ్ చాలా సమీపము నందు కానవచ్చును. దీనినే ఇట్లనెను.

وَنَحۡنُ اَقۡرَبُ اِلَيۡهِ مِنۡ حَبۡلِ الۡوَرِيۡدِ

(ఖాఫ్ 50:17)

అతని మెడలో నుండు పెద్ద రక్తనాళము కంటే దగ్గరగా మేమున్నాము. ఈ దశ యందు మానవుని స్థితి పక్వమైన ఫలము, వృక్షము నుండి క్రింద పడునట్లుండును. ఈ దశలో మానవుని పనికిరాని సంబంధాలన్నియు అంతమై, అల్లాహ్‌తో గాఢమైన సంబంధమేర్పడును. అప్పుడు అతడు మానవులకు దూరమై అల్లాహ్‌తో మాటలాడును. ఈ దశను పొందు ద్వారములు మునుపు తెరిచివున్నట్లు ఇప్పుడు తెరిచి వున్నవి. అల్లాహ్ వరములు, అనుగ్రహమును అన్వేషించు వారిని ఇప్పుడు కూడా పూర్వము ప్రసాదించునట్లు ప్రసాదించును. కాని ఈ మార్గము

కేవలము పనికిరాని కార్యములతో లభ్యము కాదు. అసత్యమైన వాగుడుతో ఈ ద్వారము తెరువబడదు. కోరువారు చాలా వున్నా, పొందువారు కొందరే. కారణము? సరియైన అన్వేషణ, నిజమైన త్యాగము వలననే ఈ దశ లభించును. వట్టి మాటలతో జరిగేదేముంది. ఇతరులు పరుగెత్తే ఈ జ్వాలలో విశ్వాసముతో కాలిడుట, ఈ మార్గపు మొదటి షరతు, కార్యము లేనిదే వట్టి మాటలు పనికిరావు. దీనినే శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు తెలిపెను.

وَاِذَا سَاَلَكَ عِبَادِىْ عَنِّىْ فَاِنِّىْ قَرِيْبٌ ؕ اُجِيْبُ دَعْوَةَ الدَّاعِ اِذَا دَعَانِ ۙ فَلْيَسْتَجِيْبُوْا لِىْ وَلْيُؤْمِنُوْا بِىْ لَعَلَّهُمْ يَرْشُدُوْنَ ○

(అల్ బఖరహ్ 2:187)

నా దాసులు నన్ను గురించి ప్రశ్నించినచో వారితో నీవిట్లనుము. అతడు మీకు చాలా సమీపములో వున్నవాడు. ప్రార్థించు వారి ప్రార్థనలను నేను స్వీకరిస్తాను. కనుక ప్రార్థనలు చేయుచు నా కలయికను అన్వేషించినచో, నన్ను విశ్వసించినచో నన్ను పొందుటలో కృతార్థులగుదురు.

# రెండవ ప్రశ్న

## మరణము తరువాత మానవుని స్థితి ఎట్లుండును

మరణము తరువాత మానవుని స్థితి వాస్తవానికి క్రొత్తదేమి కాదు. ఐహిక లోకపు స్థితులు స్పష్టముగా వివరముగా నుండును. ఐహిక లోకము నందు మానవుని విశ్వాసము, సత్కార్యములు గాని, దుష్కార్యములు గాని రహస్యముగా గూఢముగా అతని ముందే నుండును. దాని విరుగుడు, విషపు ప్రభావము రహస్యముగా మానవునిపై పడును. కాని రాబోవు కాలములో ఇట్లు గాక స్పష్టముగా అవి తమ రూపముగా మానవునిపై పడును. కాని రాబోవు కాలములో ఇట్లు గాక స్పష్టముగా అవి తమ రూపమును చూపుతాయి. దీని ఉదాహరణ నిద్రావస్తలో నుండును. మానవునిపై ప్రభావము చూపు విషయములే నిద్రావస్తలో కనిపించును. తీవ్ర జ్వరమున్నప్పుడు నిద్రావస్తలో తరచుగా అగ్ని, అగ్ని జ్వాలలు కనిపించును. చలి జ్వరము జలుబు మానవునిపై దాడి చేసినప్పుడు తమను నీటిలో ప్రవహించునట్లు చూడును. శరీరమనుభవించు విషయములు నిద్రావస్తలో కనిపించును. కనుక నిద్రావస్త పరిస్థితిని గమనించినచో రెండవ లోకము నందు కూడ అదే మాదిరిగా అల్లాహ్ చేయునని ప్రతి వాడు అర్థము చేసుకొనగలడు. ఎందుకనగా కల మా

యందొక ప్రత్యేక మార్పును పుట్టించి ఆధ్యాత్మిక స్థితులను శారీరకముగా మార్పు చేసి చూపు విధముగా పరలోకము నందు అగును. మన కార్యములు వాటి ఫలితములు శారీరకముగా బహిర్గతమగును. ఈ లోకము నుండి రహస్యముగా మనము గొనిపోయినంతయు ఆ రోజు మన ముందు ప్రత్యక్ష్యమగును. మానవుడు కల యందు చూసిన వివిధములైన రూపములను చూడును. కాని వాటిని నిజమైనవిగా నమ్మి తమ తలంపులుగా భావించడు. ఈ విధముగనే ఆ లోకము నందు జరుగును. అల్లాహ్ రూపముల ద్వారా తమ నవీన సంపూర్ణ శక్తులను చూపును. మనము వాటిని రూపములుగా గణింపక అల్లాహ్ శక్తి వలన ఒక నవీన జన్మ అని భావించినచో అది పూర్తి సరియైనది, సత్యము.

فَلَا تَعْلَمُ نَفْسٌ مَّآ أُخْفِىَ لَهُم مِّن قُرَّةِ أَعْيُنٍ ۚ

(అస్సజ్దహ్ 32:18)

తమ కొరకు గూఢముగా ఏ ఏ వరములు, శుభములు గలవో ఎరుగడు. కనుక ఇహలోకపు వరములు బహుమతులలో పోలిక లేని వరములను, బహుమతులను అల్లాహ్ రహస్యముగా నిర్ణయించెను. ప్రపంచ వరములు మనకు తెలియనివి గావు. పాలు, దానిమ్మ ద్రాక్ష మనకు తెలుసు. సదా ఇవి తింటూనే వుంటాము. కనుక అవి మరో వస్తువులని తెలిసినది. కేవలము వాటి పేర్లు వీటిని పోలివున్నవి. కనుక స్వర్గమును ప్రపంచ వస్తువుల మిశ్రమమని ఊహించువాడు పవిత్ర ఖుర్ఆన్ కొంతైన అర్థము చేసికొనలేదని తేలును.

ఇప్పుడే ఈ సూక్తిని నేను వివరించితిని. తమ యజమాని, పవిత్ర ప్రవక్త ఇట్లనిరి. స్వర్గము దాని వరములను ఇంత వరకు కన్నులు

చూడలేదు. ఏ చెవులు వినలేదు, ఎవరూహించను లేదు. మనము ప్రపంచ బహుమతులను, వరములను కన్నులతో చూతుము. చెవులతో వింటాము. హృదయయములు అనుభవిస్తాయి. కనుక అల్లాహ్ ప్రవక్త ఆ వస్తువులను విచిత్రమైనవిగా చూసినప్పుడు స్వర్గము నందు కూడా ప్రపంచము నందు గల ఆవులు, గేదెలను పోలి వుండునని, అక్కడ పశువుల మందలకు మందలుండునని, తేనె టీగల తెట్టెలుండునని, దేవదూతలు వెతికి ఆ తేనెను తెచ్చి కాలువలో వేయుదురని మనమూహించినచో మనము పవిత్ర ఖుర్ఆన్ నుండి చాలా దూరమగుదుము. జగత్తు ఇటువంటి వస్తువులను చూడనే చూడలేదని, అవి ఆత్మను ప్రకాశింపజేయునని, అల్లాహ్ సంబంధమును పెంచునని, ఆధ్యాత్మిక ఆహారమని, ఈ సూక్తిలో వివరించిన బోధకు ఇటువంటి ఊహలకు పోలికలు గలవా? అయినను ఈ ఆహారముల రూపురేఖలు శారీరకముగా చూపబడివి. కాని వెనువెంట వీటి మూలము ఆత్మతో, సన్మార్గముతో ముడిబడినదని తెలుపబడినది. స్వర్గము నందు కల్పించు వరములను చూచి స్వర్గస్తులు ఇంతకు ముందు కూడా లభించివున్నవని, పై సూక్తిని చూచి గుర్తించగలరని అనుమాన పడరాదు. దీనినే శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు తెలిపెను.

وَبَشِّرِ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ اَنَّ لَهُمْ جَنّٰتٍ تَجْرِىْ مِنْ
تَحْتِهَا الْاَنْهٰرُ ؕ كُلَّمَا رُزِقُوْا مِنْهَا مِنْ ثَمَرَةٍ رِّزْقًا ۙ قَالُوْا هٰذَا
الَّذِىْ رُزِقْنَا مِنْ قَبْلُ ۙ وَاُتُوْا بِهٖ مُتَشَابِهًا ؕ

(అల్ బఖరహ్ 2:26)

విశ్వసించినవారు, సత్కార్యములు చేయువారు, జగడమాడు గుణము లేనివారు పంట కాలువలు ప్రవహించు స్వర్గములకు వారసులని శుభవార్తనిమ్ము. ప్రపంచ జీవితమునందు వారికి లభించిన ఫలములు, పరలోకము నందు పొందినప్పుడు వారు మనకు పూర్వమే ఇవ్వబడిన ఫలములివి అని అందురు. ఎందుకనగా వారు ఆ ఫలములను పూర్వపు ఫలముల వలె చూతురు. పూర్వపు ఫలములనగా ప్రపంచ శారీరక వరములనుకొనుట తప్పిదము. సూక్తికి విరుద్ధము. శక్తిమంతుడైన అల్లాహ్ ఈ సూక్తిలో ఇట్లు తెలుపుచున్నాడు. విశ్వసించినవారు, సత్కార్యములు చేయువారు తమ చేతులతో ఒక స్వర్గమును నిర్మించిరి. దాని వృక్షములు విశ్వాసము, దాని పంట కాలువలు సత్కార్యములు. ఈ స్వర్గపు ఫలములు ముందు కూడా తిందురు. ఆ ఫలము చాలా తియ్యగా ప్రత్యేకమైనది. ఆధ్యాత్మికముగా వారు దీనిని ప్రపంచము నందు కూడా తిని వుందురు. కనుక రెండవ ప్రపంచము నందు గుర్తింతురు. ఇవి ముందే మేము తినిన ఫలములేనని వారందురు. ఈ ఫలమును పూర్వపు ఆహారము వలె వుండునట్లు చూతురు. కనుక ప్రపంచములో అల్లాహ్ అభిమానము, ప్రేమ అభిరుచి చూచిన వారికిప్పుడు శారీరక రూపములో ఆహారమే లభించునని ఈ సూక్తి స్పష్టముగా తెలుపుచున్నది. వారు ప్రేమాభిరుచి చూచివుండిరి. ఆ అనుభూతి పొంది వుండిరి. కనుక వారికి ఏకాంతములలో, మూలలో, రాత్రి మబ్బులలో, తమ నిజమైన దైవమును స్మరించునది. ఇప్పుడు జ్ఞప్తికి వచ్చును.

మొత్తముపైన ఇక్కడ శారీరక ఆహారముల చర్చ ఏ కోశాన లేదు. సత్యవంతులకు ఈ ఆహారము ప్రపంచము నందే లభించినప్పుడు ఎవరు వీటిని ప్రపంచము నందు వినలేదు, చూడలేదు. ఎవరి హృదయము

అనుభూతి పొందలేదని ఊహించినచో ఈ రెండు సూక్తులలో వైరుధ్యమేర్పడునని ఎవరేని ఊహించినచో దీనికి సమాధానమిది. ఈ సూక్తి యందు ప్రపంచ వరముల చర్చ జరిగినచో వైరుధ్యమేర్పడేది. కాని దీనిలో ప్రపంచ వరముల చర్చ లేదు. సత్యవంతునికి లభించిన దంతయు నిజమునకు పరలోక వరములు ప్రోత్సహామునకై ముందే చూపబడును.

దైవభక్తుడు ప్రపంచమునకు చెందినవాడు కాడు, ఆకాశమునకు సంబంధించిన వాడు. కనుకనే ప్రపంచమతనితో కపట నాటకమాడును. అందువలన అతనికి ఆకాశపు వరములు లభించును. ప్రపంచమునకు సంబంధించిన వానికి ప్రపంచ వరములు కలుగును. ఆకాశపు వాడు ఆకాశపు వరముల కొరకు పాటుపడునని జ్ఞప్తియందుంచుకొనవలెను. ఆ వరములు ప్రపంచ చెవులతో, ప్రపంచ హృదయాలతో, కన్నులతో దాచి పెట్టబడినవి. కాని ప్రాపంచిక జీవితంపై మరణము వచ్చినవాడు, శారీరకముగా ముందు త్రాగు పానీయము, ఆధ్యాత్మికముగా త్రాగింపబడిన వానికి శారీరకముగా ఆ పానీయమే ఇచ్చినప్పుడు ఈ పానీయము జ్ఞప్తికి వచ్చును. కాని అతడు ఈ వరములను ప్రపంచ చెవులు, కన్నులు మొదలగునవి ఎరుగవని భావించును. ఎందుకనగా అతడు ప్రపంచము నందుండిన, ప్రపంచపు వాడు కాడు. కనుక ప్రపంచ వరములలోని వరము ఇది కాదని అతడు కూడ సాక్ష్యమిచ్చును. ప్రపంచము నందు అతని కన్నులు చూడని, చెవులు వినని, హృదయము అనుభవించని వరమిది. కాని పరలోకము నందు ప్రపంచము నందు లేని ఈ వరములను చూచెను. పరలోక వార్త ఇది. అతని సంబంధము బంధుత్వము ప్రపంచముతో నుండక దీనితో ముడిబడి వుండెను.

# పరలోకమును గురించిన మూడు ఖుర్ఆన్ నిర్వచనములు

మరణము తరువాతి దశలను పవిత్ర ఖుర్ఆన్ మూడు భాగాలుగా విభజించి ఈ విధముగా వివరించి నిర్వచించినది.

## మొదటి దశ పరిజ్ఞానము

మొదటి దశ లక్షణములను పవిత్ర ఖుర్ఆన్ మరణము తరువాతి జీవితము క్రొత్తది కాదని, దాని దృశ్యములన్నియు ఐహిక జీవితపు ప్రతిచ్ఛాయలని మరీ మరీ వివరించుచున్నది. దీనినే ఇట్లు చెప్పెను.

وَكُلَّ اِنْسَانٍ اَلْزَمْنٰهُ طٰٓئِرَهٗ فِىْ عُنُقِهٖ ؕ وَنُخْرِجُ لَهٗ

يَوْمَ الْقِيٰمَةِ كِتٰبًا يَّلْقٰىهُ مَنْشُوْرًا ○

(బనీ ఇస్రాయీల్ 17:14)

ప్రతి వాని కార్యముల ఫలితము ఈ ప్రపంచము నందే అతని మెడలో కట్టివున్నాము. రహస్యముగా నున్న ఫలితములను మేము న్యాయ నిర్ణయ దినమున బహిర్గతమొనరింతుము. అతని ముందు ఒక పట్టిక రూపములో వివరించి చూపుదుము. ఈ సూక్తి యందు పక్షి ఉపమానముగా తీసుకోబడినది. మంచి, చెడు ఏ కార్యమైనను చేయబడిన తరువాత పక్షి వలె గాలిలో ఎగిరిపోవును. దాని శ్రమగాని, ఆనందము గాని అతని హృదయము నందు మిగులును.

ప్రతి కార్యము గూఢముగా ప్రభావము చూపును. మానవుని ప్రతి కార్యమును బట్టి అల్లాహ్ ప్రతీకారముండును. ఆ కార్యము పాపమును గాని పుణ్యమును గాని వ్యర్థము కానివ్వదు. దాని ప్రభావము

అతని హృదయముపై, ముఖము పై, కన్నులపై, చెవులపై, చేతులపై, పాదములపై వ్రాయబడును. ఇదే గూఢముగా నున్న కార్యముల పట్టిక, ఇదే రెండవ జీవితము నందు బహిర్గతమగును.

మరో చోట స్వర్గములను గురించి పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు వివరించుచున్నది.

يَوْمَ تَرَى الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ يَسْعٰى نُوْرُهُمْ بَيْنَ اَيْدِيْهِمْ وَبِاَيْمَانِهِمْ

(అల్ హదీద్ 57:13)

ఆ రోజు కూడా విశ్వాసులు గూఢముగా కలిగివున్న విశ్వాస కాంతి స్పష్టముగా వారి ముందు. వారి కుడి చేతులపై పరుగిడునట్లు గోచరించును. మరో చోట అన్యాయ వర్తులను గురించి ఇట్లు సంబోధించెను.

اَلْهٰكُمُ التَّكَاثُرُ ۙ حَتّٰى زُرْتُمُ الْمَقَابِرَ ۗ كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ۙ ثُمَّ كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ۗ كَلَّا لَوْ تَعْلَمُوْنَ عِلْمَ الْيَقِيْنِ ۗ لَتَرَوُنَّ الْجَحِيْمَ ۙ ثُمَّ لَتَرَوُنَّهَا عَيْنَ الْيَقِيْنِ ۙ ثُمَّ لَتُسْـَٔلُنَّ يَوْمَئِذٍ عَنِ النَّعِيْمِ ۧ

(అత్తకాసుర్ 102:2-9)

మీరు సమాధులలో పడునంత వరకు ప్రపంచ కోరికలు మిమ్ము పరలోక అన్వేషణ నుండి ఆపెను. ప్రపంచమును ప్రేమించకుము. మీరు

తొందరలోనే ప్రపంచమును ప్రేమించుట మంచిది కాదని తెలిసికొందురు. ప్రపంచమును ప్రేమించుట మంచిది కాదని మీరు తొందరలోనే తెలిసికొందురని మరల నేను మీకు తెలుపుచున్నాను. మీకు నిర్దిష్టమైన జ్ఞానము కలిగినచో మీరు ఈ జీవితము నందే నరకమును చూతురు. మీ మధ్య దశలో నమ్మక దృష్టితో చూతురు. న్యాయ నిర్ణయ దినమున పట్టుబడినప్పుడు ఆ శిక్ష మిమ్ము పూర్తిగా కప్పుకొనును. అప్పుడు మీకు ఊహించడమే గాక జ్ఞానము కలుగును.

## తెలుసుకొను విధములు మూడు

దుర్మార్గులకు ఈ జీవితము నందే నరకపు జీవితము మరుగున వుండునని ఈ సూక్తులలో శక్తిమంతుడైన అల్లాహ్ స్పష్టముగా వివరించివున్నాడు. శ్రద్ధతో చూచినచో ఈ ప్రపంచము నందే తమ నరకమును చూతురు. ఇచ్చట తెలిసికొనుటను అల్లాహ్ మూడు విధములుగా విభజించివున్నాడు. అవి లక్షణముల ద్వారా నిజాన్ని తెలిసికొనుట, చూచి నిజాన్ని నమ్ముట. అనుభవము ద్వారా నిజాన్ని నమ్ముట. ఒకడు చాలా దూరములో పొగ చూచి అక్కడ తప్పక నిప్పు గలదని ఊహించును. దీనిని లక్షణముల ద్వారా నిజాన్ని తెలిసికొనుట అందురు. నిప్పు జ్వాలలను చూచినచో దీనిని చూచి తెలిసికొనుట అందురు. స్వయముగా ఆ నిప్పులో చేరినచో దానిని అనుభవించిన నమ్మకమందురు. లక్షణముల ద్వారా నరకము ఈ ప్రపంచము నందే తెలిసిపోవును. తరువాత కన్నులతో చూచినప్పుడు నమ్మకమేర్పడును. ఆ జ్ఞానమే న్యాయ నిర్ణయ దినమును అనుభవించి తెలిసికొను దశకు చేరును.

# లోకాలు మూడు

పవిత్ర ఖుర్ఆన్ ప్రకారము మూడు లోకాలు గలవని ఋజువైనది.

1. **మొదటిది:** ప్రపంచము, దీనినే సృష్టి, మొదటి పుట్టుక దశ అని అందురు. ఈ ప్రపంచము నందే మానవుడు, మంచి చెడు కార్యములొనరించును. పునరుత్థానములో సజ్జనుల కొరకు అభివృద్ధి గలదు. కాని అది కూడా శక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహము వలననే గాని మానవుని కృత్యముల వలన కాదు.

2. **రెండవది.** మధ్య దశ, దీనిని బర్జఖ్ అందురు. అరబ్బి పదము బర్‌జఖ్ అంటే రెండిటి మధ్య గలది. అనగా ఈ కాలము మొదటి పుట్టుక, పునరుత్థానముల మధ్య నుండును. కనుక దీనిని బర్జఖ్ అందురు. ప్రాచీన కాలము అనగా ప్రపంచము పుట్టినప్పటి నుండి దీనిని మధ్య దశగా పరిగణించిరి. కనుక ఈ పదము నందు మధ్య దశ ఉనికి తెలుపు ఒక గొప్ప సాక్ష్యము రహస్యముగా నున్నది. "మిననుఱ్ఱహ్మాన్" అను గ్రంథము నందు అరబ్బి పదాలు అల్లాహ్ నోటి నుండి వెళ్ళినవని ఋజువు చేసివున్నాము. ప్రపంచము నందు కేవలము ఇదొక భాష శక్తిమంతుడైన అల్లాహ్ భాష. ప్రాచీనములైన మొత్తము విద్యలకు కేంద్రము. మొత్తము భాషలకు తల్లి. అల్లాహ్ సువార్త వాణి మొదటి అంతిమ సింహాసనము. అరబ్బి భాష పూర్వము నుండి అల్లాహ్ మాటలు, ఆ మాటలే ప్రపంచము నందు అవతరించినవి. దాని నుండే ప్రపంచము తన భాషలను సృష్టించెను. కనుక అది అల్లాహ్ మొదటి సువార్తవాణి సింహాసన మనబడును. అల్లాహ్ పవిత్ర గ్రంథము పవిత్ర ఖుర్ఆన్ అరబ్బిలో అవతరించెను. కనుక ఇది అల్లాహ్ అంతిమ సింహాసనమనబడును.

బర్జఖ్ అరబ్బి పదము. ఇది జక్కా, బఙ్హా మిశ్రమము. అనగా కార్యముల ద్వారా సంపాదన ముగిసిపోయి మరుగున పడిపోవు పద్ధతి. బర్జఖ్ దశ మానవుడు మరణించి ఆత్మ, శరీర వేరగు దశ. శరీరమును ఒక గుంతలో పడవేయడమును మనము చూస్తూనే వున్నాము. ఆత్మ కూడా ఒక విధముగా గుంతలో పడిపోవును. ఇదే జక్కా అనబడును. ఎందుకనగా అది మంచి, చెడు కార్యములు శరీర సంబంధమున్నప్పుడు చేయగలదు. ఆత్మ స్వస్థత శరీర స్వస్థతపై ఆధారపడి వున్నదని స్పష్టముగా తెలుసు. మెదడులోని ముఖ్య భాగమునకు దెబ్బ తగిలినచో జ్ఞాపక శక్తి లోపించును. మరో భాగమునకు ఏదేని బాధ కలిగినప్పుడు ఆలోచనా శక్తి లోపించును. స్పృహ తప్పిపోవును. మెదడులో వాపు వచ్చిన, రక్తము ఆగి గాని ఆటంకము గాని కలిగినప్పుడు తిమరు, మూర్ఛ, నిస్పృహ కలుగును. అనగా మన ఆత్మకు శరీరముతో సంబంధము లేనప్పుడు పూర్తిగా పనికిరాదని మనకు మన పూర్వ అనుభవము నేర్పును. కనుక కేవలము మన ఆత్మ ఒక్కటే శరీరముతో సంబంధము లేనిదే సంతోషపడునని భావించుట సరియైనది కాదు. కథల రూపములో దీనిని మనము స్వీకరించుట వేరే విషయము గాని దీనికి నిదర్శనము లేదు. మెదడుకు అందని మేత ఇది. శరీరమునకు అతి చిన్న ఆటంకము కలిగినప్పుడు నిస్సహాయ స్థితిలో నుండు మన ఆత్మ శరీరము నుండి పూర్తి సంబంధమును తెంచినప్పుడు సంపూర్ణ స్థితి ఎట్లు కలిగి వుండగలదు. శరీర ఆరోగ్యమే ఆత్మ ఆరోగ్యమని ప్రతి రోజు మనము అనుభవించడము లేదా? మనలో నుండి ఒకడు వృద్ధుడైనప్పుడు అతని ఆత్మ కూడా ముదుసలిదగును. అతని జ్ఞానమంతయూ ముదుసలితనము హరించుకొనిపోవును. శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లనెను.

لِكَيْلَا يَعْلَمَ مِنْ بَعْدِ عِلْمٍ شَيْـًٔا ۚ

(అల్ హజ్ 22:6)

మానవుడు విద్యనభ్యసించి వృద్ధుడై, తిరిగి అజ్ఞానుడగును. కనుక శరీరము లేనిదే ఆత్మ వ్యర్థమని మనకు కలిగిన అనుభవము చాలు. ఆత్మ, శరీరము లేనిదే పని చేసి వుండినచో శక్తిమంతుడు అల్లాహ్ నాశనమగు శరీరముతో దానికి కలిగించిన సంబంధము వ్యర్థమయ్యేదను సత్యము వైపు ఈ ఆలోచన త్రిప్పును. మానవున్ని అల్లాహ్ హద్దులేని అభివృద్ధి పొందుటకు పుట్టించినాడనేది కూడా ఆలోచించదగిన విషయము. కనుక స్వల్ప కాల అభివృద్ధులను కూడా శరీర సహాయము లేనిది మానవుడు పొందనప్పుడు, శరీర సహవాసము లేనిదే అనన్య అభివృద్ధులు సంపాదించునని నమ్మడము సాధ్యమా?

కనుక ఇవన్ని నిదర్శనములు ఆత్మ కార్యములొనర్చుటకు ఇస్లాం దర్శనము ప్రకారము శరీర సాంగత్యము సదా అవసరము. మరణము తరువాత నశించు శరీరము నుండి ఆత్మ వేరగును. కాని మధ్య దశలో ప్రతి ఆత్మకు తమ కార్య ప్రతిఫల రుచి అనుభవించుటకు శరీరము లభించును. ఆ శరీరము వలె నుండక కార్యములను బట్టి కాంతివంతముగా లేదా అంధకారముగా నుండును. అనగా ఈ లోకములో మానవుని కార్యములు శరీరరూపము దాల్చును. కొన్ని శరీరములు కాంతివంతముగాను కొన్ని అంధకార రూపములో నుండునని, అవి కార్యముల కాంతి లేదా కార్యముల అంధకారముతో సిద్ధమగునని అల్లాహ్ తమ చర్చలో తెలిపివున్నాడు. ఇది దివ్యమైన రహస్యము కాని ప్రతికూలమైనది కాదు. సంపూర్ణ వ్యక్తి ఈ ప్రపంచము

నందే ప్రకాశించు శరీరమును పొందగలడు. స్వప్న దర్శన స్థితిలో దాని ఉదాహరణములనేకములు. మంద బుద్ధి గల వ్యక్తికి తలెయచేయుట కష్ట సాధ్యము. స్వప్న దర్శన స్థితి నుండి కొంతైనా భాగము లభించిన వారు కార్యముల ఫలితముగా సిద్ధమై శరీరమును ఆశ్చర్యముగా అసంభావ్యమైన దృష్టితో చూడక ఈ విషయములో ఆనందింతురు.

కార్యముల ఫలితముగా లభించిన శరీరము మధ్య దశలో పుణ్యపాప ఫలితమునకు కారణమగును. దీనిని నేను అనుభవించినాను. తరచుగా, మేలుకొనిన దశలో నేను మరణించిన వారితో మాటలాడినాను. కొందరు దుర్మార్గుల, మోసగాళ్ల శరీరములను పూర్తిగా నల్లని పొగతో తయారైన శరీరముల వలె చూచితిని. ఈ విషయాలలో నేను స్వంత అనుభవము గలవానిని మంచిగా ఎరుగుదును. అల్లాహ్ చెప్పినట్లు మరణించిన తరువాత ప్రతి వానికి ఈ విధమైన శరీరము తప్పక లభించును. అది కాంతి వంతమైనది గాని మబ్బుల వలె గాని వుండవచ్చును. మానవునిపై ఆధారపడి వుండును. అతి సూక్ష్మ విషయములను ఒకడు కేవలము తెలివితో సాధించడానికి ప్రయత్నించినచో అది అతని తప్పు. అదెట్లనగా ఒక వస్తువు రుచిని కన్ను తెలుపలేదు. నాలుక ఒక వస్తువును చూడలేదు. ఈ విధముగనే మరణించిన తరువాతి జీవిత విషయములు దివ్యదర్శన స్థితిలో పొందవచ్చును గాని కేవలము తెలివినుపయోగించి సాధించలేము. తెలియని విషయములను కనుగొనుటకు ఈ ప్రపంచము నందు శక్తివంతుడైన అల్లాహ్ వివిధ మార్గములను నిర్ణయించివున్నాడు. కనుక ప్రతి దానిని దాని సరియైన మార్గములో అన్వేషించినచో మీరు దానిని పొందగలరు.

దుర్మార్గులను, పాపగ్రస్తులను శవములుగా పరిగణించి సన్మార్గులను జీవించినవారిగా నిర్ణయించినది జ్ఞప్తియందుంచుకొనవలెను. అల్లాహ్‌ను నిర్లక్ష్యము చేసి మరణించువారు తినుట, త్రాగుట, ఇష్టానుసారముగా జీవించుట మొదలగు జీవిత కార్యములను అనుసరించిరి. అవి వారితో దూరమగును. వారికి ఆధ్యాత్మిక ఆహారములో నుండి పాలు లభించలేదు. కనుక వారు నిజముగా మరణించిరి. వారు కేవలము శిక్ష పొందుటకే జీవింతురను రహస్యమిందు గలదు. ఈ రహస్యమునే శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు చూపెను.

مَنْ يَّأْتِ رَبَّهٗ مُجْرِمًا فَاِنَّ لَهٗ جَهَنَّمَ ۗ لَا يَمُوْتُ فِيْهَا وَلَا يَحْيٰى ○

(తాహా 20:75)

అపరాధునిగా అల్లాహ్ వద్దకు వచ్చిన వాని నివాసము నరకము. అతడు దానిలో చావడు, బ్రతకడు. కాని అల్లాహ్ ప్రీతిని పొందినవారు శారీరకముగా మరణించినా చావరు. ఎందుకనగా వారి అన్న పానీయములు వారి వెంట వుండును. బర్జఖ్ తరువాత పునరుత్థాన స్థితి వుండును. ఈ కాలమందు మంచి, చెడు, నీతిగల అవిధేయతగల ప్రతి ఆత్మ స్పష్టమైన శరీరమును పొందును. ఈ దినము, అల్లాహ్‌ను ప్రత్యక్షముగా చూచుట కొరకు నిర్ణయించబడినది. ఆ దినము ప్రతి వాడు తమ ప్రభువును పూర్తిగా ఎరుగును. ప్రతి వాడు తమ ఉన్నత ప్రతి ఫలమును పొందును. అల్లాహ్‌కు ఇది సాధ్యమా అని సంశయపడనవసరము లేదు. ఎందుకనగా సర్వాధికారుడతడు. అనుకున్నది చేయును దీనినే ఇట్లు వివరించెను.

اَوَلَمۡ یَرَ الۡاِنۡسَانُ اَنَّا خَلَقۡنٰهُ مِنۡ نُّطۡفَةٍ فَاِذَا هُوَ خَصِیۡمٌ مُّبِیۡنٌ ○ وَضَرَبَ لَنَا مَثَلًا وَّنَسِیَ خَلۡقَهٗ ؕ قَالَ مَنۡ یُّحۡیِ الۡعِظَامَ وَهِیَ رَمِیۡمٌ ○ قُلۡ یُحۡیِیۡهَا الَّذِیۡۤ اَنۡشَاَهَاۤ اَوَّلَ مَرَّةٍ ؕ وَهُوَ بِكُلِّ خَلۡقٍ عَلِیۡمُ ○

(యాసీన్ 36:78–80)

اَوَ لَیۡسَ الَّذِیۡ خَلَقَ السَّمٰوٰتِ وَ الۡاَرۡضَ بِقٰدِرٍ عَلٰۤی اَنۡ یَّخۡلُقَ مِثۡلَهُمۡ ؕ بَلٰی ٭ وَهُوَ الۡخَلّٰقُ الۡعَلِیۡمُ ○ اِنَّمَاۤ اَمۡرُهٗۤ اِذَاۤ اَرَادَ شَیۡـًٔا اَنۡ یَّقُوۡلَ لَهٗ كُنۡ فَیَكُوۡنُ ○ فَسُبۡحٰنَ الَّذِیۡ بِیَدِهٖ مَلَكُوۡتُ كُلِّ شَیۡءٍ وَّاِلَیۡهِ تُرۡجَعُوۡنَ ○

(యాసీన్ 36:82–84

గర్భములో వేయబడిన ఒక నీటి బిందువుతో మేము పుట్టించినది మానవునికి తెలియదా? చూడలేదా? తరువాత అతడు జగడమాడువానిగా తయారయ్యెను. మా కొరకు నిందా వాక్యములు పలకడం ప్రారంభించెను. తమ పుట్టుకను విస్మరించి ఎముకలు కూడా చూర్ణమైనప్పుడు మానవుడు మరల బ్రతకడం సాధ్యమా? అతనిని బ్రతికించు శక్తి గలవాడెవడు? అని వాదించడము ప్రారంభించెను. ముందు పుట్టించినవాడే అతనిని బ్రతికించునని, బ్రతికించు ప్రతి పద్ధతి అతడెరుగునని వారితో నను ము. ఒక వస్తువును సృష్టించడానికి గోరినప్పుడు కేవలము “అగుము” అనిన

అది అగును. అతని గొప్పదనమిదే. ప్రతి దానిని పాలించువాడు, పవిత్రుడు. మీరందరు అతని వద్దకే తిరిగి వెళ్ళెదరు. శక్తిమంతుడైన అల్లాహ్ ఈ సూక్తులలో ఇట్లు వివరించెను. అల్లాహ్ దృష్టిలో ఏదియును శక్తికి మించినది లేదు. అధమమైన ఒక బిందువుతో మానవునిని పుట్టించిన వాడు రెండవ సారి పుట్టించుటకు అనర్హుడా?

ఇచట తెలియని వారు ఒక ప్రశ్న ఎత్తవచ్చును. అది, పునరుత్థానము దీర్ఘకాలము తరువాత వచ్చును. అప్పుడు ప్రతి సజ్జనునికి, దుర్మార్గునికి బర్జఖ్ దశ కారాగారము వలె నుండును. అయినచో మరి లాభమేమి? సమాధానమిది. ఇట్లు భావించుట కేవలము అపార్థము. అజ్ఞానము. పవిత్ర గ్రంథము నందు మంచి, చెడు, కొరకు రెండు దశలు గలవు. వాటిలో ఒకటి బర్జఖ్ దశ. దీనిలో ప్రతివాడు రహస్యముగా తమ ప్రతిఫలము పొందును. దుర్మార్గులు మరణించిన తరువాతే నరకము నందు ప్రవేశింతురు. సజ్జనులు మరణించిన తరువాతే స్వర్గము నందు విశ్రాంతి పొందుదురు. మరణించిన తక్షణమే ప్రతివాడు తమ కార్యములు ప్రతి ఫలము పొందునని పవిత్ర ఖుర్ఆన్ తరచుగా వక్కాణించుచున్నది. అల్లాహ్ ఒక స్వర్గవాసుని గురించి ఇట్లు విశదపరచెను.

قِيۡلَ ادۡخُلِ الۡجَنَّةَ ؕ

(యాసీన్ 36:27)

నీవు స్వర్గము నందు వెళ్ళుము. ఒక నరకవాసుని గురించి ఇట్లనెను.

فَرَاٰهُ فِىۡ سَوَآءِ الۡجَحِيۡمِ

(అస్సాఫ్ఫాత్ 37:56)

అనగా స్వర్గస్తుని మిత్రుడు ఒక నరకవాసి. వారిరువురు

మరణించినప్పుడు స్వర్గస్థుడు తమ మిత్రుడెక్కడనని చింతాక్రాంతుడై వుండెను. అప్పుడు అతనికి నీ మిత్రుడు నరకము మధ్యనున్నాడని చూపబడెను. ప్రతిఫల చర్య వెంటనే జరుగును. నరకవాసులు నరకములో, స్వర్గస్థులు స్వర్గములో పోవుదురు. కాని తరువాత ఒక గొప్ప కాంతివంతమైన దినము గలదు. ఆ దినమును అల్లాహ్ గొప్ప వివేకము ప్రత్యక్షము చేయదలచెను. ఎందుకనగా అతడు తమ శక్తులను తెలుపుటకు మానవున్ని పుట్టించెను. తరువాత అందరిని అంతమొందించి తమ గొప్పదనమును తెలుపును. తరువాత తన శక్తిని తెలుపుటకు ఒక దినము అందరిని బ్రతికించి ఒక మైదానలో చేర్చును.

## రెండవ దశ పరిజ్ఞానము

పరలోక విషయమును పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు విపులీకరించెను. ప్రపంచ జీవితము నందు ఆధ్యాత్మిక విషయములన్నియు మధ్య దశలో గాని, పునరుత్థాన దశలో గాని శారీరకముగా బహిర్గతమగును. ఈ విషయములో పవిత్ర ఖుర్ఆన్ వివరించిన ఒక సూక్తి.

وَمَنْ كَانَ فِيْ هٰذِهٖٓ اَعْمٰى فَهُوَ فِي الْاٰخِرَةِ اَعْمٰى وَاَضَلُّ سَبِيْلًا ۝

(బనీ ఇస్రాయీల్ 17:73)

ఈ ప్రపంచము నందు అంధుడుగా నున్నవాడు పరలోకము నందు కూడ అంధుడుగానే వుండును. అనగా ఈ ప్రపంచపు ఆధ్యాత్మిక అంధకారము పరలోకము నందు శారీరకముగా నుండును. మరో చోట ఇట్లు గలదు.

خُذُوْهُ فَغُلُّوْهُ ۙ ثُمَّ الْجَحِيْمَ صَلُّوْهُ ۙ ثُمَّ فِىْ سِلْسِلَةٍ ذَرْعُهَا سَبْعُوْنَ ذِرَاعًا فَاسْلُكُوْهُ

(అల్ హాఖ్ఖహ్ 69:31-33

ఈ నరకవాసిని పట్టుకొనుము. అతని మెడలో కడియం వేయుము. నరకము నందు కాల్చుము. డెబ్బది గజముల గొలుసుతో అతనిని బంధించుము. ప్రపంచపు ఆధ్యాత్మిక బాధ మరణించిన తరువాత శారీరకముగా మారునని ఈ సూక్తి స్పష్టముగా తెలుపుచున్నది. ప్రపంచ కోరికల కడియము మానవున్ని భూమి వైపు పంపి వుండెను. అది పరలోకములో శారీరకముగా ప్రత్యక్షమగును. ఈ విధముగనే ప్రపంచపు కోరికల గొలుసు పాదములను బంధించును. ప్రపంచపు కోరికల జ్వాలలు ప్రత్యక్షమగును. దుర్మార్గుడు ప్రపంచ జీవితములో కోరికల, ఆశల నరకమును తమలో పెంచుకొనును. విఫలమైనప్పుడు నరకపు జ్వాలలను కనుగొనును. కనుక నాశనమగు కోరికలతో దూరమైనప్పుడు సదా కొరకు నిరుత్సాహము ఆవరించును. అప్పుడు ఈ కోరికలను శారీరక జ్వాలల రూపములో శక్తిమంతుడైన అల్లాహ్ అతనిపై బహిర్గతమొనరించును. దీనినే అల్లాహ్ ఇట్లు నిర్వచించెను.

وَحِيْلَ بَيْنَهُمْ وَبَيْنَ مَا يَشْتَهُوْنَ

(సబా 34:55

వారికి వారు కోరు వాటి మధ్య ఆటంకమేర్పడును. ఇదే దుఃఖమునకు మూలమగును. డెబ్బది గజముల గొలుసుతో బంధించుమనగా ఒక దుర్మార్గుడు ఒక సమయములో డెబ్బది

సంవత్సరముల ఆయువు కలిగి వుండును. ఈ ప్రపంచము నందు తరచుగా బాల్యము, వృద్ధాప్యపు వయస్సును వేరు చేసినచో బుద్ధి గల కష్టపడు వయస్సు డెబ్బది సంవత్సరములు అతనికి లభించును కాని అతడు ఈ వయస్సును కేవలము ప్రపంచ వ్యసనములలో వినియోగించును. ఈ గొలుసు బంధములతో స్వతంత్రత గోరడు. కనుక ప్రపంచ వ్యసనములలో గడిపిన డెబ్బది సంవత్సరములు, మరణించిన తరువాత డెబ్బది గజముల గొలుసులుగా బంధించును. ప్రతి గజము ఒక సంవత్సరముతో సమానమగునని ఈ సూక్తిలో వివరింపబడినది. అల్లాహ్ తమ వైపు నుండి ఏ ప్రాణిని కష్ట నష్టాలకు గురి చేయదని, మానవుని దుష్టత్వములను అతని ముందు ప్రత్యక్షపరచునని జ్ఞప్తియందుంచు కొనవలెను. మరో చోట శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు ప్రకటించును.

اِنْطَلِقُوْٓا اِلٰى ظِلٍّ ذِىْ ثَلٰثِ شُعَبٍ ۝ لَّا ظَلِيْلٍ وَّلَا
يُغْنِىْ مِنَ اللَّهَبِ ۝

(అల్ ముర్సలాత్ 77:31,32)

ఓ పాపాత్ములారా! దుర్మార్గులారా! మూడు శాఖలు గల ఆశ్రయము వైపు నడువుము. అవి ఛాయలివ్వవు. వేడిమి నుండి రక్షించవు. మూడు శాఖలనగా ఇక్కడ మృగతుల్యమైన శక్తి, క్రూరత్వము, ఊహాగానాలు. ఈ మూడు శక్తులను నైతికముగా మలచని వారు, వాటిని మార్చని వారి ఈ శక్తులు పునరుత్థానము నాడు ఆకులు లేనివిగా నిలబడి వేడిమితో రక్షించవు. వారు ఎండకు మండుదురు. ఈ విధముగనే శక్తిమంతుడైన అల్లాహ్ స్వర్గస్తులను గురించి ఇట్లనును.

يَوْمَ تَرَى الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ يَسْعٰى نُوْرُهُمْ بَيْنَ اَيْدِيْهِمْ وَبِاَيْمَانِهِمْ

(అల్ హదీద్ 57:13)

ప్రపంచము నందు గూఢముగా నున్న కాంతి ఆ రోజు వారి ముందు, వారు కుడి వైపున పరుగెత్తునది నీవు చూడగలవు. మరో సూక్తి యందు ఇట్లనెను.

يَّوْمَ تَبْيَضُّ وُجُوْهٌ وَّتَسْوَدُّ وُجُوْهٌ

(ఆలె ఇమ్రాన్ 3:107)

ఆ రోజు కొన్ని ముఖములు నల్లగా, మరికొన్ని ప్రకాశించునవిగా వుండును. మరో చోట ఇట్లనెను.

مَثَلُ الْجَنَّةِ الَّتِىْ وُعِدَ الْمُتَّقُوْنَ ؕ فِيْهَآ اَنْهٰرٌ مِّنْ مَّآءٍ غَيْرِ اٰسِنٍ ۚ وَاَنْهٰرٌ مِّنْ لَّبَنٍ لَّمْ يَتَغَيَّرْ طَعْمُهٗ ۚ وَاَنْهٰرٌ مِّنْ خَمْرٍ لَّذَّةٍ لِّلشّٰرِبِيْنَ ۚ وَاَنْهٰرٌ مِّنْ عَسَلٍ مُّصَفًّى ؕ

(ముహమ్మద్ 47:16)

సజ్జనులకివ్వబడిన స్వర్గములు, మురిగిపోని కాలువలు ప్రవహించు తోటలను పోలి వుండును. అందులో రుచి మారని పాల కాలువలు ప్రవహించుచుండును. మత్తు కలిగించని సురాపానము ప్రవహించు కాలువలుండును. త్రాగు వారిని ఆనందింపచేయును. పరిశుద్ధమైన కలుషితము లేని తేనె కాలువలు ప్రవహించును.

మొత్తము వస్తువుల అనన్య కాలువలు స్వర్గము నందు గలవు. జీవితములో ఒక వ్యక్తి ఆధ్యాత్మికముగా త్రాగు నీరు కూడ కలదు. ఆధ్యాత్మిక పాలు త్రాగి పెరుగునట్టిది స్వర్గము నందు ప్రత్యక్షముగా అగుపించును. అల్లాహ్ ప్రీతి మధుపానము ప్రపంచము నందు త్రాగి ఆనందించువాడు. ఇప్పుడు స్వర్గము నందు అవి ప్రత్యక్షముగా కనుల ముందుండును. విశ్వాసముతో కూడిన, ప్రపంచము నందు ఆధ్యాత్మికముగా నోటిలో పోవు తేనె కాలువల వలె స్వర్గము నందు కనిపించును. ప్రతి స్వర్గస్థుడు తమ కాలువలు, తమ తోటలతో తమ ఆధ్యాత్మిక స్థితిని స్పష్టముగా చూపించును. ఆ రోజు అల్లాహ్ కూడ స్వర్గస్థుల కొరకు ముసుగుల నుండి బయటికి వచ్చును. అనగా ఆధ్యాత్మిక స్థితులు గూఢముగా నుండక శారీరకముగా ప్రత్యక్షమగును.

## మూడవ దశ పరిజ్ఞానము

మూడవ దశలో పరలోకములో అభివృద్ధులు అవిచ్ఛన్నములు. శక్తిమంతుడైన అల్లాహ్ దీనిలో ఇట్లనును.

وَالَّذِيْنَ اٰمَنُوْا مَعَهٗ ۚ نُوْرُهُمْ يَسْعٰى بَيْنَ اَيْدِيْهِمْ وَبِاَيْمَانِهِمْ يَقُوْلُوْنَ رَبَّنَآ اَتْمِمْ لَنَا نُوْرَنَا وَاغْفِرْ لَنَا ۚ اِنَّكَ عَلٰى كُلِّ شَىْءٍ قَدِيْرٌ

(అత్తహ్రీమ్ 66:9)

ప్రపంచములో విశ్వాస కాంతిని కలిగి వున్న వారి కాంతి, వారి ముందు, వారి కుడి వైపు పరుగెత్తుచుండును. వారు సదా ఓ ప్రభువు!

మా కాంతిని ఉచ్ఛ స్థితికి చేర్చుము. మమ్ములను నీ అనుగ్రహముతో కప్పివేయుము. నిస్సందేహముగా నీవు ప్రతి అధికారము గల వాడవు అని పలుకుచుందురు.

ఈ సూక్తిలో వారు సదా మా కాంతిని ఉచ్ఛ స్థితికి చేర్చుమనునది, హద్దులు లేని అభివృద్ధులు పొందుటకు తెలుపుచున్నది. అనగా వారు పై స్థాయికి చేరుకొందురు. దానికి పై స్థాయి వారు పొందినప్పుడు పూర్వపు దశను పనికిరానిదిగా చూతురు. కనుక రెండవ దశ పొందుటకు ప్రార్థింతురు. అది పొందినప్పుడు వారు ఒక మూడవ దశకు చేరుదురు. ఈ మూడవ దశకు చేరినప్పుడు వారు మిగిలిన దశలను లెక్క చేయక మూడవ దశను పొందుటకు ఇష్టపడుదురు. ఈ అభివృద్ధి కోరిక మూడవ స్థాయి చేరువరకు సాగుచునే వుండును. అభివృద్ధులు సాగుచునే వుండును. అపజయ ముఖము చూడరు. స్వర్గము నుండి వెళ్లగొట్టబడరు. వెనుకకు తిరుగరు. ముందుకు సాగుచునే వుందురు.

స్వర్గము నందు చేరినప్పుడు, పాపములన్నియు క్షమించబడిన తరువాత కూడ క్షమాభిక్షను యాచించుటకు కారణమేమి? అవసరమేమి? అను ప్రశ్న ఇక్కడ ఉద్భవించును. మఘ్ఫిరత్ (క్షమాభిక్ష యాచించుట) అనగా లోపము గల, అసంపూర్ణ స్థితిని అణచుట. కప్పుట. కనుక స్వర్గస్థులు సంపూర్ణత పొందుటకు కాంతిలో మునుగుటను కోరుదురు. వారు రెండవ దశను చూచి మొదటి దశను వ్యర్థమగునట్లు భావింతురు. అనగా మొదటి స్థితిని అణచి వేయబడుటను కోరుదురు. మూడవ దశను చూచినప్పుడు రెండవ దశను కప్పబడుటకు, అణచివేయబడుటకు కోరుదురు. ఈ విధముగా నిరంతరము అనన్య మఘ్ఫిరత్‌ను ఇష్టపడుదురు. మఘ్ఫిరత్, ఇస్తిఘ్ఫార్ అను పదము కొన్ని

సమయములలో పవిత్ర ప్రవక్త విమర్శకు కారణమైనది. ఈ ఇస్తిఘ్ఫార్ కోరికయే మానవుని గర్వ కారణమగునని మీరందరికి తెలిసివుండ వచ్చును. స్త్రీ గర్భము నుండి పుట్టిన వ్యక్తి ఇస్తాఘ్ఫార్‌ను దినచర్యగా ఆచరించినచో, అలవాటుగా చేసికొనినచో అతడు పురుగే కాని మానవుడు కాదు. అంధుడే గాని కన్నులున్నవాడు కాడు. అపవిత్రుడే కాని పవిత్రుడు కానేకాడు.

పవిత్ర ఖుర్‌ఆన్ ప్రకారము నరకము స్వర్గము వాస్తవమునకు మానవుని జీవిత కార్యముల ఫలితము. మరో చోట నుండి వచ్చు నవీన శారీరక వస్తువు కాదు. అవి రెండు శారీరక సంబంధములు గలవి. కాని వాస్తవముగా అవి ఆధ్యాత్మిక స్థితులు, కార్యముల రూపములు. స్వర్గమన గా పచ్చని వృక్షముల సమూహమని, నరకమనగా గంధక రాళ్ళని గాని మేము భావించము. మానవుని ప్రపంచ జీవిత కార్యముల ప్రతిబింబము నరకము, స్వర్గమని ఇస్లామ్ విశ్వాసము. ఇదే మా నమ్మకము.

# మూడవ ప్రశ్న

## ప్రపంచములో మానవుని జీవిత ఉద్దేశములేవి?

## వాటిని పొందుటెట్లు?

వివిధములైన మానవులు తమ అంతర్బుద్ధి లోపముతో గాని, ధృఢ సంకల్ప లోపము వలన గాని వివిధములైన ఉద్దేశములను తమ జీవితము కొరకు ఎన్నుకొందురు. ప్రపంచ కోరికలు, ఆశలు పొంది తృప్తిపడుదురు. కాని అల్లాహ్ తమ పవిత్ర ఖుర్ఆన్‌లో పొందుపరచిన ఉద్దేశములివి.

وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُوْنِ ۝

(అజ్జారియాత్ 51:57)

అనగా జిన్నాతులను, మానవులను నన్ను గుర్తించుటకు, నన్ను ఆరాధించుటకు, నేను పుట్టించితిని. కనుక మానవ జీవిత ముఖ్యోద్దేశము అల్లాహ్ ఆరాధన. అల్లాహ్‌ను గుర్తించుట, అల్లాహ్ కొరకు వినియోగించుట.

మానవుడు తమ జీవిత ఉద్దేశము తనకు తాను నిర్ణయించు స్థాయి కలిగివుండడని తెలిసిన విషయమే. ఎందుకనగా మానవుడు తమ ఇష్టముతో ప్రపంచమునకు రాడు. తమ ఇష్టముతో తిరిగిపోడు. పుట్టించబడినవాడు. అతనిని పుట్టించిన వాడే అతనికి చతుష్పాదములన్నిటి కంటే మంచి, ఉన్నతమైన అవయవములు నొసంగెను. అతడే అతని జీవితమునకు ఒక ఉద్దేశము నిర్ణయించెను. ఒకడు దీనిని గుర్తించినా

గుర్తించకపోయినా, నిస్సందేహముగా అల్లాహ్ ఆరాధన, అల్లాహ్‌ను గుర్తించుట. అల్లాహ్ కొరకు తమ జీవితము అర్పించుట మానవునిని పుట్టించు ముఖ్యోద్ధేశమై వున్నది. మరో చోట శక్తిమంతుడలైన అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో దీనినే ఈ విధముగా వెల్లడించెను.

إِنَّ الدِّيْنَ عِنْدَ اللّٰهِ الْإِسْلَامُ

(ఆలె ఇమ్రాన్ 3:20)

فِطْرَتَ اللّٰهِ الَّتِيْ فَطَرَ النَّاسَ عَلَيْهَا...... ذٰلِكَ الدِّيْنُ الْقَيِّمُ

(అర్రూమ్ 30:31)

అల్లాహ్‌ను గుర్తించు, అల్లాహ్‌ను ఆరాధించు, నిజ మార్గమును చూపు ధర్మమే ఇస్లామ్ ధర్మము. మానవుని హృదయము నందు ఇస్లాం ప్రకృతి సిద్ధంగా పెట్టబడెను. మానవునిని అల్లాహ్ స్వభావముతో ఇస్లాం కొరకు పుట్టించెను. అనగా మానవుడు తమ అణువణువుతో తమను ఆరాధించవలెనని, విధేయతలు, ప్రేమలు అతని కొరకే వినియోగించ వలెనని అల్లాహ్ కోరిక. కనుకనే శక్తిమంతుడైన అల్లాహ్ మానవున్ని ఇస్లాం అనుకూలమగు అవయవములతో సృష్టించెను.

ఈ సూక్తుల భావము చాలా పెద్దది. మొదటి ప్రశ్న మూడవ భాగములో కొంత వరకు తెలిపివున్నాము. కాని ఇచ్చట మానవునికి అంతర్గత, బాహ్య రూపములో ఇవ్వబడిన అవయవములు, శక్తుల ముఖ్యోద్ధేశము అల్లాహ్‌ను పొందుట, అల్లాహ్‌ను ఆరాధించుట అతని ప్రేమను చూరగొనుట. కనుకనే మానవుడు ప్రపంచములో లక్షన్నర ప్రణాళికలు పన్నినను వ్యసనములకు గురియైనను అల్లాహ్‌కు తప్ప మరెక్కడను వాస్తవ ఆనందమును పొందదు. అధిక ధనవంతుడైనను, గొప్ప పదవి పొందినను, గొప్ప వ్యాపారస్తుడైనను, చక్రవర్తి అయినను,

గొప్ప ఫిలాసఫర్‌గా కీర్తి పొందినను తుదకు ప్రాపంచిక చిక్కుల నుండి ఆశతో పోవును. సదా అతని హృదయము అతడు ప్రపంచములో మునిగి వున్నందుకు నిందించుచుండును. అతని మోసములను, అతని కపటములను, అవినీతి కార్యములను, అతని అంతరాత్మ సమ్మతించదు. ప్రతిది ఒక ఉన్నత స్థానమునకు చేరి, ఆగును. ఈ ఉన్నతమైన కార్యములే అతని పుట్టుక ఉద్దేశమని ఒక బుద్ధిమంతుడు భావించును. ఎట్లనగా ఒక ఎద్దు గొప్ప కార్యము దున్నుట, మోటగట్టుట, బరువును మోయుట మాత్రమే. దానికి తప్ప అది చేయునదేమియును లేదు. కనుక ఎద్దు పుట్టుకకు ఉద్ధేశము ఈ మూడు కార్యములే. దీనికి తప్ప దానిలో ఎట్టి శక్తి లేదు. కాని మానవునిలో ఉత్తమోత్తమ శక్తిని అన్వేషించినప్పుడు మనకు అతనిలో ఉన్నతుడైన, శక్తిమంతుడైన అల్లాహ్‌ను కనుగొను అభిలాష, ఉబలాట వున్నట్లు తెలియును. అల్లాహ్ ప్రేమలో మునిగి మొత్తము అల్లాహ్‌కు అంకితమగు కోరిక మానవునిలో వుండును. నిద్రించుట, తినుటలో కొన్ని జంతువుల నుండి ప్రేరణ పొందును. పరిశ్రామికముగా కొన్ని జంతువులు మానవుని కంటే ముందంజలో నున్నవి. తేనె టీగలు వివిధ పుష్పముల నుండి రసమును ప్రోగు చేసి స్వచ్ఛమైన తేనెను తయారు చేయును. మానవునికింత వరకు దీనిలో జయము కలుగ లేదు. కనుక మానవుని ఉత్తమ కోరిక, ముఖ్యోద్ధేశము అల్లాహ్‌ను కలిసికొనుట, అల్లాహ్‌ను పొందుటనని తెలియుచున్నది. కనుక మానవుని ముఖ్యోద్ధేశము అతని హృదయ కిటికీ అల్లాహ్‌ను పొందుటకు తెరువబడుట.

## మానవ జీవితమును పొందు మార్గములు

ఈ ఉద్ధేశము పూర్తిగగుటెట్లు? ఏ మార్గముల నుండి మానవుడు దీనిని పొందగలడు? అను ప్రశ్న పుట్టవచ్చును. ఈ ఉద్ధేశమును పొందు

ఆధారము, షరతు అల్లాహ్‌ను సరియైన పద్ధతిలో గుర్తించుట. సత్యమైన, శక్తిమంతుడైన అల్లాహ్‌ను విశ్వసించుట. ఈ ఉద్దేశమును పొందుటకు **మొదటి మెట్టు.** ఒకడు మొదటడుగులోనే పశు, పక్షి, మానవాదులను దేవునిగా భావించినచో అతని తరువాతి అడుగులు సన్మార్గములో నుండగలవని నమ్ముట సాధ్యమా? నిజమైన అల్లాహ్ అతనిని వెతుకువారికి సహాయపడును. కాని చచ్చిన దేవుడు చచ్చినవానికి ఎట్లు సహకరించును. ఈ విషయములో శక్తిమంతుడైన అల్లాహ్ మంచి ఉపమానముతో వివరించివున్నాడు.

لَهٗ دَعْوَةُ الْحَقِّ ؕ وَالَّذِيْنَ يَدْعُوْنَ مِنْ دُوْنِهٖ لَا يَسْتَجِيْبُوْنَ
لَهُمْ بِشَيْءٍ اِلَّا كَبَاسِطِ كَفَّيْهِ اِلَى الْمَآءِ لِيَبْلُغَ فَاهُ وَمَا هُوَ
بِبَالِغِهٖ ؕ وَمَا دُعَآءُ الْكٰفِرِيْنَ اِلَّا فِيْ ضَلٰلٍ ○

(అ(్రాద్ 13:15)

ప్రతి దానిని సృష్టించు శక్తి గల అల్లాహ్, ప్రార్ధనలకు అర్హుడు. అతడే నిజమైన అల్లాహ్, దేవుడు. అతనికి తప్ప ఇతరులను పిలుచు వారికి వారే సమాధానమివ్వలేరు. ఒకడు నీటి వైపు చేతులు చాపి నీరు నోటిలో రమ్మనిన అది వచ్చునా? వీరి స్థితి కూడ అట్టిదే. కనుక నిజమైన దేవున్ని గుర్తించనివారి ప్రార్ధనలన్నియు వ్యర్థమే అగును. శక్తిమంతుడైన అల్లాహ్ సంపూర్ణ సౌందర్యమును గుర్తించుట **రెండవ ఉద్దేశము.** సహజముగా హృదయం, అందము వైపు ఆకర్షింపబడును. దాని వలన ప్రేమ పుట్టును. కనుక అల్లాహ్ సౌందర్యము, అతని ఏకత్వము, అతని గొప్పదనము, అతని మహత్యము, పవిత్ర ఖుర్ఆన్ దీనినే ఇట్లు వివరించును.

قُلۡ هُوَ اللّٰهُ اَحَدٌ ۚ اَللّٰهُ الصَّمَدُ ۚ لَمۡ يَلِدۡ ۙ وَلَمۡ يُوۡلَدۡ ۙ وَلَمۡ يَكُنۡ لَّهٗ كُفُوًا اَحَدٌ

(అల్ ఇఖ్లాస్ 112:2-5)

అనగా అల్లాహ్ తమ ఉనికిలో, తమ గుణములలో, తమ మహిమలో ఒక్కడే. అతని భాగస్వామి లేరు. అందరు తమ అవసరాలకై అతనిపై ఆధారపడివుందురు. అణువణువు అతనితో జీవితమును పొందును. సర్వమునకు అతడే సృష్టికర్త. ప్రతిది ప్రసాదించువాడు. ఎవరిని ఆశించని వాడు. ఆధారపడని వాడు. అతడెవరికి కొడుకు గాని తండ్రి గాని కాడు. ఎందుకనగా అతనికి సమానులే లేరు. ఇటువంటి ఘనత, మహిమలు, గొప్ప దనము గల అల్లాహ్, హృదయములను ఆకర్షించునే గాని బలహీనుడు గాని, చచ్చినవాడు గాని, నిర్ధయుడు గాని, శక్తి లేని వాడు గాని కాగలడా? అని పవిత్ర ఖుర్ఆన్ తరచుగా చాటుచున్నది.

అల్లాహ్‌ను పొందు **మూడవ మార్గము** అల్లాహ్ మేలును గుర్తించుట, తెలిసికొనుట. ఇది రెండవ దశ, సోపానము. ప్రేమ పొందు ప్రేరణలు రెండు. ఒకటి సౌందర్యము. రెండవది ఉపకారము. మేలు అల్లాహ్ ఉపకార గుణమును ఫాతిహా అధ్యాయము ఇట్లు వివరించెను.

اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ۙ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ۙ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ

(అల్ ఫాతిహా 1:2-4)

అల్లాహ్ తమ దాసులను నాశనమగు దాని నుండి సృష్టించి, సదా వారిని అనుగ్రహించి, ఉపకారము చేయుచు ప్రతి దానికి అతడే మూల కారణమై గొప్ప ఉపకారములు తమ దాసులకు కలుగ చేసినప్పుడే

ఆ మేలు సంపూర్ణ మేలనబడును. అల్లాహ్ ఇట్టి మేలును తరచుగా ఇట్లు చాటెను. وَاِنۡ تَعُدُّوۡا نِعۡمَتَ اللّٰهِ لَا تُحۡصُوۡهَا ؕ (ఇబ్రాహీమ్ 14:35)

అనగా అల్లాహ్ వరములను గణింప గోరినచో ఎన్నడూ గణింపలేరు.

**నాలుగవ సోపానము:** నిజమైన ఉద్ధేశమును పొందుటకు శక్తిమంతుడైన అల్లాహ్ ప్రార్థనను నిర్ణయించెను.

اُدۡعُوۡنِىۡۤ اَسۡتَجِبۡ لَـكُمۡ ؕ

(అల్ మూమిన్ 40:61)

అనగా మీరు నన్ను పిలుచుము. నేను సమాధానమిత్తును. స్వీకరింతును. ఎందుకనగా మానవుడు తమ శక్తితో గాక అల్లాహ్ శక్తితో అల్లాహ్‌ను పొందుటకు తరచుగా ప్రార్థించుటకు ఆదేశించెను.

జీవిత ఉద్ధేశమును పొందుటకు శక్తిమంతుడైన అల్లాహ్ **ఐదవ సోపానము**గా అల్లాహ్‌ను పొందు గట్టి ప్రయత్నము నిర్ణయించెను. అనగా తమ ఆస్తిపాస్తులను అల్లాహ్ మార్గములో ఖర్చు చేసి, తమ శక్తులను అల్లాహ్ మార్గములో ఉపయోగించి అతనిని కొనుగొనవలెను. దీనినే అల్లాహ్ తెలిపెను.

جَاهِدُوۡا بِاَمۡوَالِكُمۡ وَاَنۡفُسِكُمۡ فِىۡ سَبِيۡلِ اللّٰهِ ؕ

(అత్తౌబహ్ 9:41)

وَمِمَّا رَزَقۡنٰهُمۡ يُنۡفِقُوۡنَ ۝ (అల్ బఖరహ్ 2:4)

وَالَّذِيۡنَ جَاهَدُوۡا فِيۡنَا لَنَهۡدِيَنَّهُمۡ سُبُلَنَا ؕ (అల్ అన్కబూత్ 29:70)

తమ సంపదలు, తమ ప్రాణాలు, తమ జీవిత ప్రతి శక్తిని అల్లాహ్ కొరకు వినియోగించి ప్రయత్నించుము. మేము మీకిచ్చిన వివేకము, జ్ఞానము, కళలను అల్లాహ్ కొరకు వినియోగించుము. మా మార్గము

నందు ప్రతి ప్రయత్నము చేయు వారికి మేము మా మార్గములను చూపింతుము.

**ఆరవ సోపానము** అల్లాహ్‌ను పొందుటకు స్థిరత్వమును చూపించెను. అనగా ఈ మార్గములో అలసిపోరాదని, అధైర్యపడరాదని, భయపడరాదని వివరించెను. శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లనెను.

اِنَّ الَّذِيْنَ قَالُوْا رَبُّنَا اللّٰهُ ثُمَّ اسْتَقَامُوْا تَتَنَزَّلُ عَلَيْهِمُ الْمَلٰٓئِكَةُ اَلَّا تَخَافُوْا وَلَا تَحْزَنُوْا وَاَبْشِرُوْا بِالْجَنَّةِ الَّتِيْ كُنْتُمْ تُوْعَدُوْنَ ○ نَحْنُ اَوْلِيٰٓؤُكُمْ فِي الْحَيٰوةِ الدُّنْيَا وَفِي الْاٰخِرَةِ

(హామీమ్ అస్సజ్దహ్ 41:31,32)

అల్లాహ్ మా ప్రభువు. అని అసత్య దేవుళ్ళను వదిలి, నికలడగా వుండి, అనగా వివిధ ఆపదలు, కష్టాలలో కూడా అల్లాహ్‌ను వదలనివారిపై దేవదూతలు అవతరించి ఇట్లందురు. మీరు భయపడకుము. దుఃఖించక సంతోషించుము. వాగ్దానము చేసిన ఆనందమునకు మీరు వారసులు. ఈ ప్రాపంచిక, పరలోక జీవితము నందు కూడ మేము మీకు స్నేహితులము. అనగా నిలకడగా వున్నచో అల్లాహ్‌ను పొందవచ్చునని ఇచట సూచించబడినది. నిలకడ మహిమలకు, శుభములకు మూల మనునది సత్యదూరము గాదు. అల్లాహ్ కొరకు ఆపదలలో, కష్టాలలో చిక్కుకొని ప్రాణాపాయమునకు, అవమానమునకు గురైనప్పుడు గాని, అల్లాహ్ పరీక్షించుటకు మీకెలాంటి సహాయమును చేయక స్వప్న దర్శనములు, ఇవ్వక అపాయకర ఆపదలలో విడిచినను మీరు నిలకడగా వుండి వెనుకాడక నమ్మకము, విశ్వాసము, నిష్ఠను సత్యమును వీడక

అవమానమును, మరణమును సంతోషముగా ఆహ్వానించి, సహాయమున కు ఇతరుల వైపు చూడక నిలకడగా వుండవలెను. ఈ పరీక్షా సమయములో అల్లాహ్‌తో శుభవార్తల కొరకు యాచించక, నిస్సహాయ, బలహీన దశలో ఋజు మార్గమవలంభించి తమను పూర్తిగా అల్లాహ్‌కు సమర్పించవలెను. పరీక్ష అంతమైనంత వరకు అల్లాహ్ కోరికను శిరసావహించి పరిత్యాగ మవలంభించినప్పుడే అల్లాహ్ దొరుకును. సందేశహరులు, ప్రకవ్తలు, సత్యవంతులు, ధర్మమునకై ప్రాణాలర్పించిన వారి ధూళి నుండి ఇంత వరకు పరిమళము వచ్చుచున్నది. ఈ ప్రార్థన యందు శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు తెలిపెను.

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۝ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ

(అల్ ఫాతిహా 1:6,7)

ఓ మా ప్రభువు! మమ్ము స్థిర మార్గము చూపుము. నీ బహుమతి, వరములు లభించు మార్గము, నీవు సంతోషపడు మార్గము చూపుము. మరో సూక్తిలో దీనిని ఇట్లు తెలిపెను.

رَبَّنَآ اَفْرِغْ عَلَيْنَا صَبْرًا وَّتَوَفَّنَا مُسْلِمِيْنَ

(అల్ అరాఫ్ 7:127)

ఓ అల్లాహ్! విపత్సమయము నందు సహనము వహించు తృప్తిని మా హృదయము నందు నింపుము. మా మరణము ఇస్లాంలో నున్నప్పుడు వచ్చునట్లు చేయుము. దుఃఖములందు, విపత్సమయములందు అల్లాహ్ తమ ప్రియులపై ఒక కాంతిని అవతరింపచేయునని జ్ఞప్తియందుంచు కొనవలెను. దాని ద్వారా వారు శక్తిని పొంది సహనముతో ఆపదల నెదుర్కొందురు. అతని మార్గములో వారి పాదములను బంధించిన సంకెళ్ళను భక్తి విశ్వాసముతో చుంభింతురు. అల్లాహ్‌కు అంకితమైన

వానిపై ఆపదలు పడి మరణమాసన్నమైనచో ఈ ఆపదల నుండి రక్షించుమని తమ ప్రభువుతో జడగమాడడు. ఈ సమయములో క్షేమమునకు ప్రార్థించి అల్లాహ్‌తో జగడమాడుట సంపూర్ణ విధేయతకు విరుద్ధము. నిజమైన విధేయుడు ఆపదల నివారణ తరువాత ముందుకు సాగును. ప్రాణమును లెక్క చేయక దాని ప్రేమను వీడి తమ ప్రభువు ప్రేమలో మునిగి పూర్తిగా అతనికి విధేయుడగును. అతని ఇష్టమునే తమ కోరికగా భావించును. దీనినే అల్లాహ్ ఇట్లు తెలుపును.

وَمِنَ النَّاسِ مَنْ يَّشْرِىْ نَفْسَهُ ابْتِغَآءَ مَرْضَاتِ اللّٰهِ ؕ وَاللّٰهُ رَءُوْفٌۢ بِالْعِبَادِ ○

(అల్ బఖరహ్ 2:208)

అనగా అల్లాహ్ ప్రియ దాసుడు తమ ప్రాణమును అల్లాహ్ మార్గములో వినియోగించి అల్లాహ్ ప్రీతిని కోరును వారే అల్లాహ్ ప్రత్యేక అనుగ్రహమునకు వారసులు. ఇదే సహనమునకు ప్రాణము. దీని ద్వారా అల్లాహ్‌ను పొందవచ్చును. తెలిసికొనువాడు తెలిసికొనును.

జీవిత ఉద్దేశమును పొందు **ఏడవ ఆధారము**, సన్మార్గుల సహవాసము నవలంభించి వారి అనుభవములను చూచుట. సహజము గా మానవుడు సంపూర్ణ దృష్టాంతమును వాంఛించును. కనుక ప్రవక్తల రాక కూడ దీనికి ఎంతో అవసరము. సంపూర్ణ దృష్టాంతము ఉత్సాహము ను పెంచును. స్థైర్యములో వృద్ధి చేయును. దృష్టాంతముననుసరించనివాడు సోమరి తనమునకు గురై దారి తప్పిపోవును. దీని వైపే అల్లాహ్ ఈ సూక్తిలో సూచించుచున్నాడు.

كُوْنُوْا مَعَ الصّٰدِقِيْنَ

(అత్తౌబహ్ 9:119)

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ

(అల్ ఫాతిహా 1:7)

సన్మార్గుల దారిని మీరవలంభించుము. మీకు ముందు కనికరించ బడిన వారి మార్గములనవలంభించుము.

జీవిత లక్ష్యమును పొందు **ఎనిమిదవ ఆధారము**. పవిత్ర నిజ స్వప్నములు, పవిత్ర స్వప్నావస్థలు, పవిత్ర సువార్తలు. అల్లాహ్ మార్గము కష్టములతో కూడినది. కఠినమైనది. ఆ మార్గము నందు దుఃఖములు, కష్టములనేకములు. మానవుడు దీనిలో మార్గము విస్మరించుట, నిరుత్సాహపడుట, ముందుకు సాగక ఆగుట సాధ్యము. కనుక అల్లాహ్ కనికరము ఈ మార్గము నందు ప్రోత్సాహము, సడలింపులొసంగుట గోరెను. స్థైర్యము, ఉత్సాహము, పట్టుదల నొసంగుటకు పూనుకొనెను. కనుక ఈ మార్గపు ప్రయాణికులకు అప్పుడప్పుడు తమ మాటలతో తృప్తిపరచి నేను మీతోనున్నానని తెలుపును. ఇది అతని పద్ధతి. అప్పుడు వారు శక్తిని పొంది ఈ ప్రయాణమును సాగింతురు. దీనిని గురించి అతడిట్లనెను.

لَهُمُ الْبُشْرٰى فِى الْحَيٰوةِ الدُّنْيَا وَفِى الْاٰخِرَةِ

(యూనుస్ 10:65)

అనగా వారికి ఈ ఐహిక జీవితములో, పరలోకములో కూడ అల్లాహ్ వైపు నుండి శుభముల బహుమానములు గలవు. ఇటువంటి అనేక ఆధారాలను పవిత్ర ఖుర్ఆన్ వివరించెను. వ్యాసము పొడుగగునని వాటినిక్కడ వివరించనందులకు విచారించుచున్నాము.

# నాల్గవ ప్రశ్న

## కర్మల ప్రభావము ఇహపరలోక జీవితములపై ఎట్లు పడును?

వాస్తవ సంపూర్ణ దైవ శాసనము మానవుని హృదయముపై ఇట్లు ప్రభావితమగును. ముందు అతనిలో గల మొరటుతనమును దూరము చేసి మానవునిగా చేయును. మానవునికి సభ్యత గల అనగా మానవత్వమును నేర్పును. తుదకు అతనిని అల్లాహ్ దాసునిగా తీర్చి దిద్దునని మేము ముందే వివరించివున్నాము. దైవ శాసనమును అలవర్చుకొనిన తరువాత మానవుడు ఇతర అధికారాలను క్రమేపి గుర్తించును. న్యాయము, త్యాగము, మేలును వాటి వాటి సమయము లందు వాడును. జ్ఞానము, వివేకము, సంపత్తి, సౌలభ్యములు మొదలగు అల్లాహ్ నొసంగిన వరములలో ఇతరులను భాగస్వాములుగా చేయును. మొత్తము ప్రాణులపై సూర్యుని వలె తమ ప్రకాశమును వెదజల్లును. చంద్రుని వలే దైవముతో కాంతిని పొంది దానిని ఇతరులకు అందజేయును. పగలు ప్రకాశించినట్లు ప్రకాశించి మంచి, మేలు మార్గములను చూపించును. రాత్రి వలె ప్రతివాని బలహీనతలను కప్పిపుచ్చును. అలసి వేసారిన వారికి విశ్రాంతి కల్పించును. అతడు ఆకాశము వలె ప్రతి వానికి తమ ఛాయలో స్థానమిచ్చును. సమయముపై తమ అనుగ్రహ వర్షమును కురిపించును. భూమి వలె వినయ విధేయతలతో ప్రతి వాని అవసర ప్రకారము సౌకర్యాలు కల్పించి వివిధములైన ఆధ్యాత్మిక ఫలములు వారికి సమకూర్చును. అనగా సంపూర్ణ

దైవ శాసనమును అలవర్చుకొనినవాడు అల్లాహ్ అధికారములను, ప్రాణుల అధికారములను సంపూర్ణముగా నెరవేర్చును. అల్లాహ్‌తో కలిసి పోవును. ప్రాణుల సత్యసేవకుడుగా మారును. ఇదే సంపూర్ణ దైవ శాసనముల ప్రభావము.

కార్యముల ప్రభావము కాని జీవితము తరువాత పడు ప్రభావము అల్లాహ్‌తో గల ఆధ్యాత్మిక సంబంధముతో, అల్లాహ్ ప్రీతితో చేసిన మానవ సేవ ఆ రోజు స్పష్టముగా అతనికి కాన వచ్చును. ఈ కార్యము విశ్వాసము సత్కార్యముల కోరికల ఫలితము. అది స్వర్గముల వృక్షములు, కాలువల వలె కనబడును. ఈ విషయమును శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు పలికెను.

وَالشَّمۡسِ وَضُحٰهَا ○ وَالۡقَمَرِ اِذَا تَلٰهَا ○ وَالنَّهَارِ اِذَا
جَلّٰهَا ○ وَ الَّيۡلِ اِذَا يَغۡشٰهَا ○ وَالسَّمَآءِ وَ مَا بَنٰهَا ○
وَالۡاَرۡضِ وَمَا طَحٰهَا ○ وَنَفۡسٍ وَّمَا سَوّٰىهَا ○ فَاَلۡهَمَهَا
فُجُوۡرَهَا وَتَقۡوٰىهَا ○ قَدۡ اَفۡلَحَ مَنۡ زَكّٰىهَا ○ وَقَدۡ خَابَ
مَنۡ دَسّٰىهَا ○ كَذَّبَتۡ ثَمُوۡدُ بِطَغۡوٰىهَآ ○ اِذِ انۡۢبَعَثَ
اَشۡقٰىهَا ○ فَقَالَ لَهُمۡ رَسُوۡلُ اللّٰهِ نَاقَةَ اللّٰهِ وَ سُقۡيٰهَا ○
فَكَذَّبُوۡهُ فَعَقَرُوۡهَا ۙ فَدَمۡدَمَ عَلَيۡهِمۡ رَبُّهُمۡ بِذَنۢۡبِهِمۡ
فَسَوّٰىهَا ○ وَلَا يَخَافُ عُقۡبٰهَا ○

(అశ్శమ్స్ 91:2-16)

అనగా సూర్యుని, దాని ప్రకాశపు సాక్ష్యము. సూర్యుననుసరించి దానితో గైకొనిన ప్రకాశించు సూర్యునిగా మారి ఇతరులకు కాంతినిచ్చు చంద్రుని సాక్ష్యము. సూర్యుని ప్రకాశము స్పష్టముగా పడి దారులన్ని కానవచ్చు పగటి సాక్ష్యము. అంధకార తెరలు కమ్మి మొత్తాన్ని దాచుకొను రాత్రి సాక్ష్యము. ఆకాశము దాని పుట్టుకకు గల కారణాల సాక్ష్యము. భూమి దాని అవతరణ, బలపరుపుగా మారిన కారణపు సాక్ష్యము. మానవ ఆత్మ వీటన్నిటిని సమానము చేసిన దీని మహిమ సాక్ష్యము, అనగా వీటిలో గల వివిధ గుణములను సంపూర్ణ మానవ ఆత్మ తనలో క్రోఢీకరించు కొనును. అప్పుడు ఇవన్నియు వేర్వేరు పద్ధతులలో మానవుని సేవలో నిమగ్నమై వుండునట్లుండి సంపూర్ణ మానవుడు ఈ సేవలన్నిటిని ఒంటరిగా నెరవేర్చును. అతడిట్లనెను. ఈ విధముగా తమ ఆత్మను పావనము చేయువాడు ముక్తి పొందినవాడు. మరణమును తప్పించుకొనిన వాడు. అనగా భూమి, సూర్య చంద్రాదుల వలె అల్లాహ్ భక్తిలో మునిగి అల్లాహ్ ప్రాణులకు సేవకుడగును.

జీవితమనగా శాశ్వత జీవితమని జ్ఞప్తియందుంచుకొనవలెను. ఇది సంపూర్ణ మానవునికి లభించును. ధర్మ శాసనములు కార్య సిద్ధియే పరలోక శాశ్వత జీవితమునకు నాంది అని తెలియజేయబడుచున్నది. ఇది అల్లాహ్ దర్శనముతో సదా వుండును. తమ ఆత్మను చెఱపినవాడు, ఒసంగబడిన యోగ్యతలనుపయోగించక, పనికిరాని, అపవిత్ర జీవితము గడిపి తిరిగిపోయినవాడు నిరుత్సాహపడి నాశనమగునని కూడ తెలుపబడెను. అతని జీవిత స్థితి సమూద్ జాతి పరిస్థితిని పోలి వుండునని ఉదాహరణగా తెలిపెను. వారు అల్లాహ్ ఆడ ఒంటె అనబడు దానిని గాయపరచిరి. దానిని తమ చెలిమ నుండి నీరు త్రాగనివ్వలేదు. వాస్తవానికి

అతడు అల్లాహ్ ఆడ ఒంటెను గాయపరచెను. దానిని దాని చెలిమ నుండి త్రాగనివ్వలేదు. అనగా మానవుని ఆత్మ అల్లాహ్ ఒంటెనని, దానిపై అతడు స్వారి చేయునని అర్థము. ఆ ఒంటె నీరు, అల్లాహ్ ప్రీతి, వివేకము. దాని నుండే అది జీవించును. ఆడ ఒంటెను సమూద్ గాయపరచి, దానిని దాని నీటితో ఆపినప్పుడు, వారిపై అల్లాహ్ శిక్షపడెను. వారి మరణానంతరము వారి పిల్లల, విధవల గురించి అల్లాహ్ అసుమంత గూడ చింతించలేదు. కనుక ఆ ఆడ ఒంటెను అనగా ఆత్మను గాయపరిచిన వాడు, దానిని ఉచ్ఛ స్థితి వరకు చేరనివ్వని వాడు నాశనమగును.

## పవిత్ర ఖుర్‌ఆన్‌లో గల వివిధములైన ప్రమాణముల దార్శనికత

అల్లాహ్, సూర్య చంద్రాదుల ప్రమాణము చేయుటలో ఒక ప్రగాఢ వివేకము గలదని జ్ఞప్తియందుంచుకొనవలెను. దీనిపై మా విరుద్ధులు తెలియక అల్లాహ్ తాను సృష్టించిన వాటి ప్రమాణములు చేయు అవసరమేమని విమర్శింతురు. వారి జ్ఞానము భూమ్యాకాశములకు సంబంధించినది కాదు గనక వారు సత్యాన్ని గ్రహించలేరు. ప్రమాణము చేయువాడు తమ విషయములో ఒక సాక్షిని ప్రవేశపెట్టగోరి ప్రమాణము చేయును.

అల్లాహ్ ప్రతి దాగివున్న దానినెరుగును. ప్రతి విషయమునకు మొదటి సాక్షి అతడే. కనుక ఎవని విషయము నందు సాక్షి వుండడో అతడు అల్లాహ్‌ను సాక్షి చేసి అతని ప్రమాణము చేయును. అల్లాహ్‌ను సాక్షిగా చేసి అతని ప్రమాణము చేసి తరువాత, అల్లాహ్ అతని ప్రమాణము

ఫలితముగా శిక్ష విధించనిచో ప్రమాణము చేసిన విషయము సత్యమేనని అల్లాహ్ రూఢి చేసినాడని అర్థము. ప్రాణి తప్పుడు ప్రమాణమునకు శిక్షించే శక్తి లేనివాడు. దాగిన విషయములను ఎరుగడు. కనుక ఎవరు కూడ ప్రాణి మీద ప్రమాణము చేయరాదు. కాని అల్లాహ్ ప్రమాణము ప్రాణుల మీద ప్రమాణముతో సమానము కాదని ఈ సూక్తులలో వివరింపబడినది. అల్లాహ్ అలవాటు ప్రకారము అతని కార్యములు రెండు విధములు. మొదటివి. అందరికి స్పష్టముగా తెలిపినవి. వాదమునకు తావివ్వనివి. మానవులు అనుమానితులై వివాదమునకు తావిచ్చు కార్యములు రెండవ విధము. కనుక స్పష్టముగా వివాదమునకు ఆస్కారము లేని కార్యముల సాక్ష్యముతో, అనుమానాస్పద, వివాదమును సృష్టించు కార్యములను నిరూపించుటకు అల్లాహ్ ఇష్టపడెను.

సూర్య, చంద్రులలో, భూమ్యాకాశములలో, దివారాత్రులలో, మేము వివరించిన గుణములు వాస్తవముగా వుండునని తెలిసినది. స్పష్టమైనది. కాని మానవ ఆత్మలో గల గుణములను ప్రతివాడెరుగడు. కనుక అల్లాహ్ తమ స్పష్టమైన కార్యముల సాక్ష్యముతో అనుమానస్పద కార్యములను విశదపరచెను. అనగా మానవ ఆత్మలో పెట్టబడిన గుణములు అనుమానాస్పదములని మీరు సందేహించినచో ఆలోచించి చూచినచో సూర్య చంద్రాదుల ధర్మములలో అవి స్పష్టముగా మీకు గోచరించునని, అతడు తెలిపెను. మానవుని యందు ఒక ప్రపంచము దాగివున్నదని మీకు తెలుసు. మానవునిలో ఒక ప్రపంచము ఇమిడి యున్నదని మీకు తెలుసు. అతనిలో ప్రపంచపు ప్రతి జ్ఞానము గలదు. అనగా ప్రపంచమునందలి పెద్ద పెద్ద ప్రాణులు ఈ గుణములు కలిగి యుండి, ఇతరులకు శుభములు కలిగించుచున్నవని రూఢి అయ్యేను.

వీటన్నిటిలో మానవుడు గొప్పవాడు, పైస్థాయినందుకొనిన వాడు. ఈ గుణములనెట్లు కలిగియుండడు ? ఉండలేదు. ఇతనిలో కూడ సూర్యుని వలె ఒక జ్ఞాన కాంతి గలదు. దాని ద్వారా ప్రపంచము నంతయు ప్రకాశింపజేయగలడు. చంద్రుని వలె దైవము నుండి సువార్త వాణి, కాంతిని పొందును. అభివృద్ధి స్థాయికి అందని ఇతరులకు ఆ కాంతిని అందించును. ప్రవక్తృత్వము అసత్యమని ఎట్లనగలరు. మొత్తము ప్రవక్తృత్వములు, దైవ శాసనములు, గ్రంథములు మానవుని మోసపు, స్వార్థ కార్యములని మీరెట్లూహించగలరు. పగటిపూట మొత్తము మార్గములు సూర్యుని కాంతితో ప్రకాశించును. మెట్టలు గుంతలు మంచిగా కనబడును. అనగా సంపూర్ణ మానవుడు ఆధ్యాత్మిక కాంతి పొందిన పగలును పోలి వుండును. అతని అభివృద్ధితో ప్రతి మార్గము సుగమ మగును. సన్మార్గ పద్ధతులను బోధించును. సత్య, సన్మార్గమునకు అతడే ప్రతీక కనుక అట్లు చేయును. ఆ విధముగనే రాత్రి అలసి వేసారిన ప్రాణులకు ఆశ్రయమిచ్చి వారికి విశ్రాంతి కలిగించును. దినమంత కష్టపడిన కూలీలు రాత్రి పూట హాయిగా నిద్రింతురు, విశ్రాంతి పొందుదురు. ప్రతి వారి రహస్యాలను దాచుకొనునది కూడా రాత్రే. అటులనే అల్లాహ్ సంపూర్ణ దాసులు ప్రపంచానికి విశ్రాంతి కలిగించుటకు వత్తురు. అల్లాహ్ సువార్త వాణులతో శుభవార్తలతో తెలివిమంతులకు తెలియచెప్పి సన్మార్గమును చూపుదురు. వారికి శాంతి, విశ్రాంతిని కలుగజేయుదురు. వారి మూలాన గొప్ప గొప్ప రహస్యాలు, సమస్యలు సులభముగా పరిష్కరింపబడును. రాత్రి దాచుకొనినట్లు సువార్త వాణి మానవుని తెలివిని కప్పిపుచ్చును. అతని అపవిత్ర కార్యములను, తప్పిదములను ప్రపంచమునకు తెలియనివ్వదు. కారణమేమనగా

తెలివిగల వాడు సువార్త వాణి కాంతితో తమను సంస్కరించుకొనును. అల్లాహ్ పవిత్ర సువార్త వాణి అనుగ్రహముతో వారు తమను రక్షించు కొందురు. ప్లాటో వలె ఏ ముస్లిం తత్వవేత్త ఏ విగ్రహమునకు కోడిపుంజును బలివ్వలేని కారణమిదే. ప్లాటో సువార్త వాణి కాంతి పొందనందు వలన మోసపడెను. అంతపెద్ద తత్వవేత్త అయినను ఈ అవివేకపు ఏవగింపు కార్యమునకు వడిగట్టెను. కాని ఇస్లాం తత్వవేత్తలను ఇట్టి అపవిత్ర, పనికిరాని కార్యముల నుండి హజ్రత్ ముహమ్మద్ సల్లలాహు అలైహి వసల్లం రక్షించిరి. సువార్త వాణి తెలివి గలవారిని రాత్రి వలె కప్పుకొనునని దీనితో ఋజువగును.

అల్లాహ్ సంపూర్ణ దాసులు ఆకాశము వలె ప్రతివారిని తమ ఛాయలలో ఎట్లు దాచుకొనునది మీకు తెలియును. ప్రత్యేకముగా అల్లాహ్ ప్రవక్తలు, అతని సువార్తవాణి నందుకొనినవారు ఆకాశము వలె శుభముల వర్షమును కురిపింతురు. ఈ విధముగనే భూ గుణములు కూడ కలిగివుందురు. వారి పవిత్ర ఆత్మ నుండి వివిధములైన ఉత్తమ జ్ఞాన వృక్షములుద్భవించును. వాటి ఛాయల నుండి, పువ్వుల, ఫలముల నుండి ఎంతో మంది లాభము పొందుదురు. కనుక మనకు కానవచ్చు ఈ స్పష్టమైన సృష్టి చట్టము, ఆ దాగివున్న చట్టమునకు ఇదొక సాక్షి. దాని సాక్ష్యమునే అల్లాహ్ ప్రమాణాల రూపము నందు ఈ సూక్తులలో చూపి వున్నాడు. ప్రవిత్ర ఖుర్ఆన్ నందు గల సందేశమెంత వివేకముతో కూడినదో చూడుము. ఒక చదువురాని, అరణ్యములో నివసించు వాని నోటి నుండి వెళ్ళిన సందేశమిది. ఈ మాటలు అల్లాహ్‌వి కానిచో సాధారణ తెలివి మంతులు, విద్యామంతులు, విద్యావంతులనబడువారు దీనిని ఎదురించలేక ఖండించువారు కారు. ఒక విషయమును తనకున్న అతి

తక్కువ తెలివితో తెలిసికోలేనప్పుడు మానవుడు ఆ వివేకముతో కూడిన విషయమును త్రోసిపుచ్చును. ఆ వివేకపు విషయము సాధారణ తెలివికందక దీనిని తిరస్కరించుటయే అది ఉత్తమమైనదని ఋజువు చేయును. కనుకనే జ్ఞానులనబడువారు తెలివిమంతులైనను తిరస్కరింతురు. ఇప్పుడు స్పష్టమైన తరువాత జ్ఞాని ఎవరును కూడ తిరస్కరించక దానితో సంతోషించును. ఆనందించును.

సువార్తవాణి, దృగ్విషయమును ఋజువు చేయుటకు సృష్టి శాసనము నుండి సాక్ష్యమును పవిత్ర ఖుర్ఆన్ మరో చోట ఇట్లు చూపెను.

وَالسَّمَآءِ ذَاتِ الرَّجْعِ ۝ وَالْاَرْضِ ذَاتِ الصَّدْعِ ۝
اِنَّهٗ لَقَوْلٌ فَصْلٌ ۝ وَّمَا هُوَ بِالْهَزْلِ ۝

(అత్తారిఖ్ 86:12-15)

అనగా వర్షము వచ్చు ఆకాశపు సాక్ష్యము, వర్షాధారముతో వివిధములైన వృక్షములను మొలకెత్తించు భూమి సాక్ష్యము. ఈ పవిత్ర ఖుర్ఆన్ అల్లాహ్ మాటలు, అతని సువార్త వాణి, సత్యాసత్యాలను వేరు చేయు శక్తి గలది. వ్యర్థ మాటలు పలుకదు. అనగా సమయము కాని సమయము నందు అవతరించలేదు. కాలాను రూపమైన వర్షము, ఋజువు కురిపించు వర్షము వలె వచ్చెను.

పవిత్ర ఖుర్ఆన్, తమ వాక్యాలను నిరూపించుటకు అల్లాహ్ స్పష్టమైన సృష్టి శాసనమును సాక్ష్యముగా ప్రవేశపెట్టుచున్నాడు. అనగా సదా అవసరమున్నప్పుడు ఆకాశము నుండి వర్షము కురియుట సృష్టి శాసనము. భూమి పచ్చదనమంతయూ ఆకాశపు వర్షముపైనే ఆధారపడి

వున్నది. ఆకాశము నుండి వర్షము కురియనిచో భూమి యందున్న బావులన్నియు ఎండిపోవును. కనుక భూమిపై నున్న నీటి సంబంధము కూడ ఆకాశముతో గలదు. కనుక ఆకాశము నుండి వర్షము పడినప్పుడే భూమిపై నున్న బావుల నీటి మట్టము పెరుగును. ఎందుకు పెరుగును? ఆకాశపు నీరు భూమి నీటిని పైకి గుంజుటయే దీనికి కారణము. అల్లాహ్ సువార్తవాణికి తెలివికి గల సంబంధము అట్టిది. అల్లాహ్ సువార్త వాణి ఆకాశపు నీరైతే తెలివి భూమి నీరు. సదా ఈ నీరు సువార్త వాణి అనబడు ఆకాశపు నీటితో తర్ఫీదు పొందును. ఆకాశపు నీరు అనగా సువార్త వాణి, రానిచో భూమి నీరు అనగా తెలివి కూడ రాను రాను ఆరిపోవును. దీర్ఘ కాలము వరకు సువార్త వాణి పొందిన వాడు భూమిపై అవతరించని చో జ్ఞానవంతుల తెలివి చెడిపోవును. దీని నర్థము చేసికొనుటకు మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రాకకు పూర్వపు కాల పరిస్థితులను నెమరు వేయుట మంచిది. మొత్తము ప్రపంచము సర్వవ్యసనములతో నిండి చెడిపోయివుండెను. ఏసు తరువాత ఆరు శతాబ్దాలు గడిచినను అల్లాహ్ సువార్త వాణిని పొందినవారెవరు అవతరించనందువలన ప్రపంచ స్థితి అట్లు మారివుండెను. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతారమెత్తక ముందు ప్రపంచమంతయు దుష్టత్వముతో నిండి వుండెనని ప్రతి దేశ చరిత్ర చాటుచున్నది. దీనికి కారణమేమి? కారణమొక్కటే. అదే దీర్ఘకాలము వరకు సువార్త వాణి ఎవరిని వరించలేదు. ఆకాశపు ప్రభుత్వము కేవలము తెలివి చేతులతో నుండెను. కనుక పనికిరాని, ఈ, తెలివి లోకులను ప్రతి వ్యసనములో ముంచి వేసెను. దీని నెరుగని వాడెవడైనా గలడా? దీర్ఘ కాలము వరకు సువార్త వర్షము కురియనందు వలన జ్ఞానపు నీరు ఎట్లు

ఎండిపోయెనో చూడుము.

కనుక ఈ ప్రమాణాలలో కూడ అల్లాహ్ సృష్టి చట్టమును ప్రవేశపెట్టును. దీనినే ఇట్లు నుడివెను. భూమి సస్యశ్యామలము మొత్తము, ఆకాశపు నీటితో ముడిబడివున్నది. ఆధారపడి వున్నది. ఇది శాశ్వత సృష్టి శాసనము. ఆలోచించి చూడుము. కనుక ఈ గుప్తముగా నున్న సృష్టి శాసనము కొరకు, స్పష్టమైన సృష్టి శాసనము సాక్ష్యముగా నున్నది. కేవలము తెలివినే మార్గదర్శిగా చేయకుము. అది ఆకాశపు నీరు లేనిదే వుండు నీరు గాదు. ఆకాశపు నీరు ఒక బావిలో పడినా, పడకపోయిన, దాని నీటి మట్టమును పెంచును. ఇది దాని సహజ, శాశ్వత గుణము. కనుక దీనితో లాభము పొందుము. ఈ విధముగనే అల్లాహ్ సువార్త పొందినవాడు, ప్రపంచమునకు వచ్చినప్పుడు ఒక తెలివిమంతుడు అతనిని అనుసరించినను అనుసరించకున్నను అతని కాలములో స్వతాహా ముందు లేని కాంతి ప్రకాశము, పరిశుద్ధత జ్ఞానము నందు కలుగును. తెలివి వికాసమగును. ఫలితముగా ప్రతివారు సత్యాన్వేషణ చేయుటకు ఉపక్ర మింతురు. పరోక్షముగా వారి ఆలోచన శక్తిని పుట్టించు చర్య జరుగును. కనుక ఈ సర్వజ్ఞానాభివృద్ధి, హృదయావేశము ఈ సువార్త వాణి పొందిన వాని శుభకాలిడినందులకు పుట్టును. సహజ గుణముతో భూమిలో గల నీటి మట్టమును పెంచును. ప్రతివాడు ధర్మమును పరీక్షించుటకు, అన్వేషించుటకు ఉపక్రమించినప్పుడు, తహతహలాడి నప్పుడు, భూ జలము ఉప్పొంగినప్పుడు నిశ్చయముగా ఆకాశము నుండి కుంభవర్షము పడినదని, సువార్త వాణి వర్షము ఏదో ఒక మనసుపై కురిసినదని భావించుము.

# ఐదవ ప్రశ్న

## దైవ జ్ఞాన మార్గాలు

ఈ విషయములో పవిత్ర ఖుర్ఆన్ వివరముగా చర్చించినది. ఆ మొత్తము చర్చ ఈ కొద్దిపాటి సమయములో వివరించుట సాధ్యము కాని పని. అయినను ఉదాహరణగా కొంత చర్చ జరుగును. పవిత్ర ఖుర్ఆన్, జ్ఞానమును మూడు భాగాలుగా విభజించినదని తెలిసికొనుట మంచిది. నిశ్చయమైన ఊహ, అనగా ఊహించినమ్ముట. చూచి నమ్ముట. అనుభవముతో కలుగు నమ్మకము. అనగా నిశ్చయమైన నమ్మకము. ఊహించి నమ్ముట అనగా ఒక వస్తువును ఊహించి నమ్ముట. అదెట్లనగా మనము దూరము నుండి ఒక స్థానములో పొగను చూచి అక్కడ అగ్ని వుండునని ఊహించి నమ్ముదుము. మనము అగ్నిని చూచినచో పవిత్ర ఖుర్ఆన్ ప్రకారము ఇది చూచి రూఢి అయిన నమ్మకము. అనగా అక్కడ అగ్ని గలదని నిశ్చయముగా తెలసినది. మనము ఆ అగ్నిలో ప్రవేశించినచో దానిని అనుభవింతుము. ఈ చర్యను పవిత్ర ఖుర్ఆన్ ప్రకారము అనుభవ నమ్మకమందురు. ఇంతకు ముందే దీనిని వివరముగా స్పష్టము చేసి వున్నాము. దానిని మరల ఇక్కడ చర్చించుట అనవసరము. పుటలు త్రిప్పి చూచుకోగలరు.

మొదటి స్థాయి జ్ఞానమును తెలిసికొను మార్గములు తెలివి ఆధారాలపై ఆధారపడి వుండును. నరకవాసులను గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు నుడివెను.

وَقَالُوا لَوْ كُنَّا نَسْمَعُ أَوْ نَعْقِلُ مَا كُنَّا فِي أَصْحَابِ السَّعِيرِ

(అల్ ముల్క్ 67:11)

అనగా నరకవాసులు ఇట్లందురు. మేము తెలివిమంతులమై వుండినచో ధర్మ సిద్ధాంతాలను తెలివి, వివేకముతో పరీక్షించి వుండినచో, లేదా తెలివిమంతుల, పండితుల ఉపన్యాసములు గాని రచనములు గాని శ్రద్ధగా విని, చదివి వున్నచో, ఈ రోజు నరక వాసులముగా వుండ కుంటిమి. ఈ సూక్తి ఈ మరో సూక్తిని బలపరచుచున్నది. అల్లాహ్ ఇట్లు తెలుపుచున్నాడు.

لَا يُكَلِّفُ اللَّهُ نَفْسًا إِلَّا وُسْعَهَا

(అల్ బఖరహ్ 2:287)

అనగా శక్తిమంతుడైన అల్లాహ్ మానవులను వారి బుద్ధి యోగ్యతలకు మించిన విషయములను స్వీకరించుటకు బాధపెట్టడు. అనగా వారి బుద్ధిని మించి భారమేయడు. మానవుడు గ్రహించు యోగ్యతగల సిద్ధాంతాలనే ప్రవేశపెట్టును. కనుక అతని ఆదేశాలు మానవుడు మోయలేనివి కావు. ఈ సూక్తి యందు మానవుడు చెవులతో విని కూడ నమ్మగలడని తెలుపబడినది. ఉదాహరణకు మనము లండన్ చూడలేదు. కేవలము చూచినవారితో ఈ నగరపు ఉనికిని విన్నాము. కాని వారందరు అబద్దమాడినారని మనము సందేహించగలమా? లేదా, మనము ఆలంగీర్ పాదుషా కాలమందు లేము. అతనిని మనము చూడనూ లేదు. కాని మొఘలు చక్రవర్తులలో ఒకడు ఆలంగీరు కాదని మనకు సందేహమా? మనకట్టి నమ్మకమెట్లు కలిగెను? నిరంతరమతని గురించి మనము వినినందులకే కలిగెను. నిస్సందేహముగా వినికిడి కూడ ఒకనిని నమ్ముస్థాయికి గొనిపోవును. వైరుధ్యము లేని ప్రవక్తల

గ్రంధములు కూడ జ్ఞాన సంపాదనకొక మార్గము. కాని ఒక గ్రంధము అల్లాహ్ వాక్కులనబడి, దాని ఏబది, అరువది, పాఠాంతరములుగా గ్రంధములున్నచో, కొన్ని కొన్నిటిని వ్యతిరేకించినచో, వీటిలో కేవలము రెండు మూడు లేక నాలుగు గ్రంధములు సరియైనవి. మిగిలినవన్నియు కల్పితములని, తప్పుడు తడకలని ఒక వర్గము నమ్మినచో, ఈ నమ్మకము సరియైన జ్ఞానపు సాక్ష్యమునకు ఆధారము కానేరదు. ఫలితముగా ఆ మొత్తము గ్రంధములు తమ వైరుధ్యము వలన నమ్మదగినవి కావు. తిరస్కరించబడినవి, వ్యర్థమైనవి. వైరుధ్యము గల ఇట్టి వాటిని జ్ఞానమునకు మార్గమని తలచుట సరియైనది గాదు, తగదు. జ్ఞానమునకు నిర్వచనము, ఒక నమ్మకమైన ఆధారము. కాని వైరుధ్య సమ్మేళన సమూహములో నమ్మకమైన ఆధారము. మార్గము పొందుట సాధ్యము కాదు, కాని పని.

పవిత్ర ఖుర్ఆన్ కేవలము వినువరకే పరిమితము కాదు. మానవునికి అర్థము చేసికొనుటకు దీనిలో హేతువు బద్ధమైన గొప్ప నిదర్శనములు గలవు. అది ప్రవేశపెట్టిన ఆదేశాలు, సూత్రాలు, సిద్ధాంతాలలో ఏ ఒక్కటి కూడ బలవంతముగా రుద్ధబడినది గాని ఆజ్ఞాపించునది గాని లేదు. మొత్తము సూత్రాలది మానవుని సహజాతములు. ముందు నుండే అతనిలో నాటుకొని వుండునని అది వివరించి వున్నది. కనుక పవిత్ర ఖుర్ఆన్ను జ్ఞాపకము చేయునదని తెలుపబడినది. అదిట్లు వివరించును.

هٰذَا ذِكْرٌ مُّبَارَكٌ (అల్ అన్బియా 21:51)

శుభములు గల ఈ ఖుర్ఆన్ క్రొత్తదేమియును తేలేదు. కాని మానవుని సహజాతములోనున్నవి. సృష్టి గ్రంధములలో గల వాటి జ్ఞాపకము చేయును. మరో చోట ఇది ఇట్లనెను.

لَآ اِكْرَاهَ فِي الدِّيْنِ

(అల్ బఖరహ్ 2:257)

అనగా ఈ ధర్మము (ఇస్లాం) ఏ విషయమును కూడ బలవంతముగా రుద్దక ప్రతి దాని కారణములను, నిదర్శనములను ప్రవేశపెట్టును. పవిత్ర ఖుర్ఆన్ హృదయములను ప్రకాశింపజేయు ఆధ్యాత్మిక ప్రత్యేక గుణము కలిగి వున్నది. అదిట్లు తెలుపును.

شِفَآءٌ لِّمَا فِي الصُّدُوْرِ

(యూనుస్ 10:58)

అనగా పవిత్ర ఖుర్ఆన్ దాని ప్రత్యేక గుణముచే సర్వరోగములను నివారించును. కనుక ఈ గ్రంధమును ఒక తరము నుండి మరో తరమునకు పంపబడినదనలేము. ఇది ఉత్తమమైన కారణాలు, నిదర్శనములు కలిగివున్నది. దీనిలో ఒక ప్రకాశవంతమైన కాంతి గలదు.

వివేకములైన నిదర్శనములు, నిస్సందేహాముగా ఒకనికి నిశ్చయమైన నమ్మకమును కలిగించును. శక్తిమంతుడైన అల్లాహ్ దీనినే ఇట్లు తెలుపును.

اِنَّ فِيْ خَلْقِ السَّمٰوٰتِ وَ الْاَرْضِ وَاخْتِلَافِ الَّيْلِ وَ النَّهَارِ
لَاٰيٰتٍ لِّاُولِي الْاَلْبَابِ ۝ الَّذِيْنَ يَذْكُرُوْنَ اللّٰهَ قِيٰمًا
وَّقُعُوْدًا وَّعَلٰى جُنُوْبِهِمْ وَيَتَفَكَّرُوْنَ فِيْ خَلْقِ السَّمٰوٰتِ
وَالْاَرْضِ ۚ رَبَّنَا مَا خَلَقْتَ هٰذَا بَاطِلًا ۚ سُبْحٰنَكَ فَقِنَا
عَذَابَ النَّارِ ۝

(ఆలె ఇమ్రాన్ 3:191,192)

అనగా జ్ఞానము, వివేకము గల వారు భూమ్యాకాశముల సృష్టిని, దివారాత్రుల భేదమునకు గల కారణముల గురించి ఆలోచించినప్పుడు, వారికి అల్లాహ్ ఉనికి, నిదర్శనము లభించును. స్పష్టమైన జ్ఞానమునకు వారు అల్లాహ్ సహాయ్యమును కోరుదురు. అప్పుడు వారు నిలబడి, కూర్చొని ఒక ప్రక్కన పరుండి అతనిని స్థుతింతురు, కొనియాడుదురు. అట్లు చేసినందులకు వారి జ్ఞానము స్పష్టముగా అభివృద్ధి చెందును, పరిశుద్ధమగును. కనుక వారు ఆ జ్ఞానము, వివేకముతో భుమ్యాకాశముల నిర్మాణములను గురించి యోచించి నప్పుడు వారు తన్మయులై ఇట్టి ఏర్పాటు, క్రమమైన పద్ధతి వ్యర్థమైనది కాదు, పనికి రానిది కాదని నిజమైన సృష్టికర్త వీటిలో కనబడుచున్నాడని ప్రకటించుటకు వెనుకాడరు. అప్పుడు వారు సర్వ ప్రపంచ సృష్టికర్తను ఒప్పుకొని అతనినిట్లు కొనియాడుదురు. ప్రార్థింతురు. నీ ఉనికిని నిరాకరించి వ్యర్థమైన గుణములతో నిన్ను అంటగట్టుటకెవరు ఉపకరించరు. కనుక ఓ అల్లాహ్! మమ్ము నరకాగ్నితో రక్షించుము. అనగా నిన్ను నిరాకరించుట నరకమును పొందుటతో సమానము. సర్వశుభములు, సుఖ సంతోషములు నీతోనే, నిన్ను గుర్తించడములోనే గలవు. నిన్ను గుర్తించనివాడు నిజానికి ఈ జీవితములోనే నరకవాసుడు.

## మానవుని స్వభావ వాస్తవికత

జ్ఞానమునకు మానవ అంతరాత్మ కూడ ఒక ఆధారము. దాని పేరు అల్లాహ్ గ్రంథము నందు మానవుని సహజ స్వభావముగా పేర్కొనబడినది. శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు నుడివెను.

فِطْرَتَ اللّٰهِ الَّتِىْ فَطَرَ النَّاسَ عَلَيْهَا

(అర్రూమ్ 30:31)

అనగా అల్లాహ్ స్వభావముతో మానవులు పుట్టించబడిరి. ఆ స్వభావ ముద్ర అనగానేమి? అనగా అల్లాహ్ ఒక్కడేనని, అతని భాగస్వామి ఎవరు లేరని, అతడే సర్వాధికారని, సృష్టికర్తనని జీవన్మరణమునకు అతీతుడని నమ్ముట. అంతరాత్మను నిశ్చయమైన నమ్మకముగా వివరించబడినది. ఈ స్థితిలో హృదయము ఒక జ్ఞానము నుండి మరో వైపు మళ్ళదు. పొగ చూచిన వెంటనే మనస్సు అగ్ని వైపు వెళ్ళును. కాని ఈ స్థితిలో సూక్ష్మమైన మార్పు లేక పోలేదు. ప్రతి దానిలో ఒక తెలియని ప్రత్యేకత, గుణము పెట్టివున్నాడు. దానిని వివరించుట, తెలుపుట అసాధ్యము. కాని దానిని చూచినప్పుడు, దానినూహించినప్పుడు, సరాసరి ఆ ప్రత్యేకత వైపు మనస్సు మళ్ళును. నిప్పుకుపొగ తప్పని సరియైనట్లు, ఆ ప్రత్యేకత దానికి తప్పనిసరిగా వుండును. అల్లాహ్ ఉనికినూహించి నప్పుడు అల్లాహ్ ఎట్లుండవలెను. మన వలె అల్లాహ్ పుట్టవలెనా? దుఃఖములకు గురై మరణించవలెనా? అను ఆలోచన అల్లాహ్‌ను గురించి మనలో వచ్చినప్పుడు మన హృదయము మన అంతరాత్మ ఈ ఊహతో కంపించి దుఃఖించును. పై ఊహను నిరంతరము ధిక్కరించి మన సర్వ ఆశలకు ఆలవాలమైన, శక్తిమంతుడైన అల్లాహ్ సర్వ నష్ట కష్టాలకు అతీతుడు, పవిత్రుడు. సంపూర్ణుడని ఘోషించును. అప్పుడే శక్తిమంతుడైన అల్లాహ్ ఆలోచన పుట్టి పొగకు నిప్పుకు ఎట్టి సంబంధముండునో అట్టి సంబంధము ఏకత్వము, అల్లాహ్ మధ్య ఏర్పడును. కనుక మన అంతరాత్మలో మనకు కలిగిన జ్ఞానము నమ్మకమైన జ్ఞానము. కాని దీనికి ముందు మరో స్థాయి గలదు. అది చూచి నమ్మకమేర్పడిన జ్ఞానమన బడును. మన నమ్మకమునకు నమ్మిన దానికి మధ్య ఏదియును వుండరాదు. అదెట్లనగా మనము ఒక సువాసనను, దుర్వాసనను శ్వాస

శక్తితో తెలుసుకొందుము. లేదా తియ్యదనాన్ని కాని ఉప్పును కాని రుచి చూచి తెలుసుకొందుము. అటులనే స్పర్శ వలన ఉడుకును, చల్లదనాన్ని కనుక్కొందుము. ఈ సర్వ జ్ఞానములు చూచి, అనుభవించి కలిగిన నమ్మకమే. కాని పరలోక నమ్మకము మనకు అల్లాహ్ మాటలను, అల్లాహ్ సువార్త వాణిని, తమ చెవులతో వినునంత వరకు కాని, కనులతో అతని స్పష్టమైన, సత్యమైన స్వప్న దర్శనమగునంత వరకు మనకు అనుభవించిన చూచిన నమ్మకమేర్పడదు. నిస్సందేహముగా మనము సంపూర్ణ జ్ఞానము పొందుటకు సూటిగా దివ్య దర్శనమవసరము.

సంపూర్ణ జ్ఞానము పొందుటకు మనము మన హృదయములలో దాహము, ఆకలి కలిగివున్నాము. మన కొరకు అల్లాహ్ ముందే ఈ తెలివి శక్తిని పొందుపరచనిచో మనకీ దాహము ఆకలి ఎందుకు అంటగట్టెను? పరలోకమునకు కోలమానమైన ఈ జీవితము నందు సత్యవంతుడు, సంపూర్ణుడు, శక్తిమంతుడు జీవితుడైన అల్లాహ్‌ను కేవలము వృత్తాంతములు, గాథల ఆధారముగా తృప్తి పడి విశ్వసించ గలమా? లేదా ఇప్పటికి లోపము గల, అసంపూర్ణ తెలివిని ఆధారముగా చేయగలమా? అల్లాహ్‌ను నిజముగా ప్రేమించువారి హృదయాలు అతని తియ్యని సంభాషణతో ఆనందించగోరవా? అల్లాహ్ కొరకు లోకమును త్యజించి మనసిచ్చి ప్రాణాలర్పించి కేవలము ఒక మంద కాంతి ఆధారముగా జీవించి మరణించుటకు ఇష్టపడగలరా? ఆ సూర్యుని వాస్తవాన్ని చూడలేరా? జీవించి వున్న ఆ అల్లాహ్ అగుననుట ప్రపంచములోని సర్వతత్వవేత్తల స్వీయ గ్రంథముల కంటే అధిక తెలియ జేయు జ్ఞానమునందజేయును. ఆ మొత్తం గ్రంథములు అల్లాహ్ అగునను పదముల ముందు వ్యర్థములు. తత్వవేత్తలై కూడ అంధులుగా నున్నవారు

మనకేమి తెలుపగలరు, నేర్పగలరు. సత్యాన్వేషులకు అల్లాహ్ తెలివి నొసంగగోరినచో అతడు తప్పక తమ మాటలాడు మార్గమును తెరిచే వున్నాడని ఆ శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు ప్రకటించుచున్నాడు.

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۝ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ

(అల్ ఫాతిహా 1:6,7)

అనగా ఓ అల్లాహ్! నీ వరములకు వారసులైన వారి మార్గము మమ్ము చూపించుము. వరములనగా దివ్య దర్శనము, అతని మాటలు, ఆకాశపు జ్ఞానమని అర్థము. ఇవి మానవునికి సువార్తవాణి ద్వారా, స్వప్న దర్శనము ద్వారా మధ్య వర్తిత్వము లేకుండా లభించును. ఇటులనే మరో చోట ఇట్లు తెలుపును.

اِنَّ الَّذِيْنَ قَالُوْا رَبُّنَا اللّٰهُ ثُمَّ اسْتَقَامُوْا تَتَنَزَّلُ عَلَيْهِمُ
الْمَلٰٓئِكَةُ اَلَّا تَخَافُوْا وَلَا تَحْزَنُوْا وَاَبْشِرُوْا بِالْجَنَّةِ الَّتِىْ
كُنْتُمْ تُوْعَدُوْنَ ۝

(హా మీమ్ అస్సజ్దహ్ 41:31)

అనగా అల్లాహ్‌ను విశ్వసించి సంపూర్ణ స్థిరత్వమును పాటించు వారిపై అల్లాహ్ దూతలు అవతరింతురు. వారు వారికిట్లు అభయమిత్తురు. భయపడకుము, దుఃఖించకుము. మీతో వాగ్దానము చేయబడిన స్వర్గము మీ కొరకున్నది. కనుక ఈ సూక్తి యందు కూడ అల్లాహ్ పుణ్యదాసులు భయము, దుఃఖ సమయములలో అల్లాహ్‌తో సువార్తవాణి పొందుదురని, దేవదూతలు వారిని తృప్తి పరచెదరని స్పష్టముగా తెలుపబడినది. మరో సూక్తిలో ఇట్లు చెప్పబడెను.

لَهُمُ الْبُشْرٰى فِى الْحَيٰوةِ الدُّنْيَا وَفِى الْاٰخِرَةِ

(యూనుస్ 10:65)

అనగా అల్లాహ్ పుణ్య దాసులకు, ప్రీతి పాత్రులకు అల్లాహ్ సువార్త వాణి ద్వారా ఈ జీవితములో పరలోకములో కూడ శుభవార్తలందును.

## దైవవాణి నిర్వచనము

ఒక విషయమును గూర్చి మానవ ఆలోచనలతో ఉద్భవించిన ఫలితము దివ్య దర్శనము కాదని జ్ఞప్తి యందుంచుకొనవలెను. ఒక కవి రచించినప్పుడు రెండవ చరణము ఆలోచించి పూరించు దానిని దివ్య దర్శనమనరు. ఇది సృష్టికర్త శాసనము ప్రకారము ఆలోచించి పొందిన ఫలితము మాత్రమే. మానవుడు మంచి లేదా చెడు విషయాలను గురించి ఆలోచించినప్పుడు ఒక నిర్ణయమునకు తప్పక వచ్చును. ఒక దైవ భక్తి గలవాడు సత్యమును చాటుటకు కొన్ని చరణాలు రచించును. మరొక దుష్టుడు, పాపాత్ముడు దైవ భక్తులను తిట్టుచు అసత్యమును చాటుచు ఒక పద్యము లేక కొన్ని చరణాలు నిస్సందేహముగా రచించును. ఈ ఇద్దరిలో దైవభక్తులను కించపరచువాడు, అసత్యమును ప్రోత్సహించువాడు చిరకాల అభ్యాసము వలన ఉత్తమ పద్యము రచించినను ఆశ్చర్యము లేదు. కనుక హృదయములో కలిగిన భావాలను దైవవాణిగా పరిగణించిన చో సన్మార్గము, సన్మార్గుల శత్రువు సదా సత్యమును వ్యతిరేకించు అసత్యమునవలంభించు దుష్టకవి దైవ వాణి గ్రహీతునిగా పరిగణించ బడును. ప్రపంచములో అనేక నవలలో మీరు అసత్యము, మోసములను చాలా ఉత్తమ స్థాయిలో పొందుపరచి మానవ హృదయములను చూరగొనుటను చూచెదరు. వాటి నన్నిటిని దైవవాణిగా పరిగణించ వచ్చునా? కేవలము కొన్ని విషయములు హృదయములలో పుట్టటను

దైవవాణిగా అనుకొనినచో ఒక గజదొంగ కూడ దైవవాణి గ్రహితుడనబడును. ఎందుకనగా అతడు కొన్ని సమయాలలో మంచి మంచి పద్ధతులనవలంభించి చోర్యములు, దొంగతనములు అన్యాయపు హత్యల ప్రణాళికలు అతని హృదయములో పుట్టును. ఈ అపవిత్ర, అసత్య, ప్రణాళికలను మనము దైవవాణిగా పరిగణింతుమా? ఎన్నటికి కాదు. నిజమైన అల్లాహ్‌ను గుర్తించని వారి భావాలివి. అతడు ప్రత్యేక వాక్యములతో హృదయములను రంజింపజేసి తృప్తి పరచును. తెలియని వారికి ఆధ్యాత్మిక జ్ఞానము నొసంగి తెలియజేయును.

దైవవాణి అనగానేమి? పవిత్రుడు, శక్తిమంతుడైన అల్లాహ్‌కు ప్రీతి పాత్రుడైన దాసునితో లేదా అతడు కోరిన వానితో జీవితము, శక్తితో కూడిన సంభాషణ జరుపును. ఈ తృప్తికరమైన పద్ధతిలో సంభాషణ, సంబోధన ప్రారంభమైనప్పుడు అసత్యపు బూటకముల అంధకారము. వ్యర్థపు వాక్యములు మెదడులో రాక తియ్యని వైభవము, వివేకముతో కూడిన సంభాషణ వున్నచో అది అల్లాహ్ మాటలు. దానితో తమ దాసునికి తృప్తి నొసంగగోరును. తమ దర్శనమిచ్చును. కొన్ని సమయాలలో ఈ వాక్యములు దయానుగ్రహము, శుభములు లేక కేలవము పరీక్షగా నుండును. దీనిలో అల్లాహ్ దాసుని ప్రారంభ దశను పరీక్షించబడును. ఈ కొంత దైవవాణిని రుచి అనుభవించి నిజముగా తన పరిస్థితులను సత్యదైవ వాణి గ్రహీతుల వలె మలచుకొనవచ్చును. లేదా వ్యర్థము చేసికొనవచ్చును. నిజమైన సన్మార్గుల, సత్యవాదుల వలె వ్యవహరించనిచో ఈ వరమును పోగొట్టుకొనును. కేవలము వ్యర్థమైన డంబములు మిగులును.

కోట్లానుకోట్ల సన్మార్గులకు దైవవాణి అందినది. అందుచునే

వున్నది. కాని వారి స్థాయి అల్లాహ్ దృష్టిలో ఒకే శ్రేణికి చెందినది కాదు. దైవవాణి పొందిన ఉత్తమ స్థాయి ప్రవక్తలు కూడ సమాన శ్రేణులకు చెందిన వారు కారు. శక్తిమంతుడైన అల్లాహ్ బోధించునట్లు.

تِلْكَ الرُّسُلُ فَضَّلْنَا بَعْضَهُمْ عَلَىٰ بَعْضٍ

(అల్ బఖరహ్ 2:254)

అనగా సందేశహరులలో కొందరిని కొందరికంటే గొప్పవారిని చేసితిమి. దైవవాణి కేవలము దైవానుగ్రహమేనని నిరూపణ అగును. సత్యము, నిష్కపటము, నమ్మకముల స్థాయి కలిగినది అనుగ్రహము. దానిని అల్లాహ్ ఎరుగును. దైవవాణి కూడ తమ శుభములు గల షరతులతో నుండినచో అది కూడ వాటి ఒక ఫలము. అల్లాహ్ దాసుడు ప్రశ్నించి నప్పుడు అల్లాహ్ సమాధానమిచ్చుచు పోయి ఒక వరుస క్రమములో ఈ ప్రశ్నోత్తరాలు జరిగి, దైవవాణిలో మహత్యము, కాంతి వుండి రహస్య జ్ఞానము, వాస్తవ నిర్వచనములు కలిగి వున్నచో నిస్సందేహముగా అది అల్లాహ్ దైవవాణి అనబడును. ఒక మిత్రుడు మరో మిత్రునితో సంభాషించునట్లు అల్లాహ్, అతని దాసుని మధ్య సంభాషణ జరుగును. ఒక విషయమును గురించి ప్రశ్నించినప్పుడు దానికి సమాధానముగా తియ్యని, స్పష్టమైన, అల్లాహ్ వైపు నుండి, వాక్యములు వినవలెను. దానిలో వ్యక్తిగత ఆలోచన, ప్రమేయముండరాదు. ఈ సంభాషణ సంబోధము అతని కొరకు వరముగా వుండినచో దానిని అల్లాహ్ మాటలుగా భావించవలెను. ఇట్టి దాసుడు అల్లాహ్ ప్రియుడుగా నుండి, ధారాళముగా పవిత్రత, జీవితముతో కూడిన దైవవాణి ఇట్టి దాసునికి అల్లాహ్ వైపు నుండి అందిన స్థాయిగా నుండును. విశ్వాసము, సద్భావము, సత్కార్యములలో అభివృద్ధి పొందిన వారికి తప్ప ఈ స్థాయి మరెవ్వరికి

లభించదు. పవిత్ర, సత్యదైవవాణి అద్భుత ఆశ్చర్యకరములైన అల్లాహ్ మహిమలు ప్రదర్శించును. తరచుగా ఒక ప్రకాశించు కాంతి పుట్టును. దానితో ఘనమైన ఒక ప్రకాశవంతమైన దైవవాణి అవతరించును. దైవవాణి పొందువాడు భూమ్యాకాశముల సృష్టికర్తతో మాటలాడును. దీని కంటే గొప్ప వరము మరొకటి గలదా? ప్రపంచమందు అల్లాహ్ దర్శనమనగా అతనితో మాటలాడుటయే గదా!

ఒకని నోటి నుండి వ్యర్థమైన ఒక పదముగాని, వాక్యము గాని, చరణము గాని, వెళ్ళినను దానికి తోడు సంభాషణ, సంబోధన లేనిచో ఆ మానవ స్థితి మా ఈ వివరణకు సంబంధించినది కాదు. ఇట్టి వాడు అల్లాహ్ పరీక్షకు గురైనవాడు. ఒకప్పుడు అల్లాహ్ ఒక పదము లేదా వాక్యమును ఒకని హృదయములో వేయును. లేదా హృదయము నుండి వెళ్ళునట్లు చేసి సోమరి అలక్ష్యము చేయువానిని అల్లాహ్ పరీక్షించును. ఆ వ్యక్తి అంధుని వలె మారి ఈ మాటలు అల్లాహ్ వైపు నుండి వచ్చినవా లేదా షైతాన్ నుండి వచ్చినవా ఎరుగడు. కనుక ఇట్టి వాక్యములతో పశ్చత్తాపపడుట (ఇస్తిఘ్ఫార్) తప్పనిసరైనది. కాని ఒక పుణ్య, సన్మార్గ అల్లాహ్ దాసునికి నిరాటంకముగా అల్లాహ్ వైపు నుండి సంభాషణ ప్రారంభమై సంబోధముగా ఒక ప్రకాశవంతమైన తియ్యని, సారముతో కూడిన వివేకమైన ఒక వాక్యము లేక మాటలు అతనికి వినిపించినను, తరచుగా అతడు మేల్కొని వున్నప్పుడు అతనికి అల్లాహ్‌కు మధ్య ప్రశ్నోత్తరాలు నడిచినచో, అతని ప్రశ్నకు సమాధానము అల్లాహ్ ఇచ్చినచో పూర్తి స్పృహలో నున్నప్పుడు అతడు అల్లాహ్‌తో ఏదేని విన్నపము చేసిన, అతడు దానికి సమాధానమిచ్చినచో, ఇటులనే పది పర్యాయములు అతనికి, అల్లాహ్‌కి మధ్య సంభాషణ జరిగినచో, తరచుగా అల్లాహ్ అతని

ప్రార్ధనలను స్వీకరించి అంతర్ దృష్టి ప్రసాదించి, వచ్చు సంఘటనల వార్తలిచ్చి స్పష్టముగా తరచుగా అతనితో ప్రశ్నోత్తర రూపంలో సంభాషించి గౌరవించినచో అట్టి వ్యక్తి అల్లాహ్‌కు కృతజ్ఞతలర్పించుకోవలెను. అల్లాహ్ కేవలము తమ కరుణతో తమ దాసులందరిలో అతనిని ఎన్నుకొని నందులకు, అతనికి పూర్వము గల సత్యవంతులకు అతనిని వారసునిగా చేసినందులకు అందరి కంటే ఎక్కువ అతని మార్గములో తమను వినియోగించవలెను. చాలా అమూల్యమైనది అదృష్టముతో కూడిన ఈ వరము లభించిన వానికి మిగిలినవన్ని తుచ్ఛములు.

## ఇస్లాం ప్రత్యేకత

ఈ స్థాయినందుకొనిన వారు ఇస్లాంలో సదా వుండుచువచ్చిరి. ఇస్లాం నందే అల్లాహ్ మానవునికి పూర్తిగా సమీపమై అతనితో మాటలాడును. అతనిలో నివాసమేర్పరచుకొనును. అతని హృదయము నందు తమ ఆసనమును అమర్చుకొనును. అతనిలో నుండి అతనిని ఆకాశము వైపు ఆకర్షించును. పూర్వీకులకు ఒసంగిన మొత్తము బహుమతులు అతనికి ప్రసాదించును. విచారము! అంధకారములో మునిగి వున్న ప్రపంచము మానవుడు సమీపమై ఎంత వరకు పోవునో ఊహించలేదు. ఏ స్థాయినందుకొనునో వారు ఎరుగరు. వారు ముందడుగు వేయరు, వేసిన వారిని అవిశ్వాసులుగా నిర్ణయించి ధిక్కరింతురు. లేదా ఆరాధ్య దైవముగా నమ్మి అల్లాహ్ స్థానమిత్తురు. ఇవి రెండునూ తప్పిదములే. హెచ్చింపు, తగ్గుదలతో ఇవి పుట్టినవి. కాని ఒక తెలివిమంతుడు అధైర్యపడక ఈ స్థాయిని ధిక్కరించరాదు. నిరాకరించరాదు. ఆ స్థాయిని అగౌరవపరచరాదు. దానిని పూజించనూ రాదు. ఈ స్థానమందు అల్లాహ్ తమ దైవత్వ దుప్పటి అతనికి కప్పి తమ

సంబంధమును బహిర్గతమొనర్చును. ఇట్టి వాడు అల్లాహ్‌ను చూచినవాడని నుడివెను. మానవ ఆధ్యాత్మికాభివృద్ధికిది తుది మెట్టు. దీనిలో అతడు సంపూర్ణ తృప్తి పొందును.

## ఉపన్యాసకుడు దైవ సంభాషణ పొంది గౌరవించబడుట

నేనింతవరకు నిర్వచనములిచ్చి వివరించిన, సంబోధన, సంభాషణ స్థానమును అల్లాహ్ అనుగ్రహము నాకు ప్రసాదించినదని మానవాళికి తెలుపనిచో నేను చాలా తప్పు, అన్యాయము చేసిన వాడనగుదును. అంధులకు అంతర్దృష్టి ప్రసాదించుటకు, అన్వేషించువారికి పోగొట్టుకొనిన వాని చిరునామా తెలుపుటకు, సత్యమును వెతుకు వారికి పవిత్ర చెలిమ శుభవార్తనిచ్చుటకు అల్లాహ్ నన్ను ఎన్నుకొనెను. సంభాషించువారనేకులు, గాని పొందువారు కొందరే. మానవునికి ముక్తి శాశ్వత, సౌఖ్యము, ఆనందము ప్రసాదించు అల్లాహ్, పవిత్ర ఖుర్ఆన్‌ను అనుసరించనిచో ఎన్నటికి లభించదని నేను ప్రేక్షకులకు నమ్మకముగా తెలియచేయుచున్నాను. నేను చూచినది వారు చూచినను, నేను వినినది వారు వినినను, చాలా బాగుండేది. గాధలను, విడిచి సత్యము వైపు పరుగిడవలెను. అల్లాహ్ కానవచ్చు ఆ సంపూర్ణ జ్ఞానము, సర్వ సందేహాలు మలినములను నిర్మూలించు ఆ నీరు, శక్తిమంతుడైన సృష్టికర్తను దర్శించు ఆ అద్దము, నేనింతవరకు వివరించిన "అల్లాహ్" సంబోధన, సంభాషణయే. సత్యమును కోరువారు ముందుకు వచ్చి అన్వేషించవలెను. ఆత్మలో సత్యాన్వేషణ వున్నచో, హృదయాలలో నిజమైన దాహము పుట్టినచో, ఈ మార్గమును కనుగొనుటకు, పద్ధతిని వెతుకుటకు పూనుకొనవలెనను వాస్తవాన్ని మీ ముందు పెట్టుచున్నాను. కాని ఈ

మార్గమును కనుగొనుట ఎట్లు? మధ్యనున్న తెర తొలగుట ఎట్లు? ఈ మార్గ శుభవార్తనిచ్చు ఇస్లాంలోనే ఇది సాధ్యమని సత్యాన్వేషులకు తెలియచేయుచున్నాను. ఇతర జాతులు అల్లాహ్ వాణి, సంబోధ, సంభాషణ నుండి చాలా కాలము నుండి దూరమైనవి. ఈ ముద్ర అల్లాహ్ వైపు నుండి వేయబడలేదు. నిశ్చయముగా మానవుడు తమ లోపము వలన ఒక సాకును పుట్టించు కొనును. కనులు లేనిదే మనము చూడలేమో, చెవులు లేనిదే వినలేమో, నాలుక లేనిదే మాటలాడలేమో అటులనే ఖుర్ఆన్ సహాయము లేనిదే ఆ ప్రియుని ముఖము చూచుట అసాధ్యము. నేను యువకునిగా నుంటిని, ఇప్పుడు ముసలివాడినైతిని, కాని పవిత్ర చెలిమ లేనిదే ఈ స్పష్టమైన జ్ఞానమును పొందినవానిని నేనెరుగను.

## అల్లాహ్ వాణి సంపూర్ణ జ్ఞానముకు ఆధారం

ప్రియులారా! అల్లాహ్ సంకల్పములతో మానవుడు కోట్లాడలేడు. అల్లాహ్ పవిత్ర సందేశహరులకు అందిన అల్లాహ్ దైవవాణి సంపూర్ణ జ్ఞానమునకు ఆధారమని నిశ్చయముగా తెలిసికొనుము. అనుగ్రహ సాగరమైన అల్లాహ్ భవిష్యత్తులో దైవవాణిని అంతమొందించి ప్రపంచమును నాశనమొనర్చ దలచలేదు. అతని దైవవాణి సంబోధన, సంభాషణ ద్వారాలు సదా తెరిచే వున్నవి. కాని వాటి మార్గముల ద్వారా వెతికినప్పుడు సులభముగా అవి మీకు లభించును. ఆ జీవిత నీరు ఆకాశము నుండి వచ్చి దాని సరియగు స్థానమందు స్థిరపడెను. ఆ నీరు త్రాగవలెనన్న మీరు చేయవలసినదేమి? వెనుకాడక తొందరగా ఆ చెలిమ దరి చేరడమే మీ పని. ఆ చెలిమ నుండి తృప్తి పడనంత వరకు జీవిత నీరు త్రాగుము. ఆ కాంతి చిరునామా తెలిసిన వైపు పరుగిడుట మానవుని సౌభ్యాగము. పోగొట్టుకొనిన మిత్రుని జాడ తెలిసినచో ఆ మార్గమునే

అనుసరించవలెను. సదా ఆకాశము నుండి భూమిపై కాంతి పడునది చూచుచునే వున్నాము. ఇటులనే మార్గదర్శక సత్యకాంతి ఆకాశము నుండే దిగును. మానవుని ఊహాగానాలు, అతని మాటలు సత్య జ్ఞానము నొసంగలేవు. అల్లాహ్‌ను, అల్లాహ్ కాంతి లేనిదే మీరు పొందగలరా? అంధకారములో ఆకాశపు ప్రకాశము లేనిదే మీరు చూడగలరా? చూడగలిగినచో ఇచట కూడ చూసికొనుము. కాని మన కన్నులు మంచి దూర దృష్టి కలిగివున్నను ఆకాశపు ప్రకాశముపై ఆధారపడి వున్నవి. మనకు మంచి వినికిడి శక్తి వున్నను అల్లాహ్ వైపు నుండి వీచు గాలిపై ఆధారపడి వున్నవి. మౌనము వహించు అల్లాహ్ సత్యమైన అల్లాహ్ కాడు. మొత్తము మన ఉహాగానాలు, అనుమానాలు. తమ ఉనికిని తెలియజేయుచున్న అల్లాహ్ మాత్రమే జీవించి వున్న, సంపూర్ణమైన అల్లాహ్. ఇప్పుడు కూడ అతడు తన ఉనికిని తెలియజేయగోరెను. ఆకాశపు కిటికీలు తెరువబడు చున్నవి. సమీపములోనే తెల్లవారనున్నది. మేల్కొని నిజమైన అల్లాహ్‌ను వెతుకువారే అదృష్టవంతులు. ఆపద గాని, కష్టము గాని కలుగని, మహిమ చమత్కారము మందము గాని, అల్లాహ్‌ను గురించి పవిత్ర ఖుర్‌ఆన్ నందు శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు నుడివెను.

اَللّٰهُ نُوْرُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ

(అన్నూర్ 24:36)

అనగా భూమ్యాకాశముల మొత్తము ప్రకాశము అల్లాహ్. ప్రతి చోట అతని ప్రకాశము పడును. సూర్యునికి ప్రకాశము నొసంగు సూర్యుడతడు. భూమిపై గల సర్వ ప్రాణులకు అతడే ప్రాణము. నిజమైన జీవించి వున్న అల్లాహ్ అతడే. అతనిని నమ్మినవాడు ధన్యుడు.

జ్ఞానపు మూడవ మూలాధారము, చూచి అనుభవముతో కలిగిన

నమ్మకము, అవి అల్లాహ్ సందేశహరులకు, సన్మార్గులకు వ్యతిరేకుల నుండి గాని, ఆకాశము నుండి సృష్టికర్త వైపు నుండి పడు ఆపదలు, కష్టనష్టాలు, బాధలు, ఇట్టి దుఃఖములు, బాధల ఫలితముగా మానవుని హృదయములో కేవలము జ్ఞానముగా వుండిన, ధర్మ సూత్రములు, సిద్ధాంతములన్నియు కర్మల రూపము దాల్చును. కర్మల భూమిలో నుండి అంకురించి ఔన్నత్యము నందు కొనును. కర్మలొనరించు వారు స్వయముగా ఒక సంపూర్ణ అల్లాహ్ మార్గదర్శకులుగా మారును. కేవలము హృదయము, మెదడులో నిండివున్న నైతిక, క్షమాగుణము, ప్రతీకారము, సహనము సంయమనము, అనుగ్రహము మొదలగు విలువలు ఇప్పుడు సర్వ అవయవములకు వ్యాపించి కార్యానుభవ ముద్ర వేయును. శక్తిమంతుడైన అల్లాహ్ ఇట్లు నుడివెను.

وَلَنَبْلُوَنَّكُمْ بِشَيْءٍ مِّنَ الْخَوْفِ وَالْجُوْعِ وَنَقْصٍ مِّنَ
الْاَمْوَالِ وَالْاَنْفُسِ وَالثَّمَرٰتِ ؕ وَ بَشِّرِ الصّٰبِرِيْنَ ۙ
الَّذِيْنَ اِذَآ اَصَابَتْهُمْ مُّصِيْبَةٌ ۙ قَالُوْٓا اِنَّا لِلّٰهِ وَاِنَّآ اِلَيْهِ
رٰجِعُوْنَ ؕ اُولٰٓئِكَ عَلَيْهِمْ صَلَوٰتٌ مِّنْ رَّبِّهِمْ وَرَحْمَةٌ ۚ وَ
اُولٰٓئِكَ هُمُ الْمُهْتَدُوْنَ

(అల్ బఖరహ్ 2:156-158)

لَتُبْلَوُنَّ فِيْٓ اَمْوَالِكُمْ وَاَنْفُسِكُمْ ۚ وَلَتَسْمَعُنَّ مِنَ الَّذِيْنَ
اُوْتُوا الْكِتٰبَ مِنْ قَبْلِكُمْ وَمِنَ الَّذِيْنَ اَشْرَكُوْٓا اَذًى كَثِيْرًا ؕ وَ
اِنْ تَصْبِرُوْا وَتَتَّقُوْا فَاِنَّ ذٰلِكَ مِنْ عَزْمِ الْاُمُوْرِ

(ఆలె ఇమ్రాన్ 3:187)

అనగా భయము, ఆకలి, నష్టము, ప్రాణ నష్టము, ప్రయత్నములను విఫలము చేసి సంతానమునకు మరణమిచ్చి మేము మిమ్ము పరీక్షింతుము. అనగా ఈ మొత్తము ఆపదలు, బాధలు సృష్టికర్త వైపు నుండి లేదా శత్రువుల నుండి మీకు కలుగును. మేము అల్లాహ్‌ను నమ్మినవారము, అతని వద్దకే పోవువారమని, సహనము వహించు వారికి అల్లాహ్ అనుగ్రహము శుభము కలుగునని శుభవార్తనిమ్ము. వీరే సంపూర్ణ ఉపదేశము పొందినవారు. అనగా కేవలము హృదయము, మెదడులో నిండివున్న జ్ఞానము గౌరవము, గొప్పదనపు కార్యము కాదు. మెదడు నుండి దిగి మొత్తము అవయవాలకు వ్యాపించి జ్ఞాపకశక్తిని పెంపొందించు జ్ఞానము నిజమైనది. జ్ఞానమును స్థిరపరచుటకు, దానిని అభివృద్ధి చేయుటకు కార్య రూపమిచ్చి దాని గుర్తులు తమలో నిలువ చేసికొనవలెను. ప్రారంభ దశలో నున్న ఏ జ్ఞానము కూడ అమలు చేయనిదే ఔన్నత్యమునకు చేరదు. రొట్టెలు చేయుట చాలా సులభము, మనకు మంచిగా తెలుసు. ఈ పని సున్నితమైనది కాదని కూడ తెలుసు. కేవలము పిండి మెత్త పరచి ఒక్కొక్క ముద్దగా చేసి, రెండు చేతులను మర్ధన చేసి, పెనముపై వేసి, రెండు వైపులు త్రిప్పి కాల్చినచో రొట్టె సిద్ధమగును. కాని ఇది కేవలము మన డంబము మాత్రము. అనుభవము లేనిదే మనము రొట్టె చేయుటకు ప్రయత్నించినచో, మొట్ట మొదట పిండి ఎంతవరకు మెత్తగా వుండాలనునది ఒక సమస్యగా మారును. అది పూర్తి గట్టిగా రాయి వలె లేదా పూర్తి పలుచబడి బజ్జీలకు పనికొచ్చునట్లు మారును. ఏదో ఒక విధముగా తంటాలు పడి పెనముపై వేసినా కొంత కాలి కొంత కాలక ఒక వికృతాకారము దాల్చును. అర్ధశతాబ్దము నుండే రొట్టెను చూచుచునే వున్నాము. అభ్యాసరహితమైన జ్ఞానము వలన కొన్ని శేర్ల పిండి నష్టము

చేసికొందుము. సాధారణ విషయము నందు మన జ్ఞాన స్థితి ఇలా వుండగా గొప్ప విషయములలో కేవలము అనుభవము, అభ్యాసము లేని జ్ఞానమును నమ్ముటెట్లు? మీకు కలుగ జేయు బాధలు, కష్టనష్టాలు జ్ఞానానుభవాలకు నాంది అగును. వీటి వలన మీ జ్ఞానము సంపూర్ణమగునని అల్లాహ్ ఈ సూక్తులలో మనకు నేర్పుచున్నాడు.

మీరు మీ ఆస్తిపాస్తులతో, ప్రాణాల నుండి కూడ, పరీక్షించ బడుదురు. మంది మీ ఆస్తులను దోచుకొని మిమ్ములను సంహరింతురు, కూడ. మీరు యూదులు, క్రైస్తవులు విగ్రహారాధకులచే బాధలకు గురి అగుదురు. వారు మిమ్ము బాధ కలిగించు యుక్తులనుపయోగింతురు. మీరు సహనమును పాటించి, వ్యర్థపు మాటలను త్యజించినచో ఇది ధైర్య సాహసాలతో కూడినవని, అమలుతో కూడిన జ్ఞానమే శుభములు గలదని, అనుభవరహితమైన జ్ఞానము వ్యర్థ జ్ఞానము. అమలునకు నోచుకోని జ్ఞానమని ఈ సూక్తుల సారము.

ధనము వ్యాపారము వలన పెరుగునట్లు, అభివృద్ధి అగునట్లు జ్ఞానము కూడ అనుభవము అమలుతో ఆధ్యాత్మిక స్థానమును పొందును. కనుక జ్ఞానాభివృద్ధికి అనుభవము గొప్ప సోపానము. అమలు వలన జ్ఞానము ప్రకాశించును. తేజస్సు పుట్టును. జ్ఞానపు ప్రతి అంశమును పరీక్షించి అమలు చేసినప్పుడే. జ్ఞానము అనుభవ నమ్మకము నందు కొనునని అర్థము చేసికొనుము. కనుక ఇస్లాం నందు ఇటులనే జరిగెను. అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ ద్వారా నేర్పిన దంతయు అమలు చేసి, దానిని ప్రకాశింపజేసి, ఆ కాంతితో విరజల్లు అవకాశము నొసంగును.

## పవిత్ర ప్రవక్త జీవితములోని రెండు స్థితులు

శక్తిమంతుడైన అల్లాహ్ ఈ ఉద్దేశముతోనే మన పవిత్ర ప్రవక్త

జీవితమును రెండు అవస్థలుగా విభజించెను. ఒక భాగము దుఃఖముల, బాధలదైతే రెండవ భాగము జయప్రదమైనది. కారణము! బాధలు ఆపదల సమయములో బహిర్గతమగు నైతిక, న్యాయ సంబంధమైన విలువలు, కష్టనష్టములు కలిగినప్పుడు బహిర్గతమగుటకు, అధికారము లేనిది నిరూపింపబడని, న్యాయనైతిక సంబంధ నైతిక విలువలు అధికారము, విజయము పొందినప్పుడు బహిర్గతమగుటకు, పవిత్ర ప్రవక్త నుండి ఈ రెండు విధములైన నీతి పరములైన విలువలు రెండు పరిస్థితులలో ప్రకటింపబడి స్పష్టముగా నిరూపింపబడినవి. కనుక మన ప్రవక్త పదమూడు సంవత్సరముల వరకు మక్కా నగరములో బాధలను, ఆపదలను అనుభవించిరి. ఆ కాలపు జీవిత చరిత్రను చూచినచో మన పవిత్ర ప్రవక్త ఒక సన్మార్గుడు. ఆపదల సమయములో చూపు నైతిక విలువలను అనుసరించెనని స్పష్టముగా తెలియును. అనగా అల్లాహ్ పైనే ఆధారపడి, అతనినే నమ్మికొని, స్థిరత్వమును ప్రదర్శించుట, తమ కార్యసిద్ధిలో సోమరి తనము చూపక, ఎవరికీ భయపడక నిశ్చలమైన, నిలకడను ప్రదర్శించినందు వలన అవిశ్వాసులు విశ్వాసులుగా మారి, అతనిని నమ్మి, ఇట్లు సాక్ష్యమిచ్చిరి. అల్లాహ్‌పై సంపూర్ణ నమ్మకము లేనిచో ఇట్టి నిలకడను, నిశ్చల బుద్ధినవలంభించి బాధలను, ఆపదలను ఎవడు సహించలేడు.

రెండవ దశలో అనగా అధికారము విజయము, ధనము, సంపత్తి కలిగివున్న దశలో కూడ క్షమాపణ, కనికరము, ధైర్య సాహసములు, ఉత్తమమైన దశలో బహిర్గతమయ్యెను. ఈ న్యాయ, నీతి సంబంధమైన వ్యవహారమును తిలకించి అవిశ్వాసుల అసంఖ్యాక వర్గము అతనిని విశ్వసించెను. దుఃఖము కలిగించిన వారిని క్షమించెను. నగరము నుండి

వెడలగొట్టిన వారికి శరణమిచ్చెను. రక్షణ కల్పించెను. వారిలో నున్న బీద సాదలకు, అనాధలకు, ధన సంపత్తులు ప్రసాదించి ధనవంతులుగా చేసెను. జయించిన తరువాత కూడ తమ పరమ శత్రువులకు క్షమాభిక్ష నొసంగెను. వారి ఈ గొప్ప గుణములను చూచి అనేకులు అల్లాహ్ వైపు నుండి వచ్చినప్పుడు, నిజమైన సన్మార్గుడు కాని వాడు, ఇట్టి గుణములను ఎన్నటికి ప్రదర్శించలేడని సాక్ష్యమిచ్చిరి. ఈ కారణము వలననే శత్రువులలో పేరుకొని పోయిన కపటములు తక్షణము దూరమయ్యెను. నిరూపించి చూపిన అతని గొప్ప గుణములను అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ నందు ఇట్లు వివరించెను.

قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعٰلَمِيْنَ ○

(అల్ అన్ఆమ్ 6:163)

అనగా నా ఆరాధన, నా త్యాగము, నా జీవనము, నా మరణము అన్నియు అల్లాహ్ మార్గము కొరకేనని చెప్పివేయుము. అనగా అతని మహిమను చాటుటకు, చూపించుటకు నా మరణముతోనైనా అతని దాసులు జీవించుటకు, నా మొత్తము జీవితము అతనికి అంకితము. అల్లాహ్ మార్గములో ప్రాణుల మేలు కొరకు మరణించడమనగా, అజ్ఞానులు పిచ్చివారి వలె ఇతరులకు లాభము కలుగునని ఊహతో ఆత్మ హత్య చేసికొనుటయని భావించుట సత్య దూరము. వారు ఇట్టి వ్యర్థ పనులకతీతులు, వ్యతిరేకులు. పవిత్ర ఖుర్ఆన్ ఇట్టి ఆత్మ హత్యకు పాలుపడిన వానిని గొప్ప నేరస్తునిగా శిక్షకు అర్హునిగా ప్రకటించును.

وَلَا تُلْقُوا بِأَيْدِيكُمْ إِلَى التَّهْلُكَةِ

(అల్ బఖరహ్ 2:196)

అనగా ఆత్మహత్య చేసికొనకుము. తమ చేతులతో తమ

మరణమును కొని తెచ్చుకోకుము. రాముడికి కడుపు నొప్పి వున్నచో రంగడు అతని పై వున్న దయతో ప్రేమతో తన తల బ్రద్దలు కొట్టుకొనినచో రంగడు, రామునికి మేలు చేసినదేమి ? అన్యాయముగా మూర్ఖత్వములో తమ తలను బ్రద్దలు కొట్టుకొనిన లాభమేమి ? కాని రాముని సేవలో మునిగి సరియైన ఔషధములు, సేవలందించి చికిత్స చేయించి ఆ బాధను నివారించి మేలు చేసినచో రంగని మేలు మెచ్చుకోదగినది. అన్యాయముగా తన తల బ్రద్దలు చేసికొని ఒక అవయవమును భంగ పరచుకొనిన లాభమేమి. నిజానికి మన ప్రవక్త దయానురాగము, సేవలతో మానవాళికి మేలు చేయుటకు తమను అంకితము చేసి వుండిరి. ప్రార్థన, ప్రచారము, వారి కష్టనష్టములను సహించి వివేకముతో కూడిన ప్రతి పద్ధతి నవలంభించి తమను ఆ మార్గములో వినియోగించి వుండెను. శక్తిమంతుడైన అల్లాహ్ వారి సేవల గురించి ఇట్లు నుడివెను.

لَعَلَّكَ بَاخِعٌ نَّفْسَكَ أَلَّا يَكُونُوا مُؤْمِنِينَ ○

(అశ్శుఅరా 26:4)

فَلَا تَذْهَبْ نَفْسُكَ عَلَيْهِمْ حَسَرَٰتٍ

(అల్ ఫాతిర్ 35:9)

అనగా ఇతరుల కొరకు నీవు కష్టములకు గురై దుఃఖములు సహించి తమను అంతమొందింతువా ? సత్యమును స్వీకరించి వారి కొరకు తమ ప్రాణములు త్యజింతువా ? జాతి కొరకు సృష్టి ఉత్తమ మార్గాలననుసరించి కష్టనష్టాలు, దుఃఖములు భరించి సరియగు పద్ధతులనుపయోగించి తమ ప్రాణాలు వారి కొరకు అర్పించుట వివేకముతో కూడిన మార్గము. కాని ఆపదలో, దుర్మార్గములో చిక్కుకొనిన జాతిని చూచి తమను గాయపరచడము, లేదా కొంత విషము త్రాగి

తమ ప్రాణమునకు హాని కలిగించి, జాతి మేలు కొరకు తమను అంతమొందించితిమని ఊహించడము, భావించడము పురుషుల కార్యములు కావు. అవి స్త్రీ గుణములు, అధైర్యులు, సహనము వీడిన వారు, ఆపదలను సహించక తక్షణము ఆత్మహత్య వైపు పరుగిడుదురు. ఎన్ని వివరములిచ్చినను ఇట్టి ఆత్మహత్య ప్రయత్నము నిస్సందేహముగా తెలివిమంతుల కార్యము కానేకాదు. ప్రతీకార యోగ్యత లేని వాని సహనము, శత్రువును ఎదుర్కోకపోవడము వ్యర్థములే. ఎందుకనగా అతనికి ఆ అధికారము లభించినచో ఏమి చేయువాడో తెలియదు. కనుక ఎంత వరకు ఒకనిపై ఆపదలు, బాధలు గల సమయమొకటి, అధికారము, ప్రభుత్వము, సంపత్తిగల కాలమొకటి. సంభవించవో అంతవరకు అతని న్యాయపరమైన, నైతిక విలువలు బహిర్గతము గావు. ఒకడు కేవలము బలహీనునిగా, బీదవానిగా, అధికారము లేని వానిగా, ఇతరుల తిట్లు దెబ్బలకు సదా గురై మరణించినచో, అధికారము, సంపత్తి, ప్రభుత్వము మొదలగు వాటి రుచి కూడ చూడని వానిలో నైతిక, న్యాయ సమ్మతమైన విలువలు వుండునని నిరూపించలేము. నిరూపణ కాదు కూడ. యుద్ధరంగములో ప్రవేశించక పోయినచో అతడు ధైర్యవంతుడా, వీరుడా, పిరికివాడా అను విషయము నిరూపణ కాదు గదా! తమ శత్రువులను జయించినచో వారితో ఎట్లు వ్యవహరించునో మనకు తెలియదు గదా! అతడు ధనవంతుడైనచో ఆ ధనమును మానవులపై ఖర్చు చేయునా! కూడబెట్టునా వనకు తెలియదు గదా! ఒక యుద్ధ రంగ ప్రవేశము చేసినచో శత్రువులతో వీరుల వలె యుద్ధము చేయువాడా! లేదా పిరికి వాని వలె వెన్ను చూపునా! తెలియదు గదా! కాని శక్తిమంతుడైన అల్లాహ్ మన పవిత్ర ప్రవక్తకు ఆ గుణములను బహిర్గతము చేయు

అవసరాలు కల్పించివున్నాడు. కనుక కరుణ, దయ, క్షమాపణ, ధైర్య సాహసములు న్యాయము మొదలగు నీతి న్యాయ సంబంధములైన గుణములు వాటి వాటి సమయాలలో ఉత్తమ పద్ధతులలో బహిర్గతమైన ఉదాహరణ ప్రపంచమందెక్కడ వెతికినా దొరకదు. తమ జీవిత రెండు దశలలో కూడ అనగా బీదతనము, ఐశ్వర్యము, బలహీనత, అధికారము, ప్రభుత్వ దశలలో కూడ ఉత్తమ నైతిక గుణములను అమలు పరచి ప్రపంచమునకు చూపించెను. శక్తిమంతుడైన అల్లాహ్ ఉత్తమ నైతిక గుణములు ఒనరించుటకు, మానవునిలోగల ప్రతి ఉత్తమ గుణమును చేసి చూపించుటకు సమయోచితమైన అవసరము వారికి కలిగించెను. ధైర్య సాహసాలు, క్షమాగుణము, స్థిరత్వము, నిలకడ, అనుగ్రహము, దయ, సాధుత్వము, కరుణ మొదలగు ఉత్తమ నైతిక విలువలు అవలంభించిన తీరు ప్రపంచమందు కొనుగొనటు అసాధ్యము. అన్యాయమును పెద్ద ఎత్తున అవలంభించి ఇస్లాంను రూపుమాపుటకు ప్రయత్నించిన వారిని కూడ శక్తిమంతుడైన అల్లాహ్ శిక్షించక వదుల లేదనునది కూడ సత్యమే. వారిని శిక్షించక వదిలి పెట్టుట సన్మార్గులను వారి పాదాల క్రింద అణిచి వేసినట్లయ్యేది.

## పవిత్ర ప్రవక్త యుద్ధముల ఉద్దేశము

పవిత్ర ప్రవక్త చేసిన యుద్ధముల ఉద్దేశము అనవసరముగా మానవుల రక్తము ప్రవహింప చేయుట ఎన్నటికి కాదు. తాతముత్తాతల దేశము నుండి వారు వెడలగొట్టబడిరి. అనేక ముస్లిం స్త్రీ, పురుషులు ధర్మం పేర హతమార్చబడిరి. అన్యాయులు అన్యాయమును వీడక, ఇస్లాం బోధలను ఆపువారు. అప్పుడు శక్తిమంతుడైన అల్లాహ్ భద్రత శాసనము, బాధితులను పూర్తిగా నాశనము గాక ముందు రక్షించగోరెను. ఫలితముగా

ఖడ్గము ధరించువారిని ఎదుర్కొనుటకు ఖడ్గము చేత బూనవలసి వచ్చెను. హతమార్చు వారి పీడనమును రూపుమాపుటకు చేసిన యుద్ధములివి. అప్పుడు ఘాతుకులు సత్యవంతులను రూపుమాపుటకు పూనుకొనిరి. ఈ స్థితిలో ఇస్లాం స్వరక్షణ కొరకు ముందుకు రానిచో వేల కొలది పిల్లలు స్త్రీలు నిరపరాధులు సంహరింపబడి తుదకు ఇస్లాం నామరేఖలు లేకుండ పోయేది.

మా వ్యతిరేకులు దైవ ఉపదేశము ఎప్పుడు, ఏ స్థానములో కూడ శత్రువులనెదుర్కొనునట్లుండ కూడదని, సదా నమ్రత, కరుణనవలంభించి ప్రేమానురాగము, అనుగ్రహములను వ్యక్తపరచవలెనని, వీరి వాదన. ఇట్టివారు శక్తిమంతుడైన అల్లాహ్ సంపూర్ణ గుణములను నమ్రత, సాధుత్వము వరకు పరిమితము చేసి అతనిని గౌరవిస్తూ గొప్పగా మర్యాదిస్తున్నామని భ్రమపడుచున్నారు. కాని ఈ విషయములో చాలా ఆలోచించి, యోచించువారికి వీరు ఒక గొప్ప తప్పిదములో పడి వున్నారని సులువుగా స్పష్టమగును. ప్రపంచము కొరకు అల్లాహ్ తప్పక కనికరమే. కాని ఆ కనికరము సదా ప్రతి స్థితియందు మెత్తగా ప్రేమ రూపములో బహిర్గతము గాదు. కనికరము నిరంతము ఒక యోగ్యుడైన వైద్యుని వలె ఒకప్పుడు తియ్యని రసము త్రాగించును. ఒకప్పుడు చేదైన ఔషధమును త్రాగుటకిచ్చును. మనలో నుండి ఒకడు తమను ప్రేమించునట్లు అతని కనికరము మానవాళి కొరకుండును. నిస్సందేహముగా మనలో నుండి ప్రతి వాడు తమను ప్రేమించును. ఎవడేని మన ఒక వెంట్రుకను పెటికినచో మనము చాలా కోపగించుకొందుము. మన ప్రేమ మొత్తము శరీరముతో వున్నప్పటికి, అది మొత్తము శరీర అవయువాలకు వ్యాపించివున్నది. నిజానికి సర్వ అవయవాలు మనకు ప్రియమైనవే.

దేనికి హాని కలిగించగోరము. కాని మనము మొత్తము అంగములను ఒకే విధమైన సమానముగా ప్రేమించమని స్పష్టముగా ఋజువైనది. మన ఉద్దేశముల పూర్తి ఏ అంగములపై ఎక్కువగా ఆధారపడివుండునో వాటి ప్రేమ మన హృదయాలను ఆక్రమించుకొనును. ఇటులనే ఒక ప్రత్యేక అవయవపు ప్రేమ మన మొత్తము అవయవాల ప్రేమ కంటే అధికముగా నుండును. ఒక శ్రేష్టమైన అవయవమును రక్షించుటకు సామాన్య అవయవమును గాయపర్చుట, కోసి వేయుట, విరుచుట అనివార్య మైనప్పుడు మనము ప్రాణమును రక్షించుకొనుటకు ఆ అవయవమును కోసివేయుటకు గాని, గాయపరచుటకు గాని తక్షణము సిద్ధమగుదుము. మన హృదయములో ఒక ప్రియమైన శరీరాంగమును కోసివేయుచున్నామని, గాయపరచుచున్నామని దుఃఖము కలిగినప్పటికి మనము వెనుకాడము. ఈ అవయవము మరో ప్రత్యేక అవయవమును ప్రభావితము చేసి, నాశనము చేయకూడదని దానిని కోసివేయుటకు మనము సిద్ధమగుదుము. అసత్యమును, కాపట్యమును పూజించువారి చేతులతో ధార్మికులు నాశనమగునప్పుడు, ఉపద్రవము వ్యాపించినప్పుడు శక్తిమంతుడైన అల్లాహ్ కూడ ధార్మికులను, సత్యవాదులను రక్షించుటకు, ఉపద్రవమును నిర్మూలించుటకు భూమి నుండి గాని, ఆకాశము నుండి గాని సమయోచితముగా చర్య గైకొనునని మనము తెలుసుకొనుటకు పై ఉదాహరణ దోహదమగును. అతడు కారుణ్యమూర్తి, వివేకవంతుడు.

అల్లాహ్ సర్వ ప్రశంసలకర్హుడు, అల్లాహ్ సర్వ లోకములకు ప్రభువు.